సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 17
సంచిక: 279

శనివారం 21-6-2025

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



బ్యాటింగ్‌తో అదరగొట్టారు

ఇంగ్లండ్‌తో టెస్టులో తొలి రోజు భారత్ భారీ స్కోరు - స్పోర్ట్స్‌లో



బుల్ బ్యాక్ ర్యాలీ

1 శాతానికి పైగా లాభపడిన సూచీలు.. 18 పైసలు కోలుకున్న రూపాయి - బిజినెస్‌లో



ప్రజాసేవ చేయకపోతే..

నిత్యం ప్రజాసేవ చేయకపోతే తాను ప్రశాంతంగా నిద్రించలేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



1600 కోట్ల పాస్‌వర్డ్‌లు చోరీ!

ప్రపంచవ్యాప్తంగా ఇటీవలి కాలంలోనే 1600 కోట్ల పాస్‌వర్డ్‌లు లీకైనట్లు సైబర్ న్యూస్, ఫోర్బ్స్ సంస్థలు వెల్లడించాయి.

వివరాలు 6లో ▸



ఎయిరిండియా 8 సర్వీసులు రద్దు

ప్రతికూల వాతావరణ పరిస్థితులు, గగనతల పరిమితుల కారణంగా ఎయిరిండియా మొత్తం 8 సర్వీసులను రద్దు చేసింది.

వివరాలు 6లో ▸



మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

మణిపూర్‌లోని భద్రతా దళాలు, అనుమానిత కుకీ ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఓ మహిళ మరణించింది.

వివరాలు 6లో ▸

బాబు ష్యూరిటీ బాండు..

మోసం గ్యారంటీకి బ్రాండ్

ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందే సూపర్ సిక్స్ హామీలను ప్రకటించిన చంద్రబాబు

వీటితోపాటు ఇతర హామీల అమలును 2024 జూన్ నుంచే ప్రారంభిస్తామని వెల్లడి

"బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ" పేరుతో ఇంటింటికీ బాండ్లతో టీడీపీ శ్రేణుల ప్రచారం

ప్రతి ఇంటి యజమాని లేదా ఆయన భార్య ఫోన్ నంబర్ తీసుకుని వెబ్‌సైట్‌లో నమోదు

వారినుంచి వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) కూడా పొంది వివిధ పథకాల ద్వారా ఒక కుటుంబానికి చేకూరే లబ్ధి ఎంత అనేది నమోదు

2024 జూన్ నుంచే పథకాల ద్వారా మీ ఖాతాలో డబ్బులు జమ చేస్తామని త్రికరణ శుద్ధితో చంద్రబాబు ప్రమాణం చేసిన బాండ్లు జారీ

తర్వాత బాండ్లు ఇచ్చినందుకు టీడీపీకి మద్దతు తెలుపుతున్నట్లుగా మిస్డ్ కాల్ కూడా ఇప్పించిన నేతలు

తీరా అధికారంలోకి వచ్చి ఏడాది దాటి పోయినా అతీగతీ లేని సూపర్ సిక్స్

వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ పిలుపుతో బాబు బాండ్లు చూపి ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలను నిలదీసేందుకు ఇంటింటా సిద్ధమవుతున్న ప్రజలు

బాండ్లను బయటకు తీసి... గతేడాదిలో ప్రభుత్వం తమకు పడిన బకాయిని లెక్కిస్తున్న ప్రజానీకం


ఏడాది కాలంగా ఎగవేతలతో.. రూ.81,397.83 కోట్లు బకాయి పడ్డారని లెక్కలు..

బాకీపడిన ఆ మొత్తం వడ్డీతో పాటు ఈ ఏడాది ఇవ్వాల్సినవి ఇవ్వాలని డిమాండ్

సూపర్ సిక్స్‌పై ప్రశ్నించినవారి నాలుక మందమా?.. చంద్రబాబు వ్యాఖ్యలపై సర్వత్రా వ్యక్తమవుతున్న అసహనం

2 లో

చంద్రబాబు రాసిచ్చిన బాండు ఇదే..



చంద్రబాబు సమర్పించు..

'రప్పా రప్పా' డైవర్షన్

వైఎస్ జగన్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తప్పుడు ప్రచారం

2 గంటల ప్రెస్‌మీట్‌లో అనేక విషయాలను ప్రస్తావిస్తే ఒక్కదానిపైనా మాట్లాడని చంద్రబాబు

దేనిపైనా స్పందించే దమ్మూ, ధైర్యం లేక 'రప్పా రప్పా' డైలాగు పేరుతో టాపిక్ డైవర్షన్

10 లో

నీ తల నరికేస్తాం

- ఖబడ్దార్ జగన్.. నీకు జీవించే హక్కు ఉందా?
- వైఎస్ జగన్‌పై గోరంట్ల బుచ్చయ్యచౌదరి వ్యాఖ్యలు
- చంద్రబాబు, లోకేశ్ ప్రాపకం కోసం అడ్డగోలు భాష

10 లో

న్యూస్‌రీల్

'సాక్షి టీవీ'కి హైకోర్టులో ఊరట



సాక్షి టీవీ యాజమాన్యానికి హైకోర్టు ఊరట నిచ్చింది. రాజధాని అమరావతిపై సీనియర్ పాత్రికేయుడు వీవీఆర్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలకు గాను సాక్షి టీవీ యాజమాన్యంపై తుళ్లూరు పోలీసులు నమోదుచేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ హైకోర్టు నిలిపేసింది.

వివరాలు 14లో ▸

అయేషా మీరా హత్య కేసులో తుది నివేదిక సమర్పించిన సీబీఐ



రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్య కేసులో దర్యాప్తు పూర్తి చేసినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) పేర్కొంది. తుది నివేదికను సీల్డ్ కవర్‌లో శుక్రవారం హైకోర్టు ముందుంచింది.

వివరాలు 14లో ▸

సొంత రాజ్యాంగాలంటే.. కేసులు కట్టి జైల్లో పెట్టాలి

సవివరణలతో కూడిన రాజ్యాంగం అమల్లో ఉండగా కొత్తకొత్త రాజ్యాంగాలు, పుస్తకాల గురించి ఎందుకు మాట్లాడాల్సి వస్తోందని విజయవాడలో ఆంధ్ర అడ్వకేట్స్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పలువురు వక్తలు ప్రశ్నించారు.

వివరాలు 5లో ▸

పోటాపోటీగా దాడులు

- ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్లస్టర్ బాంబుల వర్షం
- హైఫా సిటీపై క్షిపణుల దాడిలో డజన్లమందికి గాయాలు.. ఇరాన్ క్షిపణి తయారీ కేంద్రంపై విరుచుకుపడిన ఇజ్రాయెల్
- ఎటూతేలని ఇరాన్, యూరప్ నేతల అణుమధ్యవర్తిత్వ చర్చలు
- టెహ్రాన్‌లో భారీ ఇజ్రాయెల్ వ్యతిరేక ర్యాలీ

6 లో

ఇంద్రావతికి కట్టడి!

గోదావరి ఉపనది జలాల గరిష్ట వినియోగానికి ఛత్తీస్‌గఢ్ రెడీ



- బోధ్‌ఘాట్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు శ్రీకారం.. కేంద్రం అనుమతి!.. తెలంగాణ, ఏపీ ప్రాజెక్టులకు నీటి లభ్యత కష్టమే అంటున్న నిపుణులు
- గోదావరిలో ఇంద్రావతి కలిసే ప్రాంతానికి దిగువనే తెలంగాణ ప్రాజెక్టులు దేవాదుల, సీతారామ, సమ్మక్క-సారక్క
- గోదావరికి ప్రాణహిత తర్వాత ఇంద్రావతే ప్రధాన వనరుగా ఉన్న వైనం.. ఈ నదిలో ఏటా సుమారు 600-800 టీఎంసీల మేర లభ్యత
- రూ.49 వేల కోట్లతో సుమారు 9.45 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చేలా ఛత్తీస్‌గఢ్ ప్రణాళికలు

3 లో

'స్థానిక' ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులెవరూ

నామినేషన్ వేయకుండా చూస్తా..

- స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాక అందరి అంతూ చూస్తా
- గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వివాదాస్పద వ్యాఖ్యలు

10 లో



- కూటమి సర్కారు తీరుకు నిరసనగా

ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజీనామా

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో సంచలన ఘటన

కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిందని తీవ్ర ఆక్షేపణ

మానసిక వేదనతో రాజీనామా చేస్తున్నట్లు వెల్లడి



చేజర్ల ఎంఈఓ కార్యాలయంలో రాజీనామా పత్రాన్ని ఇస్తున్న హెచ్‌ఎం మధుసూదన్‌రావు

10 లో

ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల



- రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కళాశాలల్లో ప్రవేశాలకు ఇటీవల నిర్వహించిన ఎడ్‌సెట్- 2025 ఫలితాలు శుక్రవారం విడుదల అయ్యాయి. ఎడ్‌సెట్‌కు మొత్తం 14,612 మంది హాజరుకాగా 14,527 మంది అర్హత సాధించారు.

వివరాలు 14లో ▸

బాబు ష్యూరిటీ బాండు...
మోసం గ్యారంటీకి బ్రాండ్

ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందే సూపర్ సిక్స్ హామీలను ప్రకటించిన చంద్రబాబు
"బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ" పేరుతో ఇంటింటికీ బాండ్లతో టీడీపీ శ్రేణుల ప్రచారం
హామీల అమలును 2024 జూన్ నుంచే ప్రారంభిస్తామని వెల్లడి
తీరా అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయినా అతీగతీ లేని సూపర్ సిక్స్

సాక్షి, అమరావతి

'చంద్రబాబునాయుడు అనే నేను రాష్ట్ర ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని త్రికరణ శుద్ధితో ప్రమాణం చేస్తున్నాను. 2024లో టీడీపీ అధికారంలోకి వచ్చాక "భవిష్యత్తుకు గ్యారెంటీ"లోని వాగ్దానాలను ఎటువంటి వివక్ష లేకుండా, నిబంధనలు విధించకుండా అమలు చేయడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి, పురోగతికి పునరంకితం అవుతానని ప్రతిజ్ఞ చేస్తున్నాను'

ఇదీ బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ పేరిట టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సంతకంతో ఆ పార్టీ జారీ చేసిన ష్యూరిటీ బాండ్. ఇందులో పథకాలను 2024 జూన్ (ఎన్నికల ఫలితాలు వెలువడిన నెల) నుంచే అమలు చేస్తామని కూడా ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ బాండ్ పేపర్లతో ఇంటింటికీ వెళ్లిన టీడీపీ క్యాడర్... ఆ ఇంటిలో మొత్తం ఎందరు ఉన్నారు...? మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు ఎంతమంది ఉన్నారు? అనే వివరాలు, వారి పేర్లు తీసుకుని... వీరికి ఏ పథకం కింద ఎంతెంత వస్తుంది..? అని లెక్కలేసి మరీ చెప్పారు. బాండ్ పేపర్లను మొబైల్ ఫోన్లకూ పంపారు. వీటిని నమ్మి ప్రజలు ఓట్లేయడంతో టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైంది. కానీ, సూపర్ సిక్స్ సహా వారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏవీ అమలు కాలేదు. దీంతో ప్రతి ఇంట ఆగ్రహం వ్యక్తమవుతోంది. టీడీపీ కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులను ఎక్కడికక్కడ నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు. బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ అంటూ ఇచ్చిన బాండ్లు మోసాలకు నకళ్లుగా మారిన వైనాన్ని ఏకరవు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. కాగా, సీఎం చంద్రబాబు మాత్రం ''సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేసేశా.. ఎవరైనా సూపర్ సిక్స్ హామీల అమలు గురించి ప్రశ్నిస్తే వారి నాలుక మందం తప్ప మరోటి కాదంటూ'' ముందుగానే బెదిరింపులకు దిగుతున్నారు.

వైఎస్ జగన్ కంటే ఎక్కువ సంక్షేమం ఇస్తామని...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తానని, అంతకు రెండింతలు సంక్షేమం సూపర్ సిక్స్ పథకాల ద్వారా ఇస్తామంటూ ఎన్నికలకు ముందు చంద్రబాబు నమ్మబలికారు. వైఎస్ జగన్ కంటే ఎంత ఎక్కువ ఇస్తాం అనేది రసీదు రూపంలో చెప్పారు. ఇక ఈ హామీల అమలు పూచీ నాదంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గ్యారంటీ ఇచ్చారు. చంద్రబాబు తానా అంటే తందానా అనే ఎల్లో మీడియా సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీలపై విస్తృత ప్రచారం చేసింది. అప్పటికీ చంద్రబాబును నమ్మి ఓట్లేస్తే చంద్రముఖిని మళ్లీ నిద్ర లేపినట్లేనంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నాటి సీఎం వైఎస్ జగన్ ప్రజలను హెచ్చరించారు. కానీ.. చంద్రబాబు మాటలు, పవన్ కళ్యాణ్ గ్యారంటీలు.. ఎల్లో మీడియా కథనాలు నమ్మి ఓట్లేసి టీడీపీ కూటమిని గెలిపించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది.. సూపర్ సిక్స్ అతీగతీ లేదు.. పైగా హామీల అమలుపై ఎవరైనా ప్రశ్నిస్తే.. 'సంపద సృష్టించడం ఎలాగో చెవిలో చెప్పు.. సంపద సృష్టించాక సంక్షేమం ఇస్తా' అంటూ దబాయిస్తున్నారు.

'త్రి'కరణశుద్ధిగా మాట తప్పారు..

సూపర్ సిక్స్, ఎన్నికల హామీల అమలుపై ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు సంతకంతో ఉన్న బాండ్ పేపర్లు పంపిణీ చేసి వివరాలు నమోదు చేశారు టీడీపీ నేతలు. టీడీపీకి మద్దతు తెలుపుతున్నట్లుగా మిస్డ్ కాల్ ఇప్పించారు. వారి ఫోన్ నుంచి ఓటీపీ కూడా తీసుకున్నారు. ప్రతి ఇంటి యజమాని లేదా ఆయన భార్య ఫోన్ నంబరు తీసుకుని టీడీపీ మేనిఫెస్టో.కామ్ వెబ్‌సైట్‌లోకి ఎక్కించారు. ఎన్నికల సభల్లోనూ భారీగా ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక 'త్రి'కరణశుద్ధిగా మాట తప్పారు. ఈ మోసంపైనే ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. టీడీపీ కూటమి నేతలను ప్రశ్నించేందుకు ప్రతి గడప ఎదురుచూస్తోంది.



నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం దొరకొట్టాల గ్రామానికి చెందిన పసాది సాలమ్మకు జరగబోయే లబ్ధికి సంబంధించి కూటమి నేతలు ఇచ్చిన బాండ్



అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గానికి చెందిన మెహరాజ్ బేగం షేక్‌కు ఐదేళ్లలో జరగబోయే లబ్ధికి సంబంధించి ఇచ్చిన హామీ

మహానాడు నుంచే మహా మోసానికి నాంది

సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందే.. అంటే 2023 మే 28న రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడు వేదికగా సూపర్ సిక్స్ హామీలను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించారు. వీటితోపాటు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇంటింటా ప్రచారం చేసి, తద్వారా ఒక కుటుంబానికి ఐదేళ్లలో చేకూరే ప్రయోజనంపై గ్యారంటీ ఇస్తూ బాండ్లు జారీ చేయాలని కూడా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ'గా నామకరణం చేశారు.

మహానాడు అనంతరం ఎన్నికల ప్రచారం ముగిసేవరకు నియోజకవర్గాల టీడీపీ సమన్వయకర్తలు, నాయకులు ప్రతి నియోజకవర్గంలో ఇంటింటికీ వెళ్లి.. కుటుంబసభ్యుల పేర్లు ఆరా తీసి, ''టీడీపీ మేనిఫెస్టో.కామ్'' వెబ్‌సైట్‌లో ఆ వివరాలు నమోదు చేశారు. ఆ తర్వాత కుటుంబ యజమాని లేదా ఆయన భార్య ఫోన్ నంబరు తీసుకుని టీడీపీ మేనిఫెస్టో.కామ్ వెబ్‌సైట్ ద్వారా ఓటీపీ పంపించారు. ఆ ఓటీపీని టీడీపీ మేనిఫెస్టో.కామ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి.. ఆ కుటుంబానికి సూపర్ సిక్స్ సహా వివిధ పథకాల కింద ఏటా చేకూరే లబ్ధి... ఐదేళ్లకు ఒనగూరే ప్రయోజనం ఎంతనో వివరించారు. తర్వాత టీడీపీకి మద్దతు ఇస్తున్నట్లు వెబ్‌సైట్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు. ఆ వెంటనే.. సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీల ద్వారా చేకూర్చే ప్రయోజనానికి గ్యారంటీ ఇస్తూ వారి ఫోన్ నంబర్‌కు బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో బాండ్లు పంపారు. బాండ్లను కుటుంబ సభ్యుల ఎదుటే డౌన్‌లోడ్ చేయించారు. వివిధ పథకాల కింద ఆ కుటుంబానికి చేకూరే లబ్ధి, ఈ హామీలను అమలు చేస్తానని త్రికరణ శుద్ధిగా ప్రమాణం చేసి చెబుతున్నానని ఆ బాండ్లలో చంద్రబాబు స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ సహా హామీలన్నీ 2024 జూన్ నుంచే అమలు ప్రారంభమవుతుందని బాండ్లలో తేల్చిచెప్పారు.

ఇది కాదా మోసం..?

2024 జూన్ నుంచే పథకాలను అమలు చేస్తామని ప్రకటించిన చంద్రబాబు... కూటమి ప్రభుత్వం వచ్చిన సరిగ్గా ఏడాది తర్వాత తల్లికి వందనం పథకం అమలు చేశారు. కానీ, ఇందులో 87,41,885 మందికి రూ.15 వేల వంతున ఇవ్వాల్సి ఉండగా 54,94,703 మందికి మాత్రమే రూ.13 వేల చొప్పున జమ చేస్తామని ప్రకటించారు. అంటే 32,47,182 మందికి ఎగనామం పెట్టి తల్లికి వందనం పథకాన్ని మహా మోసంగా మార్చారు. ఈ పథకంపై మీడియాతో మాట్లాడుతూ పీ–4కు ఆడబిడ్డ నిధి, స్కిల్ డెవలప్‌మెంట్‌కు నిరుద్యోగ భృతిని అనుసంధానం చేశానని... 20న అన్నదాత సుఖీభవ, ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు అమలు చేస్తానని చెప్పుకొచ్చారు. ఈ ప్రకారం చూస్తే.. చంద్రబాబు మాటల్లోనే సూపర్ సిక్స్ సూపర్ మోసంగా మారిందని స్పష్టమవుతోంది.



మెహరాజ్ బేగం ఓటీపీ ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించి మొబైల్‌కు వచ్చిన మెసేజ్




పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మంచెం సుమదేవికి కూటమి నేతలు అందజేసిన బాండ్‌పేపర్

ఆ బాండ్లు... మోసాలకు సాక్ష్యాలు
ఏడాదిలో రూ.81,397.83 కోట్లు ఎగవేత

- కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటికీ బాండ్లలో గ్యారంటీ ఇచ్చిన హామీల మేరకు లబ్ధి చేకూరకపోవడంతో 'మోసపోయాం' అంటూ ప్రతి ఇంట ప్రజలు నిట్టూర్పుతున్నారు. టీడీపీ నేతలు ఇచ్చిన బాండ్లు.. ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న బాండ్లను తీసుకుని.. ఏడాదిలో సూపర్ సిక్స్ పథకాల కింద తమ కుటుంబానికి ఎంతమేరకు ప్రభుత్వం ఎగ్గొట్టిందో లెక్కలు వేసుకుంటున్నారు.
- సూపర్ సిక్స్‌లో భాగంగా.. 20 లక్షల మందికి ఉద్యోగాలు.. లేదా ఉద్యోగం వచ్చేవరకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. తొలి ఏడాది నిరుద్యోగ భృతి జాడే లేదు. రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. వారికి నెలకు రూ.3 వేల చొప్పున ఏడాదికి రూ.7,200 కోట్లు బాకీ పడ్డారు.
- పీఎం కిసాన్ సమ్మాన్ పథకంతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ కింద ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తానని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో 53,58,266 మంది రైతులు ఉన్నారు. వారికి రూ.20 వేల చొప్పున ఇవ్వాలంటే ఏటా రూ.10,716.53 కోట్లు అవసరం. కానీ, తొలి ఏడాది వాటిని ఇవ్వకుండా ఎగ్గొట్టారు.
- సూపర్ సిక్స్‌లో ఆడబిడ్డ నిధి పథకం ఒకటి. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలు 2.07 కోట్ల మంది ఉన్నారు. ఇందులో 18–59 ఏళ్ల మధ్య వయసు వారు 1.80 కోట్ల మంది. వీరికి నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలను ఆడబిడ్డ నిధి కింద ఇస్తానని బాబు హామీ ఇచ్చారు. మొదటి ఏడాది ఒక్క పైసా ఇవ్వలేదు. అంటే.. మహిళలకు రూ.32,400 కోట్లు బాకీపడ్డారు.
- దీపం పథకం కింద రాష్ట్రంలో 1,59,20,000 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. సిలిండర్ ధర రూ.855. ఈ లెక్కన ఏడాదికి మూడు సిలిండర్లు ఇవ్వాలంటే రూ.4,083.48 కోట్లు అవసరం. తొలి ఏడాది ఒక సిలిండర్‌కు రూ.865 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఈ ప్రకారం రూ.3,218.48 కోట్లు ఎగ్గొట్టారు.
- మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామనేది మరో హామీ. దీనికోసం నెలకు రూ.275 కోట్ల చొప్పున ఆర్టీసీకి ఇవ్వాలి. తొలి ఏడాది ఈ హామీ అమలు చేయలేదు. అంటే... ఉచిత బస్సు రూపంలో మహిళలకు రూ.3,500 కోట్లు ఎగ్గొట్టారు.
- 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలు, పురుషులకు పింఛను ఇస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 20 లక్షల మంది ఉన్నారు. వారికి నెలకు రూ.4 వేల చొప్పున ఏడాదికి రూ.9,600 కోట్లు పింఛనుగా ఇవ్వాలి. కానీ.. తొలి ఏడాది ఇది ఇవ్వలేదు. రూ.9,600 కోట్లు ఎగ్గొట్టారు.
- తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలను బడికి పంపిస్తే అంతమందికి రూ.15 వేల వంతున తల్లి ఖాతాలో జమ చేస్తామని బాబు వాగ్దానం చేశారు. యూడీఐఎస్ఈ (యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ యూడైస్) ప్రకారం రాష్ట్రంలో 87,41,885 మంది పిల్లలు పాఠశాలల్లో చదువుతున్నారు. రూ.15 వేల చొప్పున వారికి ఏడాదికి రూ.13,112.82 కోట్లు ఇవ్వాలి. కానీ, తొలి ఏడాది ఆ మేరకు ఇవ్వకుండా ఎగ్గొట్టారు.
- పంటల బీమా పరిహారం ఇవ్వకుండా రాష్ట్రంలోని 53 లక్షల మంది రైతులకు టోపీ పెట్టిన మొత్తం రూ.1,385 కోట్లు. ఇక మత్స్యకారులకు వేట నిషేధ భృతి కింద ఎగ్గొట్టిన మొత్తం రూ.265 కోట్లు.

ఇలా ఏడాది కాలంగా టీడీపీ కూటమి ప్రభుత్వం రూ.81,397.83 కోట్లు బకాయి పడిందని ప్రజలు లెక్కలు వేస్తున్నారు. బాకీపడిన ఈ మొత్తంతో పాటు ఈ ఏడాది ఇవ్వాల్సినవి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం పొన్నలూరు మండలం పెదవెంకన్నపాలెంకు చెందిన ఓ వ్యక్తికి కూటమి నేతలు ఇచ్చిన బాండ్‌పేపర్

బాబూ... ఇదిగో మీరిచ్చిన బాండు..!
ఇంటి వద్దకు వచ్చే ఎమ్మెల్యేలు, టీడీపీ నేతల నిలదీతకు ప్రజలు సిద్ధం

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీల అమలును 2024 జూన్ నుంచే ప్రారంభిస్తామంటూ బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ పేరిట ప్రతి ఇంటా ఇచ్చిన బాండ్ల మేరకు లబ్ధి చేకూరకపోవడంతో ఇంటింటా ఆగ్రహం పెల్లుబుకుతోంది. బాండ్లు చూపి చంద్రబాబును నిలదీయాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపుపై ఇప్పుడు ప్రతి ఇంట చర్చ సాగుతోంది. టీడీపీ నేతలు ఇచ్చిన బాండు ప్రకారం తమ ఇంటికి గత ఏడాది కాలంలో రావాల్సిన మొత్తంపై లెక్క వేసుకుని.. ఆ మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించాలని తమ ఇంటి వద్దకు వచ్చే ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలను నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు.

బాబు తొలి ఏడాది మోసాల ఖరీదు



81,397.83 కోట్లు

- **32,400 కోట్లు** — 18 నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు ఏటా **రూ. 18 వేల** చొప్పున ఎగ్గొట్టిన ఆడబిడ్డ నిధి. లబ్ధిదారులు **1.80** కోట్లు
- **13,112.82 కోట్లు** — తల్లికి వందనం పథకం కింద మహిళలకు **రూ. 15 వేల** చొప్పున టోపీ. లబ్ధిదారులు **87,41,885**
- **10,716.53 కోట్లు** — అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు **రూ. 20 వేల** చొప్పున అన్యాయం. లబ్ధిదారులు **53,58,266**
- **265 కోట్లు** — మత్స్యకారులకు వేట నిషేధ భృతి కింద **రూ. 24 వేల** చొప్పున తొలి ఏడాది ఎగవేసిన మొత్తం
- **7,200 కోట్లు** — నిరుద్యోగ భృతి కింద యువతకు **రూ. 36 వేల** చొప్పున దగా. లబ్ధిదారులు **20** లక్షలు
- **3,500 కోట్లు** — ఉచిత బస్సు కింద మహిళలకు మోసం. లబ్ధిదారులు **2.7** కోట్లు
- **3,218.48 కోట్లు** — దీపం–2 పథకం కింద మహిళలకు టోకరా. లబ్ధిదారులు **1.59** కోట్లు
- **1,385 కోట్లు** — పంటల బీమా పరిహారం చెల్లించకుండా రైతులకు కలిగించిన నష్టం. లబ్ధిదారులు **53** లక్షలు
- **9,600 కోట్లు** — 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు నెలకు **రూ. 4 వేలు** చొప్పున ఇవ్వని పింఛన్ సొమ్ము. లబ్ధిదారులు **20** లక్షలు

రాష్ట్రపతికి వైఎస్ జగన్ జన్మదిన శుభాకాంక్షలు

సాక్షి,అమరావతి: రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆయురారోగ్యాలతో ఉండాలని..దేశ సేవలో మరింత ముందుకు సాగాలని, అందుకు అవసరమైన శక్తిని దేవుడు ఆమెకు ప్రసాదించాలంటూ వైఎస్ జగన్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

జూన్ నెలలో పంపిణీ కాని పింఛన్ల నగదు రూ. 66.01 కోట్లు

- మిగులు నిధులను జమ చేయాలంటూ ఆదేశాలిచ్చిన ప్రభుత్వం
- ఏడు రోజుల్లో జమ చేయకపోతే శాఖాపరమైన చర్యలు
- సెర్ప్ ప్రధాన కార్యాలయం ఆదేశాలు

సాక్షి, అమరావతి: జూన్ నెల పింఛన్లకు ప్రభుత్వం విడుదల చేసిన నగదులో రూ. 66.01 కోట్లు లబ్ధిదారులకు పంపిణీకి చేయకుండా మిగిలిపోయాయి.ఇది కేవలం ఒక్క జూన్ కు మాత్రమే కాదు. ప్రతి నెలా రూ.50 కోట్ల నుంచి రూ.80 కోట్లు దాకా పింఛన్ల సొమ్ము తిరిగి ప్రభుత్వానికి చేరుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. మిగిలిపోయే నిధులను తిరిగి ప్రభుత్వానికి జమ చేసే బాధ్యత ఆయా గ్రామ వార్డు సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు లేదా వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, వార్డు అడ్మిన్ సెక్రటరీల బాధ్యత అని పేర్కొంటూ సెర్ప్ ప్రధాన కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. ఏడు రోజుల్లో తిరిగి జమ చేయనిపక్షంలో తాత్కాలిక నిధుల దుర్వినియోగంగా పరిగణించి శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్టు సెర్ప్ కార్యాలయం స్పష్టం చేసింది. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రభుత్వానికి జమ చేసే ప్రక్రియపై తగిన చర్యలు తీసుకోవాలని సెర్ప్ కార్యాలయం ఆ ఆదేశాల్లో జిల్లాల కలెక్టర్లకు సూచించింది.

బాలికపై లైంగిక దాడి.. కేసు నమోదు

తవణంపల్లె: చిత్తూరు జిల్లా తవణం పల్లె మండలంలోని దిగువ మోదలపల్లెకి చెందిన ఓ దళిత బాలిక(13)పై శుక్రవారం లైంగిక దాడి జరిగినట్టు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ఎస్సీ కాలనీకి చెందిన సురేంద్రబాబు(36), అదే గ్రామానికి చెందిన ఓ బాలిక అంగడికి వెళ్తుండగా ఇంట్లోకి లాక్కెళ్లి అఘాయిత్యానికి ఒడిగట్టాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఇంద్రావతికి కట్టడి!

సాక్షి, న్యూఢిల్లీ: రెండు తెలుగు రాష్ట్రాలకు జీవనాడిగా ఉన్న గోదావరి నదికి ప్రాణహిత తర్వాత ప్రధాన ఉప నది అయిన ఇంద్రావతి నీటిని పూర్తిగా కట్టడి చేసేలా ఛత్తీస్‌గఢ్ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇంద్రావతిలో లభ్యతగా ఉన్న నీటిలో మెజారిటీ జలాలను వినియోగించుకునేలా బోధ్‌ఘాట్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు అంకురార్పణ చేస్తోంది. ఇటీవలే ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సైతం అనుమతినిచ్చిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ప్రకటించారు. ఇంద్రావతి నీటినే నమ్ముకొని తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు చేపడుతుండటం గమనార్హం. కాగా ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ తెరపైకి తెచ్చిన ఈ ప్రాజెక్టుతో దిగువ గోదావరిలో జలాల లభ్యత తగ్గిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఛత్తీస్‌గఢ్ వినియోగించని జలాలనే ఆధారంగా చేసుకుని కేంద్రం గోదావరి-కావేరి అనుసంధానాన్ని తెరపైకి తెచ్చిన సంగతి తెలిసిందే.

ఎగువ నీళ్లకు ఎగువనే అడ్డుకట్ట..

ఇంద్రావతిలో ప్రతి ఏటా 600-800 టీఎంసీల మేర లభ్యత ఉంటుందని కేంద్రం లెక్కలు చెబుతున్నాయి. ఇది ఛత్తీస్‌గఢ్‌లో 264 కిలోమీటర్ల దూరం ప్రయాణించి తెలంగాణలో మేడిగడ్డ దిగువన, సమ్మక్క-సారక్క బ్యారేజ్ ఎగువన గోదావరిలో కలుస్తుంది. దంతెవాడ, బీజాపూర్, సుక్మా, బస్తర్, కాంకేర్ జిల్లాల గుండా ప్రవహిస్తుంది. జిల్లాలన్నీ తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దుల్లోనే ఉన్నాయి. ఇంద్రావతి నీళ్లు కలిశాకే గోదావరి దిగువన ప్రవాహాలు మరింత ఉధృతంగా ఉంటాయి. కాగా ఇంద్రావతి నది గోదావరిలో కలిసే ప్రాంతానికి దిగువన, గరిష్ట నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ.. దేవాదుల (38 టీఎంసీలు), సీతారామ (70 టీఎంసీలు), సమ్మక్క-సారక్క (50 టీఎంసీలు- మొత్తంగా 158 టీఎంసీలు) ప్రాజెక్టులు చేపట్టింది. ఇలావుండగా ఇంద్రావతిలో లభ్యత నీటిని ఛత్తీస్‌గఢ్ పూర్తిస్థాయిలో వినియోగించుకోలేక పోవడంతో.. ఈ నీటిని మిగులు జలాలుగా గుర్తించిన కేంద్రం.. నదుల అనుసంధాన ప్రతిపాదనలు చేసింది. ఇంద్రావతి బేసిన్‌లో ఛత్తీస్‌గఢ్ (అప్పటి మధ్యప్రదేశ్)కు గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిన నీటిలో వాడుకోని 141.4 టీఎంసీలకు మరో 106 టీఎంసీల వరద జలాలను జతచేసి మొత్తం 247 టీఎంసీలను ఇచ్చంపల్లి-నాగార్జునసాగర్-సోమశిల మీదుగా కావేరి గ్రాండ్ ఆనకట్ట వరకు తరలించేలా నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) తొలుత ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే గోదావరిలో మిగులు, వరద జలాల నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చేవరకు అనుసంధానం పక్కన పెట్టాలని ఏపీ, తెలంగాణ డిమాండ్ చేస్తూ వచ్చాయి. దీంతో తొలిదశ కింద ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141.3 టీఎంసీలనే గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి నుంచి నీటిని తరలించేలా ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. ఆవిరి, ప్రవాహ నష్టాలు పోను ఏపీకి 41.8, తెలంగాణకు 42.6, తమిళనాడు 38.6, పుదుచ్చేరికి 2.2, కర్ణాటకకు 9.8 టీఎంసీలు ప్రతిపాదించింది. దీనిపై ఛత్తీస్‌గఢ్ సర్కార్ తీవ్ర అభ్యంతరం తెలిపింది.

చెప్పినట్టే చేస్తున్న ఛత్తీస్‌గఢ్

తమకు హక్కుగా సంక్రమించిన నీటిని తరలించుకుపోతామంటే ఒప్పుకునేది లేదని, భవిష్యత్తులో ఈ నీటిని వినియోగించుకునేలా తాము ప్రాజెక్టులు చేపడతామని ఛత్తీస్‌గఢ్ తెగేసి చెప్పింది. ఈ క్రమంలోనే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం బోధ్‌ఘాట్ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్రం ముందుంచింది. ఈ ప్రాజెక్టు కింద ఇంద్రావతి నీటిని ఒడిసిపట్టేలా రూ.29 వేల కోట్లతో బోధ్‌ఘాట్ ఆనకట్టని, అదనంగా మరో రూ.20 వేల కోట్లతో మహానది-ఇంద్రావతి లింక్‌ను చేపట్టనుంది.

గోదావరి-కావేరి అనుసంధానం కూడా ప్రశ్నార్థకమే..!

ఇంద్రావతి మెజారిటీ జలాలను ఛత్తీస్‌గఢ్ వినియోగించుకునే పక్షంలో గోదావరి నుంచి తెలంగాణ, ఏపీ ప్రాజెక్టులకు నీటి లభ్యత తగ్గడం ఖాయమని నీటి పారుదల నిపుణులు అంటున్నారు. అలాగే కేంద్రం ప్రతిపాదిస్తున్న నదుల అనుసంధానం కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని చెబుతున్నారు.

> కృష్ణా, గోదావరి నదీ జలాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ విషయంలో తమకెలాంటి భేషజాలు లేవని, ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబుతో ముఖాముఖి చర్చలు జరిపే అంశంపై ఈ నెల 23న జరిగే కేబినెట్ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే చర్చలకు తానే స్వయంగా చంద్రబాబును ఆహ్వానించేందుకు కూడా సిద్ధంగా ఉన్నానన్నారు.

పచ్చనేత ఆక్రమణలపై పెల్లుబికిన ఆగ్రహం

- ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ పునరుద్ధరించాలంటూ మత్స్యకారుల ఆందోళన
- ఆక్రమణలను తొలగించే యత్నం.. అడ్డుకున్న పోలీసులు
- విచారణకు కలెక్టర్ ఆదేశం
- యంత్రాలు ధ్వంసం చేశారంటూ మత్స్యకారులపై కేసులు
- టీడీపీ నేతను అరెస్ట్ చేయాలంటూ ప్రతిగా పోలీసులకు మత్స్యకారుల ఫిర్యాదు



పాండురంగాపురం సముద్ర తీరం వద్ద మత్స్యకారుల ఆందోళన

సాక్షి ప్రతినిధి, బాపట్ల: చీరాల పచ్చనేత బుర్ల వెంకట్రావు ఆక్రమించి ధ్వంసం చేసిన ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్‌ను తక్షణమే పునరుద్ధరించాలంటూ తీర గ్రామాల మత్స్యకారులు శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఉదయమే పాండురంగాపురం పరిధిలో ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ సముద్రంలో కలిసే ప్రాంతానికి చేరుకున్నారు. ప్రధాన కాలువను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్పందించకపోతే యంత్రాలతో తామే కాలువను పునరుద్ధరించుకుంటామని తేల్చి చెప్పారు. మత్స్యకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతో టీడీపీ నేత బుర్ల అనుచరులు పోలీసులకు సమాచారమందించారు. దీంతో బాపట్ల డీఎస్పీ రామాంజనేయులుతో పాటు, సిబ్బంది హుటాహుటిన తీరప్రాంతానికి చేరుకున్నారు. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ మత్స్యకారులు అక్కడే బైఠాయించి ధర్నాకు దిగారు. తక్షణమే టీడీపీ నేత బుర్ల వెంకట్రావు ధ్వంసం చేసి ఆక్రమించిన స్ట్రెయిట్‌కట్‌ను, ప్రధానంగా సీ మౌత్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాలువలో ఉన్న వెయ్యికి పైగా పడవలు వేటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, దీనివల్ల తాము ఉపాధి కోల్పోతున్నామని వాపోయారు. అందుకు కారణమైన వెంకట్రావును అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. సముద్ర తీరంలో ఆక్రమిత భూములకు డీకేటీ పట్టాలిచ్చిన రెవెన్యూ అధికారులపైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

స్పందించిన కలెక్టర్..

మత్స్యకారులు ఆందోళన తీవ్రతరం చేయడంతో బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి స్పందించారు. తీరం ఆక్రమణలపై బాపట్ల ఆర్డీవో గ్లోరియా, చీరాల ఆర్డీవో చంద్రశేఖర నాయుడుతో విచారణ కమిటీని నియమించారు. వెంటనే నివేదిక సమర్పించాలన్నారు. అంతవరకూ వివాదాస్పద భూమిగా ఉన్న సర్వేనంబర్ 499-1, 2లోని 1.50 ఎకరాల్లో ఎవరూ దిగవద్దని ఆదేశాలు జారీ చేశారు. విచారణ నివేదిక వచ్చాక సదరు భూమిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో మత్స్యకారులు శాంతించి ఆందోళనను విరమించారు.

మత్స్యకారులపై కేసులు?

తీరంలో ఆక్రమణలను అడ్డుకుంటున్న మత్స్యకారులపై టీడీపీ నేత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. తమ ట్రాక్టర్లు, ఇతర యంత్రాలను ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొనడంతో 20మందికి పైగా మత్స్యకారులపై పోలీసులు కేసులు నమోదు చేసినట్లు సమాచారం.

వెంకట్రావుపై మత్స్యకారుల ఫిర్యాదు..

ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ సీ మౌత్ పూడ్చివేసి 12 వేల కుటుంబాల మత్స్యకారుల కడుపు కొట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బుర్ల వెంకట్రావుపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలంటూ మత్స్యకారుడు కనకారావు శుక్రవారం బాపట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలువలను ధ్వంసం చేస్తున్న అతన్ని అడ్డుకునే ప్రయత్నం చేయగా.. తమను దూషించి, చంపేస్తామంటూ బెదిరించారని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

తరగతుల విలీనంపై తల్లి దండ్రుల ఆందోళన

ప్రకాశం జిల్లా వెంకటాపురంలో ధర్నా



ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న తల్లిదండ్రులు

దొనకొండ: గ్రామంలో ఉన్న పాఠశాలలో తరగతులను మరో స్కూల్‌లో విలీనం చేయడాన్ని నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు తహసీల్దార్, ఎంఈఓ కార్యాలయాల ఎదుట ధర్నా చేసిన ఘటన ఇది. ప్రకాశం జిల్లా దొనకొండ మండలం వెంకటాపురం గ్రామ ఎస్సీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను వెంకటాపురం పాఠశాలకు బదిలీ చేశారు. దీనితో 40 మంది పిల్లలు వెంకటాపురం పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇప్పటికే ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామ పెత్తందారులు ఊర్లోకి తరలించుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బదిలీని రద్దు చేసి పాఠశాలలోనే తమ పిల్లలు విద్యను అభ్యసించేలా చూడాలని కోరారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంఈఓ సాంబశివరావుకు వినతి పత్రం అందజేశారు.

జగన్ పర్యటనను అడ్డుకునేందుకు పోలీసుల విఫలయత్నం

ప్రజలు రాకుండా అడుగడుగునా అడ్డంకులు
ఇద్దరు మరణిస్తే వాటిపైనా దుష్ప్రచారం
మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు పర్యటనను అడ్డుకునేందుకు పోలీసులు అడుగడుగునా బారికేడ్లు, ఆంక్షలు, ముందస్తు నోటీసులతో అన్నిరకాలుగా ప్రయత్నించారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. అయినప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేశారని చెప్పారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దురదృష్టవశాత్తు ఇద్దరు మృతిచెందితే, వారి మరణాలను కూడా వివాదం చేయాలని టీడీపీ కూటమి నేతలు దిగజారుడు రాజకీయం చేశారని, అయినా, అన్ని కుట్రలను ఛేదిస్తూ అశేష ప్రజావాహిని జగన్ వెంట నిలబడిందని చెప్పారు. కూటమి ప్రభుత్వంపై ప్రజాగ్రహం వెల్లువెత్తిందన్నారు. సత్తెనపల్లిలో కనీసం మంచినీరు కూడా దొరకకుండా పోలీసులు హోటళ్లను మూసేయించారన్నారు.

కేసులకు భయపడే ప్రసక్తే లేదు..

వైఎస్ జగన్ పర్యటనలో పాల్గొన్న తనతో పాటు మాజీ మంత్రి అంబటి రాంబాబు, డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి, నాగమల్లేశ్వరరావు తండ్రిపైన కూడా పోలీసులు కేసులు పెట్టారని, ఇటువంటి కేసులకు భయపడే ప్రసక్తే లేదని గోపిరెడ్డి తేల్చిచెప్పారు. గోదావరి పుష్కరాల్లో చంద్రబాబు ప్రచార ఆర్భాటంవల్ల జరిగిన తొక్కిసలాటలో 29 మంది, కందుకూరులో చంద్రబాబు సభను ఇరుకు సందుల్లో నిర్వహించడంవల్ల డ్రైనేజీలో పడి ఎనిమిది మంది, గుంటూరులో చీరల పంపిణీలో ముగ్గురు.. తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు, సింహాచలంలో ఏడుగురు చనిపోయారని, లోకేశ్ పాదయాత్ర మొదటిరోజు సినీనటుడు తారకరత్న చనిపోయాడని, ఈ మరణాలన్నిటికీ ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. జగన్‌ను చూసి చంద్రబాబు భయపడుతున్నారని, భూతాన్ని భూస్థాపితం చేయాలంటూ మాట్లాడిన సీఎంపై చర్యలు తీసుకోవాలన్నారు. మొన్న జగన్ పర్యటనలో ఫ్లెక్సీ ప్రదర్శించిన రవితేజ అనే యువకుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకుని ఎక్కడకు తీసుకువెళ్లారో ఇప్పటికీ తెలీదన్నారు.

నిరుద్యోగాంధ్ర సంగతేంటి?: డీవైఎఫ్‌ఐ

సాక్షి, అమరావతి: యోగాంధ్ర సరేగాని..నిరుద్యోగాంధ్ర సంగతేంటని కూటమి ప్రభుత్వాన్ని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ప్రశ్నించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాము, జి.రామన్న శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. నెల రోజులపాటు మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని యోగా కోసం వాడుకున్నారని, ప్రచార ఆర్భాటానికి, ఏర్పాట్లకు ప్రజాధనం వృథా చేయడం సిగ్గుచేటన్నారు. ఓపైపు ఆర్థిక ఇబ్బందులతో రాష్ట్రం అప్పులపాలవుతోందని, మరోవైపు యోగా ఈవెంట్ పేరుతో రికార్డుల కోసం రూ.62 కోట్లకుపైగా వృథా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనికితోడు రాష్ట్రంలో యువత పరిస్థితి ఏమిటి? వారికి ఉద్యోగాలు, ఉపాధి గురించి అని సీఎం ఎప్పుడైనా ఆలోచించారా? అని ప్రశ్నించారు.

మరో ఏడాది.. ఐదు రోజుల పనిదినాలు

సీఎస్ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: వారంలో ఐదు రోజుల పనిదినాలను రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. సచివాలయం, కార్పొరేషన్లు, ఇతర ప్రభుత్వ సంస్థల ఉద్యోగులకు 'వారంలో ఐదు రోజుల పనిదినాల విధానం' వర్తిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ నుంచి ఉద్యోగులు అమరావతికి రావాల్సిన పరిస్థితి నేపథ్యంలో అప్పట్లో ప్రభుత్వం ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం పొడిగిస్తూ వస్తోంది. ఈ విధానానికి గడువు ఈ నెల 26వ తేదీతో ముగుస్తోంది. దీంతో మరోసారి పొడిగించింది.

కుప్పం విమానాశ్రయానికి బలవంతపు భూ సేకరణ వద్దు

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: కుప్పం విమానాశ్రయం నిర్మాణం కోసం రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకోవద్దని వ్యవసాయ కార్మిక సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు తదితర నాయకులు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మికి మంగళగిరి సీసీఎల్ఏ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలోని 9 గ్రామాల్లో రెండు పంటలు పండే సారవంతమైన 1,136.95 ఎకరాల భూమిని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ కోసం సన్న, చిన్నకారు రైతుల నుండి బలవంతంగా సేకరిస్తున్నారని, దీన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పం నియోజకవర్గంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఎవరి ప్రయోజనాల కోసం విమానాశ్రయం కడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

తల్లికి వందనం నగదు ఇవ్వం

మహిళను బయటకు పంపేసిన బ్యాంక్ మేనేజర్
బ్యాంకు ఎదుట పిల్లలతో బోరుమన్న తల్లి
నిలదీయడంతో రూ.7వేలు ఇచ్చి పంపేసిన వైనం



బ్యాంకు ఎదుట బిడ్డలతో మహిళ

కలువాయి(సైదాపురం): తల్లికి వందనం కింద జమయిన సొమ్మును డ్రా చేసుకునేందుకు వెళ్లిన మహిళను బ్యాంకు మేనేజర్ నిర్దాక్షిణ్యంగా నగదు ఇవ్వనంటూ బ్యాంకు సిబ్బంది ద్వారా బయటకు పంపేశారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలువాయి మండలం కుల్లూరులో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కుల్లూరు ఎస్‌సీ కాలనీకి చెందిన నిప్పట్ల లక్ష్మికి నలుగురు సంతానం. వీరిలో ముగ్గురు పిల్లలు అంగన్‌వాడీకి పోతున్నారు. రెండో తరగతి చదువుతున్న కుమార్తెకు తల్లికి వందనం వర్తించింది. ఈ మేరకు పథకం నగదు జమయిందంటూ ఫోన్ సందేశం రావడంతో ఆనందించింది. డబ్బులను తీసుకునేందుకు ఆంధ్ర ప్రగతి బ్యాంకుకు వెళ్లింది. అయితే బ్యాంక్ మేనేజర్ వెంకట నారాయణ జోక్యం చేసుకుంటూ ''మీ అత్త బ్యాంకు పొదుపు నగదు బాకీ ఉంది. నీకు తల్లికి వందనం డబ్బులు ఇవ్వను'' అంటూ బ్యాంకు సిబ్బందితో ఆమెను బయటకు పంపేశారు. దీంతో లక్ష్మి బ్యాంకు ఎదుట బోరుమంది. అక్కడే ఉన్న కొందరు ఈ విషయమై బ్యాంకు మేనేజర్‌ను గట్టిగా ప్రశ్నించారు. దీంతో చివరికి లక్ష్మికి రూ.7వేలు ఇచ్చి పంపేశాడు.

లక్ష్మి అత్త లోను కట్టలేదని రికవరీ చేశాం: బ్యాంక్ మేనేజర్

లక్ష్మి అత్త మరియమ్మ బ్యాంక్ ద్వారా స్వర్ణ హంస గ్రూప్ నుంచి రుణం తీసుకుని కట్టడం మానేసిందని బ్యాంక్ మేనేజర్ వెంకటనారాయణ తెలిపారు. మరియమ్మ కోడలు కాబట్టి లక్ష్మి నగదును రికవరీ చేశామన్నారు. తల్లికి వందనం నగదు నుంచి లక్ష్మికి రూ.7వేలు ఇచ్చామని, మిగతా నగదు పొదుపు సంఘం రుణానికి జమ చేస్తామని మేనేజర్ అన్నారు.

పోలవరంతో భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
పోలవరం ముంపుపై రౌండ్ టేబుల్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచడంతో తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని, దీంతో భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదం ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ముంపుపై సంయుక్త సర్వే నిర్వహించాలని, ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన ముంపు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రగతి ఎజెండా పేరిట ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించబోయే సమావేశంలో ఈ అంశంపై చర్చించాలని కోరారు. పోలవరం ముంపుపై, ఏపీలో కలిపిన భద్రాచలం సమీపంలోని గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలన్న అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను ఈనెల 25న నిర్వహించే ప్రగతి ఎజెండా సమావేశంలో ప్రధాని ముందు పెట్టి పరిష్కారానికి కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఆమె లేఖ రాశారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో గ్రామాలకు రక్షణ ఉంటుందని చెప్పారు. దేవుడేమో తెలంగాణలో, దేవుడి మాన్యం భూములు మాత్రం ఆంధ్రాకి పోయాయని ఆమె ధ్వజమెత్తారు. సమావేశంలో సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో స్థానిక సంస్థలు నిర్వీర్యం

- సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు అనైతిక చర్య
- నీరు-చెట్టు, ఫాంపాండ్స్ పేరుతో ప్రజాధనం లూటీ
- వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రారెడ్డి ధ్వజం
- 23న పార్టీ పంచాయతీరాజ్ విభాగం కార్యవర్గ విస్తృత సమావేశం

సాక్షి,అమరావతి: టీడీపీ కూటమి పాలనలో స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యాయని, కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనే స్థితిలో కూడా పంచాయతీలు లేవని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నీరు -చెట్టు, ఫాంపాండ్స్ నిర్మాణం పేరుతో టీడీపీ నాయకులు రూ.వేల కోట్ల అవినీతి చేస్తున్నారని ధ్వజమెత్తారు.

'2014-19 మధ్య గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు పేరుతో పనులు చేయకుండా, వాటిని ఎంబుక్ (మెజర్‌మెంట్ బుక్)లో నమోదు చేయకుండానే బిల్లులు పొందాలని చూశారు. 2019లో వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఆ పనులపై విచారణ జరిపి అక్రమాలకు అడ్డుకట్ట వేశారు. కానీ 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ నీరు -చెట్టు పేరుతో ప్రజాధనం లూటీ చేస్తున్నారు. పల్లె పండుగల పేరుతో హడావుడి చేసిన కూటమి సర్కారు... 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1150 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తే స్థానిక సంస్థలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఉపాధి హామీ పథకం నిధులనూ తమ సొంత లేఅవుట్లకు రోడ్లు వేసుకునేందుకు టీడీపీ నేతలు మళ్లిస్తున్నారు. మేట్ పోస్టులనూ రూ.5 లక్షలకు అమ్ముకునే దుస్థితికి దిగజారారు. ఉపాధి కూలీలకు చెల్లించే వేతనాల పేరుతోనూ భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారు. 1.55 లక్షల ఫాంపాండ్స్ నిర్మాణం పేరుతో అవినీతికి తెర తీశారు. సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు అనైతికం. కూటమి సర్కారు ఏడాదిగా ఎంపీటీసీలకు ఒక్క రూపాయి కూడా గౌరవ వేతనం ఇవ్వలేదు. దీనికి ఆ శాఖ మంత్రిగా ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలి. సర్పంచ్‌ల కుటుంబాలకు తల్లికి వందనం ఇవ్వలేదు. తల్లికి వందనం పథకం అమలు జరిగిందంటే అది వైఎస్ జగన్ పోరాట ఫలితమే. కూటమి సర్కారు తీసుకొచ్చిన జీవో ఎంఎస్ నంబర్ 11 వల్ల దాదాపు 1320 మంది పంచాయతీ సెక్రటరీలకు పోస్టింగులు లేవు. వారికి 9 నెలలుగా జీతాలూ ఇవ్వడం లేదు' అని రవిచంద్రారెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించామని చెప్పారు. ఈనెల 23న విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని, ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి హాజరవుతారని తెలిపారు. ఆ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని రవీంద్రారెడ్డి చెప్పారు.

వైఎస్ జగన్ కమ్మ కులాన్ని దూషించలేదు

- రాజకీయాలకు కులాన్ని ముడిపెట్టొద్దు
- వైఎస్ జగన్ కమ్మ ద్వేషి అన్న పేరును ఆపాదించొద్దు
- జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టిన నాయకుడు వైఎస్ జగన్
- ఆదర్శ ఆంధ్రప్రదేశ్ కమ్మ సంక్షేమ సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న రామ కాళేశ్వరరావు, నవీన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ సీఎం వైఎస్ జగన్ సత్తెనపల్లి పర్యటనలో కమ్మ కులాన్ని దూషించారని కొందరు నానా రాద్ధాంతం చేస్తున్నారని, వాస్తవానికి ఆయన ఎక్కడా ఆ కులాన్ని దూషించలేదని ఆదర్శ ఆంధ్రప్రదేశ్ కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధనేకుల రామకోటేశ్వరరావు స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి పర్యటనలో వైఎస్ జగన్ కమ్మ కులస్తులు వైఎస్సార్‌సీపీలో ఉండకూడదా? ఉంటే కేసులు పెట్టి వేధిస్తారా? అని మాత్రమే అన్నారని గుర్తుచేశారు. వైఎస్ జగన్ కేబినెట్‌లో కమ్మ కులానికి చెందిన మంత్రి లేడని కొందరు మాట్లాడుతున్నారని, కొడాలి నానికి మంత్రి పదవి ఇవ్వలేదా అని ప్రశ్నించారు. విజయవాడ జిల్లాకు వైఎస్ జగన్ ఎన్టీఆర్ పేరు పెట్టినపుడు ఈ కమ్మ సంఘాలన్నీ ఏమయ్యాయని నిలదీశారు. ఎన్టీఆర్ కమ్మ కులానికి చెందిన వాడేగా.. ఆనాడు ఎందుకు హర్షించలేదని ప్రశ్నించారు. వైఎస్ జగన్ కమ్మ కార్పొరేషన్ పెట్టారని, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ ఆలోచన ఎందుకు చేయలేదని నిలదీశారు. కులం చూడకుండా వేలాది మందికి ఇళ్ల పట్టాలిచ్చిన ఘనత వైఎస్ జగన్‌ది అని కొనియాడారు. లక్షల మంది కమ్మ తల్లులకు అమ్మ ఒడి లబ్ధి చేకూర్చారని, వేలాది మంది కమ్మ విద్యార్థులకు వసతి దీవెన, విద్యా దీవెన లబ్ధి చేకూర్చారని, కొన్ని వేల మంది కమ్మ మహిళలకు చేదోడు పథకం వర్తింపజేశారని, ఈబీసీ నేస్తం ద్వారా ఆడబిడ్డలకు రూ. 15వేల చొప్పున ఇచ్చారని రామకోటేశ్వరరావు గుర్తుచేశారు.

వైఎస్సార్‌సీపీలో కమ్మ కులస్తులు ఉంటే తప్పేంటి?

కమ్మ సంఘం నాయకులు మాగంటి నవీన్ మాట్లాడుతూ కమ్మ కులానికి చెందిన కొందరు వైఎస్ జగన్ కుల ప్రస్తావన తేకూడదని మాట్లాడుతున్నారని, గత ఐదేళ్లలో కుల ప్రస్తావన లేకుండా ఏ పార్టీ రాజకీయం చేసిందని ప్రశ్నించారు. కుల ప్రస్తావన లేకుండానే గత ఐదేళ్లు టీడీపీ రాజకీయం చేసిందా? అని అడిగారు. కుల సంఘాలు సేవా కార్యక్రమాలకే పరిమితం కావాలని, రాజకీయాలు తగవని పేర్కొన్నారు. కమ్మ కులస్తులంతా ఒకే పార్టీలో ఉండాలని ఒత్తిడి చేసిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తల్లిదండ్రులపై దాడి



లక్ష్మి నుంచి వివరాలు సేకరిస్తున్న రూరల్ ఎస్సై వీర్రాజు

భీమవరం అర్బన్: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఓ కుమారుడు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం తల్లిదండ్రులపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలంలోని నాగేంద్రపురం గ్రామానికి చెందిన నాగిడి గోవిందరాజు (45)కు రుస్తుంబాదకు చెందిన యువతితో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. గోవిందరాజు మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవ పడుతుండటంతో 15 ఏళ్ల క్రితం ఆమె పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది. గోవిందరాజు తల్లి లక్ష్మి, తండ్రి గణపతి ప్రభుత్వ పింఛనుపై ఆధారపడి జీవిస్తున్నారు. కొడుకు మద్యానికి అవసరమైన డబ్బులు తరచూ అడుగుతుండగా, వారు నిరాకరించేవారు. దీంతో కక్ష పెంచుకున్న గోవిందరాజు.. శుక్రవారం తెల్లవారుజామున డబ్బులివ్వాలని తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. మద్యం మత్తులో కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

> ఎపుడెపుడు ధర్మములకు గ్లాని ఏర్పడి అధర్మము వృద్ధి చెందుచున్నదో,
> అపుడు నన్ను నేను తయారుచేసుకొని భూమిమీద పుట్టుచున్నాను.
> – హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 21 జూన్ 2025

ఎయిరిండియా రద్దుల పద్దు!

చూడబోతే ఎయిరిండియాకు కష్టాలన్నీ ఒక్కసారే కట్టగట్టుకుని వచ్చినట్టున్నాయి. ఈ నెల 12న గుజరాత్‌లో జరిగిన దురదృష్ట ఘటనలో 272 మంది మరణించిన తర్వాత ఎయిరిండియా విమానాలు ఎక్కాలన్నా, ప్రత్యేకించి ప్రమాదం సంభవించిన బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ రకం విమానాల్లో ప్రయాణించాలన్నా చాలామంది భయపడుతున్నారు. అందుకు తగినట్టే ఆ సంస్థ అంతర్జాతీయ, దేశీయ మార్గాల్లో వినియోగించే దాదాపు 90 విమాన సర్వీసుల్ని అంచెలంచెలుగా రద్దుచేస్తూ పోతోంది. శుక్రవారం కూడా ఎనిమిది విమానాలు రద్దయ్యాయి. నిర్వహణాపరమైన, సాంకేతికమైన సమస్యల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు సంస్థ చెబుతోంది. వీటికితోడు పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇరాన్ గగనతలాన్ని మూసివేయటం వంటివి కూడా విమాన సర్వీసుల రద్దుకు దోహదపడ్డాయి. జూలై రెండో వారం వరకూ అంతర్జాతీయ విమాన సర్వీసులు 15 శాతం మేర తగ్గించనున్నామని ఎయిరిండియా ప్రకటించింది. ప్రయాణికులు కూడా ఏమంత భరోసాతో లేరు. అసలు విమానయానమే వద్దనుకున్నవారు కొందరైతే, బోయింగ్ విమానాలు ఎక్కరాదని మరికొందరు నిర్ణయించుకుని ప్రయాణాలు రద్దుచేసుకున్నారు.

విమానయాన సంస్థలను నియంత్రించే పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) ఎయిరిండియా విమానాల్లో భద్రతకు సంబంధించిన ప్రధాన లోపాలేమీ లేవని, కేవలం నిర్వహణాపరమైన సమస్యలే ఉన్నాయని చెబుతోంది. భిన్న విభాగాల మధ్య సమన్వయం అవసరమవుతుందని సలహా ఇచ్చింది. ఎక్కడ ఏ చిన్న లోపాన్ని గమనించినా దాన్ని నమోదు చేయటం, వెనువెంటనే సరిదిద్దటం వంటివి జరగాలని సూచించింది. ఎయిర్‌లైన్స్ సంస్థలకు రేటింగ్ ఇచ్చే అంతర్జాతీయ స్వతంత్ర ఆన్‌లైన్ సంస్థ పరిశీలనలో ఇండిగో, ఆకాశ సంస్థలు ఏడు అంశాల్లో ఆరు పాయింట్లు సాధించాయి. స్పైస్ జెట్ ఏడుకు ఏడు పాయింట్లు పొందగా, ఎయిరిండియా కేవలం నాలుగు పాయింట్లే సాధించటం గమనించదగ్గ అంశం. ఇక బోయింగ్ డ్రీమ్‌లైనర్ భద్రతా లోపాలపై ఫిర్యాదు చేసిన ఇంజినీర్ జార్జి బార్నెట్ అనుమానాస్పద స్థితిలో నిరుడు మార్చిలో మరణించిన ఉదంతం కలవరపరుస్తుంది. ఆ సంస్థ క్వాలిటీ కంట్రోల్‌లో 32 ఏళ్లు పనిచేసిన బార్నెట్ రెండ్రోజులు విచారణకు హాజరై మూడో రోజు ఎందుకు తుపాకీతో కాల్చుకుంటాడన్నది ప్రశ్నార్థకమైంది.

టాటా ఎయిర్‌లైన్స్‌గా ఉన్న సంస్థను 1953లో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జాతీయం చేసి, ఎయిరిండియాగా నామకరణం చేశారు. దేశీయ విమాన సర్వీసుల కోసం ఇండియన్ ఎయిర్‌లైన్స్ సంస్థ ఆవిర్భవించింది. ఈ రెండూ పబ్లిక్ రంగ సంస్థలు కావటంతో పౌర విమానయాన రంగంలో అవి దిగ్గజ సంస్థలుగా వెలిగాయి. కానీ దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలై విమానయానంలో ప్రైవేటు సంస్థలు ప్రవేశించటం, తక్కువ ధరకే ప్రయాణికులను చేరవేసే సంప్రదాయాన్ని ప్రారంభించటంతో అంతక్రితమే నష్టాలతో ఉన్న ఆ సంస్థ మరింతగా కుంగిపోవటం మొదలైంది. అసలు విమానయాన రంగంలో ప్రైవేటును అనుమతించినప్పుడే ఎయిరిండియా నిర్వహణను పూర్తిగా నిపుణులకు వదిలేయాల్సింది. కానీ పగ్గాలు ప్రభుత్వం దగ్గరే ఉండటం, దానికి లోబడి సంస్థ పనిచేయాల్సి రావటంతో ఎన్నో సమస్యలు చుట్టుముట్టాయి.

టాటా సన్స్ 2022లో ఎయిరిండియాను తీసుకున్నప్పుడు విమానయాన రంగాన్నే సంపూర్ణంగా మారుస్తామని ప్రకటించింది. దశాబ్దాల అసమర్థ ఉద్యోగస్వామ్యాన్ని తొలగించి, గర్వించదగిన గొప్ప సంస్థగా తీర్చిదిద్దుతామని తెలిపింది. మూడేళ్లు గడిచాయి. కానీ చెప్పుకోదగ్గ మార్పుల జాడ లేదు. అలాగని ఎయిరిండియా ఏమీ చేయలేదని కాదు. సిబ్బందికి పునఃశిక్షణనిచ్చింది. వారి యూనిఫాంని మార్చింది. యాప్‌ను సరికొత్తగా తీసుకొచ్చింది. అయితే, ప్రాణం మీదికొచ్చే ప్రమాదాలు జరగలేదన్న మాటేగానీ లోపాల పరంపర గురించిన ఫిర్యాదులు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. ఇందులో పారిశుద్ధ్యం మొదలుకొని విరిగిపోయిన సీట్లు, నాసిరకం ఉపకరణాలు వగైరాలున్నాయి. అయినా పెద్దగా ఫలితం లేదు. ఇక అస్వస్థతగా ఉండి సెలవు పెట్టినవారిని సైతం ఒత్తిడి తెచ్చి విధి నిర్వహణకు పిలిచిన సందర్భాలున్నాయని పైలెట్ల ఫిర్యాదు. ఇవన్నీ విడివిడి ఘటనలుగా కొట్టిపారేయటం కాక వాటివెనక అల్లుకునివున్న నిర్లక్ష్యాన్నీ, అలసత్వాన్నీ సకాలంలో గమనించుకుంటే పరిస్థితి మెరుగుపడేది. నిరుడు ఢిల్లీ–శాన్‌ఫ్రాన్సిస్కో సర్వీస్ విమానం ఇంజన్ వైఫల్యం కారణంగా రష్యాలో రోజుల తరబడి నిలిచిపోయింది. మరుగుదొడ్లు పనిచేయక చికాగోకు బయల్దేరిన విమానం కాసేపటికే వెనుదిరిగింది. టాటా బ్రాండ్‌కు మార్కెట్‌లో మంచి పేరుంది. వాటి ఉత్పత్తులపై వినియోగదారుల్లో విశ్వాసం ఉంది. ఎయిరిండియా దాన్ని అందుకోలేకపోయింది.

నిరుడు మే నెలలో ముంబై–లండన్ సర్వీసు బోయింగ్ 787 విమానంలో తలుపు సరిగా పనిచేయటం లేదంటూ ఫిర్యాదు చేశాక, దాన్ని వెనక్కు తీసుకోవాలని తమపై తీవ్రంగా ఒత్తిడి తెచ్చారని, నిరాకరించినందుకు షోకాజ్ నోటీసులు జారీచేసి, 48 గంటలు దాటకుండా ఉద్యోగం నుంచి తొలగించారని సీనియర్ ఫ్లయిట్ అటెండెంట్లు ఇద్దరు ఈ మధ్యే ప్రధాని నరేంద్ర మోదీకి ఫిర్యాదు చేయటం గమనించదగ్గది. ప్రవర్తన సరిగా లేకపోవటం, విధి నిర్వహణ సక్రమంగా చేయకపోవటం వంటి కారణాలతోనే వారిని తొలగించామని సంస్థ సంజాయిషీ ఇస్తోంది. అంతా సవ్యంగా గడిచినంతకాలం నిర్వాహకులు తమను తాము అభినందించుకుంటూ కాలం గడుపుతారు. ఎప్పటికప్పుడు తనిఖీ చేసే నియంత్రణ వ్యవస్థ ఉంటే ఇలాంటివి చోటుచేసుకోవు. ఈ విషాద ఘటన నుంచి అయినా గుణపాఠం నేర్చుకోవాలి. అత్యంత జాగరూకతతో మెలగాలి.

అణు ఉపద్రవం



విశ్లేషణ
మనోజ్ జోషీ

‘‘ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేయకుండా (అమెరికా) పరిస్థితిని నిరంతరం మదింపు చేస్తోంది. (ఇరాన్) 2003లో పక్కనపెట్టిన అణ్వాయుధాల నిర్మాణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సర్వోన్నత నాయకుడు ఖొమేనీ ఆదేశించలేదు’’ అని అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబార్డ్ ఈ ఏడాది మార్చి 26న చెప్పారు. అయినా, ఇరాన్ అణ్వాయుధాల నిర్మాణ సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకు ‘ముందస్తు’ చర్యగా పేర్కొంటూ ఇజ్రాయెల్ ఈ జూన్ 13న దాడులు ప్రారంభించింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ చర్యను నిర్లక్ష్యపూరిత దుందుడుకు చర్య.

ఇరాన్‌లో ఉన్న ప్రభుత్వం అక్కడి ప్రజలందరికీ ఆమోదయోగ్యమైందని చెప్పలేం. ఇజ్రాయెల్‌లో ఉన్న ప్రభుత్వం కూడా అలాంటిదే. అయినా ఇరాన్‌పై దాడికి దిగే హక్కు దానికి లేదని నిస్సందేహంగా చెప్పవచ్చు. అణ్వాయుధాన్ని నిర్మించగలిగిన స్థితికి ఇరాన్ చాలా దగ్గరలో ఉందనే ఇజ్రాయెల్ అభిప్రాయం ట్రంప్ మనసులో నాటుకుంది. దాంతో ఆయన ఇంటెలిజెన్స్ అంచనాను పక్కనపెట్టేశారు.

చేయాలనుకుంటే ఆపగలరా?

ఇరాన్ అణు సామర్థ్యాన్ని దెబ్బతీయడం, అక్కడ అధికారం చేతులు మారేటట్లు చూడటం ఇజ్రాయెల్ ఆశయాలు. ఆ రెంటిలో ఏదీ తేలికైనది కాదు. ఇరాన్ అణ్వాయుధాన్ని నిర్మించకుండా జాప్యం చేయగలిగిన సత్తా ఇజ్రాయెల్ సొంతం ఏమీ కాదని ఇజ్రాయెల్ మాజీ ప్రధాని ఎహుద్ బరాక్ ఈమధ్య అన్నారు. ‘‘బహుశా కొన్ని వారాలు ఆపగలం... ఓ నెల ఆపగలం... అమెరికా కూడా దాన్ని కొద్ది నెలలపాటే అడ్డుకోగలదేమో’’ అన్నారాయన.

ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థతోపాటు నటాంజ్‌లో ఉన్న ముఖ్యమైన యురేనియం శుద్ధి సదుపాయాన్ని, ఇస్ఫహాన్ న్యూక్లియర్ టెక్నాలజీ సెంటర్‌ను ఇజ్రాయెల్ తీవ్రంగా ధ్వంసం చేయగలిగిందని ప్రస్తుత మదింపులు సూచిస్తున్నాయి. కానీ అరాక్ న్యూక్లియర్ కాంప్లెక్స్ చాలా వరకు చెక్కుచెదరకుండానే ఉందని చెబుతున్నారు.

అన్నింటికన్నా ముఖ్యంగా, ఫర్దోలో ఉన్న ఇంధన శుద్ధి భూగర్భ కేంద్రానికి కూడా ఇంతవరకు వాటిల్లిన నష్టం ఏమీ లేదు. ఈ సదుపాయం చాలా కీలకమైంది. ఎందుకంటే, ఇరాన్ వద్ద 60 శాతం శుద్ధి అయిన యురేనియం ఉంది. అణ్వాయుధాన్ని నిర్మించడానికి 90 శాతం శుద్ధి అయిన యురేనియం అవసరం. ఆ పనిని ఫర్దో సదుపాయం వారం రోజుల్లో చేసిపెట్టగలదు. ఇరాన్ వద్ద 2025 మే నాటికి 408.6 కిలోల శుద్ధి చేసిన యురేనియం ఉందని అంచనా. దానిని మరింత శుద్ధి చేస్తే, రానున్న వారాల్లో తొమ్మిది అణ్వాయుధాల తయారీకి సరిపోతుంది.

అమెరికా భాగస్వామ్యం ఎంత?

భారీ మందుగుండు సామగ్రితో కూడిన ఎయిర్ బ్లాస్ట్ బాంబు (ఎంఏబీ) మాత్రమే ఫర్దోను ధ్వంసం చేయగలదు. అది ఇజ్రాయెల్ వద్ద లేదు. అమెరికా రంగంలోకి దిగితేనే దాన్ని ధ్వంసం చేయడం సాధ్యం. అణ్వాయుధాలను సమకూర్చుకునేందుకు ఇరాన్ ఇరవై ఏళ్ళపైనుంచి కృషి చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ చెక్కుచెదరని భూగర్భ సదుపాయాలను కూడా అది నిర్మించుకుంది.

గగనతల దాడులొక్కటే ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్మూలించలేవు. పదాతి దళాలతో భూతల ఆక్రమణ కూడా అవసరమవుతుంది. అమెరికా పాత్ర ఇక్కడే అవసరం పడుతుంది. ఇరాన్ ‘బేషరతుగా లొంగిపోవడం’ ట్రంప్ డిమాండ్లలో ముఖ్యమైంది. వెనుతిరిగి చూస్తే, ఇరాన్‌పై యుద్ధం అమెరికా–ఇజ్రాయెల్ కలిసి చేసిన పనేనేమో అనిపిస్తుంది. బేషరతుగా లొంగిపొమ్మనడం, ప్రభుత్వాన్ని మార్చుకొమ్మని చెప్పడం వల్ల, ఇరాన్ నిజంగానే అణ్వాయుధ నిర్మాణ దిశగా అడుగు వేయవచ్చు. ఇరాన్ అలాంటి ఆయుధాలను నియోగించకుండా నివారించేందుకు ఇజ్రాయెల్, అమెరికాలు అణ్వాయుధాలను అమ్ములపొదుల నుంచి బయటకు తీయవలసి రావచ్చు. అణ్వాయుధాల ప్రయోగమే జరిగితే అది ప్రపంచానికంతటికీ వినాశకరం.

నిజానికి, ఇజ్రాయెల్‌ను దృష్టిలో పెట్టుకుని ఇరాన్ అణ్వాయుధాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టలేదు. ఇరాక్ కారణంగా ఆ పని చేసింది. ఇరాన్–ఇరాక్‌ల మధ్య 1980–88 వరకు సాగిన యుద్ధం అందుకు ప్రేరణగా నిలిచింది. అమెరికా సాయంతోనే ఇరాన్‌పై దాడికి ఇరాక్ ఉపక్రమించింది. ఇరాన్‌లోని నగరాలపై ఇరాక్ రసాయనిక ఆయుధాలు, క్షిపణులతో దాడులకు దిగినా ప్రపంచ దేశాలు చాలావరకు మిన్నకుండిపోయాయి. దాంతో 1980ల మధ్య నుంచి ఇరాన్ సైనిక కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే, ఇరాక్‌పై 2003లో అమెరికా దాడి చేసిన తర్వాతనే, అణ్వాయుధాలు లేనిదే తన భద్రతకు పూచీ ఉండదని ఇరాన్ భావించడం మొదలుపెట్టింది.



> ఇరాన్ వద్ద 2025 మే నాటికి 408.6 కిలోల శుద్ధి చేసిన యురేనియం ఉందని అంచనా. దానిని మరింత శుద్ధి చేస్తే, రానున్న వారాల్లో ఇరాన్ తొమ్మిది అణ్వాయుధాలు తయారు చేయవచ్చు.

ఇరానియన్లకు చరిత్ర పట్ల చక్కని అవగాహనతోపాటు జాతీయతా భావాలు మెండు. ఇరాక్‌లో మాదిరిగానే ఇరాన్‌లో కూడా అపార విధ్వంసానికి పాల్పడటంలో, ఆ దేశాన్ని బలహీనపరచడంలో అమెరికా–ఇజ్రాయెల్ విజయం సాధించవచ్చు. ప్రభుత్వాన్ని మార్చడంలోనూ సఫలం కావచ్చు. కానీ, కథ అంతటితో కంచికి పోదు.

వ్యాసకర్త ఢిల్లీలోని అబ్జర్వర్ రిసెర్చ్ ఫౌండేషన్‌లో విశిష్ట సభ్యుడు

మనకు పరీక్ష



విశ్లేషణ
శ్యామ్ శరణ్

మనకు సంబంధం లేని సమస్య మన తలకు చుట్టుకోవడమంటే ఇదే. ప్రాంతీయ ఘర్షణలు లేదా అంతర్జాతీయ సంక్షోభాలు తరచు భారత్‌కు లేనిపోని కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. ఇవి మన విదేశాంగ విధానానికి, భద్రతకు సంబంధించి ఊహించని సవాళ్ళను విసురుతున్నాయి. సాపేక్షంగా చూస్తే, మనం ఇరాన్‌తో సుహృద్భావ వాతావరణాన్ని నిలబెట్టుకుంటున్నాం. అటు పశ్చిమాసియా, గల్ఫ్ దేశాలతో, ఇటు ఇజ్రాయెల్‌తో సమాంతరంగా మనం ఎంతో జాగ్రత్తగా సన్నిహిత రాజకీయ, భద్రతా, ఆర్థిక సంబంధాలను కొనసాగిస్తూ గడించుకున్న ప్రయోజనాలకు ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య మొదలైన యుద్ధం గొడ్డలిపెట్టు.

ఇరు పక్షాలూ కావాల్సినవే!

పరస్పరం శత్రువులుగా ఉన్న దేశాలు మనతో మాత్రం మైత్రిని కొనసాగించేటట్లు చేయడంలో భారత్ ఇంతవరకు గణనీయమైన నిపుణతను ప్రదర్శించింది. భారతదేశ రక్షణ, భద్రతా సామర్థ్యాలను పెంపొందించడంలో ఇజ్రాయెల్ కీలక భాగస్వామిగా ఉంది. ఇటీవల మనకు పాకిస్తాన్‌తో తలెత్తిన సైనిక ఘర్షణలో అది మనకు ఎంతగా ఉపయోగపడిందో చూశాం. నిజానికి, కొన్ని అంశాల్లో ఇజ్రాయెల్‌తో కలిసి పనిచేయాలని కొన్ని ముఖ్యమైన గల్ఫ్ దేశాలే కోరుకుంటూండటంతో, దానితో మైత్రిని కాపాడుకుంటూనే, పశ్చిమాన పొరుగునున్న అన్ని ముఖ్యమైన దేశాలతో స్నేహ సంబంధాలను సుస్థిరపరచుకునేందుకు మనకొక మహత్తర అవకాశం లభించింది. ఈ దేశాల్లో అమెరికా కూడా ఉంది. దానికి ఈ ప్రాంతంలో భద్రతాపరంగా పటిష్ఠమైన ఉనికి ఉంది.

> భారత దీర్ఘకాలిక ప్రయోజనాల రీత్యా, స్నేహపూర్వకమైన ఇరాన్ ఒక అమూల్యమైన ఆస్తి. ఇక భారత్ రక్షణ, భద్రతా సామర్థ్యాలను పెంపొందించడంలో ఇజ్రాయెల్ కీలక భాగస్వామి.

గల్ఫ్‌కు సంబంధించి భారత్–అమెరికా మధ్య నున్న లోపాయకారీ అవగాహన భారత్–ఇజ్రాయెల్‌లను, అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లను ఒక గ్రూపుగా చేర్చింది. ఈ నాలుగు దేశాల గ్రూపును పశ్చిమ దేశాలవారు ‘క్వాడ్’గా పిలుచుకుంటున్నారు. దీన్నే ఐ2యు2గా కూడా పిలుస్తున్నారు. పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతంలో భద్రతకు బాధ్యత వహించే అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయం (సెంట్ కామ్)లో ఒక భారతీయ అనుసంధాన అధికారి కూడా ఉన్నారు. సాపేక్షంగా చూస్తే, ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలకు అవకాశం ఉందనే అంచనాతోనే భారత్–మధ్య ప్రాచ్య–యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఐఎంఇసి) ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టే ప్రయత్నం చేశారు. భారత్–గల్ఫ్ మధ్య ఏర్పాటు చేసే ఈ రవాణా కారిడార్ ఇజ్రాయెల్‌లోని హైఫా నౌకాశ్రయం వరకు వెళుతుంది.

ఇరాన్, తుర్కియే ఆ ప్రయత్నాల పట్ల సంతోషంగా లేవు. ప్రాజెక్టులో తమ పాత్ర లేదని కినుక వహించాయి. కానీ, ఆ రెండు దేశాలతోనూ సత్సంబంధాలను కొనసాగిస్తూ భారత్ జాగ్రత్తపడింది. ‘లుక్ వెస్ట్ పాలసీ’ భారత్ ఇంధన భద్రతను పెంపొందించడంలో, విస్తరిస్తున్న మార్కెట్లను, పెట్టుబడి వనరులను కనుగొనడంలో సఫలమైంది. ఆ ప్రాంతంలో బతుకుబండి లాగిస్తున్న 90 లక్షల మంది భారతీయుల సంక్షేమానికి తోడ్పడింది.

ముమ్ముందు ఈ వైఖరి సాధ్యమా?

గాజాలో 2023లో మొదలైన యుద్ధంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఇజ్రాయెల్, పాలస్తీనా రెండూ పక్కపక్కన రెండు స్వతంత్ర, సార్వభౌమాధికార రాజ్యాలుగా ఉండాలనే మూసపోసిన ప్రకటనలనే భారత్ విడుదల చేసింది. ఇజ్రాయెల్‌ను విమర్శిస్తూ ఐరాస చేసిన తీర్మానాలు ఓటింగుకు వచ్చినపుడు భారత్ గైర్హాజరైంది. గల్ఫ్, అరబ్ దేశాలతో మన సంబంధాలపై అదృష్టవశాత్తు, అది ఇంతవరకు ప్రతికూల ప్రభావాన్ని చూపలేదు. కానీ, వెస్ట్ బ్యాంక్, గాజాలలో జాతి నిర్మూలన విధానాలను ఇజ్రాయెల్ స్పష్టమైన రీతిలో అనుసరిస్తూండటంతో ఆ ప్రాంతం పట్ల ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాన్ని భారత్ కొనసాగించడం ఇకపై కష్టం. కవ్వింపు లేకుండానే ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేసిన తాజా దాడులతో పరిస్థితి జటిలమైంది.

ఇజ్రాయెల్ దాడులకు భారత్ మూల్యం చెల్లించుకోవాల్సి రావచ్చు. ఇజ్రాయెల్‌తో మన భాగస్వామ్యం, ప్రాంతీయ శాంతి, సుస్థిరతతో ముడిపడిన మన గణనీయ ప్రయోజనాలను కాపాడుకోనివ్వకుండా అడ్డుపడుతోందా?

అమెరికా లోపాయకారీగా ఆమోదం తెలుపనిదే ఇజ్రాయెల్ ఈ ‘రైజింగ్ లయన్’ ఆపరేషన్‌కు దిగి ఉండదు. అణ్వస్త్ర సహిత దేశంగా ఇరాన్ అవతరించకుండా నిరోధించడానికి ఇజ్రాయెల్ ఎంత పట్టుదలతో ఉందో అమెరికా కూడా అంతే దృఢ నిశ్చయంతో ఉంది. ఆరంభపు దాడులను ఇజ్రాయెల్ నిర్వహించినా, ప్రాణాంతక తదుపరి దాడులను అమెరికా చేపట్టవచ్చు. ఇజ్రాయెల్ వద్ద లేని బంకర్–బస్టింగ్ బాంబులు దానివద్ద ఉన్నాయి. నటాంజ్, ఫర్దో అనే రెండుచోట్ల భూగర్భ అణు సదుపాయాలను ఇరాన్ నిర్మించుకుంది. ఆ బాంబులు ఈ భూగర్భ సదుపాయాలను కూడా ధ్వంసం చేయవచ్చు. ఇరాన్‌పై దాడులను అరబ్, గల్ఫ్ దేశాలు పైకి విమర్శించినా, దాని అణ్వస్త్ర నిర్మాణ సామర్థ్య సదుపాయాలు కుప్పకూలడం వల్ల అవి లోలోపల సంతోషిస్తున్నాయని అమెరికా, ఇజ్రాయెల్ భావిస్తున్నాయి.

ఇస్లామిక్ రిపబ్లిక్‌గా అవతరించాక, ఇరాక్‌తో ఎనిమిదేళ్ళపాటు సాగిన యుద్ధం తర్వాత ఏర్పడిన బలహీన స్థితిని మినహాయిస్తే– నేడున్నంత బలహీన స్థితిలో ఇరాన్ ఎన్నడూ లేదు. భారతదేశ దీర్ఘకాలిక ప్రయోజనాల రీత్యా, పటిష్ఠమైన, స్థిరమైన, స్నేహపూర్వకమైన ఇరాన్ ఒక అమూల్యమైన ఆస్తి. పశ్చిమం వైపు దృష్టి సారిస్తున్న మన విధానం ఈ వాస్తవికతను కూడా ప్రతిబింబించి తీరాలి.

వ్యాసకర్త విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి, (‘ద ట్రిబ్యూన్’ సౌజన్యంతో)

తిలాపాపం తలా పిడికెడు!

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయింది. ఈ సందర్భంగా విద్యాసంస్థలు, బోధనా సిబ్బంది, విద్యార్థులు అనే త్రికోణంలో నేటి విద్యావ్యవస్థ తీరుతెన్నులను విశ్లేషించుకోవలసి ఉంది. ఈ మధ్యకాలంలో విద్యార్థులకు బోధన చేయలేక ఉపాధ్యాయులు గుంజీలు తీయడం, చెప్పు దెబ్బలు తినటం వంటివి జరుగుతున్నాయి. ప్రతీ దశలోనూ ‘చదువు’ ఓ వ్యాపార వస్తువయిన వర్తమానంలో... వినిమయ వస్తువుగా ఉపాధ్యాయుడు మిగిలిపోవడం విషాదం. ఉపాధ్యాయులు చెబితే తల్లిదండ్రులతో వచ్చి దాడులు చేస్తున్నారు. తరగతి గదిలో ఫోన్ వాడకం వద్దు అని మందలించినందుకు ఉన్నత సాంకేతిక విద్యావంతురాలైన అధ్యాపకురాలిని ఓ విద్యార్థిని చెప్పుతో కొట్టడం లోకం చూసింది.

అదే సమయంలో ‘విద్యార్థులు గురువులను అనుసరిస్తారు’ అనే మహాత్ముని వ్యాఖ్యానం నిజమనుకుంటే వర్తమానంలో కొంత (ఎంతో) మంది విద్యార్థుల అనైతిక గుణాలు, ప్రవర్తనకు కారకులెవరనుకోవాలి? పిల్లలు తప్పు చేస్తే తల్లిదండ్రులనంటారు. కానీ విద్యార్థులు తప్పు చేస్తే? నిజానికి ఇటువంటి సూక్తులు, నీతులు వినటానికి బావుంటాయి. నిపుణతను ఇవ్వని ‘తరగతి’ బోధన ‘నైతికత’ను మాత్రం ఇవ్వగలుగుతుందా? మరి సృజనాత్మకమైన, నైతిక విలువలు కలిగిన జాతి నిర్మాణం ఎలా? మార్కెట్ మాయాజాలం, సెల్ ఫోన్ ప్రపంచం ఇస్తున్న అనేకానేక సౌకర్యాలు విద్యార్థి– గురువు సంబంధాలను పలుచన చేస్తున్నాయి.



విద్యావిధానంలో మార్పులు అనివార్యం. పాఠ్యప్రణాళికలో నైతిక, మానవీయ, మానవతా విలువలు పెంపొందించే ‘అవకాశాలు’ ఏవి? కార్పొరేట్ యాజమాన్యాలు లక్షలు వసూలు చేస్తూ ‘మర మనుషులను’ తయారు చేస్తుంటే, ఇంట్లో తల్లిదండ్రులు తమ పిల్లలను ‘స్టేటస్’ సింబల్స్‌గా చూస్తున్నారు. మార్కులు, ర్యాంకుల చక్రబంధంలో విద్యార్థులు ఆటలు, పాటలు, సరదాలు, సంతోషాలు, పుస్తక పఠనాలు ఎక్కడ? ప్రభుత్వం విద్యావిధానంలో నైతిక విలువలను ప్రోది చేయటం కోసం ప్రత్యేకంగా ఓ ప్రవచన కర్తను నియమించింది. కాని క్షేత్రస్థాయిలో జరుగుతున్నదేమిటి? గురువులు బెల్, బిల్‌లను చూస్తున్నారు. విద్యార్థులకు ‘పాస్’ అయితే చాలు.

కొత్త విద్యా సంవత్సారాలు వస్తుంటాయి, వెళుతుంటాయి. గురుశిష్య సంబంధాలను విశ్లేషించుకొని, లోటుపాట్లను సరిదిద్దుకొని ముందుకు వెళుతున్న ప్రక్రియలు ఎక్కడ ఉన్నాయి? ‘విద్యార్థి ఎలా పోతే నాకేమి తల్లిదండ్రులకు కావలసి మార్కులు, ర్యాంకులు ఇస్తున్నాం. ఓకే’ అనేది కార్పొరేట్ టీచర్ల సంతృప్తి. ఇక ప్రభుత్వ కళాశాలల గురించి చర్చించుకోవడం అంటే అదేమంత గొప్ప విషయంగా కనిపించదు. ఈ త్రిభుజంలో... విద్యాసంస్థ, విద్యార్థి, గురువుల విలువలు గురించి ఆలోచించే అవకాశం, సమయం ఎవరికుంది?

– ఎం. లక్ష్మి: వి.ఎస్.ఎం. కళాశాల, రామచంద్రాపురం

నిరసన అంటే నిజం చెప్పడమే...

నిరసన అనేది పాలకులకు ప్రజలు నిజం చెప్పడానికి ఉన్న ఒక బలమైన మార్గం. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ హక్కులో భాగమిది. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి అసమ్మతి, నిరసన అనేది ఒక సేఫ్టీ వాల్వ్ అని జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. నిజానికి, ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే అనేక సామాజిక ఉద్యమాలకు నిరసనలు అత్యంత శక్తిమంతమైన చోదక శక్తిగా ఉన్నాయి. ఈ నిరసనలు ప్రభుత్వాలు చేసే అన్యాయం, దుర్వినియోగాన్ని బట్టబయలు చేస్తున్నాయి. పాలకుల నుంచి జవాబుదారీతనం కోరుతున్నాయి. మెరుగైన భవిష్యత్తు కోసం ఆశతో ఉండటానికి నిరసనలే ప్రజలకు దిక్సూచిలుగా కనిపిస్తున్నాయి.

కానీ దురదృష్టవశాత్తు, ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం ప్రసాదించిన ఇతర హక్కులతో పాటు ఈ హక్కూ దాడికి గురవుతోంది. ప్రశ్నించే గొంతులను కర్కశంగా అణిచివేస్తున్నారు. స్వేచ్ఛ, సమానత్వం, జీవించే హక్కు, దోపిడీని నిరోధించే హక్కులకు భంగం కలిగిస్తున్నారు. రాజ్యాంగానికి లోబడే నిష్పక్షపాతంగా పనిచేస్తామన్న పాలకుల ప్రమాణాలు ఆచరణలో కనిపించడం లేదు. ప్రభుత్వం పోలీసు వ్యవస్థ ద్వారా నాయకుల నిరసనలను వారి పర్యటనలను అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్ష నేతలకు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తోంది. ప్రజలలో వస్తున్న మార్పుకు ప్రభుత్వ పెద్దలు భయపడుతున్నారా? అనే చర్చ ప్రారంభమైంది. నిరసనలను అడ్డుకోవడమంటే నిజాలన్నింటినీ దాచేందుకు ప్రయత్నిస్తున్నారనే అర్థంకాక మరేమిటి? ఈ నిరసన గొంతుకలను నొక్కేసేందుకు పోలీసు వ్యవస్థ నానాటికీ వింతపోకడలకు దిగుతోంది. టీవీ లైవ్ షోలో విశ్లేషకుడి మాటలను సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుకి అన్వయించి పోలీసులు ఆయనను అరెస్ట్ చేయడం దీనికి ఓ సంకేతం.



> భిన్నాభిప్రాయాలు ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సేఫ్టీ వాల్వ్ లాంటివని జస్టిస్ డీవై చంద్రచూడ్ అభివర్ణించారు. భిన్నాభిప్రాయాలను అణచివేయాలని చూడటం, ప్రజలలో భయాన్ని సృష్టించడం వ్యక్తిగత స్వేచ్ఛనూ, రాజ్యాంగ విలువలనూ ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు.

అయితే దీనిపై సర్వోన్నత న్యాయస్థానం స్పందించి ఆయనను విడుదల చేయాలని ఆదేశించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ‘లైవ్ షోలో విశ్లేషకుడి మాటలను యాంకర్‌కు ఎలా అన్వయిస్తారు? నవ్వినంత మాత్రాన అరెస్టు చేస్తారా? అలాగైతే విచారణల సందర్భంగా మేము కూడా నవ్వుతుంటా’మని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. అత్యంత కీలకమైన వాక్ స్వాతంత్ర్యపు హక్కును పరిరక్షించాలని పోలీసులకు, ప్రభుత్వానికి హితవు పలికింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యలను పరిశీలిస్తే, ఏపీ పోలీసులు రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పౌరుల హక్కులను కాలరాస్తున్న వైనం తేటతెల్లమైంది. పాలకుల మెప్పు కోసం పోలీసులు చట్ట విరుద్ధంగా చేసే ఇలాంటి చర్యలను ఎప్పటికప్పుడు సుప్రీంకోర్టు చెక్ పెడుతూనే వస్తోంది.

భారతదేశంలో పోలీసు సంస్కరణలు అత్యవసరమని ‘ప్రకాష్ సింగ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా’ కేసులో సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. పోలీసుల హింసను అరికట్టేందుకు అనేక అంశాలను సూచించింది. దుష్ప్రవర్తనకు పాల్పడే పోలీసులను జవాబుదారీ చేయాలని వెల్లడించింది. పోలీసులు చట్టబద్ధంగానే అరెస్టులు చేయాలని, ఏకపక్ష నిర్బంధం సరికాదని సూచనలు చేసింది. ఎందుకంటే ఇవి తీవ్రమైన కస్టోడియల్ హింసకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. అయితే ఈ మార్గదర్శకాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిష్క్రియాత్మకంగా ఉన్నాయి. ఫలితంగా పోలీసు వ్యవస్థలో జవాబుదారీతనం లోపిస్తోంది.

నిజానికి భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం, నిరసనలు ప్రకటించడం భావ ప్రకటన స్వేచ్ఛలో భాగమే. ఆర్టికల్ 19 కింద పౌరులకు వాక్ స్వాతంత్ర్య హక్కు, సంఘాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించుకునే హక్కును రాజ్యాంగం ప్రజలకు కల్పించింది. భిన్నాభిప్రాయాలు ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సేఫ్టీ వాల్వ్ లాంటివని జస్టిస్ డీవై చంద్రచూడ్ అభివర్ణించారు. అంతేకాదు, భిన్నాభిప్రాయాలను అణచివేయాలని చూడటం, ప్రజలలో భయాన్ని సృష్టించడం కచ్చితంగా వ్యక్తిగత స్వేచ్ఛనూ, రాజ్యాంగ విలువలనూ ఉల్లంఘించడమేనని స్పష్టం చేశారు. నిజానికి నిరసన ద్వారానే వివక్ష, అన్యాయాల నుంచి ప్రజలకు విముక్తి పొందే మార్గం దొరుకుతుంది. అసమానతల, అన్యాయాల సంకెళ్లను తెంచి సమానత్వాన్నీ, స్వేచ్ఛనూ సాధించేందుకు ఉపకరిస్తుంది. అయితే దురదృష్టవశాత్తు ఏపీలో రాజకీయ ద్వేషాలతో ఈ నిరసన హక్కు ప్రమాదంలో పడింది.

– వెంకటేష్ నాగిళ్ల, డిప్యూటీ ఇన్‌పుట్ ఎడిటర్, సాక్షి టీవీ, ఢిల్లీ

సానుకూల ఆలోచన

ఒకానొక జెన్ గురువును సందర్శించిన ఓ వ్యక్తి తాను ఏ పనీ చెయ్యలేకపోతున్నాననీ, సొంత వ్యాపారం చేద్దామన్నా ఎవరైనా మోసం చేస్తారని భయపడుతున్నాననీ చెప్పాడు. అంతా విన్న గురువుగారు ‘ఈ రోజు రాత్రి నువ్వు కోతుల గురించి ఆలోచించకుండా రేపు వచ్చి కలువు’ అన్నారు. సరేనని ఇంటికి వెళ్లిన ఆ వ్యక్తి ‘గురువుగారు ఇలా ఎందుకు చెప్పారు? తాను కోతికి ఎప్పుడూ ఏ అపకారం చెయ్యలేదే...’ అనుకుంటూ దాని గురించే ఆలోచిస్తూ నిద్రపోయాడు. కలలో కూడా కోతే కనిపించింది. తెల్లవారింది. గురువు దగ్గరకు పరుగుతీశాడు. ఎంత వద్దనుకున్నా కోతి ఆలోచన తనను వెంటాడిందన్నాడు.

జ్యోతిర్మయం

అతను చెప్పినదంతా విన్న గురువుగారు చిరునవ్వుతో ‘నిజానికి నువ్వేమీ కోతికి అపరాధం చేయలేదు. ఇది అర్థం చేసుకో. నీ ఆలోచనలకు నువ్వే అధిపతివి. వాటిని నువ్వే తీర్మానిస్తావు. నీకేది అవసరమో దాని గురించి మాత్రమే ఆలోచించు. కోతి గురించి తలవకు అన్నాను. కానీ దాని గురించే ఆలోచించావు. నీకు ప్రయోజనం లేని దాని గురించి ఆలోచించకు. ఏదైనా మంచిగానే జరుగుతుందని నమ్ము. ఏదైనా ఆరంభించేటప్పుడు అలా జరుగుతుందేమో, ఇలా జరుగుతుందేమో అని ఆలోచించి ఓ నిర్ణయానికి రాకు... ప్రతికూలమైన ఆలోచనే నీ పురోగతికి అడ్డుకట్ట. కనుక దానిని విడిచిపెట్టు. ఏది ఎదురైనా అధిగమించడానికి ప్రయత్నించు. నీ లక్ష్యసాధన మీదే దృష్టిపెట్టు’ అని చెప్పారు. దాంతో అతను అలాగేనని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం; **తిథి:** బ.ఏకాదశి రా.1.43 వరకు, తదుపరి ద్వాదశి; **నక్షత్రం:** అశ్విని సా.5.38 వరకు, తదుపరి భరణి; **వర్జ్యం:** ప.1.48 నుండి 3.17 వరకు, తదుపరి రా.2.34 నుండి 4.03 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.6.02 నుండి 7.13 వరకు; **అమృత ఘడియలు:** ఉ.10.54 నుండి 12.21 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు; **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు; **సూర్యోదయం:** 5.30; **సూర్యాస్తమయం:** 6.33; **స్మార్త ఏకాదశి.**

సొంత రాజ్యాంగాలంటే.. కేసులు కట్టి జైల్లో పెట్టాలి

- ఒక రాజ్యాంగం ఉండగా ఈ 'బుక్'లేంటి?
- టీవీ డిబేట్‌లో నవ్వితే జర్నలిస్టుపై కేసు పెట్టారంటే నవ్వొస్తోంది
- ప్రజల హక్కుల కోసం న్యాయవాదులు పోరాడకపోతే వారి హక్కులకూ భంగం
- రాష్ట్రంలో తొలిసారిగా ఐపీఎస్‌లు జైలుపాలు
- అధికారులు చట్టం ప్రకారం నడుచుకోవాలి
- తెనాలి ఘటనలో పోలీసులదే కాదు.. పైనున్న అధికారులదీ బాధ్యతే
- మహిళలు, చిన్నారులపై దారుణాతి దారుణాలు జరుగుతున్నాయి
- 'మానవ హక్కుల పరిరక్షణ–న్యాయవాదుల పాత్ర'పై సదస్సులో వక్తలు

సాక్షి, అమరావతి: ప్రతిఒక్కరి హక్కులు పరిరక్షించాలన్న ఆలోచనతోనే రాజ్యాంగం రాయాల్సి వచ్చిందని, సవివరణలతో కూడిన రాజ్యాంగం అమలులో ఉండగా కొత్తకొత్త రాజ్యాంగాలు, పుస్తకాల గురించి ఎందుకు మాట్లాడాల్సి వస్తోందని పలువురు వక్తలు ప్రశ్నించారు. ఒకరు రెడ్‌బుక్, ఇంకొకరు ఎల్లోబుక్, మరొకరు ఇంకో బుక్ అంటున్నారని.. ఈ రకమైన అదనపు రాజ్యాంగాల అవసరం ఎందుకొచ్చిందని వారు నిలదీశారు. రాజ్యాంగంపై ప్రమాణంచేసి అధికారం చేపట్టిన ప్రజాప్రతినిధులు రాజ్యాంగాలు ప్రయోగిస్తాం, అమలుచేస్తామంటే.. అది కచ్చితంగా రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుందని, వీరిపై కేసులు నమోదుచేసి జైల్లో పెట్టాలని ముక్తకంఠంతో కోరారు. ఆంధ్ర అడ్వకేట్స్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ ఐలాపురం హోటల్‌లో 'మానవ హక్కుల పరిరక్షణ–న్యాయవాదుల పాత్ర' అనే అంశంపై సదస్సు జరిగింది. ఫోరం రాష్ట్ర కన్వీనర్ బి. అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్, విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు డాక్టర్ వసుంధర, మాజీ ఐఏఎస్ అధికారి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.విజయ్‌కుమార్, హైకోర్టు న్యాయవాది మలసాని మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలపై పిల్ వేయాలి..



ఈరోజు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఉన్న వారంతా ప్రభుత్వోద్యోగుల బదిలీలకు లేఖలు ఇస్తున్నారు. వారికి అనువైన పోలీసులను వేసుకుంటున్నారు. నియోజకవర్గాన్ని సామ్రాజ్యంగా భావించి అక్కడున్న సహజ వనరులు ఎలా దోచుకోవాలి? అన్నదానికే వీరు ప్రాధాన్యత ఇస్తున్నారు. నిజానికి.. ఎవరైనా ఒక అధికారి ఎమ్మెల్యే సిఫార్సు లేఖ తెచ్చుకుంటే అతన్ని సస్పెండ్ చెయ్యొచ్చు. అలాగే, ప్రజాప్రతినిధులు రాతపూర్వకంగా సిఫార్సు లేఖలిస్తున్నారు. ఇదొక్కటి చాలు ఎమ్మెల్యేలపై కేసు పెట్టడానికి. వీటిపై న్యాయవాదులు పిల్ వేయాలి. ఇక ఈ ఏడాది పాలనలో 766 హత్యాయత్నాలు జరిగితే వీటిలో 390 ఘటనలు రాజకీయపరమైనవే. 2,466 కేసుల్లో 500 మంది జైల్లో ఉన్నారు. సోషల్ మీడియాపై 440 కేసులు బనాయించగా.. 79 మంది జైళ్లలో ఉన్నారు. – విజయ్‌కుమార్, విశ్రాంత ఐఏఎస్ అధికారి

నవ్వితే కేసు అంటే నవ్వొస్తోంది..



టీవీ డిబేట్‌లో నవ్వితే జర్నలిస్టుపై కేసు పెట్టారని అంటే నవ్వొస్తోంది. ఈ కేసులో ప్రభుత్వ పరువు ఏమైంది? అసలీ వ్యవహారంలో ఎస్సీ, ఎస్టీ కేసు ఎలా వచ్చింది? అధికారం మారితే పోలీసులు మారిపోతారా? పోలీసులే చంపుకుంటూపోతే ఇక హక్కుల గతేమిటి? హక్కులు పరిరక్షించుకుంటూ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి. కారణం లేకుండా ఏ వ్యక్తినీ నిర్బంధించకూడదు. తెనాలి ఘటన వంటి వాటిల్లో యువకులను కొట్టిన పోలీసులదే కాదు పైనున్న అధికారులదీ బాధ్యతే. ఈ సమాజంలో లాయర్లు, ప్రజలు ఫిఫ్త్ ఎస్టేట్. రైట్ టు ఎడ్యుకేషన్, ఫ్రీడమ్ టు స్పీచ్ లేకపోతే మన మనుగడ కష్టం. ప్రజల హక్కుల కోసం న్యాయవాదులు పోరాడకపోతే న్యాయవాదుల హక్కులు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది.
– మాడభూషి శ్రీధర్, కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్

అణచివేత ఎల్లకాలం పనిచేయదు..



విజయవాడ ఒకప్పుడు రాజకీయ రాజధాని. ఎంతో ఉన్నతమైనది. అలాంటి చోట కులతత్వం పెరగడం విచారకరం. రాష్ట్రంలో మహిళను చెట్టుకు కట్టేసి కొడుతుంటే.. యువకులను నడిరోడ్డుపై పడేసి కొడుతుంటే ఎవరూ స్పందించకపోతే భవిష్యత్తు ఏమవుతుందో ఆలోచించాలి. ముఖ్యంగా లాయర్లు స్పందించకపోతే ఎలా? రాజకీయ నాయకులు యువతను ఎప్పుడూ మత్తులోనే ఉంచి వారి పబ్బం గడుపుకుంటున్నారు. అణచివేసి రాజ్యమేలుతానంటే అది ఎల్లకాలం పనిచేయదు. స్వతంత్ర పోరాటంలో న్యాయవాదులే ఎక్కువ. తెనాలి, కుప్పం వంటి ఘటనలపై సమాజం, న్యాయవాదులు స్పందించకపోతే చాలా ప్రమాదం. ప్రజల హక్కులను కాపాడే బాధ్యత న్యాయవాదులు తీసుకోవాలి. అధికారులు చట్టం ప్రకారమే నడుచుకోవాలి.
– జస్టిస్ బి. చంద్రకుమార్, ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి

పీ4 విధానం అశాస్త్రీయమైనది..



ప్రభుత్వం తీసుకొచ్చిన పీ4 విధానం పూర్తిగా అశాస్త్రీయమైనది. ఇది పేద ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడమే తప్ప మరొకటి కాదు. ఇలాంటి విషయాలను న్యాయవాదులు ఖండించాలి.
– డాక్టర్ వసుంధర, విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు

కూటమి పాలనలో టీటీడీ అప్రదిష్టపాలు

- దేవదేవుడి చెంత నిత్యం అపచారాలు
- వేద పారాయణం ఆపాలని చూస్తున్నారు
- ఇది సనాతన ధర్మాన్ని నిట్టనిలువునా గొయ్యి తీసి పాతేయడమే
- వైదిక నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘన
- సీఎం చంద్రబాబు సూచన లేకుండా ఆ స్థాయి నిర్ణయం ఉండబోదు
- తనిఖీల పేరుతో అర్చకులను వేధిస్తున్నారు
- పీఠాధిపతులకు నోటీసులు ఇవ్వడంపై కేంద్రం మొట్టికాయలు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తెలుగుదేశం కూటమి పాలనలో టీటీడీ అప్రదిష్టపాలవుతోందని, దేవదేవుడి చెంత నిత్యం అపచారాలు కొనసాగుతున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆక్షేపించారు. తిరుమలలో వేద పారాయణం ఆపాలని చూస్తున్నారని, ఇది హిందూ సనాతన ధర్మానికి విరుద్ధమని, వైదిక నిబంధనల ఉల్లంఘన అని స్పష్టంచేశారు. ఈ అంశంపై ఆలయ ఉన్నతాధికారి ఒకరు ఏకపక్షంగా ఆదేశాలు జారీచేశారని, సీఎం సూచన లేకుండా ఆ స్థాయి నిర్ణయం ఉండే అవకాశమే లేదని తిరుపతిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో భూమన కరుణాకర్‌రెడ్డి తేల్చి చెప్పారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



వేద పారాయణానికి వైఎస్ జగన్ అధిక ప్రాధాన్యం

టీటీడీ ఆధ్వర్యంలో ఆరు వేద పాఠశాలలు కొనసాగుతున్నాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు వేద విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారు. వేద పారాయణానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. గత ప్రభుత్వంలో కొత్తగా 700 పోస్టులు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక, వేద పారాయణంపై శీతకన్ను వేసింది. 56 పోస్టుల్లో ఉద్యోగులు పదవీ విరమణ చేసినా కొత్తవారిని నియమించడం లేదు. ఇప్పటికీ 27 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తిరుమల శ్రీవారి ఆలయంలో శతాబ్దాలుగా నిరంతరాయంగా కొనసాగుతున్న వేద పారాయణాన్ని ఆపాలని టీటీడీలో ఒక ఉన్నతాధికారి ఆదేశించారు. వేద పారాయణాన్ని అవహేళన చేస్తూ, అది ఎవరికీ అర్థం కాదని.. అందువల్ల అందుకు బదులుగా 'ఓం నమో వెంకటేశాయ' అనాలని ఆ అధికారి వేద పండితులను ఆదేశిస్తున్నారు. ఇది దారుణం. ఇది సనాతన హిందూ ధర్మాన్ని నిట్టనిలువునా గొయ్యి తీసి పూడ్చిపెట్టడమే. వేద పారాయణానికి పురాణ కాలం నుంచి ఎంతో ప్రాశస్త్యం ఉంది. ఉన్నతాధికారి తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం. తరతరాలుగా స్వామి సేవల్లో ఉన్న నాలుగు కుటుంబాల అర్చకులను తనిఖీల పేరుతో అవమానించడం దారుణం.

13 పీఠాలకు నోటీసులు

కొండ మీద ఉన్న ఆశ్రమాల్లో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయంటూ 13 పీఠాలకు నోటీసులిచ్చారు. నిరంతరం హోమం, అన్నదానం జరుగుతున్నప్పుడు మీరెందుకు అన్నప్రసాదం చేస్తున్నారని ఆపేయాలని ఆదేశించారు. దీంతో పీఠాధిపతులు ఆర్ఎస్ఎస్ చీఫ్‌కు మొర పెట్టుకోగా, కేంద్ర ప్రభుత్వం కలుగజేసుకుని మొట్టికాయలు వేస్తే మొన్న జరిగిన పాలక మండలి సమావేశంలో ఇక మీదట పీఠాలకు నోటీసులు ఇవ్వకూడదని తీర్మానించారు. ఏఐ టెక్నాలజీ సాయంతో భక్తులందరికీ గంటలో దర్శనం చేయిస్తామని టీటీడీ చైర్మన్ చెప్పినట్లు టీడీపీ అనుకూల మీడియాలో ప్రచారం చేస్తూ భక్తులను విజిలెన్స్ సిబ్బంది ఎక్కడికక్కడ ఆపేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను ఇక్కట్లపాలుచేస్తున్నారు. భక్తులను బెదిరించి ఆపడం సమంజసమేనా? అని భూమన కరుణాకర్‌రెడ్డి ప్రశ్నించారు.

జనసేన నాయకుడి బూతు పురాణం

సాక్షి టాస్క్‌ఫోర్స్: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరుకు చెందిన జనసేన నాయకుడు తాతంశెట్టి నాగేంద్ర బూతు పురాణం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఫోన్‌లో అవతలి వ్యక్తిపై ఇష్టానుసారంగా బూతులతో విరుచుకుపడ్డాడు. అమ్మ, అక్క.. చెల్లి.. ఇలా ఎవరినీ వదలకుండా తిడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎందుకు.. ఏమిటీ అన్న పూర్వాపరాలు తెలియకపోయినా తాతంశెట్టి ఇష్టానుసారంగా మట్లాడడం తగదనే వాదన బలంగా వినిపిస్తోంది. నెటిజన్లూ తాతంశెట్టి తీరుపై మండిపడుతున్నారు. అధికార కూటమిలో ఉంటూ అడ్డదిడ్డంగా మాట్లాడడం తగదని హితవు పలుకుతున్నారు. ఈ నేపథ్యంలో తాతంశెట్టిపై జనసేన పార్టీ ఎలాంటి చర్యలు తీసుకకుంటుందో వేచి చూడాలి.

నాగేంద్ర బూతు పురాణం.. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురైన

పులివెందుల వాసులకు వైద్యపరీక్షలు

హైకోర్టు ఆదేశాలతో కర్నూలు జీజీహెచ్‌లో పరీక్షలు

కర్నూలు(హాస్పిటల్): పోలీసుల చేతిలో చిత్రహింసలకు గురైన పులివెందుల వాసులకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జీజీహెచ్)లో శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. మహానాడు సందర్భంగా కడపలో వైఎస్సార్ విగ్రహం చుట్టూ టీడీపీ నేతలు ఆ పార్టీ జెండాలు, తోరణాలను కట్టారు. వీటిని వైఎస్సార్ సీపీ నేతలు తొలగించారు. దీంతో టీడీపీ నేతల ఒత్తిళ్లతో పోలీసులు అక్రమ కేసు నమోదు చేసి పులివెందుల 4వ వార్డు కౌన్సిలర్ పి.కిశోర్, 25వ వార్డు కౌన్సిలర్ కావేటి మల్లికార్జున, 4వ వార్డు మాజీ కౌన్సిలర్ వెంకటపతితోపాటు చరణ్, రాజేష్, షేక్‌షావలి అరెస్టు చేశారు. తమపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి తీవ్రంగా హింసించారంటూ నిందితులు మేజిస్ట్రేట్ ముందు చెప్పడంతో ముందుగా పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యపరీక్షల నిమిత్తం పంపించారు. వారికి ఎలాంటి గాయాలూ లేవని వైద్యాధికారులు నివేదిక ఇవ్వడంతో వాస్తవాలు నిగ్గుతేల్చాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌కు రెండు రోజుల క్రితం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు వైద్యపరీక్షల నిమిత్తం శుక్రవారం తెల్లవారుజామున 2 గంటలకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు నిందితులను తీసుకొచ్చారు. ఆస్పత్రిలో ఎక్స్‌రే, సీటీ స్కాన్, రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు ఆస్పత్రిలోని ధన్వంతరి హాలులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డు ముందు వీరిని ప్రవేశపెట్టారు. వైద్యుల బృందంలో ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణనాయక్, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ, న్యూరోసర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ రాం బాలాజీనాయక్ ఉన్నారు. వీరు పులివెందులకు చెందిన ఒక్కొక్కరిని పిలిచి భౌతికంగా పరిశీలించారు. ఎక్స్‌రే, సీటీ స్కాన్, వైద్యపరీక్షల నివేదికలను చూశారు. వైద్యుల బృందానికి పోలీసులు తమను ఎలా హింసించారో బాధితులు వివరించారు. ఎక్కడెక్కడ, ఎలా కొట్టారో పేర్కొన్నారు. ఈ మేరకు వివరాలు నమోదు చేసుకున్న వైద్యుల బృందం నివేదికను తయారు చేసి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు అందజేశారు. సీల్డ్ కవర్‌లో నివేదికను హైకోర్టుకు అందజేస్తామని డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

అధికారులు, వైద్యులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు

పులివెందుల వైద్యులు ఇచ్చినట్లుగానే నివేదిక ఇవ్వాలంటూ రాష్ట్రస్థాయిలో ఓ కీలక మంత్రి సహా పలువురు ఎమ్మెల్యేలు, పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆస్పత్రి అధికారులు, వైద్యులకు ఒత్తిళ్లు వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం కొందరు వైద్యాధికారులు పలు కేసుల విషయమై కోర్టుల చుట్టూ తిరుగుతున్న నేపథ్యంలో వైద్యులు జాగ్రత్తగా పరీక్షలు చేయించారు. కాగా థర్డ్ డిగ్రీ ప్రయోగించినా రెండు వారాలకు గాయాలు మానిపోతాయని, మూడు వారాల తర్వాత అవి కనిపించే అవకాశాలు చాలా తక్కువని ఆస్పత్రికి చెందిన ఓ వైద్యుడు అభిప్రాయపడ్డారు.

కుప్పం ఘటన మరువకముందే

కడపలో దారుణం

కడప అర్బన్: చంద్రబాబు ఇలాకా కుప్పంలో అప్పు తీర్చలేదని ఒక మహిళను చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటన మరువకముందే వైఎస్సార్ కడపలో మరో దారుణం చోటుచేసుకుంది. కడప నగరంలోని మృత్యుంజయ కుంటలో నివాసం ఉంటున్న షేక్ గౌసియా అనే మహిళ తన కుటుంబ అవసరాల నిమిత్తం రామ సుబ్బమ్మ నుంచి కొంత డబ్బు అప్పుగా తీసుకుంది. ఇటీవల ఆ డబ్బు తిరిగి చెల్లించమని అడగ్గా కొంత సమయం ఇవ్వాలని గౌసియా కోరింది. ఇదే అదనుగా గౌసియాకు గత ప్రభుత్వం కట్టించి ఇచ్చిన ఇంటిని తన పేరిట రాయమని సుబ్బమ్మ బలవంతపెట్టింది. అలా కుదరదని గౌసియా తెగేసి చెప్పింది. ఆగ్రహించిన రామసుబ్బమ్మ తన కుటుంబ సభ్యులను, కిరాయి రౌడీలను వెంటబెట్టుకుని గౌసియా ఇంట్లోకి చొరబడి గౌసియా, ఆమె కుటుంబ సభ్యులను దారుణంగా కొట్టి,బలవంతంగా ఇంట్లో నుంచి బయటికి తోసేసింది. ఈ ఇల్లు మాదే అంటూ రౌడీ మూకలను మోహరించి ఆక్రమించిందని బాధిత మహిళ వాపోయింది. పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ తనకు న్యాయం చేయాలని, లేదంటే ఆత్మహత్యే శరణ్యం అంటూ కన్నీటి పర్యంతమై ఆమె ఒక వీడియోను విడుదల చేసింది.

అప్పుల బాధతో యువరైతు బలవన్మరణం



మృతుడు ఆంజనేయులు (ఫైల్)

ఉరవకొండ రూరల్: అప్పుల బాధ తాళలేక అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామంలో యువరైతు ఆంజనేయులు (22) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఆంజనేయులు తండ్రి మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి ఆంజనేయులు తల్లి మంజులతో కలిసి వ్యవసాయ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇతనికి ఇద్దరు అక్కలు. వివాహాలు అయిపోయాయి. వ్యవసాయం కోసం ఆంజనేయులు రూ.10 లక్షలకు పైగా అప్పులు చేశాడు. సాగు చేసినా పంటలు సరిగా పండకపోవటంతో నష్టాలు చవిచూశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం లేక శుక్రవారం పొలంలోనే పురుగు మందు తాగాడు. గమనించిన స్థానికులు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన అరుణక్క అంత్యక్రియలు

బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ మండిపడిన ప్రజా సంఘాలు



పెందుర్తి (విశాఖపట్నంజిల్లా): అల్లూరి సీతారామరాజు జిల్లా కింటుకూరు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్ట్ నేత వెంకట రవివర్మ చైతన్య అలియాస్ అరుణక్కకు శుక్రవారం విప్లవ నినాదాలతో తుది వీడ్కోలు పలికారు. ఆమె భౌతికకాయాన్ని రంపచోడవరం నుంచి స్వగ్రామం పెందుర్తి మండలం కరకవానిపాలేనికి శుక్రవారం ఉదయం తీసుకొచ్చారు. భారీగా తరలివచ్చిన ప్రజలు, ప్రజా సంఘాల నేతలు రాంపురం వద్ద జాతీయ రహదారి నుంచి కరకవానిపాలెం వరకు అరుణక్క మృతదేహాన్ని ఊరేగింపుగా తరలించారు. దారి పొడవునా విప్లవ గేయాలు ఆలపించారు. అనంతరం అరుణక్క స్వగృహం వద్ద నివాళులర్పించారు. కరకవానిపాలెం శ్మశానవాటికలో తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల సమక్షంలో విప్లవ సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు జరిపారు. పౌరహక్కుల నేతలు, ప్రజా సంఘాల సానుభూతి పరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని ఆరోపించారు. తన కుమార్తె అరుణక్కను ముందుగానే పట్టుకుని హత్య చేశారని ఆమె తండ్రి లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం దుకాణం తొలగించాలని ధర్నా

విజయనగరం జిల్లాలో ఆందోళన



మద్యం దుకాణం వద్ద ధర్నా చేస్తున్న కాలనీవాసులు

బొండపల్లి: జనావాసాల మధ్య మద్యం దుకాణం నిర్వహణపై విజయనగరం జిల్లా బొండపల్లి మండల కేంద్రంలోని యాతపేట వాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దుకాణం వద్ద శుక్రవారం పెద్దఎత్తున నిరవధిక ధర్నా చేపట్టారు. టెంట్లు వేసుకుని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాలనీలో నిర్వహిస్తున్న నవీన్ వైన్‌షాపు వల్ల మందుబాబులు తమ ఇళ్లల్లోకి చొరబడి వికృతచేష్టలకు దిగుతున్నారని, మద్యం సేవించి తమ ఇళ్ల ముందు మలమూత్రాలు విసర్జిస్తున్నారని, మహిళలపై ఎప్పుడు ఎలాంటి అనాగరిక చర్యకు పాల్పడతారోనన్న భయంతో బతుకుతున్నామంటూ ఆందోళన వ్యక్తంచేశారు. దుకాణం తొలగించే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టంచేశారు. గజపతినగరం ఎక్సైజ్ సీఐ జనార్దనరావు, ఎస్ఐ నరేంద్రకుమార్ ధర్నా శిబిరం వద్దకు వచ్చి దుకాణం తొలగింపునకు 15 రోజులు గడువు ఇవ్వాలని కోరినా స్థానికులు ససేమిరా అన్నారు. తక్షణమే తొలగించాలని పట్టుబట్టడంతో వారు వెళ్లిపోయారు. ధర్నాలో యాతపేట వాసులతో పాటు చలుమూరి మూర్తి, మాజీ ఎంపీపీ బంగారం, సీపీఐ నాయకులు పురం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగంటల నరకం



నిలిచిన వాహనాలు

కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా రాయగడ వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి పెద్దపెద్ద గోతులతో అధ్వానంగా తయారైంది. శుక్రవారం వేకవజామున మూడు గంటల సమయంలో స్వామినాయుడువలస రైల్వేగేటు సమీపంలో లారీ దిగబడింది. దీంతో సుమారు ఐదు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రోడ్డుపై కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. వాహనచోదకులు నరకం చూశారు.

కృష్ణమ్మ ఒడిలోకి సంగమేశ్వరుడు

నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని ప్రాచీన సంగమేశ్వర ఆలయం క్రమేపీ కృష్ణమ్మ ఒడిలోకి చేరుకుంటోంది. ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా శుక్రవారం నాటికి నీటిమట్టం 849.5 అడుగులకు చేరుకుంది. దీంతో శ్రీశైలం వెనుక కృష్ణా జలాలు ప్రాచీన సంగమేశ్వరాలయాన్ని 8 అడుగుల చుట్టుముట్టాయి. ఆలయ ముఖ మండపం, ప్రాంగణం పైకి నీరు చేరింది. సగభాగం నీటిలో, సగభాగం నీటిపై కనిపిస్తున్న ఆలయం భక్తులకు, సందర్శకులకు కనువిందు చేస్తోంది. – కొత్తపల్లి



కృష్ణమ్మ ఒడిలోకి చేరుకుంటున్న ప్రాచీన సంగమేశ్వర ఆలయం

వైఎస్సార్‌సీపీ వర్గీయులపై 'టీడీపీ' దాడి


ఆరుగురికి గాయాలు..

ఒకరి పరిస్థితి విషమం

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలం కుప్పం గ్రామం కొండుగారిపల్లె వడ్డెపల్లెలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ వర్గీయులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు దాడి చేశారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... వల్లెపు చిన్నసుబ్బయ్య తమ పొలంలో పైపులైన్ వేసుకునే విషయమై టీడీపీకి చెందిన ముట్టిశెట్టి వెంకటేశ్ అతని అనుచరుల మధ్య వివాదం ఉండేది. ఈ వ్యవహారాన్ని తహశీల్దారు దృష్టికి తీసుకెళ్లగా, రెవెన్యూ సిబ్బంది భూమిని పరిశీలించి పైప్‌లైన్ వేసుకోవచ్చునని చెప్పారు. పొలంలో పైప్‌లైన్ పనులు పూర్తి చేసుకుని ఇంటి వస్తుండగా ముట్టిశెట్టి వెంకటేశ్, అతని కుటుంబ సభ్యులు ముట్టిశెట్టి నాగభూషణం, ముట్టిశెట్టి వెంకటాద్రి, ముట్టిశెట్టి రామాంజనేయులు, ముట్టిశెట్టి తిరుమలేసు, ముట్టిశెట్టి వెంకటస్వామి, ముట్టిశెట్టి పాలకొండ్రాయుడు రాళ్లు, కత్తులు, కర్రలతో చిన్న సుబ్బయ్యపై దాడి చేశారు. ఈ ఘటనలో చిన్న సుబ్బయ్యతో పాటు అతని కుటుంబీలకు కూడా గాయాలయ్యాయి. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిరుపేద ఆధార్‌తో 22 విద్యుత్ కనెక్షన్లు

- దూరమైన తల్లికి వందనం పథకం
- ఆధార్ ఒకటే.. పేర్లు, ఊర్లు వేర్వేరు
- విద్యుత్ శాఖ నిర్వాకంతో నిరుపేదకు అన్యాయం



ఒకే ఆధార్ నంబర్‌తో లింక్ అయిన 22 విద్యుత్ కనెక్షన్లు

అగనంపూడి: తల్లికి వందనం పథకం అమల్లో విద్యుత్ శాఖ పొరపాట్లు లబ్ధిదారులకు శాపాలుగా మారాయి. విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలం ఇస్లాంపేటకు చెందిన షేక్ అక్బర్ హలీమ్‌కు 88వ వార్డు మంగళపాలెంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఫ్లాట్ కేటాయించారు. ఈ ఇంట్లో హలీమ్ తల్లిదండ్రులు ఉంటున్నారు. దీంతో హలీమ్ ఆధార్ కార్డుతో ఇస్లామ్‌పేటలో ఒక విద్యుత్ మీటర్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో మరో విద్యుత్ మీటర్ అనుసంధానం అయి ఉంది. హలీమ్ కుమార్తె షేక్ సమీరా బేగమ్ ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. గతంలో సమీరాకు అమ్మ ఒడి పథకం అందింది. అన్ని అర్హతలున్న నేపథ్యంలో తల్లికి వందనం నగదు పడుతుందని ఆ కుటుంబం ఆశగా ఎదురుచూసింది. అయితే డబ్బులు ఖాతాలో జమ కాకపోవడతో వార్డు సచివాలయాన్ని సంప్రదించగా అసలు విషయం వెలుగుచూసింది. హలీమ్ ఆధార్ కార్డుతో 22 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, ఈ కారణంగానే పథకం వర్తించదని బదులివ్వడంతో వారు కంగుతిన్నారు. వెంటనే అగనంపూడిలోని ఆర్ఈసీఎస్ సెక్షన్ కార్యాలయంలో సంప్రదించగా, మంగళపాలెం, దువ్వాడ పరిధిలోని పలువురి విద్యుత్ కనెక్షన్లు పొరపాటున అనుసంధానం జరిగినట్లు సెక్షన్ కార్యాలయ ఇన్‌చార్జి తెలిపారు. గ్రీవెన్స్‌కు కేవలం ఒక్క రోజు మాత్రమే గడువు ఉండడంతో హలీమ్ కుటుంబ సభ్యులు లబోదిబో మంటున్నారు. తల్లికి వందనం డబ్బులు వస్తే కుమార్తెకు కావాల్సిన దుస్తులు, పుస్తకాలు, బ్యాగ్‌లు కొందామనుకున్నామని, ఇప్పుడేం చేయాలో దిక్కుతోచడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని అధికారులు గుర్తించి తల్లికి వందనం నగదు జమయ్యేలా చూడాలని హలీమ్ కుటుంబం కోరుతోంది.

కుప్పం 'అప్ప' ఘటన దారుణం

తీవ్రంగా స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్



తిరుపతి మంగళం: స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గం చిత్తూరు జిల్లా, కుప్పంలో అప్పు తీర్చలేదని ఒక మహిళని తన కన్న కొడుకు ఎదుటే చెట్టుకు కట్టేసి దాడి చేసిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించినట్లు తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి తెలిపారు. ఈ కేసును సుమోటోగా స్వీకరించడంతోపాటు దీనిపై తాను ఇచ్చిన ఫిర్యాదును కూడా కమిషన్ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలియజేశారు. ఘటనపై పూర్తి నివేదికను రెండు వారాల్లో సమర్పించాలంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీలకు కమిషన్ నోటీసులు జారీ చేసిందని తెలిపారు.

విశాఖలో కాగ్నిజెంట్

ఏయూ క్యాంపస్: విశాఖలో కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తన కార్యాలయాన్ని ఏర్పాటు చేయనుంది. గురువారం జరిగిన రాష్ట్ర ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మూడు దశల్లో రూ.1,583 కోట్ల పెట్టుబడులతో 8 వేల మందికి ఉపాధి కల్పించడమే దీని లక్ష్యం.

రుణం చెల్లించలేదని చిన్నారిని తీసుకెళ్లిన సిబ్బంది

కర్ణాటకలో మైక్రో ఫైనాన్స్ సిబ్బంది దాష్టీకం

మైసూరు: కర్ణాటకలో సూక్ష్మ రుణ సంస్థల ఆగడాలకు అడ్డే లేకుండా పోతోంది. వాటికి ముకుతాడు వేసేందుకు చట్టం తెచ్చినా సిబ్బంది అమానుషంగా వ్యవహరిస్తూనే ఉన్నారు. కేవలం రూ.1,280 కంతు చెల్లించలేదని ఫైనాన్స్ సిబ్బంది ఏడేళ్ల చిన్నారిని ఎత్తుకెళ్లారు. ఈఘటన మైసురు జిల్లా టి.నరసీపుర తాలూకా జాలహళ్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నవీన్, ప్రమీల దంపతులు కుటుంబ అవసరాల కోసం బజాజ్ ఫైనాన్స్‌లో రూ.30వేల రుణం తీసుకున్నారు. 13 నెలల కంతులు చెల్లించారు. జూన్ నెల చెల్లించడం ఆలస్యమవడంతో 2రోజుల క్రితం ఫైనాన్స్ సిబ్బంది నవీన్ ఇంటికి వెళ్లారు. దంపతులు పనులకు వెళ్లగా ఇంట్లో ఉన్న నవీన్ తల్లిని దూషించారు. తమ వద్ద డబ్బు లేదని, బంగారు తాళి తాకట్టు పెట్టి సాయంత్రం చెల్లిస్తామని వృద్ధురాలు వేడుకున్నా దయ చూపలేదు. దంపతుల ఏడేళ్ల కుమార్తె ఆడుకుంటుండగా అమ్మానాన్న ఎక్కడున్నారో చూపించాలని చిన్నారిని వెంట తీసుకెళ్లారు. దంపతులు ఇంటికి వచ్చిన తర్వాత విషయం తెలుసుకొని మైసూరు బాలల రక్షణ సమితికి ఫిర్యాదు చేశారు. సమితి సభ్యులు మైక్రో ఫైనాన్స్ సిబ్బందితో చర్చించి బాలికను తల్లిదండ్రులకు అప్పగించేలా చర్యలు తీసుకున్నారు.

విధ్వంసకర క్లస్టర్ బాంబు

యుద్ధం మొదలైనప్పటి నుంచి తమపై క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించి విధ్వంసం సృష్టించిన ఇరాన్ ఇప్పుడు ఏకంగా క్లస్టర్ బాంబులను ప్రయోగిస్తూ దారుణాలకు ఒడిగడుతోందని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఎన్నో దేశాలు నిషేధం విధించిన క్లస్టర్ బాంబులను ఇరాన్ ఉద్దేశపూర్వకంగా భారీ పౌరనష్టం జరగాలని తమపై ప్రయోగిస్తోందని ఇజ్రాయెల్ శుక్రవారం ప్రకటించింది. గత వారం రోజులుగా కొనసాగుతున్న సమరంలో ఇరాన్ క్లస్టర్ బాంబులను వినియోగించడం ఇదే తొలిసారి అని తెలుస్తోంది. దీంతో డజన్లకొద్దీ దేశాల నుంచి నిషేధాన్ని ఎదుర్కొంటున్న క్లస్టర్ బాంబులపై చర్చ మొదలైంది.

ప్రత్యేకతలేంటి?

ఏదైనా బాంబును జారవిడిస్తే అది ఒకేసారి పూర్తిగా పేలిపోతుంది. మొత్తం మందుగుండు అయిపోతుంది. కానీ క్లస్టర్ బాంబు అలా కాదు. అందులో గోళాకృతిలో చిన్న చిన్న బాంబులుంటాయి. వాటిని మోస్తున్న కస్టర్ బాంబు వార్‌హెడ్‌ను ప్రయోగించాక లక్ష్యాన్ని ఢీకొట్టడానికి కొంతదూరంలో అంటే గాల్లోనే అది పేలిపోతుంది. దాంతో అందులోని గోళాకార చిన్నపాటి బాంబులన్నీ చెల్లాచెదురుగా నలుదిక్కులా పడి పేలిపోతాయి. దీంతో వినాశనం విస్తృతస్థాయిలో ఉంటుంది. జన సమూహంపై ఈ బాంబు పడితే ఈ చిన్న బాంబులు సృష్టించే విధ్వంసం అంతాఇంతా కాదు. ఇష్టమొచ్చినట్లు అన్ని వైపులకు దూసుకెళ్లడంతో నలుచెరుగులా ఉన్న వారంతా తీవ్రస్థాయిలో లేదా మధ్యస్థాయిలో గాయపడటం ఖాయం. ఇంతటి ప్రమాదకర బాంబు కావడంతోనే చాలా దేశాలు ఈ క్లస్టర్ బాంబు వినియోగానికి దూరంగా



ఉండిపోయాయి. ఇంట్లో కొంత ఎత్తు నుంచి ఒక గాజుముక్కను నేలపై పడేస్తే అది ముక్కలుచెక్కలై ఎలాగైతే గది మొత్తం పరుచుకుంటుందో ఈ క్లస్టర్ బాంబులోని పేలని ముక్కలు పరిసరాల్లోకి దూసుకెళ్లి దారుణ నష్టానికి కారణమవుతాయి. శుక్రవారం ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన ఒక క్లస్టర్ బాంబు ఆకాశంలో ఏడు కిలోమీటర్ల ఎత్తులో పేలిపోయి పెద్దసంఖ్యలో చిన్నబాంబులుగా మారి 8 కిలోమీటర్ల పరిధిలో వేర్వేరుచోట్ల బద్ధలయ్యాయి. బాలిస్టిక్ క్షిపణితో పోలిస్తే ఈ బాంబు తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఇజ్రాయెల్ సైనికాధికారిది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' వార్తాసంస్థతో చెప్పారు.

పొంచి ఉన్న మరో ప్రమాదం

క్లస్టర్ బాంబు పేలాక అంతటా పడిపోయే చిన్న బాంబులు అన్నీ అదే సమయంలో పేలకపోవచ్చు. పేలని ఆ కొన్నింటిని నిర్వీర్యమైనట్లు భావించకూడదు. అవి కొంతకాలం తర్వాత పేలుతాయి. అంటే యుద్ధక్షేత్రంలో ఈ క్లస్టర్ బాంబును ప్రయోగిస్తే ఆ తర్వాతకూడా అక్కడికి జవాన్లు వెళ్లాలంటే జంకాల్సిందే. ఎక్కడ పడిన బాంబు ఎప్పుడు పేలుతుందో ఎవరూ ఊహించలేరు. 2008లో వందకుపైగా దేశాలు ఐక్యరాజ్యసమితి సారథ్యంలో ఈ బాంబు వినియోగంపై నిషేధాన్ని అమల్లోకి తెచ్చాయి. 111 దేశాలు, 12 ఇతర సంస్థలు ఈ ఒప్పందంపై సంతకాలుచేశాయి. క్లస్టర్ బాంబుల ఉత్పత్తి, నిల్వ, రవాణా, వినియోగంపై నిషేధం విధించారు. అయితే ఆనాడు ఇరాన్, ఇజ్రాయెల్, రష్యా, ఉక్రెయిన్, అమెరికా ఈ ఒడంబడికకు కట్టుబడతామని ప్రకటించలేదు. ఈ లెక్కన అమెరికా సైతం ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధంలో దిగితే ఈ బాంబులను ఉపయోగించే వీలుంది. లేదంటే పరోక్షంగా ఇజ్రాయెల్‌కు సరఫరా చేసే అవకాశముంది. చాన్నాళ్ల క్రితం సిరియాను ఏలిన బషర్ అల్ అసద్ ప్రభుత్వం సైతం తాము అంటే గిట్టనివారిపై వీటిని విపరీతంగా వాడిందని ఆరోపణలున్నాయి. అఫ్గాన్‌లో అమెరికా సైతం ఇదే బాటలో పయనించిందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. 2006 లెబనాన్ యుద్ధంలో ఇజ్రాయెల్ ఏకంగా 40 లక్షల క్లస్టర్ బాంబులను ప్రయోగించిందని ఐక్యరాజ్యసమితి గతంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 19 ఏళ్ల క్రితం ప్రయోగించిన క్లస్టర్ బాంబుల్లో కొన్ని ఇప్పటికీ పేలుతూ లెబనాన్ పౌరుల ప్రాణాలు హరిస్తున్నాయని స్థానిక మీడియా గతంలో ఆరోపించింది.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలోనూ...

ఆనాడు ఒప్పందంలో భాగస్వామిగా లేని రష్యా నెలలతరబడి కొనసాగుతున్న ఉక్రెయిన్ యుద్ధంలో దానిపై విచ్చలవిడిగా వాడుతోందని తెలుస్తోంది. దీంతో రష్యాతో పోరాటం చేస్తున్న ఉక్రెయిన్‌కు తమ వద్ద పేరుకుపోయిన లక్షలాది క్లస్టర్ బాంబులను సరఫరాచేయాలని అమెరికా భావిస్తోంది. సమరసమయంలో పేలితే అది యుద్ధనీతిగా భావించవచ్చు. కానీ యుద్ధం ముగిశాక కూడా పేలుతూ ఇవి ఒకరకంగా పౌరహక్కులను కాలరాస్తున్నాయని మానవహక్కుల సంఘాలు సైతం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి.

\- సాక్షి, నేషనల్ డెస్క్



ఇరాన్ క్షిపణి దాడిలో ధ్వంసమైన ఇజ్రాయెల్‌లోని హైఫా నగరంలోని ఓ భవనం



ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా శుక్రవారం టెహ్రాన్‌లో భారీ ర్యాలీ

పోటాపోటీగా దాడులు

ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్లస్టర్ బాంబుల వర్షం

- హైఫా సిటీపై క్షిపణుల దాడిలో డజన్లమందికి గాయాలు
- ఇరాన్ క్షిపణి తయారీ కేంద్రంపై విరుచుకుపడిన ఇజ్రాయెల్
- ఎటూతేలని ఇరాన్, యూరప్ నేతల 'అణు' మధ్యవర్తిత్వ తొలి దఫా చర్చలు
- టెహ్రాన్‌లో ఇజ్రాయెల్ వ్యతిరేక ర్యాలీ

టెల్ అవీవ్/టెహ్రాన్/జెనీవా: ఏడు రోజులుగా ఎడతెరిపిలేకుండా భీకరంగా బాంబులేసుకుంటూ పశ్చిమాసియాలో రావణకాష్టాన్ని మరింత రాజేసిన ఇజ్రాయెల్, ఇరాన్‌లు శుక్రవారం సైతం పోరుపంథాలోనే పయనించాయి. పోటాపోటీగా క్షిపణులు జారవిడుస్తూ రెండు దేశాల్లో ఉద్రిక్తతల్ని అమాంతం పెంచేశాయి. ఇజ్రాయెల్‌ను మరింత దెబ్బకొట్టేందుకు ఇరాన్ తన వద్ద పోగుబడిన క్లస్టర్ బాంబులను ప్రయోగించింది. ఇరాన్ క్లస్టర్ బాంబుల్ని ఉపయోగించడం ఇదే తొలిసారి. ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్, హైఫా, బీర్‌షెబా, రెహోవోట్ నగరాలు సహా పలు ప్రాంతాలపై క్లస్టర్ బాంబులను వేయడంతో పెద్దసంఖ్యలో భవనాలు ధ్వంసమయ్యాయి. తీరప్రాంత నగరమైన హైఫాలో భవంతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో పదుల సంఖ్యలో జనం గాయపడ్డారు. రక్తమోడుతూ జనం వీధుల్లో పరుగులు పెడుతున్న దృశ్యాలు మీడియాలో కనిపించాయి. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రుల్లో చేర్పించారు. కొందరి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని నగర మేయర్ యొనా యాహవ్ చెప్పారు. రెహోవోట్‌లో దెబ్బతిన్న భవనాలను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ స్వయంగా వచ్చి పరిశీలించారు. కర్మేయిన్ పట్టణంలో షెల్టర్‌లో దాక్కున్న 51 ఏళ్ల మహిళ భయంతో గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయారని తెలుస్తోంది. ప్రతిగా ఇజ్రాయెల్ టెహ్రాన్‌లోని పలు క్షిపణి తయారీ కార్మాగారాలపై దాడులు చేసింది. దేశవ్యాప్తంగా ఇప్పటిదాకా సగం వరకు ఇరాన్ మిస్సైల్ లాంచర్లను నాశనం చేశామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ చీఫ్ ఇయాల్ జమీర్ చెప్పారు. ఇరాన్ అణుపరిశోధనా ఏజెన్సీసహా పలు నగరాలపై తమ 60 యుద్ధవిమానాలు బాంబుల వర్షం కురిపించాయని ఇజ్రాయెల్ ప్రకటించింది. శుక్రవారం నాటికి ఇరాన్‌లో 263 మంది పౌరులు, 154 మంది సైనికులు సహా 657 మంది ప్రాణాలు కోల్పోయారు. 2,000 మందికిపైగా గాయాలపాలయ్యారు. ఇరాన్ జరిపిన దాడుల్లో ఇజ్రాయెల్‌లో 24 మంది చనిపోయారు. మరోవైపు ఇరాన్‌లో బుషెహర్ అణుకేంద్రంపై దాడితో అత్యంత ప్రమాదకర పరిస్థితి తలెత్తనుందని అంతర్జాతీయ అణుఇంధన ఏజెన్సీ డైరెక్టర్ రఫేల్ గ్రోసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ప్లాంట్‌లో వేల కేజీల అణుపదార్థం ఉందని, అది బయటకొస్తే వినాశకర స్థాయిలో రేడియోధార్మికత వందలకిలోమీటర్ల పరిధికి విస్తరిస్తుందని ఆయన చెప్పారు. మరోవైపు అవసరమైన సమయంలో పోరులో భాగస్వాములమవుతామని హెజ్‌బొల్లా ఉగ్రసంస్థ ప్రధాన కార్యదర్శి షేక్ నయీమ్ ఖాసిమ్ అన్నారు. ఇన్నాళ్లూ ఇరాన్ రహస్యంగా గాజాలో హమాస్, లెబనాన్‌లో హెజ్‌బొల్లా, యెమెన్‌లో హౌతీ తిరుగుబాటుదారులను పెంచి పోషించినప్పటికీ ఎవరూ ఇంతవరకు సాయపడేందుకు ముందుకురాలేదు. ఈ నేపథ్యంలో హెజ్‌బొల్లా స్పందించడం గమనార్హం. అయితే హెజ్‌బొల్లా స్పందించిన వెంటనే లెబనాన్‌లోని దాని స్థావరాలపై ఇజ్రాయెల్ బాంబులు వేసింది.

ఇరాన్‌కు విదేశీ ఆయుధసాయంపై అమెరికా ఆంక్షలు

ఇరాన్ సైనికరంగంపై అమెరికా శుక్రవారం మరికొన్ని ఆంక్షలు విధించింది. ఇరాన్ సైన్యం ఉపయోగించే పలు రకాల ఆయుధాల్లో విడిభాగాలు, సాఫ్ట్‌వేర్‌లను సరఫరాచేసే విదేశీ సంస్థలు, వ్యక్తులపై అమెరికా నిషేధం విధించింది. ఆంక్షలు ఎదుర్కొంటున్న వారిలో చైనా కంపెనీ, ఒక సరుకు రవాణా నౌక సంస్థ సైతం ఉన్నాయి. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లు, బాంబులను విక్రయించే సంస్థలనూ అమెరికా నిషేధిత జాబితాలో చేర్చింది.

ఇజ్రాయెల్ వ్యతిరేక ర్యాలీలు

తమపై దండెత్తిన ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరాన్, ఇరాక్‌లో ముస్లింలు శుక్రవారం మధ్యాహ్నం ప్రార్థనల తర్వాత వేలాదిగా రోడ్లమీదకొచ్చి భారీ నిరసనర్యాలీ చేపట్టారు. టెహ్రాన్, బాగ్దాద్, సదర్ సిటీల్లో ఇజ్రాయెల్ వ్యతిరేక నినాదాలు చేశారు. మరోవైపు ఇప్పటికే హమాస్‌తో పోరాడుతున్న ఇజ్రాయెల్ కొత్తగా ఇరాన్‌తోనూ కయ్యం పెట్టుకోవడాన్ని ఇజ్రాయెలీలు తీవ్రంగా తప్పుబట్టారు. టెల్ అవీవ్‌లో వేలాది మంది ఆందోళనకారులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. మరోవైపు ఇరాన్‌లో మౌలికసదుపాయాలు దెబ్బతిని గత 48 గంటలుగా ఇంటర్నెట్ స్తంభించింది. కేవలం 3 శాతం ప్రాంతాల్లో ఇంటర్నెట్‌ను పునరుద్ధరించారు. ఇరాన్‌లోని బ్యాంక్ సెపాపై ఇజ్రాయెలీ హ్యాకర్లు సైబర్ దాడులు చేశారు. దీంతో ఏటీఎంలు పనిచేయక జనం ఇబ్బందులు పడ్డారు.

మరోదఫా చర్చలకు సిద్ధమన్న యూరప్ నేతలు

స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో శుక్రవారం బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రులతోపాటు యూరోపియన్ యూనియన్ విదేశీవిధానాల చీఫ్‌తో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ చర్చలు జరిపారు. చర్చల్లో ఏఏ అంశాలు ప్రస్తావనకు వచ్చాయో వెల్లడించలేదు. మరోదఫా చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నామని, చర్చలు ముగిశాక యూరోపియన్ కమిషన్ ఉపాధ్యక్షుడు చెప్పారు. మరోవైపు తమ సేనలు ఎక్కడెక్కడ ఉన్నాయనే విషయాలను మీడియా అత్యుత్సాహంతో ప్రసారం చేయొద్దని స్థానిక మీడియాకు ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

ధ్వంసమైన వీజ్‌మన్ ఇన్‌స్టిట్యూట్ వద్ద నెతన్యాహూ



నా కొడుకు పెళ్లి వాయిదా పడింది

- యుద్ధం వల్ల తన కుటుంబమూ ఇబ్బంది పడుతోందన్న నెతన్యాహు
- ప్రాణాలు కోల్పోవడం, పెళ్లి వాయిదా రెండూ ఒకటేనా? అంటూ ప్రజల ఆగ్రహం

టెల్ అవీవ్: ఇరాన్–ఇజ్రాయెల్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్ క్షిపణుల దాడి నేపథ్యంలో నెతన్యాహు చేసిన వ్యాఖ్యలు ఆగ్రహానికి కారణమయ్యాయి. బీర్ షెవాలోని సోరోకా ఆస్పత్రి ముందు మీడియాతో మాట్లాడిన నెతన్యాహు ''ఈ ఘర్షణ వల్ల మనలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా ఏదో ఒక మూల్యం చెల్లించుకుంటున్నారు. ఇందుకు నా కుటుంబం ఏం మినహాయింపు కాదు. క్షిపణి దాడుల కారణంగా నా కుమారుడు అవ్నర్ వివాహాన్ని రద్దు చేయడం ఇది రెండోసారి. ఇది అతని కాబోయే భార్యను కలవరపెడుతోంది. నా భార్య ఒక హీరో అని చెప్పాలి. ఆమె వ్యక్తిగతంగా ఎన్నో భరిస్తోంది'' అని వ్యాఖ్యానించారు. కాగా, ప్రధాని వ్యాఖ్యలపై ఆన్‌లైన్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రాణాలు కోల్పోవడం, పెళ్లి ఆగిపోవడం ఒకటేనా? అని ప్రశ్నిస్తున్నారు. పెళ్లి ఆగిపోతే మళ్లీ చేసుకోవచ్చు.. కానీ పోయిన ప్రాణాలు తిరిగి వస్తాయా? రెండు ఘటనలను పోల్చడమేంటని ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రజాసేవ చేయకపోతే

ప్రశాంతంగా నిద్రించలేను

- రాత్రి పగలు ప్రజల కోసమే పని చేస్తున్నా
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నా హృదయంలో ఉన్నాడు
- ఆయన చిత్రపటాన్ని గుండెకు హత్తుకోవడం ఇష్టం
- ప్రధాని మోదీ స్పష్టీకరణ
- బిహార్, ఒడిశాలో ప్రధానమంత్రి పర్యటన



సివాన్: నిత్యం ప్రజాసేవ చేయకపోతే ప్రశాంతంగా నిద్రించలేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాత్రి పగలు ప్రజల కోసమే పని చేస్తున్నానని చెప్పారు. ఆయన శుక్రవారం బిహార్, ఒడిశాలో పర్యటించారు. తొలుత బిహార్‌లోని సివాన్ జిల్లాలో రూ.5,900 కోట్లకుపైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. బిహార్‌లోని పాటలీపుత్ర జంక్షన్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ వరకు నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. విపక్ష రాష్ట్రీయ జనతా దళ్(ఆర్జేడీ), కాంగ్రెస్‌లపై విరుచుకుపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఆర్జేడీ అవమానించిందని ఆరోపించారు. వారసత్వ రాజకీయాలను అంబేడ్కర్ వ్యతిరేకించారని గుర్తుచేశారు. అందుకే అంబేడ్కర్ అంటే ఆర్జేడీ, దాని మిత్రపక్షాలకు ఇష్టం లేదన్నారు. బాబాసాహెబ్ చిత్రపటాన్ని ఆర్జేడీ నేతలు పాదాలతో తొక్కేశారని, దీనిపై క్షమాపణ చెప్పాలని ప్రజలు డిమాండ్ చేస్తే ఏమాత్రం స్పందించలేదని మండిపడ్డారు. అంబేడ్కర్ కంటే తామే గొప్పవాళ్లమని ఆర్జేడీ-కాంగ్రెస్ నాయకులు అహంకారం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. అంబేడ్కర్ తన హృదయంలో ఉన్నాడని, ఆయన చిత్రపటాన్ని గుండెకు హత్తుకోవడం తనకు ఇష్టమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆర్థిక వనరులు కొల్లగొట్టడానికి ఆర్జేడీ, కాంగ్రెస్ కాచుకొని కూర్చున్నాయని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ కూటమిని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

అభివృద్ధి కోసం శ్రమిస్తున్నాం

''భారతదేశ ప్రగతిని చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోతున్నాయి. నిన్ననే విదేశాల నుంచి తిరిగొచ్చా. విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు అక్కడి నేతలు మన దేశ అభివృద్ధిని ప్రత్యేకంగా ప్రశంసించారు. పేదల సాధికారతకు ఎదురవుతున్న అడ్డంకులను ఎన్డీయే ప్రభుత్వం తొలగిస్తోంది. గత 11 ఏళ్లుగా ప్రజాసేవలో నిమగ్నమయ్యాం. అభివృద్ధి కోసం అహోరాత్రులూ శ్రమిస్తున్నాం. బిహార్‌లో మళ్లీ జంగిల్‌రాజ్ రావొద్దంటే విపక్ష ఇండియా కూటమి ఓడించాలి. ఎన్డీయే నినాదం సబ్‌కా సాత్, సబ్‌కా విశ్వాస్. విపక్ష కూటమి నినాదం పరివార్‌కా సాత్, పరివార్‌కా వికాస్. సొంత కుటుంబాల అభివృద్ధి తప్ప ప్రజలంటే వారికి లెక్క లేదు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ స్ఫూర్తికి ఇది విరుద్ధం కాదా?'' అని ప్రధాని మోదీ ప్రశ్నించారు.

భువనేశ్వర్‌లో తిరంగా యాత్ర

ప్రధాని మోదీ ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో తిరంగా యాత్ర, రోడ్‌షోలో పాల్గొన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి జనతా మైదాన్ వరకు 9 కిలోమీటర్ల మేర జరిగిన ఈ యాత్రలో వేలాది మంది ప్రజలు భాగస్వాములయ్యారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయిన సందర్భంగా తిరంగా యాత్ర నిర్వహించారు. రూ.18,600 కోట్లకుపైగా విలువైన 105 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు.

ట్రంప్ ఆహ్వానం తిరస్కరించా..

వాషింగ్టన్‌లో పర్యటించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించగా, తాను తిరస్కరించానని ప్రధాని మోదీ చెప్పారు. వాషింగ్టన్ పర్యటనకు బదులు ఒడిశాను ఎంచుకున్నానని తెలిపారు. భువనేశ్వర్ సభలో ఆయన మాట్లాడారు. ''జీ7 సదస్సు కోసం కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ నాతో ఫోన్‌లో మాట్లాడారు. వాషింగ్టన్‌కు రావాలంటూ ఆహ్వానించారు. చర్చించుకుందామని, కలిసి భోజనం చేద్దామని అన్నారు. ఆహ్వానించినందుకు ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలియజేశా. జగన్నాథుడు కొలువుదీరిన ఒడిశాకు వెళ్లాల్సి ఉందని చెప్పా. వాషింగ్టన్‌కు రాలేనంటూ ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా'' అని ప్రధానమంత్రి వెల్లడించారు.



చిన్నారుల పాటకు రాష్ట్రపతి ముర్ము కంటతడి

న్యూఢిల్లీ: చిన్నారుల పాట విని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కరిగిపోయారు. ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లో పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ముర్ము శుక్రవారం 67వ బర్త్‌డే జరుపుకున్నారు. డెహ్రాడూన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ విజువల్ డిజబిలిటీస్‌కు వెళ్లిన ఆమెకు చిన్నారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అంధులైన చిన్నారులు రాష్ట్రపతికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక పాట ఆలపించారు. 'ఈ రోజులు మళ్లీ మళ్లీ రావాలి, నా హృదయం మళ్లీ మళ్లీ పాడాలి, మీరు వెయ్యేళ్లు జీవించాలి, ఇదే నా కోరిక, హ్యాపీ బర్త్ డే టూ యూ.. (బార్ బార్ దిన్ ఏ ఆయే, బార్ బార్ దిల్ యే గాయే, తు జియో హజారోం సాల్, యే మేరీ హై ఆర్జూ...)అంటూ సాగిన పాట విని ఆమె కన్నీటిని ఆపుకోలేకపోయారు. 'వాళ్లెంతో అందంగా, హృద్యంగా పాడారు. నేనెంతో ఉద్వేగానికి లోనయ్యా. వారి పాటవిని సంతోషంతో ఉప్పొంగిపోయా. నా కళ్ల వెంట నీళ్లు ఆగకుండా వచ్చేస్తూనే ఉన్నాయి'అని ఆమె పేర్కొన్నారు. కాగా, రాష్ట్రపతి ముర్ముకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తదితర ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె జీవితం, నాయకత్వం దేశవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని ప్రశంసించారు. ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో 1958 జూన్ 20వ తేదీన ముర్ము జన్మించారు. దేశానికి 15వ రాష్ట్రపతిగా 2022 జూలై 25న బాధ్యతలు చేపట్టారు.

మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

చురాచంద్‌పూర్/బిష్ణుపూర్: మణిపూర్‌లో మళ్లీ అశాంతి చెలరేగింది. గురువారం చురాచంద్‌పూర్ జిల్లాలోని చింగ్‌ఫీ గ్రామంలో భద్రతా దళాలు, అనుమానిత కుకీ ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో కుకీ వర్గానికి చెందిన ఒక మహిళ మరణించింది. ఆ తర్వాత బిష్ణుపూర్ జిల్లాలోని ఫుబాలా గ్రామంలో కాల్పుల్లో ఒక మైతేయి రైతు గాయపడ్డాడు. ఈ సంఘటనలతో ఈ ప్రాంతంలో మళ్లీ జాతుల మధ్య ఉద్రిక్తతలు ప్రారంభమయ్యాయి. ఇరువర్గాలు నిరసనలకు పిలుపునిచ్చాయి. పోలీసులు, అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, గురువారం మధ్యాహ్నం 3:30 గంటలకు బిష్ణుపూర్–చురాచంద్‌పూర్ సరిహద్దులో ఉన్న లోతట్టు గ్రామమైన ఫుబాలా వద్ద సాయుధులు కాల్పులు జరిపారు. పక్కనే ఉన్న కొండలలో నుంచి పొలాల్లో పనిచేస్తున్న రైతులపై అనేక రౌండ్లు కాల్పులు జరిపారు. మైతేయి రైతు 60 ఏళ్ల నింగ్తౌజామ్ బిరెన్ ఎడమ చేతికి గాయమైంది. వెంటనే బిష్ణుపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. దాడి తరువాత, భద్రతా దళాలు సమీపంలోని చింగ్ఫీ గ్రామంలో ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో అనుమానిత ఉగ్రవాదులతో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో చురాచంద్‌పూర్‌లోని లాంగ్‌చింగ్‌మాన్‌బి గ్రామ అధిపతి ఖైఖోగిన్ హావోకిప్ భార్య హోయిఖోల్హింగ్ హావోకిప్ బుల్లెట్ తగిలి మరణించింది.

1,600 కోట్ల పాస్‌వర్డ్‌లు చోరీ!

వాషింగ్టన్: నేటి ఇంటర్నెట్ యుగంలో డేటా లీకేజీ సర్వసాధారణంగా మారిపోయింది. నెటిజన్ల గోప్యతకు భంగం కలుగుతోంది. వారి వ్యక్తిగత సమాచారం హ్యాకర్ల చేతుల్లోకి వెళ్తుండడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు సైబర్ మోసాలు పెరిగిపోతూనే ఉన్నాయి. అతిపెద్ద డేటా లీకేజీ వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఇటీవలి కాలంలోనే 1,600 కోట్ల పాస్‌వర్డ్‌లు లీకైనట్లు సైబర్‌న్యూస్, ఫోర్బ్స్ సంస్థలు వెల్లడించాయి. ఇది ఇంటర్నెట్ చరిత్రలో అతిపెద్ద డేటా లీకేజీ ఘటన అని తెలియజేశాయి. ఆపిల్, ఫేస్‌బుక్, గూగుల్, టెలిగ్రామ్‌తోపాటు ప్రభుత్వ వెబ్‌సైట్ల యూజర్ల లాగిన్ వివరాలు హ్యాకర్ల చేతికి చేరినట్లు పేర్కొన్నాయి. అంతేకాకుండా సోషల్ మీడియా వేదికలు ఉపయోగించేవారి వివరాలు సైతం బయటకు లీకైనట్లు వెల్లడించాయి. రహస్యంగా ఉండాల్సిన పాస్‌వర్డ్‌లు పరులు చేతికి చేరుతుండడంతో ప్రపంచవ్యాప్తంగా ఫిషింగ్ స్కామ్‌లు, అకౌంట్ హ్యాకింగ్ వంటివి పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. సైబర్ నేరగాళ్లు ఇన్ఫోస్టీలర్స్ అని పిలిచే మాల్‌వేర్‌ను కంప్యూటర్లు, ఫోన్లలోకి పంపించి పాస్‌వర్డ్‌లు చోరీ చేస్తున్నారని చెప్పారు. డేటా లీకేజీ వెనుక అంతర్జాతీయ ముఠాల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని ముఠాలు వ్యవస్థీకృతంగా పనిచేస్తూ వ్యక్తుల రహస్య సమాచారాన్ని కొల్లగొట్టి, వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి.

సవాల్ చేయకుంటే 45 రోజుల్లో ఫుటేజీని ధ్వంసం చేయండి

ఎన్నికల సంబంధ వీడియో రికార్డ్‌లపై రాష్ట్ర అధికారులకు ఈసీ సూచన

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం అమలుచేస్తున్న సీసీటీవీ, వెబ్‌క్యాస్టింగ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ సంబంధ ఫుటేజీ ఆ తర్వాత దుర్వినియోగం అవుతున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) అప్రమత్తమైంది. ఆయా నియోజకవర్గాల్లో పోటీచేసిన అభ్యర్థులు ఎవరైనా 45 రోజుల్లోపు ఎన్నికల ఫలితాన్ని హైకోర్టులో సవాల్ చేయపోతే సంబంధిత ఎన్నికల ఫుటేజీని రాష్ట్ర అధికారులు ధ్వంసం చేయాలని ఈసీ ఆదేశించింది. ఈ మేరకు గత నెల 30వ తేదీన రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌లకు ఈసీ లేఖలు రాసింది. ఎన్నికల చట్టాల్లో ఎక్కడా ఇలా సీసీటీవీ, వెబ్‌క్యాస్టింగ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ తీయాలనే దానిపై ఎలాంటి నిబంధనలు లేవు. కానీ ఎన్నికల ప్రక్రియలో అత్యంత పారదర్శకత కోసం ఈ విధానాలను ఒక అంతర్గత సాధనంగా ఈసీ సద్వినియోగం చేసుకుంటోంది. అయితే ఇన్నాళ్లూ ఈ ఫుటేజీ అందరికీ బహిరంగంగా అందుబాటులో ఉండటంతో కొందరు వీటిని తమకు నచ్చినట్లుగా మార్చేసి తప్పుడు, అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తుండటంతో ఈసీ అప్రమత్తమైంది.

స్కూటీకి రూ. లక్ష నంబర్‌కు రూ.14 లక్షలు



సిమ్లా: బైక్ లేదా కారు.. వాహనం ఏది కొన్నా, రిజిస్ట్రేషన్ చేయించినప్పుడు ఫ్యాన్సీ నెంబర్ కావాలని కోరుకుంటాం. ఏదైతే ఏముందిలే? అని కొందరనుకుంటే.. ఇష్టమైన నంబర్ కోసం ఎంతైనా ఖర్చు చేయాలనుకుంటారు మరికొందరు. ఈ కోవలోకే వస్తాడు హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఈ వ్యక్తి. లక్ష రూపాయలు పెట్టి కొన్న స్కూటీకి వీఐపీ నంబర్ హెచ్‌పీ21సీ–0001 కోసం ఏకంగా రూ.14 లక్షలు చెల్లించాడు. ఆ నంబర్ కోసం వేలంలో ఇద్దరే పాల్గొనడం గమనార్హం. సోలన్ జిల్లాలోని బడ్డీకి చెందిన ఓ వ్యక్తి రూ.13.5 లక్షలు పాడగా.. హమీర్‌పూర్‌కు చెందిన సంజీవ్ కుమార్ అతని కంటే ఎక్కువగా రూ.14 లక్షలకు ఆ నంబర్‌ను కైవసం చేసుకున్నాడు. రాష్ట్రంలో అత్యంత ఖరీదైన బైక్ రిజిస్ట్రేషన్ నంబర్ కూడా ఇదే. తనకు ప్రత్యేకమైన నంబర్లను సేకరించడం ఇష్టమని చెప్పే సంజీవ్ కుమార్.. ప్యాషన్ ముందు డబ్బులు లెక్క కాదంటున్నాడు. కొన్ని కావాలంటే కొన్ని వదులుకోవడం తప్పదని చెబుతున్నాడు.

ఎయిరిండియాలో ఆగని రద్దులు

సాక్షి, న్యూఢిల్లీ: తనిఖీలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, గగనతల పరిమితుల కారణంగా ఎయిర్ ఇండియా నాలుగు అంతర్జాతీయ సర్వీసులు సహా మొత్తం 8 సర్వీసులను రద్దు చేసింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జూన్ 21 నుంచి జూలై 15వ తేదీ వరకు అంతర్జాతీయ మార్గాల్లో విమానాల సంఖ్య తగ్గిస్తున్నట్లు, మూడు మార్గాల్లో విమానాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపట్టామని తెలిపింది.

ఎయిరిండియా విమానాన్ని ఢీకొన్న పక్షి

ఢిల్లీ–పుణే ఎయిరిండియా విమానాన్ని శుక్రవారం పక్షి ఢీకొట్టింది. పుణేలో సురక్షితంగా ల్యాండయ్యాక తనిఖీల్లో ఈ విషయం వెల్లడైంది. ఇంజనీర్లు మరింత క్షుణ్నంగా పరీక్షలు చేపట్టారని ఎయిరిండియా తెలిపింది.

ఇండిగో విమానంలో సాంకేతిక లోపం

చెన్నై: సాంకేతిక లోపం తలెత్తడంతో మదురై వెళ్లే ఇండిగో విమానం మధ్యలోనే వెనుదిరిగింది. మొత్తం 68 మంది ప్రయాణికులతో శుక్రవారం చెన్నై విమానాశ్రయంలో టేకాఫ్ తీసుకున్న ఈ విమానంలో అరగంటలోనే సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్ గుర్తించారు. దీంతో, ఆయన అధికారులకు సమాచారమిచ్చారు. వారి సూచనల మేరకు తిరిగి విమానాన్ని చెన్నైలోనే సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులను వేరే విమానాల్లో గమ్యస్థానాలకు పంపించారు.

భారత్ కోసం గగనతలం తెరిచిన ఇరాన్

న్యూఢిల్లీ: ఓవైపు యుద్ధం కొనసాగుతున్నాసరే ఇరాన్ భారత్‌కు అనుకూలంగా వ్యవహరించింది. పౌరవిమానాల రాకపోకల కోసం గతంలో మూసేసిన గగనతలాన్ని భారత్ కోసం ప్రత్యేకంగా తెరిచింది. దీంతో ఇరాన్ నుంచి భారత్‌కు విమానాలు రానున్నాయి. ఆపరేషన్ సింధూలో భాగంగా ఈ విమానాల్లోనే అక్కడి 1,000 మంది భారతీయులను స్వదేశానికి భారత్ తరలించనుంది. యుద్ధం కారణంగా అక్కడి మష్హాద్ సిటీలో ఎక్కువ సంఖ్యలో భారతీయ విద్యార్థులు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ఇటీవల ఆపరేషన్ సింధూలో భాగంగా భారతసర్కార్ ఇరాన్‌లోని కొందరు విద్యార్థులను రోడ్డుమార్గంలో అర్మేనియాకు తరలించి అక్కడి నుంచి విమానమార్గంలో స్వదేశానికి తీసుకొచ్చింది. ఇకపై నేరుగా ఇరాన్ ఎయిర్‌పోర్ట్‌ల నుంచే విమానాలు తిరుగు ప్రయాణం కానున్నాయి. శుక్రవారం రాత్రికల్లా తొలివిమానం ఇరాన్ నుంచి ఢిల్లీకి చేరుకుంటుందని తొలుత వార్తలొచ్చాయి. టెహ్రాన్‌లో చిక్కుకున్న భారతీయులను తొలుత ఖ్వామ్‌కు ఆ తర్వాత మష్హాద్‌కు తీసుకొచ్చి మూడు విమానాల్లో తీసుకు రావొచ్చని ఢిల్లీలోని ఇరాన్ ఎంబసీలో మిషన్ డిప్యూటీ చీఫ్ మొహమ్మద్ జావేద్ హుస్సేనీ చెప్పారు. తుర్కెమినిస్తాన్ రాజధాని అష్గబాత్ నుంచి మరో విమానం ఢిల్లీకి రానుంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం • 21 • జూన్ • 2025

స్పెషల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ కవాతు

శివమొగ్గ: మత ఘర్షణలను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన స్పెషల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం శివమొగ్గ నగరంలో కవాతు నిర్వహించారు. శాంతిభద్రతలను కాపాడటానికి, ప్రజల్లో ధైర్యం నింపేందుకు ప్రత్యేక ఊరేగింపు చేపట్టినట్లు పోలీసు శాఖ తెలిపింది.



కొండచరియలతో ముప్పు

- 2,252 గ్రామాలకు వరద ముప్పు
- భూకంపం, కొండచరియలు విరిగిపడతాయి
- రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార నివేదికలో వెల్లడి

బనశంకరి: నైరుతి వర్షాల నేపథ్యంలో 31,261 చదరపు కిలోమీటర్లలో భూమి కుంగడం, కొండచరియలు విరిగిపడే ప్రదేశాలను గుర్తించగా ఇందులో 2,252 గ్రామాలకు ముప్పు పొంచి ఉంది. ఈమేరకు రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార తన నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కరావళి జిల్లాల్లో వరదలు, భూమి కుంగిపోవడం, కొండచరియలు విరిగిపడే ఘటనలు పెచ్చుమీరుతున్నాయి. ఈ నేపథ్యంలో రెవిన్యూ శాఖ వరదలు, భూమి కుంగిపోవడం, ఇతర విపత్తులకు గురయ్యే ప్రదేశాలను గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది. సుమారు 29 తాలూకాల్లో 1,164.52 చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో అత్యధికంగా భూమి కుంగిపోయే ప్రమాదం ఉండగా, 5,386.79 చదరపు కిలోమీటర్ల పరిధిలో కొండచరియలు విరిగిపడనున్నాయి. 24,710.11 చదరపు కిలోమీటర్లలో భూమి కుంగిపోయే ప్రమాదం ఉందని ఆ నివేదికలో పొందుపరిచారు.

ఆయా జిల్లాల్లో వివరాలివే..

ప్రదానంగా దక్షిణ కన్నడ, శివమొగ్గ, చిక్కమగళూరు, ఉత్తర కన్నడ, కొడగు, ఉడుపి, హాసన జిల్లాల్లో అధికంగా భూమి కుంగడం, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉంది. భారతీయ భూ విజ్ఞాన సమీక్ష, రాష్ట్ర నైసర్గిక విపత్తు నిర్వహణ సమితి నివేదిక ప్రకారం కర్ణాటకలో కనీసం 15.30 శాతం భూభాగం కుంగిపోయే ప్రమాదం పొంచి ఉంది. రెవెన్యూ శాఖ ఇచ్చిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 2006 నుంచి ఇప్పటివరకు సుమారు 1,541 చదరపు కిలోమీటర్ల మేర భూమికుంగిపోగా, కొండచరియలు విరిగిపడటంతో 101 మంది మృత్యువాత పడ్డారు. రెవెన్యూశాఖ కర్ణాటక రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార నివేదిక ప్రకారం ఉత్తరకన్నడలో అత్యధికంగా 8,389.26 చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో భూమి కుంగిపోయే ప్రమాదం ఉంది. శివమొగ్గలో 4,797.97 చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో భూమి కుంగిపోనుంది. దక్షిణకన్నడ జిల్లాలో సుమారు 4,600 చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో భూమి కుంగిపోవడం, కొండచరియలు విరిగిపడటం జరుగనుంది. కొడగులో 4,150 చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో భూమి కుంగిపోయే అవకాశం ఉంది.


శిరూరు వద్ద కూలిన కొండచరియలు


ఉత్తరకన్నడ జిల్లాలో విరిగిన కొండచరియలు


గోకర్ణ తుర్కె గ్రామం వద్ద కొండచరియలు విరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న భూవిజ్ఞాన పరిశోధన శాఖ అధికారుల బృందం

ప్రమాదం పొంచి ఉన్న జిల్లాలు

చిక్కమగళూరులో సుమారు 4,100 చదరపు కిలోమీటర్ల ప్రదేశం, ఉడుపిలో 2,650 చదరపు కిలోమీటర్లు, హాసనలో 1,100 చదరపు కిలోమీటర్లు ప్రదేశంలో భూమికుంగిపోయే ప్రమాదం ఉంది. బీబీఎంపీ పరిధిలో 201 ప్రాంతాలకు ముంపు ముప్పు ఉన్నట్లు గుర్తించారు. బెళగావిలో 230 గ్రామాలు, బాగల్‌కోటలో 203 గ్రామాలు, విజయపురలో 76 గ్రామాలు, ఉత్తర కన్నడలో 208 గ్రామాలు, చిత్రదుర్గలో 51 గ్రామాలకు వరదల ముంపు ఉంది. బీదర్‌లో 51 గ్రామాలు, శివమొగ్గలో 216 గ్రామాలు, కలబుర్గిలో 153 గ్రామాలు, గదగలో 43 గ్రామాలు, బళ్లారిలో 19, కొప్పళలో 27, హావేరిలో 80, దక్షిణకన్నడలో 90, ఉడుపిలో 86 గ్రామాల్లో వరదలు, భూమి కుంగిపోయే ప్రదేశాలుగా గుర్తించింది. మండ్యలో 112, చామరాజనగరలో 21, చిక్కమగళూరులో 85 గ్రామాలు, కొడగులో 88 గ్రామాలు, యాదగిరిలో 80 గ్రామాలు, హాసనలో 81 గ్రామాలు, ధార్వాడలో 56, తుమకూరులో 13 గ్రామాలు, రాయచూరులో 26 గ్రామాలు, విజయనగరలో 22, మైసూరులో 63, రామనగరలో 17 గ్రామాలు, దావణగెరెలో 55 గ్రామాలను వరదలు, భూమికుంగిపోయే ప్రదేశాలుగా గుర్తించారు. వరదలు, భూమికుంగిపోవడం, కొండచరియలు విరిగిపడే ప్రదేశాల్లో రెవెన్యూ, పంచాయతీ అభివృద్ధి అధికారులు, గ్రామ పాలనాధికారి, పోలీస్ ప్రతినిధి, అగ్నిమాపక శాఖ ప్రతినిధి, ఆరోగ్యశాఖ ప్రతినిధి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతినిధి, పశుసంవర్ధక శాఖ ప్రతినిధులతో కూడిన నగర, స్థానిక సంస్థలు, గ్రామీణ స్థానిక సంస్థలు విపత్తు నిర్వహణ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించింది.

న్యూస్‌రీల్

విమానంలో వైద్యురాలు హల్‌చల్


సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న వైద్యురాలు

దొడ్డబళ్లాపురం: ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో క్యాబిన్ సిబ్బందితో వాగ్వాదం జరిపి నిందించిన ప్రయాణికురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో చోటు చేసుకుంది. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కెంపేగౌడ ఎయిర్‌పోర్టు నుంచి సూరత్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు బయలుదేరిన ఐఎక్స్ 2749 విమానం బయలుదేరడానికి కొన్ని క్షణాల ముందు ఈ సంఘటన జరిగింది. యలహంక సమీపంలోని శివనహళ్లి నివాసి వైద్యురాలు వ్యాస్ హిరాల్ మోహన్ భాయ్ తనకు కేటాయించిన సీట్ నంబర్- 20లో కూర్చోడానికి ముందు ముందు వరుసలో ఉన్న సీట్లో తన బ్యాగులను ఉంచింది. దీన్ని ప్రశ్నించిన సిబ్బందితో ఆమె తీవ్రంగా వాగ్వాదానికి దిగింది. అందరినీ నిందిస్తూ బాంబు పెట్టి విమానాన్ని పేల్చేస్తానని ఆగ్రహంతో ఊగిపోయింది. పైలట్, విమాన సిబ్బంది ఎంత నచ్చచెప్పినా ఆమె తగ్గలేదు. తోటి ప్రయాణికులతో కూడా గొడవ పడింది. దీంతో విమాన సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

పులి దాడిలో మహిళ మృతి

మైసూరు: పులి దాడిలో మహిళ మృతి చెందిన ఘటన చామరాజనగర జిల్లా బండీపుర పులుల సంకరక్షణ ప్రాంతమైన దేశిపుర కాలనీలో చోటు చేసుకుంది. గుండ్లుపేటె తాలూకాలోని ఓంకార విభాగం పరిధిలో ఉన్న దేశిపుర కాలనీలో నివాసం ఉంటున్న పుట్టమ్మ(40) శుక్రవారం గ్రామ సమీపంలో మేకలను మేపుతుండగా పులి దాడి చేసింది. గొంతు పట్టుకొని అడవిలోకి లాక్కెళ్లి హతమార్చింది. మేకలు ఇంటికి చేరినా పుట్టమ్మ జాడ లేక పోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా గ్రామ సమీపంలోని అడవిలో మృతదేహం కనిపించింది. అటవీశాఖ అధికారులు వచ్చి పరిశీలించారు. పోలీసులు మహిళ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతోందని హతమార్చాడు


గణేశ్(ఫైల్)

యశవంతపుర: నిత్యం సెల్‌ఫోన్‌లో మాట్లాడుతోందని ఓ వ్యక్తి తన భార్యను హతమార్చాడు. ఈ ఘటన ఉడుపి జిల్లా బ్రహ్మవర తాలూకా హిలియాణ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలో గణేశ్, రేఖ దంపతులు నివాసం ఉంటున్నారు. ఇటీవల రేఖకు కొత్త సెల్‌ఫోన్ కొనిచ్చాడు. దీంతో బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి గంటల కొద్దీ మాట్లాడేది. ఎక్కువ సమయం ఫోన్‌లో మాట్లాడవద్దని భర్త హెచ్చరిస్తుండటంతో గొడవ జరిగేది. గురువారం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన గణేష్ భార్యతో గొడవకు దిగి కత్తితో కడుపు భాగంలో పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఉడుపి జిల్లా బ్రహ్మవర తాలూకా శంకరనారాయణ పోలీసులు గణేశ్‌ను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ హరిరామ్ శంకర్ పరిశీలించారు.

నవ ధాన్యాలతో అలంకరణ


విశేష అలంకరణలో మారెమ్మదేవి

బొమ్మనహళ్లి : బెంగళూరు నగరం బొమ్మనహళ్లి నియోజకవర్గం హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ వార్డు పరంగిపాళ్య గ్రామంలో గ్రామదేవత మారెమ్మ దేవి అమ్మవారికి శుక్రవారం విశేష అలంకరణ చేపట్టారు. అర్చకులు వినయ్ కుమార్ దీక్షిత్ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి నవధాన్యాలతో అలంకరించి అర్చనలు, పూజలు నిర్వహించి మహామంగళహారతి ఇచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రూ.500 లంచం తీసుకున్నందుకు పదేళ్ల తర్వాత జైలు

దొడ్డబళ్లాపురం: రూ.500 లంచం తీసుకున్న పాపానికి రిటైర్డ్ అయిన 10 సంవత్సరాలకు ఒక విలేజ్ అకౌంటెంట్‌కు 10 సంవత్సరాల జైలు శిక్ష విధించారు. ఈ సంఘటన బెళగావిలో చోటుచేసుకుంది. నాగేశ్ శివంగేకర్ 30 సంవత్సరాల క్రితం విధుల్లో ఉన్న సమయంలో బెళగావి తాలూకా కడోలి గ్రామానికి చెందిన లక్ష్మణ్ ఓ పని కోసం నాగేశ్‌ను ఆశ్రయించగా రూ.500 లంచం డిమాండ్ చేశాడు. దీంతో లక్ష్మణ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. పథకం ప్రకారం లోకాయుక్త పోలీసులు దాడి చేసి నాగేశ్‌ను అరెస్టు చేశారు. 2006లో నాగేశ్‌కు కోర్టు రూ.వెయ్యి జరిమానా, ఏడాది జైలు శిక్ష విధించింది. తర్వాత ధార్వాడ హైకోర్టును ఆశ్రయించగా శిక్షను రద్దు చేసింది. అయితే అప్పటికే నాగేశ్ రిటైర్ య్యారు. అయితే లోకాయుక్త సుప్రీంకోర్టుకు అప్పీలుకు వెళ్లింది. నాగేశ్‌కు పది సంవత్సరాల జైలు శిక్షను కోర్టు ఖరారు చేసింది. ఆయన్ను బెళగావి హిండలగా జైలుకు తరలించారు. కాగా ఫిర్యాదు చేసిన వ్యక్తి మృతి చెంది 5ఏళ్లు కావడం గమనార్హం.

టర్మినల్‌లోకి చొరబడేందుకు యత్నం

దొడ్డబళ్లాపురం: ఎయిర్‌పోర్టులోని టర్మినల్‌లోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించిన వ్యక్తిని సీఐఎస్‌ఎఫ్ అధికారులు అరెస్టు చేశారు. ఈఘటన బెంగళూరులోని కెంపేగౌడ విమానాశ్రయంలో జరిగింది. పాస్‌పోర్టు లేకుండా ఒక వ్యక్తి హఠాత్తుగా టర్మినల్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించగా అప్రమత్తమైన సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది అతడ్ని అదుపులోకి తీసుకుంది. అతన్ని కశ్మీర్‌లోని శ్రీనగర్‌కు చెందిన సదాద్ మహమ్మద్ బాబాగా గుర్తించారు.

బీబీఎంపీ అటవీ అధికారులపై కేసు

- అక్షయ్ మృతి కేసు నేపథ్యం

బనశంకరి: చెట్టుకొమ్మ విరిగిపడి యువకుడు అక్షయ్ మృతిచెందిన ఘటనకు సంబంధించి ముగ్గురు బీబీఎంపీ అటవీ అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదైంది. బెనరాజ్ అనే వ్యక్తి హనుమంతనగర పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుతో ఆర్ఎఫ్ఓ, ఏసీఎఫ్, డీఎఫ్ఓపై కేసు నమోదుచేశారు. అక్షయ్ ఈనెల 15వ తేదీన బనశంకరి వద్ద బైకులో వెళుతుండగా చెట్టుకొమ్మవిరిగి తలపై పడి తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లి గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. అక్షయ్ మృతి ఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం బీబీఎంపీ అటవీ విభాగం డీసీఎఫ్ బీఎల్‌జీస్వామిని బదిలీ చేసి ఆ స్థానంలో చిక్‌మగళూరు అధికారి సుదర్శన్‌ను నియమించింది. బదిలీవేటు వేసిన స్వామికి ఎలాంటి పోస్ట్ ఇవ్వలేదు. తాజాగా ముగ్గురు అధికారులపై కేసు నమోదు చేశారు.


సర్కారుపై ఐకమత్యంగా పోరాడండి

- పార్టీ నాయకులకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఉద్బోధ

శివాజీనగర: రాష్ట్ర బీజేపీలో నాయకుల్లో నెలకొన్న విభేదాలకు చెక్ పెట్టేందుకు ఆ పార్టీ నేత అమిత్‌షా ప్రయత్నించారు. ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం బెంగళూరు విచ్చేసిన ఆయన రాష్ట్ర నాయకులతో సమావేశమయ్యారు. మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ బసవరాజ బొమ్మై, బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర, ప్రతిపక్ష నేత ఆర్.అశోక్, శాసనసభా పక్ష ఉప నాయకుడు అరవింద బెల్లద, ఎంపీ తేజస్వి సూర్యతో పాటు పలువురితో సమావేశమయ్యారు. రాష్ట్ర బీజేపీలో చోటు చేసుకొన్న పరిణామాలు, కాంగ్రెస్ ప్రభుత్వంలోని పరిణామాలపై చర్చించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని తీవ్రం చేయాలని సూచించారని తెలిసింది. పార్టీ అధ్యక్షుల ఎంపిక విషయంపై త్వరలోనే తీర్మానం తీసుకుంటామని చెప్పినట్లు సమాచారం. విజయేంద్రను కొనసాగించే విషయంపై అభిప్రాయాలను సేకరించాం. త్వరలోనే హైకమాండ్ ఒక తీర్మానం చేస్తుందని అమిత్ షా చెప్పారని తెలిసింది. పార్టీలో అసంతృప్తి, అసమ్మతికి అవకాశం కల్పించకుండా అందరూ కలసికట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేకంగా పోరాటం చేపట్టాలని సూచించారని తెలిసింది. కాగా బీజేపీ రాష్ట్రాధ్యక్షుడిగా బీ.వై.విజయేంద్రను కొనసాగించాలని ఆయన తరపున నాయకులు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు విన్నవించారని తెలిసింది. కాగా విజయేంద్ర వ్యతిరేక వర్గం గురువారం అర్ధరాత్రి జీ.ఎం.సిద్దేశ్వర్ ఇంటిలో సమావేశం జరిపి పార్టీ హైకమాండ్‌కు విజయేంద్రపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైంది. అయితే కేంద్ర మంత్రి వీ.సోమణ్ణ, ప్రహ్లాద్ జోషిలు బీజేపీ భిన్నాభిప్రాయ వర్గంలో గుర్తింపు పొందిన మాజీ ఎంపీ సిద్దేశ్వర్, ఎమ్మెల్యే బీ.పీ.హరీశ్, మాజీ మంత్రులు అరవింద లింబావళి, రమేశ్ జార్కిహొళిలను కలిసి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మంత్రి సోమణ్ణ సైతం పాల్గొని అసమ్మతి నాయకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పార్టీని దృష్టిలో పెట్టుకొని హైకమాండ్ తీర్మానానికి అందరూ కట్టుబడి ఉండాలని మంత్రి సోమణ్ణ తెలిపారని తెలిసింది.

రాష్ట్రంలో అవినీతి తాండవం

- మాజీ సీఎం బీఎస్.యడియూరప్ప



బనశంకరి: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి తాండవిస్తోందని, అభివృద్ధి పనులు నిలిచిపోయాయని మాజీ సీఎం బీఎస్.యడియూరప్ప ఆరోపించారు. శుక్రవారం నగర బీజేపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజల బాధలు పట్టించుకునేవారే లేరన్నారు. అభివృద్ధి వైపు దృష్టి సారించడం లేదన్నారు. నీటిపారుదల పథకాలు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. రాష్ట్రంలో ఈ ప్రభుత్వం ఒక కి.మీ. రోడ్డు వేసి ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. ఈ ప్రభుత్వానిది తుగ్లక్ దర్బార్ అని దుయ్యబట్టారు. తాము మైనార్టీలకు వ్యతిరేకం కాదన్నారు. కానీ మైనార్టీలకు మితిమీరి సహాయం చేయడం నేరమన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అనుకూలం చేయాల్సిన ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం మైనార్టీలను బుజ్జగించే పనిలో నిమగ్నమైందన్నారు. దీనిని తామంతా ఖండిస్తున్నామన్నారు. డబ్బు ఇచ్చి ఆశ్రయ ఇళ్లు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఆర్.పాటిల్ ఆడియో వైరలైన విషయం గురించి మాట్లాడుతూ బీఆర్.పాటిల్ చెప్పింది నూటికి నూరు శాతం సత్యమన్నారు. ప్రభుత్వం తప్పు ఒప్పుకుని దీనిని సరిదిద్ది పేదలకు న్యాయం చేయాలని ఆయన అన్నారు.

'డబ్బు ఇచ్చిన వారికే ఇళ్లు' ఆడియో వైరల్

బనశంకరి: డబ్బు ఇచ్చినవారికి మాత్రమే వసతి మండలిలో ఇళ్ల ను మంజూరుచేశామని ఆళంద ఎమ్మెల్యే బీఆర్.పాటిల్ మాట్లాడిన ఆడియో వైరల్ అయింది. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీసింది. గృహ నిర్మాణశాఖ మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్ వ్యక్తిగత కార్యదర్శి సర్ఫరాజ్‌ఖాన్‌కు ఫోన్‌చేసి తమ ప్రభుత్వ కార్యవైఖరిపై బీఆర్.పాటిల్ అసమాధానం వ్యక్తం చేసినట్లు ఆడియోలో ఉంది.

న్యాయ విచారణ జరిపించాలి

దొడ్డబళ్లాపురం: రాష్ట్ర వసతి శాఖలో ఇళ్ల పంపిణీలో అవినీతి చోటుచేసుకుందని ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ వెల్లడించారని, ఈ అవినీతి వ్యవహారంపై న్యాయ విచారణ చేపట్టాలని ప్రతిపక్ష నేత ఆర్ అశోక్ డిమాండ్ చేశారు. డబ్బు ఇచ్చిన వారికే రాజీవ్ గాంధీ వసతి మండలి ద్వారా ఇళ్లు కేటాయిస్తున్నారని ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్‌కు కాల్ చేసి మాట్లాడిన ఆడియో వాస్తవానికి అద్దం పడుతోందన్నారు. ఈ ఆడియో ఆధారంగా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ ఎంక్వైరీ వేయాలని డిమాండు చేశారు. ఈమేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.


తుంగా సోయగం
నైరుతి రుతుపవనాల ప్రభావంతో శివమొగ్గ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో శుక్రవారం పరవళ్లు తొక్కుతున్న తుంగా నది దృశ్యం

సమాధి నుంచి బయటకు వచ్చిన చేయి

మైసూరు: సమాధి నుంచి చేయి బయటకు వచ్చిన ఘటన చామరాజ నగర జిల్లా కొళ్లెగాల తాలూకా హలె హంపాపుర గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన 40 సంవత్సరాల వయస్సున్న మహిళ మృతి చెందగా శ్మశానంలో ఖననం చేశారు. శశికుమార్ అనే గొర్రెల కాపరి ఆ ప్రాంతంలో జీవాలను మేపుతుండగా సమాధి నుంచి చెయ్యి బయటికి రావడాన్ని గమనించి గ్రామస్తులకు తెలపడంతో జిల్లా ఎస్పీ డాక్టర్ బి.టి.కవితకు సమచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి చామారాజనగర సిమ్స్‌కు తరలించారు. ఆమెది సహజ మరణమా? ఇతర కారణాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సమాధికి 20 మీటర్ల దూరంలో దీపం, నీటిబాటిల్, పసుపుకుంకుమ లభించడంతో క్షుద్ర పూజలు జరిగాయా? అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధరాత్రి ఇళ్లలో తనిఖీలపై ఎస్పీకి నోటీసులు

శివాజీనగర: మంగళూరులో ఆర్‌ఎస్‌ఎస్ నేతల ఇళ్లలో పోలీసులు అర్ధరాత్రి తనిఖీ చేసిన ఘటనకు సంబంధించి దక్షిణ కన్నడ జిల్లా ఎస్పీకి హైకోర్టు నోటీస్ ఇచ్చింది. ఆ జిల్లాలో మత సంఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో వాటికి బ్రేక్ వేసేందుకు పోలీసులు ఈనెల 1న హిందూ నేతల ఇళ్లలో తనిఖీలు చేశారు. ఈఘటనపై ఉప్పినంగడికి చెందిన వృద్ధురాలు యూ.జీ.రాధా హైకోర్టు మెట్లెక్కారు. వ్యక్తి స్వాతంత్ర్యపు మూలభూత హక్కును పోలీసులు కాలరాస్తున్నారని, తనిఖీలతో తన గౌరవానికి భంగం కలిగిందని, రూ.20 లక్షల పరిహారం అందజేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈపిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సునీల్ దత్ యాదవ్ ఏకసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. దీంతో కోర్టు దక్షిణ కన్నడ ఎస్పీ అరుణ్‌కు కర్ణాటక హైకోర్టు నోటీస్ జారీచేసింది. తగిన దాఖలాలను సమర్పించాలని ఆదేశించింది.

11 రోజుల పాటు మైసూరు దసరా


మైసూరు దసరా ఉత్సవాల్లో భాగంగా జంబూ సవారీ(ఫైల్)

మైసూరు: ప్రపంచ ప్రసిద్ధి చెందిన నాడ హబ్బ మైసూరు దసరా మహోత్సవాన్ని ఈ ఏడాది మొదటి సారిగా 11 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇప్పటివరకు మైసూరు దసరా వేడుకలు 10 రోజుల పాటు నిర్వహించేవారు. కానీ చరిత్రలో మొదటి సారిగా ఈ యేడాది మైసూరు దసరా వేడుకలు 11 రోజుల పాటు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 1399వ యేడాదిలో విజయనగర సామ్రాజ్య పరిపాలనలో, 1410వ యేడాది మైసూరు సంస్థానం మహారాజుల పరిపాలన నుంచి మైసూరు దసరా మహోత్సవాన్ని 10 రోజుల పాటు నిర్వహించేవారు. దసరా అంటేనే దశ హర 10 రోజుల నిర్వహణ అని అర్థం. అయితే ఈ యేడాది మాత్రం మైసూరు దసరా మహోత్సవం చరిత్రలో నిలిచిపోనుంది. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు 11 రోజుల పాటు దసరా వేడుకలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 26, 27వ తేదీల్లో పంచమి ఉన్నందున ఈ యేడాది 11 రోజుల పాటు ఇదే మొదటిసారిగా దసరా వేడుకలు నిర్వహిస్తున్నారు. నవరాత్రి మరుసటి రోజు విజయదశమి నిర్వహించడం సాంప్రదాయం. విజయ దశమి రోజున మైసూరు ప్యాలెస్‌లో సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో జంబూ సవారీ నిర్వహిస్తారు. కాని 11 రోజుల పాటు నిర్వహించనున్న ఈ యేడాది ఉత్సవాలు ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఈ వేడుకలపై మైసూరు రాజవంశస్తులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.


స్మారకం.. అద్భుతం
ప్రపంచ పర్యాటక కేంద్రం హంపీలో శుక్రవారం వాన నీటిలో ఆవిష్కృతమైన విరూపాక్షేశ్వర ఆలయ ప్రతిబింబం

క్లుప్తంగా

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో లోకాయుక్త తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న లోకాయుక్త అధికారి

పావగడ: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తుమకూరు జిల్లా లోకాయుక్త అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ రవి పలు రికార్డులు పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్ రాధమ్మ సెలవులో ఉండగా ఇన్ చార్జ్ సబ్ రిజిస్ట్రార్ నాగరాజు లోకాయుక్త అధికారులు అడిగిన దాఖలాలు అందించారు. రామాంజనేయ, రవి కుమార్, చంద్ర శేఖర్ అనేవారు సబ్ రిజిస్ట్రార్ రాధమ్మపై లోకాయుక్త అధికారులకు ఫిర్యాదులు చేశారు. లంచం ఇస్తేనే రిజిస్ట్రేషన్ పనులు త్వరిత గతిన చేస్తారని, లేకుంటే ఆలస్యం చేస్తారని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయలపై ఏక కాలంలో దాడులు నిర్వహించినట్లు లోకాయుక్త ఎస్ఐ రాజు తెలిపారు.

మాదక ద్రవ్యాల కట్టడికి చర్యలు



మాట్లాడుతున్న జిల్లాధికారి ఎంఆర్ రవి

కోలారు : జిల్లాలో మాదక ద్రవ్యాల సంపూర్ణ నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లాధికారి ఎం ఆర్ రవి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సభాంగణంలో నిర్వహించిన ఎన్‌సీఓఆర్‌డీ జిల్లా స్థాయి సమన్వయ సమితి సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు యువత ఎక్కువగా ఆకర్షితులు అవుతున్నారన్నారు. దీని వల్ల దేహంపై కలిగే దుష్పరిణామాలపై అవగాహన కలిగించాలన్నారు. అప్పుడే వాటి నుంచి దూరం ఉండడానికి ప్రయత్నం చేస్తారన్నారు. జాగృతి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. విద్యా సంస్థల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందించాలన్నారు. పొగాకు ఉత్పత్తులతో పాటు మాదక ద్రవ్యాల దురలవాట్లకు కార్మికులు బానిసలు అవుతున్నారు. కార్మికులకు దీని వల్ల కలిగే చెడు ప్రభావాల గురించి తెలియజేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, అటవీ సిబ్బంది వ్యవసాయ భూములు, తోటల వద్దకు వెళ్లి గంజాయి పెంచుతున్నారా? అనే విషయంపై పరిశీలించాలన్నారు. ఆన్‌లైన్ మార్కెట్ గోదాముల్లో కూడా పరిశీలించాలన్నారు. సమావేశంలో ఎస్పీ బి.నిఖిల్, జెడ్పీ సీఈఓ ప్రవీణ్ పి బాగేవాడి, కేజీఎఫ్ ఎస్పీ శాంతరాజు పాల్గొన్నారు.

పరిధికి అనుగుణంగా విధులు నిర్వహించండి

• కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్



గౌరవవందనం స్వీకరిస్తున్న కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్, కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బనశంకరి: బెంగళూరునగర కమిషనరేట్ పరిధి రోజురోజుకు విస్తరిస్తోందని, దీనికి అనుగుణంగా విధులు నిర్వహించాలని నగర పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ తెలిపారు. శుక్రవారం మైసూరు రోడ్డులోని సీఏఆర్ కేంద్ర మైదానంలో ఏర్పాటు చేసిన ప్రథమ నెలవారి కవాతులో ఆయన గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. బెంగళూరు నగర కమిషనరేట్ పరిధిలో ప్రస్తుతం కుంబళగోడు, ఆవలహళ్లి, హెబ్బగోడి పోలీస్ స్టేషన్లు చేరి విస్తీర్ణం పెరగడంతో పని ఒత్తిడి అధికమైందన్నారు. అధికారులు, సిబ్బంది అత్యుత్తమంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న 8 విభాగాలతో పాటు మళ్లీ మూడు కొత్త విభాగాలు కొత్తగా చేరనున్నాయన్నారు. నెలవారీ పరేడ్‌కు ఎవరూ గైర్హాజరు కారాదన్నారు.

28 ఏళ్ల క్రితం ఇక్కడే శిక్షణ పొందా

తాను 28 ఏళ్ల క్రితం ఇదే సీఏఆర్ మైదానంలో మొదటిసారిగా శిక్షణ తీసుకున్నానని గుర్తు చేసుకున్నారు. నేడు ఇదే స్థలంలో తాను కవాతు గౌరవ వందనం స్వీకరించడం గర్వకారణంగా ఉందన్నారు. నగర ప్రజలకు ఉత్తమ వాతావరణం కల్పించడం తమ బాధ్యత అన్నారు. నగరంలో శాంతిభద్రతలు కాపాడటానికి అందరూ కలిసి అత్యుత్తమసేవలు అందించాలన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడాలన్నారు. వారు బాధలో ఉంటారని, వారిని ఇబ్బంది పెట్టరాదని, వారి ఫిర్యాదులు ఆలకించి సహాయం చేయాలని అధికారులు, సిబ్బందికి హితవు పలికారు.

బాబూరెడ్డికి ఘన నివాళులు



బాబూరెడ్డి వైకుంఠ సమారాధనలో మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీజీ.భరత్ తదితరులు



కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్, వేణురెడ్డి, చినబాబు

బనశంకరి: పెనుకొండ వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త చల్లాపల్లి బాబూరెడ్డి సమారాధన కార్యక్రమం గురువారం బెంగళూరులోని యలహంక ఉపనగర నివాసంలో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై బాబూరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్, హిందూపురం వైస్సార్‌సీపీ నేత వేణురెడ్డి, కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త టీజే.భరత్, సత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, చిలమత్తూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, తంబళ్లపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు జీ.రాజశేఖర్‌రెడ్డి, చినబాబు, యలహంక నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఖైదీ అరెస్ట్

బనశంకరి: పెరోల్‌పై తీసుకుని పరారీలో ఉన్న ఖైదీని శుక్రవారం పరప్పన అగ్రహారపోలీసులు అరెస్ట్‌చేశారు. బొమ్మనహళ్లి సింగసంద్ర నివాసి మహమ్మద్‌ఇద్రీస్(30) ఓ కేసులో పరప్పన అగ్రహార జైలుకు వెళ్లాడు. తల్లికి ఆరోగ్యం సరిగా లేదనే కారణంతో ఏప్రిల్ 18 నుంచి మే 17 వరకు పెరోల్ తీసుకుని బయటికి వచ్చాడు. పెరోల్ గడువు పూర్తయినా జైలుకు వెళ్లలేదు. జైలు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరప్పనఅగ్రహార పోలీసులు గాలించి శుక్రవారం తమిళనాడు కృష్ణగిరిలో మహమ్మద్ ఇద్రీస్‌ను అరెస్ట్‌చేశారు.

వెలుగు చూసిన డీజిల్ చోరీ



ఆయిల్ ట్యాంకర్



ట్యాంకర్ కింద పైపులు

మండ్య : కేఎస్ ఆర్టీసీ బస్సులకు సరఫరా చేసే డీజిల్ చోరీ అవుతున్న ఉదంతం మండ్యలో వెలుగు చూసింది. మండ్య జిల్లా పాండవపుర తాలూకాలోని కేఎస్ఆర్‌టీసీ డిపోలకు హాసన్ హెచ్‌పీసీఎల్ కంపెనీ నుంచి ఇంధనం సరఫరా చేస్తుంటారు. అయితే ప్రతి ట్రిప్పులో 200 లీటర్ల డీజిల్ తక్కువగా ఉంటున్నట్లు డిపో అధికారులు గుర్తించి కంపెనీకి సమాచారం ఇచ్చారు. దీంతో ట్యాంకర్‌ను పరిశీలించగా ట్యాంకర్ కింద పైపులు ఏర్పాటు చేసి అందులోకి డీజిల్ వెళ్లేలా ఏర్పాట్లు చేసినట్లు గుర్తించారు.

క్రీడలతో క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కోలారు : క్రీడల ద్వారా ఉత్తమ ఆరోగ్యంతో పాటు క్రియాశీలత లభిస్తుందని, ఉత్తమ వ్యక్తిత్వం రూపొందడానికి సాధ్యం అవుతుందని జిల్లా పారా ఒలంపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.జయదేవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని విశ్వేశ్వరయ్య క్రీడా మైదానంలో జిల్లా యువ సబలీకరణ క్రీడాశాఖ, బెంగళూరు యంగ్ స్టార్ స్పోర్ట్స్ ప్రమోటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన బెంగళూరు రూరల్ డివిజన్ స్కూల్ ఒలంపిక్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025ను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఇటీవల పాఠశాలల్లో విద్యార్థులు కేవలం పాఠాలకే పరిమితం అవుతున్నారు. మంచి మార్కులు సాధించాలనే తపనతో క్రీడలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. క్రీడలకు ప్రోత్సాహం లభించక పోవడం విచారకరమన్నారు. విద్యార్థులు స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలన్నారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలన్నారు. అనంతరం క్రీడల్లో విజేత విద్యార్థులకు బహుమతులు అందించారు. బెంగళూరు యంగ్‌స్టర్ స్పోర్ట్స్ ప్రమోటర్స్ సమన్వయ కార్యదర్శి ఎస్ ఆర్ రమేష్, సీనియర్ క్రీడాకారులు, కోచ్ జగన్నాథ్, గౌస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలి

మాలూరు : తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారిని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని చన్నిగరాయపుర ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ వెంకటపతి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారు. నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుంది.దీని వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు రావడానికి సాధ్యమవుతుందన్నారు.

భాగ్యనగర్‌గా బాగేపల్లి మారడం ఖాయం



ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి : బాగేపల్లి భాగ్యనగర్‌గా మారడం వంద శాతం ఖాయమని ఎమ్మెల్యే సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 3 దశాబ్దాల క్రితం నటుడు డాక్టర్ రాజ్‌కుమార్ ప్రారంభించిన భాగ్యనగర్ డిమాండ్ నేటికీ కొనసాగుతోందన్నారు. ఈ విషయంపై నేను చాలా సార్లు ప్రభుత్వాన్ని కోరానన్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం బాగేపల్లిని భాగ్యనగర్‌గా మార్చడానికి అంగీకరించిందన్నారు. ఈమేరకు మంత్రి వర్గ సమావేశంలో ప్రవేశపెట్టారన్నారు. చిక్కబళ్లాపురం, కోలారు, బెంగళూరు రూరల్‌కు సంబంధించి సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదిస్తుందనే విశ్వాసం ఉందని ఎమ్మెల్యే తెలిపారు.

డ్రైవర్లు, క్లీనర్ల పేర్ల నమోదు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రమోద్ తదితరులు

బనశంకరి: పద్మనాభనగర నియోజకవర్గంలోని కరిసంద్రవార్డులో శుక్రవారం రాష్ట్ర కట్టడనిర్మాణ, రాష్ట్ర అసంఘటిత కార్మికుల సామాజిక భద్రతమండలి, అంబేడ్కర్ కార్మికుల సామాజిక భద్రత శాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లు, క్లీనర్ల పేర్ల నమోదు అభియాన్ ప్రారంభమైంది. గ్యారంటీ పథకాల అమలు కమిటీ అధ్యక్షుడు ప్రమోద్ శ్రీనివాస్, ఎల్ఎస్.చేతన్‌గౌడ రామమూర్తి, పురటాసి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సౌకర్యాల లబ్ధి పొందాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

కేజీఎఫ్ : మైనారిటీ సముదాయం అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాలను ఆ సముదాయం వారు సద్వినియోగం చేసుకోవాలని కోలారు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మైలారప్ప మనవి చేశారు. శుక్రవారం రాబర్ట్‌సన్ పేట పిచర్డు రోడ్డులో ఉన్న షాదీ మహల్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల గురించి ముస్లిం, క్రిస్టియన్ సముదాయాలకు అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ముస్లిం, క్రిస్టియన్ సముదాయాల అభివృద్ధికి సముదాయ భవనాల నిర్మాణం, చర్చిల మరమ్మత్తు, నవీకరణానికి సహాయ ధనం అందిస్తోంది. అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. మాజీ నగరసభ సభ్యుడు ముజాహిద్ ఖాన్, నగరసభ మాజీ స్థాయి సమితి అధ్యక్షుడు అమీర్ పాల్గొన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం.. నిందితుని అరెస్టు



స్వాధీనం చేసుకున్న బంగారం, నిందితునితో పోలీసులు

శ్రీనివాసపురం : చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న ముళబాగిలు రూరల్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.5 లక్షల విలువ చేసే 67 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ముళబాగిలు తాలూకా వి.హొసహళ్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్ పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు. తాలూకాలోని వివిధ గ్రామాల్లో బంగారు అభరణాల చోరీపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు దర్యాప్తు జరిపి నిందితుడిని అరెస్టు చేసి కస్టడీకి తరలించారు.

రోడ్డును మరమ్మతు చేయాలని వినూత్న ఆందోళన



చింతామణి: పట్టణంలోని చేలూరు రోడ్డు అండర్ పాస్ కింద రోడ్డు గుంతలమయమైంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వచ్చేందుకు శుక్రవారం గుంతల వద్ద పూజలు నిర్వహించారు. అబ్దుల్‌ఖయూమ్, శివారెడ్డి, విశ్వనాథ్, సుబాన్ పాల్గొన్నారు.

హోసూరు వార్తలు...

రైతుల సమస్యలు పట్టని డీఎంకే ప్రభుత్వం





దీక్షలో పాల్గొన్న అన్నాడీఎంకే నేతలు , దీక్షా శిబిరం ముందు మామిడికాయలు పడేసిన దృశ్యం

క్రిష్ణగిరి: ధర తగ్గి నష్టపోయిన మామిడి రైతులను ఆదుకోవంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని అన్నాడీఎంకే నేతలు మండిపడ్డారు. రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి బస్టాండులో వేపనపల్లి ఎమ్మెల్యే కే.పి.మునిస్వామి అధ్యక్షతన నేతలు నిరాహార దీక్ష చేపట్టారు. రాజ్యసభ సభ్యుడు తంబిదురై, మాజీ మంత్రి పి.బాలక్రిష్ణారెడ్డి, క్రిష్ణగిరి ఎమ్మెల్యే అశోక్‌కుమార్ తృత్వం వహించారు. నేతలు మాట్లాడుతూ పండ్ల రసాల తయారీ పరిశ్రమలు రైతుల నుంచి మామిడిని కిలో రూ. 4 నుంచి, రూ. 5తో మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో రైతులకు పెట్టుబడులు కూడా గిట్టుబాటు కావడం లేదన్నారు. పండ్ల రసాల తయారీ పరిశ్రమలు మామిడి కిలో రూ. 13తో కొనుగోలు చేయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ఎకరాకు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేయాలని నినాదాలు చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన నిరాహార దీక్ష సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది.

ఆర్టీవో వాహనంలో అనధికారిక నగదు లభ్యం

హోసూరు: క్రి ష్ణగిరి తాలూకా ఆర్టీవో అధికారి వాహనంలో లంచనిరోధక శాఖ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో లెక్కకు రాని రూ. 2.46 లక్షలు లభించింది. హోసూరు ఆర్టీవో కార్యాలయంలో తాలూకా రవాణాశాఖాధికారిగా విధులు నిర్వహిస్తున్న ప్రభాకరన్ క్రిష్ణగిరి తాలూకా ఆర్టీవో కార్యాలయ అదనపు బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నాడు. వాహనాలకు అనుమతి పత్రాలు, డ్రైవింగ్ శిక్షణా కేంద్రాలు తదితర విభాగాల్లో దళారులనుంచి డబ్బు వసూలు చేస్తున్నట్లు ధర్మపురి లంచనిరోధక శాఖ పోలీసులకు సమాచారం అందింది. గురువారం సాయంత్రం లంచనిరోధకశాఖ అధికారి నాగరాజ్ నేతృత్వంలో క్రిష్ణగిరి ఆర్టీలో కార్యాలయంలో ఉన్న ఆర్టీవో అధికారి వాహనాన్ని తనిఖీ చేయగా రూ. 2.46 లక్షల నగదు పట్టుబడింది. నగదును స్వాధీనపరుచుకొని అధికారిని విచారణ జరుపుతున్నారు.

బస్సులు నడపాలని సంతకాల సేకరణ



సంతకాల సేకరణ చేపట్టిన విద్యార్థులు, స్థానికులు

హోసూరు: డెంకణీకోట సమీపంలోని అటవీ ప్రాంత గ్రామాలకు బస్సులు నడిపించాలని డిమాండ్ చేస్తూ గ్రామీణులు సంతకాల సేకరణ చేపట్టారు. కుందుకోట సమపంలోని ఏణిబండ, వీరశెట్టిచెరవు తదితర అటవీ ప్రాంత గ్రామాలకు బస్సులు లేవు. దీంతో పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కూలీలు, కార్మికులు, వృద్ధులు మూడు కిలో మీటర్ల దూరంలోని కుందుకోటకు కాలినడకన వెళ్లి అక్కడి నుంచి డెంకణీకోట, అంచెట్టి పట్టణాలకు వెళ్తున్నారు. బస్సులు నడపాలని పలు సంవత్సరాలుగా ప్రజలు కోరుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నికల సమయాల్లో మాత్రం రాజకీయ నాయకులు హామీ ఇచ్చి అనంతరం విస్మరిస్తున్నారు. దీంతో విసిగి వేసారిన అటవీ ప్రాంత ప్రజలు కుందుకోట గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి సంతకాలు సేకరించి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి బస్సు వసతులు కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

నేటి నుంచి మామిడి మేళా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలోని క్రిష్ణగిరి-హోసూరు జాతీయ రహదారి టోల్‌గేట్ సమపంలో శనివారం నుంచి అఖిల భారత మామిడి మేళా ప్రారంభం కానుంది. ఈమేరకు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తమిళనాడులోని వివిధ జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక, ఆంధ్ర, కేరళ నుంచి రైతులు మామిడి ఉత్పత్తులను ప్రదర్శిస్తారని తెలిపారు. మహిళా సంఘాల తయారు చేసిన చేతివృత్తి బొమ్మలను కూడా ఈ ప్రదర్శనలో ఉంచనున్నారని తెలిపారు. రోజూ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ తంగదురై పాల్గొన్నారు. మామిడి మేళాను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

నలుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు

మైసూరు : ఒక వ్యక్తిని అక్రమంగా బంధించి చెక్కుపై సంతకం చేయాలని బలవంతం చేసిన బెంగళూరు వ్యాపారవేత్తలు గోవిందప్ప, పూజారి సురేష్, వారి అనుచరులు సుభేష్‌శెట్టి, ప్రజ్వల్‌లపై ఎఫ్ఐఆర్, కేసులు నమోదయ్యాయి. ఎన్ఆర్ మొహల్లా నివాసి సునీల్, అతని భార్య కవిత సంతకం చేసిన చెక్కులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారు ఐదు చెక్కుల్లో రూ. 21 లక్షలు నమోదు చేసుకుని బౌన్స్ చేసి వారెంట్ తెచ్చారు. ఈ పరిణామంతో కలత చెందిన సునీల్, అతని భార్య కవిత న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు. మూడేళ్ల పాటు విచారణ జరిపిన తర్వాత మైసూరు కోర్టు వ్యాపారవేత్తలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థినికి నోటు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

కోలారు : వేమగల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎప్సన్ కంపెనీ శుక్రవారం ఉచితంగా నోటు పుస్తకాలను అందించింది. బీఈఓ మధుమాలతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను రక్షించే ఉద్దేశంతో జిల్లాలోని పాఠశాలల్లోని 36 వేల మంది పిల్లలకు 1.80 లక్షల నోటు పుస్తకాలను, పిల్లలకు రక్షిత తాగునీటిని అందించడానికి 572 వాటర్ ఫిల్టర్లను కంపెనీ విరాళంగా అందిస్తుండడం హర్షణీయమన్నారు. పీఆర్ఓ విజయ్ గోవింద్, కంపెనీ అధికారి రాజేంద్రసింగ్, ఉపాధ్యాయ గెళెయర బళగ అధ్యక్షుడు ఎస్ నారాయణస్వామి పాల్గొన్నారు.

పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

తుమకూరు : సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌పై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన గరదకుప్పె గ్రామానికి చెందిన దనంజయ అనేవ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా ఎస్పీకి, హెబ్బూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాయకులు టి.హెచ్.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒక్కలిగ పారిశ్రామికవేత్తల సమావేశాలు



విలేకరులతో మాట్లాడుతున్న సీఎంఆర్ శ్రీనాథ్

కోలారు : నగర సమీపంలోని నందిని ప్యాలెస్‌లో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు ఒక్కలిగ పారిశ్రామికవేత్తల సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ఒక్కలిగ పారిశ్రామికవేత్తల సంఘం జిల్లా అధ్యక్షుడు సీఎంఆర్ శ్రీనాథ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సముదాయంలో నిరుద్యోగులను స్వయం ఉద్యోగులుగా చేయడానికి ఒక్కలిగ పారిశ్రామిక సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకు అందరి సహకారం అవసరమన్నారు. 2024లో మొదటి సమావేశాన్ని నిర్వహించామన్నారు. జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కోలారు జిల్లాలో రెండు రోజుల పాటు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోలారు, చిక్కబళ్లాపుర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో సముదాయ పారిశ్రామికవేత్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎంతో మంది యువకులకు పరిశ్రమలు స్థాపించాలనే ఆశయం ఉంటుంది. అలాంటి వారికి సమావేశాల్లో తగిన మార్గదర్శనం చేస్తారని తెలిపారు. చిక్కబళ్లాపుర సర్కిల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, నివృత్త డీఎస్పీ శివకుమార్, నాగేరి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కోలారు సమాచారం

బాల్య వివాహాల కట్టడికి జాగృతి అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి నటేష్

కోలారు : బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రజలను జాగృతం చేసే కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ ప్రాధికార కార్యదర్శి ఆర్.నటేష్ తెలిపారు. శుక్రవారం నగరంలోని మౌలానా ఆజాద్ మోడల్ పాఠశాలలో నిర్వహించిన బాల్య వివాహాలపై జాగృతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయసు కలిగిన వారికి వివాహం చట్టరీత్యా నేరం అంతేకాకుండా దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. తమ పిల్లల యోగ క్షేమాలను దృష్టిలో ఉంచుకుని బాల్యవివాహాలను తల్లిదండ్రులు ప్రోత్సహించరాదన్నారు,. ప్రపంచ వ్యాప్తంగా ఐదు మంది పిల్లల్లో ఒకరు బాల్య వివాహానికి గురవుతుండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. బాల్య వివాహాలు మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుంది. సంఘర్షణ, వాతావరణ ప్రభావాలు, కోవిడ్ కారణంగా జరుగుతున్న పరిణామాల వల్ల ఇలాంటి దురాచారాలు జరుగుతున్నాయని, 2030 నాటికి పూర్తిగా బాల్య వివాహాలను అరికట్టాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత సీఐ సదానంద తదితరులు పాల్గొన్నారు.

'ఇక నాకు అధికారం, సంపద అక్కర్లేదు'



మంత్రి రాజన్న దంపతులకు సత్కారం

తుమకూరు : రాబోయే రోజుల్లో నాకు ఎలాంటి అధికారం లేదా సంపద అక్కర్లేదని, ప్రజలు నాపై ఉంచిన ప్రేమ, నమ్మకాన్ని కొనసాగిస్తే చాలని సహకారశాఖ మంత్రి కే.ఎన్.రాజణ్ణ అన్నారు. తన 75వ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆయన భార్య శాంతలా రాజన్న, కుటుంబ సభ్యులతో కలిసి చంద్రమౌళీశ్వర ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. అనంతరం అమృత మాట్లాడారు. క్యాత్సంద్ర ప్రజలు తనకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చారన్నారు. కే.ఎస్.నరసింహయ్యతో సహా చాలా మంది పెద్దలు నన్ను నడిపించారని, వారి మార్గాన్ని అనుసరించానన్నారు. కల్లహళ్లి దేవరాజు, పి.మూర్తి, జీఆర్.రవి, ఆనంద్, జయరాం, ఇనాయత్ ఉల్లా పాల్గొన్నారు.

ఇందిరా క్యాంటీన్ ప్రారంభం



ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభించిన దృశ్యం

కేజీఎఫ్ : నగరంలోని రాబర్ట్‌సన్ పేట ప్రభుత్వ ఆస్పత్రి ముందు శుక్రవారం ఎమ్మెల్యే రూపా శశిధర్ ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభించారు. కేజీఎఫ్ నియోజకవర్గం సరిహద్దులో ఉండడం వల్ల కార్మికులు, కూలీల సంఖ్య అధికంగా ఉన్నారు. నిత్యం ఉదయమే పని కోసం నగరానికి కార్మికులకు ఇందిరా క్యాంటీన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎంఆర్ రవి మాట్లాడుతూ ముళబాగిలులో ప్రారంభించిన ఇందిరా క్యాంటీన్‌ను ఎందుకు మూసివేశారనే దానిపై విచారణ చేస్తానని తెలిపారు. నగర సభ అధ్యక్షురాలు ఇందిరాగాంధీ, కమిషనర్ పవన్ కుమార్, తహసీల్దార్ నాగవేణి పాల్గొన్నారు.

ఎస్సీ కులగణనపై పరిశీలన



సర్వేలో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ మంగళ

శ్రీనివాసపురం : మొబైల్ అప్లికేషన్ ద్వారా నికరమైన సమాచారం సేకరణ సాధ్యమని డిప్యూటీ కలెక్టర్ ఎస్. మంగళ తెలిపారు. శుక్రవారం పట్టణంతో పాటు సంత మైదానం వద్ద ఇంటింటికీ వెళ్లి ఎస్సీ సముదాయ సమగ్ర సమీక్షను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. పట్టణంలో సంత మైదానం, అంబేడ్కర్ పాళ్య, జగ్‌జీవన్‌పాళ్యలో ఇంటింటా సమీక్ష నిర్వహించి మొత్తం 97 శాతం సమీక్ష పూర్తయిందని తెలిపారు. తహసీల్దార్ సుధీంద్ర, పురసభ ముఖ్యాధికారి వీ.నాగరాజ్, ఆరోగ్య అధికారి సురేష్ ఉన్నారు.

క్లుప్తంగా

వైభవం.. అన్నపూర్ణేశ్వరీ పూల పల్లకీ ఉత్సవం


అన్నపూర్ణేశ్వరీ పూల పల్లకీ ఉత్సవ దృశ్యం

గౌరిబిదనూరు: పట్టణంలోని మధుగిరి రస్తాలో వున్న ఆదిశక్తి అన్నపూర్ణేశ్వరీ ఆలయ 8వ వార్షిక బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ఆవరణలో కొలువైన వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామికి రెండు రోజులుగా జరిగిన వివిధ ధార్మిక కార్యక్రమాలు గురువారం రాత్రి జరిగిన పూలపల్లకీ ఊరేగింపుతో సమాప్తమయ్యాయి. ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ అన్నపూర్ణేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శివశర్మ,బాలాజీ శర్మలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నపూర్ణేశ్వరిని పూల పల్లకీలో ఊంచి ఊరేగించారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొన్న సిద్దరబెట్ట వీరభద్ర శివాచార్య మాట్లాడుతూ రథోత్సవాలు భక్తి భావనలకు, శాంతి సౌహార్దతలకు సంకేతాలన్నారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహాన్ని చెక్కిన మైసూరుకు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ ఇక్కడి మూల విగ్రహం చెక్కారని తెలిపారు. డాక్టర్ హెచ్ఎన్ ప్రాధికార అధ్యక్షుడు శివశంకరరెడ్డి, నగరసభ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కమిషనర్ గీత, వెంకటరామి రెడ్డి, ఆలయ ధర్మకర్త నారాయణప్ప, మంజునాథ్, రవికుమార్, గదరె సతీశ్, పెద్ద సంఖ్యలో భక్తులు ల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బార్లలో అశ్లీల నృత్యాలు.. పోలీసుల దాడి

శివాజీనగర: బార్లలో అశ్లీల నృత్య ప్రదర్శనలు చేస్తున్నట్లు ఆరోపణలపై నగరంలోని 17కుపైగా బార్, పబ్, క్లబ్‌లపై నగర పోలీసులు గురువారం అర్ధరాత్రి ఆకస్మిక దాడి చేపట్టారు. ఎం.జీ.రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, ఉప్పారపేట ప్రాంతంలోని బార్లు, పబ్‌లు, క్లబ్‌ల్లో తనిఖీలు చేశారు. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన యువతులను తీసుకొచ్చి అర్ధరాత్రి డ్యాన్స్ చేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీనికితోడు వేళలు పాటించకుండా ఇష్టానుసారంగా అర్ధరాత్రి వరకు బార్లను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.

యోగా దినోత్సవానికి దివ్యాంగులు


మానసిక దివ్యాంగులతో పాఠశాల నిర్వాహకులు

గౌరిబిదనూరు: పట్టణంలో ప్రజ్ఞాట్రస్ట్ నిర్వహిస్తున్న అరుణోదయ, ప్రతీక్షా దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలకు చెందిన ఆరుమంది మానసిక దివ్యాంగులు సికింద్రాబాద్‌లో శనివారం జరుగనున్న అంతర్జాతీయ యోగా దినాచరణలో పాల్గొనడానికి గురువారం బయల్దేరి వెళ్లారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 3500 మంది దివ్యాంగులు యోగాలో పాల్గొంటారని పాఠశాల ప్రాజెక్ట్ అధికారి నాగరాజు తెలిపారు. ఉపాధ్యాయులు అనిత, శాంత, ఉషా, శాంతలక్ష్మి, నాగరాజు, సవిత పాల్గొన్నారు.

సస్పెండ్ అయిన అధికారిపై ఎఫ్ఐఆర్

మైసూరు: సస్పెండ్ అయిన మైసూరు ఉప విభాగం అధికారి నందీష్‌పై మైసూరులోని నజరాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 2024 ఫిబ్రవరి 22 నుంచి 2024 జూన్ 7వరకు ఆయన విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ చేపట్టగా సరైన దాఖాలాలను తీసుకురాలేదు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయనపై కేసు నమోదు చేశారు.

ముగ్గురు కార్ల దొంగల అరెస్ట్


పట్టుబడిన నిందితులు

యశవంతపుర: కార్లను చోరీ చేస్తున్న ముఠా పట్టుబడింది. ఉమేశ్, తబ్రేజ్, జమీర్ అలియాస్ జబీర్‌ఖాన్ అనే దొంగలను యలహంక విద్యారణ్యపుర పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులనుంచి రూ.12 లక్షలు విలువైన ఆరు ఓమ్ని కార్లను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు తూర్పు విభాగం అడిషనల్ పోలీసు కమిషనర్ రమేశ్ బానోత్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. నిందితులు గతంలో బెంగళూరులో ట్యాక్సీలను చోరీ చేసేవారు. 2020లో కామాక్షిపాళ్య పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపగా బెయిల్‌పై వచ్చి పంథామార్చారు. కేవలం ఓమ్నికార్లను చోరీ చేసి పల్లెలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. గతనెలలో విద్యారణ్యపుర పోలీసుస్టేషన్ పరిధిలో ఓమ్నికారు చోరీకి గురైంది. పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా ఈ ముఠా పట్టుబడింది.


బల్లాలరాయనదుర్గం


బల్లాలరాయనదుర్గ వద్ద ట్రెక్కర్లు మకాం వేసిన దృశ్యం

బల్లాలరాయన దుర్గం.. అంతులేని ఆహ్లాదం

- దట్టమైన అడవి మధ్య పురాతన కోట
- నయనమనోహరంగా లోయలు, పర్వతాలు
- వైవిధ్యమైన జంతుజాలం

బనశంకరి: రాజులు నిర్మించిన కోట, దాని చుట్టూ అల్లుకున్న పచ్చదనం, దట్టమైన అడవి, వైవిధ్యమైన జంతుజాలం, పక్షుల కిలకిలరావాలు, మంచుతెరలతో బల్లాల రాయనదుర్గ కోట పర్యాటకులను పరవశింపజేస్తుంది. ఈ కోట పరిసరాలను వీక్షిస్తే ఒక్క క్షణంలోనే మనసంతా ఉత్తేజభరితంగా మారుతుంది. ఇది చిక్‌మగళూరు పశ్చిమకనుమల మధ్య పర్వతంపై సముద్రమట్టానికి 1509 మీటర్ల ఎత్తులో ఉంది. లోయలు, ప్రవాహాలు, రోలింగ్ పొగమంచు పర్వతాలతో నయమనోహరంగా ఉంటుంది. అన్నింటికి మించి ఇక్కడ తేమతో కూడిన మేఘాలు పర్యాటకులను కనువిందుచేస్తాయి. బల్లాలరాయన దుర్గ చేరుకోవడానికి దట్టమైన అడవులు, పచ్చిక భూములు మధ్య ట్రెక్కింగ్ చేయాలి. బల్లాలరాయన దుర్గ ప్రాంతంలో అడుగుపెట్టగానే కొండలు అంచున కిలోమీటర్ల దూరంలో నిర్మించిన కోట గోడలను చూడవచ్చు. కోట బయటిగోడపై నిలబడి సూర్యుడి రంగు రంగుల కాంతులు వీక్షిస్తూ సందడి చేయవచ్చు. బల్లాలరాయనకొండ కోటను హోయ్సళ రాజవంశానికి చెందిన వీరబల్లాల మొదటి భార్య


బందాజే జలపాతం

నిర్మించింది. 12వ శతాబ్దంలో కర్ణాటక ద్రావిడ నిర్మాణశైలిలో నిర్మించారు. చారిత్రాత్మకంగా, సాంస్కృతికంగా ప్రఖ్యాతిగాంచింది. కానీ నేడు కోట శిథిలాలు పగిలిన గోడలు, తోరణాలు, నేలమాళిగ మాత్రమే ఉంది. దుర్గదహళ్లిలోని కోట పాదాల వద్ద ఉన్న కాలబైరవేశ్వరదేవాలయం వద్ద నుంచి ట్రెక్కింగ్ ప్రారంభమవుతుంది. నాలుగుకిలోమీటర్ల మేర ట్రెక్కింగ్‌కు రెండు గంటల సమయంపడుతుంది. పచ్చని గడ్డితో కూడిన పచ్చిక బయళ్లలో అటవీ మార్గంలో ట్రెక్కింగ్ చేయాలి. రెండు పర్వతాలను దాటిన తర్వాత బల్లాల రాయనదుర్గ చేరుకుంటారు.

పచ్చని లోయ

రాయనదుర్గపైకి ట్రెక్కింగ్ వర్షాకాలం చివరి వరకు వెళ్లవచ్చు. లోయ మొత్తం పచ్చదనంతో కూడుకుని ఉంటుంది. బల్లాలరాయదుర్గ కోట చుట్టూ దట్టమైన అడవులు ఉన్నాయి. అందులో ఎత్తైన చెట్లు, సున్నితమైన, వివిధ రకాల వృక్షాలు ఉన్నాయి. ఈ ప్రాంతం అడవిపువ్వులు శక్తివంతమైన రంగులతో వికసిస్తుంది. వివిధ రకాల పక్షులు, మలబార్ జెయింట్‌స్క్విరెల్, చిరుతలు, ఏనుగులు, దుప్పులు, జింకలు దర్శనమిస్తాయి. చిక్‌మగళూరు సూర్యాస్తమయం బల్లాలరాయనదుర్గ నుంచి అద్భుతంగా ఉంటుంది. పర్యాటకులు, ట్రెక్కర్ల కు సరికొత్త అనుభూతి కలిగిస్తుంది. బెంగళూరు నుంచి హొరనాడు లేదా మూడిగెరెకు బస్సులో వెళ్లవచ్చు. అక్కడ నుంచి బస్సులు, జీపుల్లో 30 కిలోమీటర్ల దూరంలోని సుంకసల చేరుకోవాలి. బల్లాలరాయన దుర్గ ట్రెక్ ప్రారంభ ప్రాంతం నుంచి దుర్గదహళ్లికి ఆటోరిక్షాలో చేరుకోవాలి.


దట్టమైన అడవిలో ట్రెక్కింగ్


వర్ణరంజితంగా సూర్యాస్తమయం


దట్టమైన అడవిలోని కొలను వద్ద సేదదీరిన ట్రెక్కర్లు

ప్రమాదకర వృక్షాలకు ట్రిమ్మింగ్

శివాజీనగర: గాలివానలకు చెట్లు, కొమ్మలు విరిగిపడి ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుండటంతో ప్రమాదకరమైన చెట్లను గుర్తించి ట్రిమ్మింగ్ చేయాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర బి.ఖండ్రె అటవీ అధికారులకు సూచించారు. బెంగళూరులోని కంటోన్మెంట్ వద్ద శుక్రవారం రోడ్డు పక్కన చెట్టు చుట్టూ వేసిన కాంక్రీట్ తొలగింటం ద్వారా వృక్షాల సంరక్షణా కార్యాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చెట్టు కొమ్మలు విరిగిపడి గాయపడిన 29 సంవత్సరాల అక్షయ్ మృతి చెందటం బాధాకరమన్నారు. చెట్ల చుట్టూ కాంక్రీట్ వేస్తుండటంతో వాటికి సరిగా నీరు అందడం లేదని, వేళ్లు భూమిలోకి వెళ్లడం లేదన్నారు. దీంతో గాలివానకు కూలిపోతున్నాయన్నారు. రోడ్డు పక్కన మొక్కలు నాటే సమయంలో మీటర్ చుట్టూ మట్టి ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థలు, రహదారి ప్రాధికార, ఉద్యానవన శాఖ, అటవీ శాఖ ఆధ్వర్యంలో నాటిన మొక్కల చుట్టూ కాంక్రీట్ ఉంటే తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వృక్ష ప్రాధికార (ట్రీ అథారిటీ) సభలను క్రమం తప్పకుండా జరుపాలని, ప్రమాదకర చెట్లను గుర్తించి వాటి కొమ్మలు తొలగించేందుకు త్వరగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. బెంగళూరు నగర జిల్లాలో 2041 ఎకరాల అటవీ భూమి అక్రమణకు గురైందన్నారు. రెండేళ్లలో సుమారు రూ.4వేల కోట్ల విలువైన 128 ఎకరాల అటవీ భూమిని కబ్జాదారులనుంచి రక్షించినట్లు తెలిపారు.

కుప్పలు తెప్పలుగా నకిలీ దరఖాస్తులు

బనశంకరి: నగరంలో చెట్టుకొమ్మ పడి అక్షయ్ అనే యువకుడు మృతి చెందగా బాధితుడి కుటుంబానికి బీబీఎంపీ రూ.5 లక్షలు పరిహారం ప్రకటించింది. ఈక్రమంలో పాలికెకు నకిలీ దరఖాస్తులు వెల్లువెత్తాయి. రోడ్డుపక్కన చెట్టు విరిగి పడి మృతి చెందినా, గాయపడినా పాలికె పరిహారం అందిస్తుందని సమాచారం తెలియగానే ఇతర ఘటనల్లో గాయపడిన వ్యక్తులు కూడా తమపై చెట్టుకొమ్మ విరిగిపడిందని, పరిహారం ఇవ్వాలని దరఖాస్తు చేస్తున్నారు. వారంరోజులుగా పరిహారం కోసం వందలాది దరఖాస్తులు అందాయి. ఇలాంటి నకిలీ దరఖాస్తుల హవాను తగ్గించడానికి బీబీఎంపీ కొత్తప్లాన్ చేసింది. ఇకపై చెట్టుకొమ్మవిరిగిపడి మృతిచెందితే అలాంటి వారికి ఇన్సూరెన్స్ చేయాలని బీబీఎంపీ తీర్మానించింది. ఇన్సూరెన్స్ కంపెనీకి శాశ్వత మొత్తం చెల్లించి భవిష్యత్‌లో చెట్టువిరిగిపడి మృతిచెందినవారికి బీమా సంస్థ పరిహారం అందించాలని కీలక నిర్ణయం తీసుకుంది. బెంగళూరు నగరంలో చెట్ల లెక్కింపు ప్రారంభమైంది. ఇప్పటివరకు 7 లక్షల చెట్ల గణన పూర్తికాగా ఆయుష్షు తీరిన చెట్లు 5శాతం వరకు ఉన్నాయని తేలింది. 70–80 ఏళ్ల వయసున్న 35 వేల చెట్లను తొలగించడానికి పాలికె సన్నాహాలు చేస్తోంది.

పేదల సమస్యలు పట్టని ప్రభుత్వాలు

బాగేపల్లి: రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపిస్తూ శుక్రవారం బాగేపల్లిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. తాలూకా కార్యదర్శి ఎం.ఎస్ రఘురాంరెడ్డి మాట్లాడుతూ 20, 30 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిని పేదలు సాగు చేసుకుంటున్నా ఇప్పటికీ హక్కు పత్రాలు ఇవ్వలేదన్నారు. వెంటనే హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.


ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

బొమ్మనహళ్లి: ప్రధాని మోదీ మూడో పర్యాయం బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా బొమ్మనహళ్లి నియోజకవర్గంలోని పుట్టెనహళ్లిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మొక్కలునాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. బొమ్మనహళ్లి బీజేపీ అధ్యక్షుడు శివాజీ, బీబీఎంపీ కార్పొరేటర్ జల్లీ రమేష్ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి

రాష్ట్రంలో అన్ని చోట్ల అవినీతి

- పలు శాఖల్లో కమీషన్ల దందా
- ఆరోపించిన కేంద్రమంత్రి కుమారస్వామి

దొడ్డబళ్లాపురం: రాష్ట్రలో అవినీతి సర్వాంతరామి అయ్యిందని, అక్రమాలు, కమీషన్ దందాలు పెరిగాయని కేంద్రమంత్రి కుమారస్వామి మండిపడ్డారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వంలో ఏం జరుగుతోందో సీఎం సలహాదారుడు బీఆర్ పాటిల్ కళ్లకు కట్టినట్టు చెప్పారన్నారు. వసతి శాఖలో అవినీతి ఏ స్థాయిలో ఉందో వైరల్‌గా మారిన ఆడియో ద్వారా తెలుస్తోందన్నారు. అవినీతి విషయంలో మంత్రి క్రిష్ణ భైరేగౌడ ఏం మాట్లాడారో తాను విన్నానన్నారు. కేతగానహళ్లి భూములకు సంబంధించి తాను న్యాయ పోరాటం చేస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తనను కావాలనే ఈ విషయంలో వేధిస్తోందన్నారు. అక్కడ తాను 40 ఏళ్ల క్రితం కొనుగోలు భూమిని కొన్నానన్నారు. డీసీఎం డీకే శివకుమార్ తనకు దుస్తులు కుట్టిస్తానన్న వ్యాఖ్యలపై స్పందిస్తూ 2028లో జేడీఎస్-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తానే డీకే శివకుమార్‌కు దుస్తులు కుట్టిస్తానన్నారు. డీకే సురేశ్‌ను బమూల్ అధ్యక్షుడిగా ఎన్నిక చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ అధికారం ఉంది కాబట్టి ఏమైనా చేస్తారని, సందర్భం వచ్చినప్పుడు తాను ఈ విషయంలో సమాధానం ఇస్తానన్నారు.

భక్తి పారవశ్యం.. లలిత సహస్ర నామం


లలిత సహస్ర నామ పూజలో మహిళలను ఆశీర్వదిస్తున్న శ్రీసుబుదేంద్ర తీర్థ స్వామీజీ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరవింద కుమార్, ఎమ్మెల్యే సీకే.రామమూర్తి తదితరులు

బనశంకరి: జయనగర చంద్రగుప్త మౌర్య(శాలిని) క్రీడామైదానంలో శుక్రవారం రక్షా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లోకకళ్యాణార్థం శ్రీలలిత సహస్ర నామ పూజ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రక్షా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 13వ ఏడాది 5 వేల మంది ముత్తైదువులతో శ్రీ లలిత సహస్ర నామ పూజ కార్యక్రమాన్ని మంత్రాలయ మఠం సుబుదేంద్ర తీర్థ స్వామీజీ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరవింద కుమార్, జయనగర ఎమ్మెల్యే సీకే.రామమూర్తి, మాజీ బీబీఎంపీ సభ్యురాలు నాగరత్న రామమూర్తి ప్రారంభించారు. సుబుదేంద్రతీర్థ స్వామీజీ మాట్లాడుతూ బెంగళూరులోని జయనగరలో ప్రతి ఏడాది శ్రీలలిత సహస్ర నామ పూజను విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. తల్లి ఆశీర్వాదం కరుణ, కృపాకటాక్షాలు అందరికీ దక్కాలన్నారు. భారతీయ సనాతన సంస్కృతి అత్యంత శ్రేష్టమైన సంస్కృతి అన్నారు. మన ధర్మంలో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. సనాతన హిందూ పరంపరలో మహిళలకు దేవస్థానాల్లో ప్రవేశం, పూజ చేసే హక్కు ఇచ్చిందన్నారు. వేదాల్లో శ్రీలలిత సహస్ర నామం విశేషం, మహిమ, ఉపాసన గురించి తెలిపారన్నారు. లలిత అంటే సరళ, పిల్లలకు తల్లి అనుగ్రహం, ప్రేమ అందించడం సరళం, సమస్త లోకానికి మాతృస్వరూపమైన శ్రీ లలితాదేవి సహస్ర నామంతో సకల ఇబ్బందులు నివారణ అవుతాయన్నారు.

పూజతో బాధలు తొలుగుతాయి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరవింద కుమార్ మాట్లాడుతూ రక్షా ఫౌండేషన్ సమాజసేవ అమోఘమన్నారు. లలిత సహస్ర నామ లలితాంబ పూజ చేయడంతో బాధలు, ఇబ్బందులు తొలుగుతాయని పురాణాల్లో ప్రస్తావించారని తెలిపారు. జయనగర ఎమ్మెల్యే సీకే.రామమూర్తి, నటి మాళవిక అవినాశ్, టీటీడీ సభ్యుడు నరేశ్, మాజీ కార్పొరేటర్లు సోమశేఖర్, మాలతి సోమశేఖర్, ధనరాజ్, గోవింద నాయుడు, చంద్రశేఖర్ రాజు, దీపికా మంజునాథ రెడ్డి, చెన్నగిరియప్ప తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంతోనే అత్యధిక ఉద్యోగాల సృష్టి

- సీఎం సిద్ధరామయ్య

శివాజీనగర: వ్యవసాయ రంగం ద్వారానే అత్యధిక ఉద్యోగాల సృష్టి జరుగుతుందని సీఎం సిద్ధరామయ్య అన్నారు. జీకేవీకే సభా మందిరంలో ఓ ప్రైవేట్ పత్రిక ఏర్పాటు చేసిన సూపర్ స్టార్ రైతు కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ అధికారులు రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించి ఉత్తమ దిగుబడులు సాధించేందుకు సహకారం అందించాలన్నారు. ల్యాబ్ టీ ల్యాండ్, ల్యాండ్ టు ల్యాబ్ వైపు వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సామాజిక న్యాయం, వర్గ రహిత సమాజం కావాలంటే రైతులకు ఆర్థికంగా శక్తి లభించాలన్నారు. సామాజిక మార్పు దిశలో తాము గ్యారెంటీలను అమలు చేస్తుండగా రాష్ట్రం దివాళా తీసిందని ప్రధాని మోదీ అసత్యాలు పలికారన్నారు. వ్యవసాయ పంప్‌సెట్‌లకు ప్రభుత్వం రూ.19వేల కోట్ల సబ్సిడీ ఇస్తోందన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.26 వేల కోట్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని, రైతుల కష్టనష్టాలు తనకు తెలుసన్నారు. రైతుల సంక్షేమం కోసం సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. అనంతరం సూపర్ స్టార్ రైతు పురస్కారానికి ఎంపికైన రైతులను అభినందించారు.

ఆదిచుంచనగిరి మఠం సేవలు ప్రశంసనీయం

దొడ్డబళ్లాపురం: ఆదిచుంచనగిరి మఠం సేవలు ప్రశంసనీయమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కొనియాడారు. బెంగళూరు ఉత్తర తాలూకా నగరూరులోని బీజీఎస్ ఎంసీఎచ్ ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆదిచుంచనగిరి యూనివర్సిటీ బీజీఎస్ మెడికల్ కాలేజు, ఆస్పత్రిని శుక్రవారం ఆయన ఉద్ఘాటించి మాట్లాడారు. మఠం నుంచి ఎంతోమంది విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించారన్నారు. తాజాగా వెయ్యి పడకల ఆస్పత్రి ప్రారంభించి పేదలకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు. కేంద్రంలోని తమ ప్రభుత్వం మెడికల్ కాలేజీల స్థాపనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కేంద్ర మంత్రులైన హెచ్.డీ.కుమారస్వామి, వీ.సోమణ్ణ, ఆదిచుంచనగిరి మఠం పీఠాధ్యక్షుడు డాక్టర్ నిర్మలానందనాథ స్వామి, మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్, ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్, ఎమ్మెల్యే ఎస్.ఆర్.విశ్వనాథ్, ఎంపీ డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

నామఫలకం ఆవిష్కరణ


ప్రారంభిస్తున్న మంత్రి రామలింగారెడ్డి

బొమ్మనహళ్లి: బొమ్మనహళ్లి నియోజకవర్గం అరికెరె వార్డు హుళిమావులో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన నమ్మ హుళిమావు అనే కన్నడ డిజిటల్ నేమ్ బోర్డును శుక్రవారం రాష్ట్ర రవాణ శాఖ మంత్రి రామలింగారెడ్డి ప్రారంభించారు. బొమ్మనహళ్లి బ్లాక్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన టి.మధును మంత్రి సన్మానించారు. లోకేష్‌రెడ్డి, అనిల్ కుమార్, నారాయణ స్వామి, ఆనంద్, సతీష్, సునీల్ కుమార్, మంజు, కుమార్, మను పాల్గొన్నారు.

హోంస్టేలో జూదం

దొడ్డబళ్లాపురం: చిక్కమగళూరు తాలూకా మల్లందూరులోని ఒక హోంస్టేలో ఇస్పేట్ జూదం ఆడుతుండగా మల్లందూరు పోలీసులు దాడి చేశారు. ఐదుమంది జూదరులను అరెస్ట్ చేశారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

బనశంకరి: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ఘటన కృష్ణరాజపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. నేపాల్‌కు చెందిన ఒక కుటుంబం స్వాతంత్యనగరలో నివాసం ఉంటుంది. ఈ కుటుంబంలోని బాలుడు అనంత్(10) ఈనెల 15 తేదీన ఆడుకుంటూ చీపురుకట్టను హైటెన్షన్ వైర్‌పైకి విసిరి వేయడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. బాలుడిని విక్టోరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కృష్ణరాజపురం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరి ప్రాణం తీసిన మద్యం మత్తు

యశవంతపుర: అతి వేగం, మద్యం మత్తు వెరసి ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన మంగళూరులో జరిగింది. ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఓంశ్రీ పూజారి, కద్రికి చెందిన అమన్ రావ్‌లు మరో ఐదు మందితో కలిసి ఈనెల 17న అర్ధరాత్రి వరకు మద్యం తాగారు. అనంతరం కారులో తలపాడి నుంచి మంగళూరు వైపు బయల్దేరారు. మార్గం మధ్యలో కారు ప్రమాదానికి గురైంది. ఓంశ్రీ పూజారి, అమన్‌రావ్, వంశీ, ఆశిక్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలించగా అమన్‌రావ్, ఓంశ్రీ పూజారి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారని మంగళూరు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఇటలీకి చెందిన జెర్సీ అనే వ్యక్తి ప్రమాదం నుంచి బయట పడ్డాడని తెలిపారు.

బాలిక మృతి

యశవంతపుర: శరీరంపై సాంబారు పడి గాయపడిన బాలిక పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన హావేరి జిల్లా శిగ్గాంవి తాలూకా రామపురలో జరిగింది. గ్రామానికి చెందిన రుక్సానా బాను తన తల్లిదండ్రులతో కలిసి రెండు రోజుల క్రితం బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లింది. వంటలు చేస్తుండగా వేడివేడి సాంబారు శరీరంపై పడింది. బాలికను హుబ్లీ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కోలుకున్న అనంతరం డిశ్చార్జ్ చేశారు. ఇంటిలో ఉన్న బాలిక కాలిన భాగాలపై గుల్లలు రావటంతో మళ్లీ ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గం మధ్యంలో రుక్సానా మృతి చెందింది.

22న బయప్పనహళ్లి మెట్రో మార్గంలో అంతరాయం



బనశంకరి: బెంగళూరు ఎంజీ.రోడ్డు నుంచి బయప్పనహళ్లి మధ్య ఈనెల 22న నమ్మమెట్రోసేవలకు అంతరాయం కలగనుంది. ఆరోజు ఉదయం 7 నుంచి 9 గంటలవరకు మెట్రో సంచారం ఉండదు. అయితే బయప్పనహళ్లి నుంచి కాడుగోడికి మెట్రో సేవలు అందుబాటులో ఉంటాయని బీఎంఆర్‌సీఎల్ తెలిపింది. చల్లఘట్ట నుంచి ఎంజీ.రోడ్డు వరకు యథాప్రకారం మెట్రోసేవలు ఉంటాయన్నారు. ఎంజీ.రోడ్డు నుంచి బయప్పనహళ్లి మధ్య మాత్రమే మెట్రో సంచారం ఉండదని, హసిరుమార్గంలో యథాప్రకారం మెట్రో సేవలు ఉంటాయని బీఎంఆర్‌సీఎల్ ప్రకటనలో తెలిపింది.

ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య


హతుడు కుపేంద్ర(ఫైల్)

దొడ్డబళ్లాపురం: ప్రియుడితో కలిసి భర్తను ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసిన భార్య ఉదంతం కలబుర్గి జిల్లా చిత్తాపుర తాలూకా భాగోడి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలో తిప్పణ్ణ కుపేంద్ర(30), శాంతమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. శాంతమ్మ మరో వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుంది. తన ఆనందానికి భర్త అడ్డుగా ఉన్నాడని, ఎలాగైనా అతడిని అంతం చేయాలని శాంతమ్మ తన ప్రియుడితో కలిసి పన్నాగం పన్నింది. రాత్రి సమయంలో కుపేంద్ర నిద్రిస్తుండగా ఇద్దరూ కలిసిముఖంపై తలదిండుతో అదిమిపెట్టారు. కుపేంద్ర అరుపులు విన్న స్థానికులు తలుపులు తట్టినా తెరవకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. శాంతమ్మ ప్రియుడు కిటికీలోంచి దూకి పరారయ్యాడు. పోలీసులు పరిశీలించగా కుపేంద్ర విగతజీవిగా కనిపించాడు. దీంతో శాంతమ్మను అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మైసూరు : మైసూరులోని బన్ని మంటపం గూడ్సు టర్మినల్ సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారంతో మండి మొహల్లా పోలీసులు శుక్రవారం దాడి చేశారు. అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ తంజీమ్ అనే విక్రేతను అరెస్ట్ చేసి 611 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

యోగాంధ్రలో గిరిజన విద్యార్థుల ఆకలి కేకలు

- ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో 25 వేల మంది విద్యార్థులతో యోగాసనాలు
- శుక్రవారం రాత్రి అరకొర భోజనాలు అందజేత
- ఆకలితో అలమటించిన విద్యార్థులు
- లంబసింగి నుంచి వచ్చిన చిన్నారులకు వసతి లేక ఇబ్బందులు
- ఏయూ మైదానం, బస్సుల్లోనే నిద్ర
- పట్టించుకోని కూటమి ప్రజాప్రతినిధులు



యోగాంధ్ర కార్యక్రమానికి వచ్చిన విద్యార్థులకు సరైన వసతులు కల్పించకపోవడంతో బస్సులోనే కునికిపాట్లు పడుతున్న దృశ్యం

విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వం విశాఖలో అట్టహాసంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో గిరిజన విద్యార్థులు నిద్రాహారాలకు అలమటించారు. శుక్రవారం రాత్రి భోజనాలు సరిపోక.. ఆకలి కేకలతో హాహాకారాలు చేశారు. వసతి ఏర్పాట్లు లేకపోవడంతో మైదానం, బస్సుల్లో నిద్రపోయారు. ప్రభుత్వం గిన్నిస్ రికార్డుపై పెట్టిన శ్రద్ధ.. చిన్నారులకు భోజనం, వసతి ఏర్పాట్లపై పెట్టలేదు. దీంతో యోగాసనాలు చేయడానికి అల్లూరి జిల్లా నుంచి వచ్చిన గిరిజన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

భోజనాల కోసం గలాటా..

యోగాంధ్ర వేడుకల్లో భాగంగా అల్లూరి జిల్లా నుంచి 25 వేల మంది విద్యార్థులను ప్రభుత్వం విశాఖకు తరలించింది. శుక్రవారం తెల్లవారుజామునే అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో చిన్నారులను ఎక్కించి మధ్యాహ్నం 12 గంటలకు ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌కు తీసుకొచ్చారు. వారికి అక్కడ సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం ఏయూలోని రోడ్డు మీదే భోజనాలు పెట్టారు. ప్లేటు తీసుకోవడం నుంచి తిన్నాక చేతులు కడుక్కోవడం వరకు క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. తాగునీటి కోసం ఎండలో లైన్లలో వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమవ్వాల్సిన యోగాసనాల కార్యక్రమం ఆలస్యమైంది. సాయంత్రం 4.45కు విద్యార్థులతో 108 నిమిషాల పాటు 108 సూర్య నమస్కారాలు చేయించారు.

రాత్రి భోజనాలకూ అవే తిప్పలు..

బస్సుల్లో నిద్రపోయిన విద్యార్థులను పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. రాత్రి 8 గంటల వరకు పిల్లలు గ్రౌండ్‌లోనే ఉండిపోయారు. అనంతరం అక్కడకు భోజనాలు తీసుకురాగా, అవి సరిపోలేదు. సగం మందికి భోజనాలు అందలేదు. దీంతో 30 నిమిషాల పాటు భోజనాల కోసం విద్యార్థులు ఎగబడ్డారు. ఈ సమయంలో గలాటా జరిగింది. కొంత సేపటికి మళ్లీ భోజనాలు తీసుకొచ్చి వారికి అందించారు. అనంతరం వారిలో కొంత మందిని విశాఖ వ్యాలీ, పెందుర్తి ప్రాంతంలోని కళ్యాణ మండపానికి తరలించారు. లంబసింగితో పాటు మరికొన్ని ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పించలేదు. దీంతో వందల మంది విద్యార్థులు గ్రౌండ్‌లో, బస్సుల్లోనే నిద్రపోవాల్సి వచ్చింది. వీరందరినీ శనివారం వేకువజాము 4 గంటలకే సిద్ధంగా ఉండాలని అధికారులు ఆదేశించడం గమనార్హం.

ప్రజాప్రతినిధులు, అధికారుల సేవల్లో జిల్లా యంత్రాంగం..

యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు విశాఖకు వచ్చారు. అన్ని శాఖల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల నుంచి ముఖ్య కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు 3రోజులు ముందుగానే నగరానికి చేరుకున్నారు. దీంతో జిల్లా అధికారులందరూ వారి సేవలోనే తరిస్తున్నారు. యోగాంధ్ర ఏర్పాట్లు, తరలించిన విద్యార్థుల పరిస్థితులను పట్టించుకునే దిక్కు లేదు. ఇదిలా ఉంటే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం శనివారం ఉదయం 6.30 గంటల నుంచి 7.50 వరకు జరగనుంది. ప్రధాని పాల్గొనే కార్యక్రమానికి కేవలం గంటలకు ముందు సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, వలంటీర్లకు శిక్షణ ఇవ్వడం గమనార్హం. యోగాంధ్ర కార్యక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్యూఆర్ కోడ్ స్కానింగ్, ఇతర విషయాలను వివరించేందుకు 2 వేల మందికి శుక్రవారం రాత్రి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు, మూడు రోజులకు ముందే శిక్షణ ఇవ్వాల్సి ఉండగా.. అధికారులందరూ కార్యదర్శులు, ప్రజాప్రతినిధుల సేవలో తరించడంతో ఈ కార్యక్రమంలో జాప్యం జరిగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

యోగాంధ్రకు వచ్చిన విద్యార్థుల అవస్థల వీడియో కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి



ఆకలికి తట్టుకోలేక ఆహారం కోసం ఎగబడుతున్న విద్యార్థులు

చంద్రబాబు సమర్పించు.. ‘రప్పా రప్పా’ డైవర్షన్

వైఎస్ జగన్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తప్పుడు ప్రచారం

2 గంటల ప్రెస్‌మీట్‌లో అనేక విషయాలను ప్రస్తావిస్తే ఒక్కదానిపైనా మాట్లాడని చంద్రబాబు

- సూపర్ సిక్స్ అమల్లో వైఫల్యం, రూ.1.60 లక్షల కోట్ల రుణ భారం,
- రెడ్ బుక్ భయాందోళనలు... దేనిపైనా సమాధానం చెప్పలేని పరిస్థితి
- స్పందించే దమ్ము, ధైర్యం లేక ‘రప్పా రప్పా’ డైలాగు పేరుతో టాపిక్ డైవర్షన్
- బాబు పాలనలో మోసపోయానని వైఎస్సార్‌సీపీ ర్యాలీలోకి వచ్చి ప్లకార్డు ప్రదర్శించిన టీడీపీ కార్యకర్త
- ఆ ప్లకార్డులో ఉన్న విషయాన్ని విలేకరులు చెబితే దానిపై స్పందించిన జగన్
- దాన్ని జగనే అన్నట్లు చిత్రీకరిస్తూ రంగంలోకి టీడీపీ నేతలు, ఎల్లో మీడియా
- ఆ పార్టీ కార్యకర్తే రప్పా రప్పా నరికేస్తానంటే సిగ్గుపడాల్సింది చంద్రబాబే
- కొద్దిరోజుల ముందే జగన్‌ను భూస్థాపితం చేస్తానన్న సీఎం చంద్రబాబు
- మాజీ సీఎం గురించి 70 ఏళ్లున్న సీఎం ఆ మాట అనడం అంటే అర్థం ఏమిటి?
- గతంలో పవన్ కళ్యాణ్, అనిత అన్న మాటల పరిస్థితి ఏమిటి?
- వారన్న మాటలకు ఏ శిక్షలు పడాలి?
- ఓడిపోయాడు..కానీ చావలేదు అంటూ అయ్యన్నపాత్రుని ప్రేలాపనలు
- జగన్ తల నరకాలని, ఆయనకు జీవించే హక్కే లేదని బుచ్చయ్యచౌదరి శివాలు
- ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతతో ఫేక్ ప్రచారాలు, వక్రీకరణలు



సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ రెండు గంటల తన సుదీర్ఘ మీడియా సమావేశంలో సంధించిన ప్రశ్నల్లో ఏ ఒక్క దానికి సమాధానం చెప్పే ధైర్యం లేని చంద్రబాబు తనకు అలవాటైన రీతిలో డైవర్షన్ రాజకీయానికి తెరలేపారు. రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో ప్రతి వ్యక్తి చంద్రబాబు చేతిలో మోసపోయారని జననేత వైఎస్ జగన్ చెబుతూ శాంతిభద్రతల వైఫల్యం, ఏడాదిలోనే రాష్ట్రం అప్పులపాలైన పరిస్థితి, సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడం, తాను అమలు చేసిన పథకాలను కూడా నిలిపివేయడం, ఇసుక మాఫియా, అవినీతి, మద్యం ... వంటి అనేక అంశాలపై సూటిగా ప్రశ్నలు సంధించారు. దానికి కౌంటర్‌గా చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించినా.. జగన్ అడిగిన ఒక్క ప్రశ్నకూ సమాధానం చెప్పే దమ్ము, ధైర్యం ఆయనలో కనిపించలేదు. అందుకే ఎప్పుడూ చేసే మాదిరిగానే టాపిక్ డైవర్షన్ గేమ్ మొదలుపెట్టారు. నిజానికి గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఒక విలేకరి.. టీడీపీ కార్యకర్త ‘రప్పా రప్పా’ డైలాగు రాసి ప్లకార్డు పట్టుకున్న విషయాన్ని ప్రస్తావించగా.. జగన్ దానిపై స్పందిస్తూ అసలు ఆ ప్లకార్డులో ఏం రాసి ఉందో తనను ప్రశ్నించిన విలేకరులనే అడిగారు. ‘అది సినిమా డైలాగ్ కదా?’ అని మాట్లాడితే జగనే ‘రప్పా రప్పా నరికేస్తా’ అన్నట్లు ప్రచారం మొదలుపెట్టారు. దీనిపై ఐ–టీడీపీ ఒక ఫేక్ వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేసింది. జగన్ ప్రశ్నించిన అంశాల్లో ఒక్క దానిపైనా మాట్లాడని చంద్రబాబు రప్పా రప్పా డైలాగు గురించే మాట్లాడి టాపిక్ డైవర్షన్ మొదలుపెట్టడం గమనార్హం.

దేశం కార్యకర్త నుంచే వ్యతిరేకత

వాస్తవానికి జగన్ పల్నాడు జిల్లా పర్యటనలో టీడీపీ కార్యకర్త రవితేజ ‘రప్పా రప్పా’ అనే పుష్ప సినిమా డైలాగు రాసిన ఒక ప్లకార్డును పట్టుకున్నాడు. చంద్రబాబు పాలనలో మోసపోయానని కడుపుమండి ఒక టీడీపీ కార్యకర్త వైఎస్సార్‌సీపీ ర్యాలీలోకి వచ్చి అలా ప్లకార్డు పట్టుకున్నాడంటే చంద్రబాబు సిగ్గుపడాలి. కానీ వక్రీకరణలో ఆరితేరిన చంద్రబాబు ఆ విషయాన్ని నిస్సిగ్గుగా వక్రీకరించేశారు. ఆ వాదనకు మద్దతుగా ఎల్లో మీడియా, ఆయన సోషల్ మీడియా, పవన్ కళ్యాణ్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, పయ్యావుల కేశవ్ వంటి కొన్ని పాత్రలను రంగంలోకి దింపారు. ఏడాదిలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేక, జగన్ అడిగిన వాటికి సమాధానం చెప్పలేక ఇలాంటి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నట్లు అర్థమవుతోంది.

వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు ఫేక్ ప్రచారాలు

చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్‌లు, 143 హామీల అమలు వైఫల్యం గురించి, ఏడాదిలోనే రూ.1.60 లక్షల కోట్లకు దాటిపోయిన అప్పుల గురించి, రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై పెడుతున్న తప్పుడు కేసులు.. చేస్తున్న దాడులు, దౌర్జన్యాల గురించి.. అనేక ప్రజా సమస్యల గురించి వైఎస్ జగన్ ప్రశ్నిస్తే వాటిపై స్పందించకుండా కేవలం ఆయన అనని మాటలను వక్రీకరిస్తూ విష ప్రచారానికి దిగడాన్ని బట్టి వారికి చెప్పుకోవడానికి ఏమీ లేదని స్పష్టమైంది. అమరావతి పేరుతో అవినీతి, ఇసుక, మద్యం దోపిడీ, ఎమ్మెల్యేల అవినీతితోపాటు మొత్తంగా చంద్రబాబు పాలనపై ఏడాదిలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్లు తాజా ఘటనలతో స్పష్టమవుతోంది. మరోవైపు జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు తరలివస్తున్న జనాన్ని చూసి కళ్లల్లో విషం నింపుకున్న కూటమి నేతలు తమకు అలవాటైన రీతిలో డైవర్షన్ రాజకీయానికి మరింత పదునుపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. కానీ తమకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని రాష్ట్రంలోని ప్రతి ఇంట్లోనూ, ప్రతి వ్యక్తి చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించే పరిస్థితి వస్తుందని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

జగన్‌ను భూస్థాపితం చేస్తానని ఇటీవలే నోరుపారేసుకున్న చంద్రబాబు

‘డైలాగులు సినిమాలకే సరిపోతాయంటూ’ చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారం పవన్ కళ్యాణ్ షూటింగ్‌ల బిజీలోనూ స్పందించారు. వాస్తవానికి ఎన్నికలకు ముందు ‘కొడకల్లారా.. తోలు తీస్తాం.. తొక్క తీస్తాం’ అంటూ వైఎస్సార్‌సీపీ నేతలపై ఇష్టం వచ్చినట్లు నోరుపారేసుకుంటూ పూనకం వచ్చినట్లు మాట్లాడింది ఆయనే. అంతెందుకు ఇటీవలే ఎంపిక చేసిన మీడియా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు.. జగన్‌ను భూస్థాపితం చేస్తానని అన్నారు. సీఎం స్థాయిలో 70 ఏళ్ల వయసులో ఉన్న వ్యక్తి.. ఒక మాజీ సీఎంను, ప్రతిపక్ష నేతను ఆ మాట అనడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? దీన్ని చంద్రబాబు ఎలా సమర్థించుకుంటారు? ఎన్నికలకు ముందు అంగళ్ల సభలో చంద్రబాబు స్వయంగా అల్లర్లు సృష్టించి పోలీసులపై దాడులు చేయించారు. ఈ దాడిలో రణధీర్ అనే కానిస్టేబుల్‌పై దాడి చేసి కన్ను పోగొట్టారు. జగన్‌ను గాజుగ్లాసుతో పొడవండి.. రాళ్లతో కొట్టండి.. సీసం పోసి చంపండి అని రెచ్చిపోయి మాట్లాడింది చంద్రబాబే. ఇప్పుడు హోం మంత్రిగా ఉన్న అనిత అప్పట్లో జగన్‌పై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం స్పీకర్‌గా ఉన్న అయ్యన్నపాత్రుడు జగన్‌ను భౌతికంగా లేకుండా చేయాలని అన్న వీడియో బయటకు వచ్చింది. అంత బరితెగించి మాట్లాడిన వారికి ఏం శిక్ష పడాలి? ఇప్పుడు కూడా డైవర్షన్ రాజకీయాలు చేస్తూ, అందులో భాగంగా జగన్ తల నరికేయవచ్చు కదా? అసలు ఆయనకు జీవించే హక్కు ఉందా? అని టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరితో చంద్రబాబు తన కడుపులోని విషాన్నంతా కక్కించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అన్యాయాలు, నిర్బంధాలు, నోరెత్తితే అక్రమ కేసులు పెట్టి జైళ్ల పాలు చేస్తున్న వైనంపై జగన్ మాట్లాడితే బుచ్చయ్యచౌదరి దాన్ని వక్రీకరించి నక్సలైట్లను తయారు చేస్తావా? అంటూ తన నోటికి అడ్డూఅదుపూ లేదని నిరూపించారు.

నీ తల నరికేస్తాం.. ఖబడ్దార్ జగన్..

- టీడీపీ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి



సాక్షి, అమరావతి: రాజమహేంద్రవరం రూరల్ టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేశారు. ‘నీ తల నరకొచ్చు కదా.. నీకు జీవించే హక్కు ఉందా?’ అంటూ అడ్డగోలు మాటలతో రెచ్చిపోయారు. శుక్రవారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం వైఎస్ జగన్ ప్రెస్‌మీట్‌లో ఓ సినిమా డైలాగ్ గురించి ప్రస్తావన రాగా... సీఎం చంద్రబాబు, టీడీపీ నాయకులు దానిని పూర్తిగా వక్రీకరించి రాజకీయం చేస్తున్నారు. ఈ క్రమంలోనే బుచ్చయ్య చౌదరి తెరపైకి వచ్చారు. ‘ఖబడ్దార్ జగన్‌రెడ్డి... ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా వ్యవహరిస్తావా? అసెంబ్లీకి రాకుండా, ప్రజా సమస్యలపై మాట్లాడకుండా... కుట్ర రాజకీయాలకు తెరలేపి పర్యటనలు చేస్తున్నావ్. సత్తెనపల్లి పర్యటనకు 100 మందికి పర్మిషన్ ఉంటే వేలమందిని పోగేసి ఏవిధంగా స్లోగన్స్ ఇప్పించావ్. తక్షణమే అధికారం కావాలనే లక్ష్యంతో వ్యవహరిస్తున్నావ్. ఇష్టారాజ్యంగా సాగుతామంటే కుదరదు. మిమ్మల్ని ఎలా కట్టడి చేయాలో మాకు తెలుసు. ఓపిక నశించి మా కార్యకర్తలు తిరగబడితే వైఎస్సార్‌సీపీ నాయకుల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలి’ అని అన్నారు. కాగా, చంద్రబాబు, లోకేశ్‌ను మచ్చిక చేసుకునేందుకు బుచ్చయ్య బరితెగించి దారుణ వ్యాఖ్యలు చేయడంతో టీడీపీ నేతలే ఆశ్చర్యపోతున్నారు.

వైఎస్ జగన్‌కి హాని కలిగించేందుకు కుట్ర

- మాజీ మంత్రి సాకే శైలజానాథ్



సాక్షి,అమరావతి: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి హాని కలిగించాలనే కుట్రతో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మండిపడ్డారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ఏకంగా వైఎస్ జగన్ తల నరుకుతానంటూ టీడీపీ సీనియర్ నాయకుడు బుచ్చయ్య చౌదరి బహిరంగంగా చేసిన వ్యాఖ్యలను చంద్రబాబు సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ పర్యటనలకు ఉద్దేశపూర్వకంగా భద్రత కల్పించకపోవడం, ఏకంగా సీఎం చంద్రబాబు ఆయనను భూస్థాపితం చేస్తానని హెచ్చరించడం, జీవించే హక్కు లేదని తన పార్టీ వారితో బెదిరించడం చూస్తుంటే, పెద్ద కుట్రకే తెగబడుతున్నారనే విషయం అర్థమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ‘‘చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో హింసా ప్రవృత్తి పెరిగిపోయింది. జెడ్ ప్లస్ కేటగిరి సెక్యూరిటీ ఉన్న మాజీ సీఎం పర్యటనల్లో వరుసగా పోలీసుల భద్రతా వైఫల్యం కనిపిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. జగన్ తల నరికితే తప్పేంటని వయసు, అనుభవాన్ని మరిచి టీడీపీ సీనియర్ నేత బుచ్చయ్య చౌదరి సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారు. తానొక సీఎంనని కూడా మరిచిపోయి వైఎస్ జగన్‌ని భూస్థాపితం చేస్తామని చంద్రబాబు అంటున్నారు. ప్రశ్నించే గొంతుక ఉండకూడదు అనేది చంద్రబాబు ఆలోచనగా కనిపిస్తోంది.’’ అని శైలజానాథ్ ధ్వజమెత్తారు.

జగన్‌ను లేకుండా చేయాలని కూటమి కుట్ర

- మాజీ మంత్రి విడదల రజిని



చిలకలూరిపేట: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని లేకుండా చేయాలనే కుట్రకు కూటమి ప్రభుత్వం తెగబడుతోందని మాజీ మంత్రి విడదల రజిని మండిపడ్డారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని తన నివాసంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. జగన్‌కు పెరుగుతున్న ఆదరణ, కూటమి పాలనపై ప్రజల్లో వ్యక్తమవుతున్న ఆగ్రహం చూసి భయంతో రాజకీయంగా ఆయన ఉనికినే లేకుండా చేయాలని కూటమి సర్కారు చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే టీడీపీ సీనియర్ నాయకుడు బుచ్చయ్యచౌదరి ఎటువంటి దారుణమైన వ్యాఖ్యలు చేశారో మొత్తం రాష్ట్ర ప్రజలంతా చూశారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. పల్నాడు జిల్లాలో వైఎస్ జగన్ పర్యటనను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎంత యత్నించినా ప్రజలు మాత్రం ఆయనను అక్కున చేర్చుకున్నారని గుర్తుచేశారు. చంద్రబాబు గతంలో సీఎంగా ఉండి, గోదావరి పుష్కరాల సందర్భంగా తన ప్రచార యావతో 29 మందిని బలి తీసుకున్నది నిజం కాదా అని రజిని ప్రశ్నించారు. ఇరుకు సందుల్లో సభలను పెట్టి, జనాలను ఎక్కువగా చూపాలనే యత్నంలో భాగంగా కందుకూరులో ఎనిమిది మందిని పొట్టనపెట్టుకున్నారని ధ్వజమెత్తారు. గుంటూరులో టీడీపీ తరుపున చీరల పంపిణీ పేరుతో మహిళలకు ఆశచూపి, తొక్కిసలాటకు దారితీసి ముగ్గురు చనిపోయిన విషయం గుర్తులేదా అని చంద్రబాబును నిలదీశారు.


కూటమి సర్కారు తీరుకు నిరసనగా..

ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజీనామా

- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సంచలన ఘటన
- రాష్ట్రంలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని ఆక్షేపణ

ఆత్మకూరు: గత ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం మెరుగైన ఆధునిక పద్ధతుల్లో విద్యార్థులకు బెంచీలు, కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులు, తరగతి గదులను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది పాఠశాలలు పునర్నిర్మించారని.. కానీ, ప్రస్తుత ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించిందంటూ ఓ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. సర్కారు తీరుపట్ల ఆయన నిరసన తెలుపుతూ శుక్రవారం తన ఉద్యోగానికి గుడ్‌బై చెప్పారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం చేజర్ల మండలం కోటితీర్థం గ్రామ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. మధుసూదన్‌రావు ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆగ్రహంతో ఈ రాజీనామా చేశారు. మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) అందుబాటులో లేకపోవడంతో అక్కడి సిబ్బందికి రాజీనామా లేఖ అందజేశారు. రాజీనామా పత్రంలో మధుసూదన్‌రావు ఆవేదన ఆయన మాటల్లోనే..

నేను 29 సంవత్సరాలకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నాను. ప్రస్తుతం కోటితీర్థం ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నా. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమైంది తప్ప విద్యా వ్యవస్థలో ఎలాంటి మార్పులు చేయకపోగా పూర్తిగా భ్రష్టు పట్టించింది. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాను. ఈ అనాలోచిత నిర్ణయాలపై ప్రజలను చైతన్యపరిచేందుకు నిర్ణయించుకుని నా ఉపాధ్యాయ వృత్తి (హెచ్‌ఎం)కి రాజీనామా చేశాను. ఎంఈఓ, డీఈఓల పేరుతో స్వహస్తాలతో రాజీనామా పత్రం రాసి కార్యాలయంలో అందచేశాను. ఈ ప్రభుత్వం ఆచరణ యోగ్యం కాని విధంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఉ.6 గంటలకే యోగా శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యేలా చూడమనడం కష్టంగా ఉంది. దీనికితోడు.. విద్యాశాఖ వింత పోకడలు, యాప్‌ల పేరుతో హాజరు, పాఠశాలకు హాజరయ్యే వేళలు నమోదు చేయడం.. నెట్‌వర్క్ సక్రమంగా లేని సమయంలో ఆలస్యం అవుతుండడంతో పై అధికారులు తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారు. 9.30 గంటలకు హాజరు పూర్తిచేయాల్సి ఉండగా నెట్‌వర్క్ సక్రమంగా లేక 11 గంటలకు పైగా దానితోనే సమయం సరిపోతోంది. ఈ విషయంలో ఉపాధ్యాయులది తప్పులేకున్నా వారిపైనే చర్యలు తీసుకుంటున్నారు.



మధుసూదన్‌రావు రాసిన రాజీనామా లేఖ

ఉపాధ్యాయులతో పనికిమాలిన పనులా?

ఇక ఉ.6 గంటలకు మహిళా టీచర్లు యోగా తరగతులకు ఎలా వస్తారు? ఎలాంటి సౌకర్యాల్లేని పల్లెటూర్లలో నివసించడం కష్టంగా ఉండడంతో మండల, జిల్లా కేంద్రాల్లో ఉంటున్నారు. వీరు తెల్లవారుజామునే ఈ యోగా శిక్షణా తరగతుల కోసం పాఠశాలలకు ఎలా హాజరుకాగలరు? రెండునెలల క్రితం పాఠశాలల్లో బాత్‌రూమ్‌ల ఫొటోలు అడిగిన వెంటనే పంపలేదని పలువురు ఉపాధ్యాయులకు మెమోలు ఇచ్చారు. ఇటీవల జరిగిన టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌ను కూడా భ్రష్టు పట్టించారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. నా 29 ఏళ్ల సర్వీసులో ఇంతటి బానిసత్వం ఎప్పుడూ చూడలేదు. పిల్లల చదువులు గాలికొదిలేసేలా యాప్‌లు, ఫొటోలు పంపమంటూ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం మంచిది కాదు. ఉపాధ్యాయుడిగా చదువులు చెప్పగలంగానీ, ఇలా ఇతర పనికిమాలిన పనులు ఉపాధ్యాయులతో చేయించడం మంచిది కాదన్న ఆవేదనతో రాజీనామా చేశాను. ఈ విషయమై మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరావును సంప్రదించగా.. హెచ్‌ఎం రాజీనామా విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారికి తెలియజేశానని పేర్కొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నేతలెవరినీ నామినేషన్ వేయకుండా చేస్తా

- టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు రెచ్చిపోతున్నారు. ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. ఇదే వరుసలో ఇప్పుడు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కూడా చేరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణుల సమాయత్తం కోసం గురువారం గుంతకల్లులో, శుక్రవారం గుత్తిలో నిర్వహించిన సమావేశాల్లో గుమ్మనూరు జయరాం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులెవరూ నామినేషన్లు కూడా వేయకుండా చేస్తానని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోపు వైఎస్సార్‌సీపీ వారు టీడీపీలో చేరితే సరి.. లేదంటే తోకలు కత్తిరించి సున్నం అంటిస్తానని బెదిరించారు. నారా లోకేష్ రెడ్ బుక్ క్లోజ్ చేసినా.. తాను మాత్రం ఓపెన్ చేసే ఉంచుతానని, స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాక అందరి అంతూ చూస్తానని బెదిరించారు. ఇది ఊరకనే చెప్పడం లేదని, చెప్పానంటే చేసి చూపిస్తానని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాతోపాటు వివిధ చానళ్లలో వైరల్ అయ్యాయి.

నాదమే జీవనం

నేడు వరల్డ్ మ్యూజిక్ డే

కోయిల ఊరికే ఉండదు... పాడుతుంది.
గాలి కూడా కామ్‌గా కూర్చోదు... సవ్వడి చేస్తుంది.
వినాలే గానీ... కిటికీ పరదా చప్పుడు కూడా సంగీతమే!
ఆనందమో, చిరు సంతోషమో కలిగినప్పుడు...
ప్రతి గొంతూ కూని రాగం తీస్తుంది. సంగీతం లేకపోతే... ఈ జగతి ఉత్త శూన్యం.
సప్త స్వరాలే... ఉచ్ఛ్వాస నిశ్వాసలు. 'వరల్డ్ మ్యూజిక్ దే' సందర్భంగా
ఒక పాటకో, ఒక గళానికో, ఒక స్వరానికో కృతజ్ఞత చెప్పకోకపోతే ఎలా..?
నాదమే జీవనంగా బతుకుతున్న నలుగుర్ని కలవకపోతే ఎలా..!

ఊపిరి ఉన్నంతవరకూ పాటే నా ప్రపంచం

- సంగీతదర్శకురాలు శ్రీలేఖ



● మ్యూజిక్ డైరెక్టర్‌గా ప్రతి క్షణం, ప్రతి నిమిషం, ప్రతి రోజూ సంగీతాన్ని ఆస్వాదిస్తాను... ఆనందిస్తాను. ఊపిరి ఉన్నంతవరకు పాటలతో సెలబ్రేట్ చేసుకుంటాను. పాటే నా ప్రపంచం. సంగీతం తప్ప నాకు వేరే ప్రపంచం తెలియదు. సంగీతాన్ని రోజూ ఇష్టపడుతున్నప్పటికీ 'వరల్డ్ మ్యూజిక్ డే' సందర్భంగా నాకు నచ్చిన పాటలను మరింత ఎక్కువగా వింటాను. నేను కంపోజ్ చేసిన పాటలను నెమరు వేసుకుంటాను... ఇలా చేసి ఉంటే బాగుండేది, అలా చేసి ఉంటే బాగుండేది... ఇలా రకరకాలుగా నా పాటలను విశ్లేషించుకుంటాను.

● అప్పట్లో లైవ్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఎక్కువగా ఉండేవి. ప్రొడ్యూసర్, డైరెక్టర్, మ్యూజిక్ డైరెక్టర్‌లు ఎక్కువగా కోరుకునేవారు కూడా. పాటలు కూడా అలాగే ఉండేవి. రికార్డింగ్, సాంగ్ రికార్డింగ్‌లో నేను కూడా లైవ్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఉపయోగించాను. వివిధ లైవ్ ఇన్‌స్ట్రుమెంట్లతో హాల్ మొత్తం సందడిగా, పండగ వాతావరణంతో ఉండేది. ప్రతిరోజూ ఒక పండగలా ఉండేది. ఎవరికి వారు బిజీ కావడం, లైవ్ ఇన్‌స్ట్రుమెంట్ రిక్వైర్డ్ సాంగ్స్ రాకపోవడం, డీజే టైప్ పాటలు, రెట్రో, హిప్ హాప్‌లాంటివి వచ్చి లైవ్ అవసరం లేకుండా పోయింది. ఒకవేళ అవసరం ఉన్నా ఎక్కడున్న వారు అక్కడ, ఎవరికి టైమ్ ఉన్నప్పుడు వారు పాడి, వాయించి పంపుతున్నారు. వాటిని తరువాత మిక్స్ చేస్తున్నారు. అంతా డిజిటలైజ్డ్ అయిపోయింది. ఇది ఎంతవరకు వెళుతుందో మాత్రం తెలియదు.

● ఫుల్ ఆర్కెస్ట్రా ఉన్నప్పుడు సాంగ్ స్ట్రక్చర్ ఇలా రాబోతుందని తెలిసేది. ఎందుకంటే సింగర్స్‌తో సహా లైవ్ ఉండేది. స్ట్రక్చర్ గురించి ఇప్పుడు మ్యూజిక్ డైరెక్టర్‌కే తెలియడం లేదు. అక్కడొక ముక్క, ఇక్కడొక ముక్క, పల్లవి ఒకరు చేస్తారు... బీజీయమ్ ఒకరు చేస్తారు. ఫైనల్ వచ్చే వరకు కూడా సాంగ్ ఎలా వస్తుంది? అనేది మ్యూజిక్ డైరెక్టర్‌కి తెలియడం లేదు. మార్పులు, చేర్పులు చేయాలంటే అదొక తతంగం. సో... సాంకేతిక అభివృద్ధి పరంగా మైనస్ ఉంది. కాకపోతే పని గంటలు తగ్గుతాయి. అలాంటి ప్లస్‌లూ ఉన్నాయి.

● సీనియర్ మ్యూజిక్ డైరెక్టర్స్ అందరితోనూ బాగుంటాను. కోటిగారు, వందేమాతరం శ్రీనివాస్ గారు, కీరవాణి అన్నయ్య, మణిశర్మగారు... ఇలా ఎంతోమంది చిన్నప్పటి నుంచి నన్ను చూసి ఉన్నారు కాబట్టి, అందరికీ నేను పెట్. అందరూ నన్ను అభిమానిస్తారు.

● నా సినిమాల్లో నాకు సంతృప్తినిచ్చినవి చాలా ఉన్నాయి. ఉదాహరణకు 'ధర్మచక్రం, తాజ్ మహల్, ప్రేమించు, ప్రేయసి రావే, శివయ్య' వంటివి. మొన్న వచ్చిన 'హిట్–2'లో 'ఉరికే ఉరికే' సాంగ్ బ్లాక్ బస్టర్. నా కెరీర్‌లో ఎక్కువగా మంచి సినిమాలకు పని చేసే చాన్స్ రావడం నా అదృష్టం.

● ఏఐ (కృత్రిమ మేధ) గురించి విన్నాను. ఎంత ఏఐ వాడినా, ఎలా చేసినా తెలిసిపోతుంది. హ్యూమన్ ఎమోషన్ ఏఐ ఇవ్వలేదు. మనిషి కంపోజ్ చేసి ఇచ్చినంత ఏఐ ఇవ్వలేదు.

● సినిమా రంగంలో రావడానికి నేను వచ్చిన టైమే కష్టం అనుకుంటే ఇప్పుడు మరింత కష్టం అయింది. ఎంతోమంది డైరెక్టర్స్, సింగర్స్, కంపోజర్స్ వస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాగా కష్టపడాలి. ఇక మనం ఏ స్థాయికి వెళతామనేది అది మన అదృష్టంపై ఆధారపడి ఉంటుంది.

● నేను సినిమా ఒప్పుకోవడానికి మూడు విషయాల గురించి ఆలోచిస్తాను. మొదటిది కథ. జనరల్‌గా కథే కదా హీరో. కథ ఎలా ఉంది. ఏ జానర్‌లో ఉంది. డైరెక్టర్ ఫ్యాషనేట్‌గా తీయగలరా? ప్రాపర్‌గా రిలీజ్ చేయగలరా? వీటి గురించి ఆలోచిస్తాను.

● మహిళలు, పురుషులు అని కాదు... సినిమా ఫీల్డ్‌లోకి రావాలంటే ఎవరికైనా అది అంత తేలికైన విషయం కాదు. కమర్షియల్ ఫీల్డ్ కాబట్టి ఇంట్లో అందరినీ ఒప్పించాలి. చాలా టాస్క్‌లు ఉంటాయి. దేవుడి దయ వల్ల ఆ టాస్క్‌లన్నీ దాటుకొని ఇప్పటికీ సక్సెస్‌ఫుల్‌గా ఉన్నాను.

– డి.జి. భవాని

మనసుని తాకాలంటే మెలోడీ బెస్ట్

- సంగీతదర్శకుడు అనూప్ రూబెన్స్



● ప్రపంచ సంగీత దినోత్సవాన్ని జూన్ 21న వరల్డ్ వైడ్‌గా జరుపుకుంటారు. మనకు కూడా ఇక్కడ మ్యూజిక్ డే సెలబ్రేషన్స్‌ని చేస్తుంటారు. కానీ, నాకైతే ప్రతి రోజూ సంగీత దినోత్సవమే. ఎందుకంటే ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి వరకూ సంగీతంతోనే ఉంటాను కాబట్టి.

● సంగీతంలో అప్పటికీ, ఇప్పటికీ టెక్నాలజీ వైజ్, వర్కింగ్ వైజ్ చాలా మార్పులొచ్చాయి. మ్యూజిక్ ఎప్పుడూ మెలోడీ వైజ్ మెలోడీనే ఉంటుంది... దాన్ని ఏదీ రీ ప్లేస్ చేయలేదు. గతంలో లైవ్‌లో అందరం ఒకే సారి రికార్డ్ చేసేవాళ్లం. ఇప్పుడు బిట్ బిట్‌గా, సిస్టమ్ ద్వారా చేస్తున్నాం. ఒక పదం పదం పరంగా కూడా రికార్డింగ్ చేస్తున్నాం. అలాగే ఏఐ ద్వారా వాయిస్ మాడ్యులేషన్స్‌లో కూడా మార్పులొస్తున్నాయి.

● సాంకేతికంగా ఎప్పటికప్పుడు మార్పులు వస్తుంటాయి. దానికి తగ్గట్టుగానే పని చేయాల్సి ఉంటుంది. అయితే ముందు రోజుల్లో లైవ్ రికార్డింగ్స్ ఉన్నప్పుడు ఒకటేసారి మొత్తం ఆర్కెస్ట్రా, సింగర్స్ అంతా కలిసి ఒక టేక్‌లో అయిపోయేది. అది ఒక రకంగా సులభంగా ఉండేది. ఎందుకంటే... గతంలో ఫ్లూట్ బిట్, వీణ బిట్, తబలా బిట్ ఇది... అని ఒక ప్రాపర్‌గా సెట్ చేసుకుని కంపోజ్ చేసేవారు. ఇప్పుడు టెక్నాలజీ వచ్చిన తర్వాత చాలా ఆప్షన్స్ వచ్చాయి. ఒక్కొక్క ట్యూన్ సెలక్షన్స్‌కే చాలా రోజులు పట్టేస్తోంది. అంటే ఎక్కువ ట్యూన్స్ ఎంచుకునే అవకాశం ఉండటంతో ఇంకా ఏదో మంచిది దొరుకుతుంది, ఇంకా కొత్త ట్యూన్ దొరుకుతుంది అని. ఈ ప్రాసెస్ కొంచెం కాంప్లికేటెడ్ అయితే ఈ టెక్నాలజీ పరంగా సౌలభ్యం ఏంటంటే టైమింగ్స్. సింగర్ లేదా మ్యుజిషియన్ టైమ్‌కి అందుబాటులో లేకున్నా, ఇతర దేశంలో ఉన్నా వారు పాడటం లేదా వాయించి పంపితే మేము ఇక్కడ యాడ్ చేస్తాం. ఒక రకంగా ఇది అడ్వాంటేజ్.

● ఒక్కో మ్యూజిక్ డైరెక్టర్‌కి ఒక్కో శైలి ఉంటుంది. నా పరంగా వచ్చేసరికి నేనెప్పుడూ మెలోడీని ప్రేమిస్తాను. ఏ పాట కంపోజ్ చేసినా కూడా మెలోడీకి తొలి ప్రాధాన్యం ఇస్తాను. ఎందుకంటే మనకు సంగీతం అనగానే మొదట టచ్ అయ్యేది మనసు. మెలోడీయే మనకు ఎక్కువ రోజులు గుర్తుంటుందని బలంగా నమ్ముతాను. నా తొలి ప్రాధాన్యం ఎప్పుడూ మెలోడీయే. కానీ, కథ, సందర్భం, అవసరాన్ని బట్టి అక్కడ మాస్ సాంగ్ లేదా బీట్ సాంగ్ ఇస్తుంటాను.

● ఇప్పుడొస్తున్న యువ సంగీత దర్శకులు చాలా బాగా పని చేస్తున్నారు. అయితే ఆరోగ్యకరమైన పోటీ అనేది చాలా అవసరం. ఎందుకంటే.. ఒక్కొక్కరికి ఒక్కో శైలి ఉంటుంది. ఒక్కొక్కరిలో ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. వైవిధ్యమైన స్టైల్స్, ఫీల్స్ వినడానికి అవకాశం ఉంటుంది. అలాగే ఇంకా మనం ఏదో చేయాలి? అనే ఉత్సాహం ఉండాలి. అయితే పోటీ ఆరోగ్యకరంగా ఉండాలి.

● నా కెరీర్‌లో దాదాపు 90 సినిమాలు చేశాను. అయితే ఓ సంతృప్తి అనేది సినిమా విజయం వల్ల ఉంటుంది... కథ వల్ల ఉంటుంది. ఆ స్టోరీ జనాల్లోకి బాగా వెళ్లడం, మన పాటలు బాగా హిట్ అయితే అదో సంతృప్తి ఉంటుంది. నా సినిమాల్లో అలా సంతృప్తి ఇచ్చిన వాటిలో 'ప్రేమకావాలి, మనం, ఇష్క్, గోపాల గోపాల, టెంపర్' వంటివి చాలా ఉన్నాయి.

● ప్రస్తుతం కొత్తగా ఇండస్ట్రీకి వస్తున్న సంగీత దర్శకులు, సింగర్స్‌లో చాలా మంచి ప్రతిభ ఉంది. ఇప్పుడు మీడియా, సోషల్ మీడియా పరిధి బాగా పెరిగింది. దాని వల్ల స్టార్ వేల్యూ, పాపులారిటీ అన్నది గతంతో పోలిస్తే ఇప్పుడు చాలా సులభం అయింది. అయితే కొత్తవాళ్లకు అంకితభావం... ప్రధానంగా ఓపిక అనేది ఉండాలి. అప్పుడే మన లక్ష్యం అనేది చేరుకుంటాం. ప్రతి ఒక్కరికి ఒక్కో టైమ్ ఉంటుంది... మన సమయం వచ్చినప్పుడు ఆ లక్ష్యాన్ని చేరుకుంటాం.

● ప్రస్తుతం 'వారాహి' అనే సినిమా చేస్తున్నాను. అలాగే తేజగారి చిత్రంతో పాటు అర్జున్‌గారి సినిమా చేస్తున్నాను. మరో ఐదారు సినిమాలు కూడా ఒప్పుకున్నాను.

● నేను చిన్నప్పటి నుంచి ఇళయరాజా సార్, ఏఆర్ రెహమాన్ సార్ పాటలు వింటూ పెరిగాను. వాళ్ల వర్కింగ్ స్టైల్, లైఫ్ స్టైల్.. చెప్పాలంటే వాళ్లే నాకు స్ఫూర్తి. నాకే కాదు ఇప్పుడు కొత్తగా వచ్చే చాలా మంది సంగీత దర్శకులకు, అలాగే ఇప్పుడు ఉన్న వారికి కూడా. నేను మాత్రం ఆర్‌డీ బర్మన్‌గారు, ఇళయరాజా సార్, ఏఆర్ రెహమాన్‌గారు.. వాళ్ల వద్ద నుంచి చాలా నేర్చుకున్నాను.

● సినిమా ఒప్పుకోవాలంటే నా తొలి ప్రాధాన్యత కథే. అయితే కొన్నిసార్లు బ్యానర్, హీరో, డైరెక్టర్ వేల్యూ కూడా ఉంటాయి. అయితే ఎవరైనా కొత్తవాళ్లు, కొత్త ప్రొడక్షన్ హౌస్ వాళ్లు నన్ను కలిస్తే మాత్రం ముందు కథ విని, నచ్చితే ఒప్పుకుంటాను.

– దేరంగుల జగన్ మోహన్

లైవ్ రికార్డింగ్‌లో డెప్త్ ఉంటుంది

- సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల



● సంగీత దర్శకుడిగా ప్రతిరోజునీ నా ఫస్ట్ డే మ్యూజిక్ డైరెక్షన్‌లానే భావిస్తాను. ప్రతిరోజూ ఓ స్ట్రగులే. అందుకే అప్‌గ్రేడ్ అవుతుంటాను. ప్రజలు ఎలాంటి సంగీతాన్ని ఇష్టపడుతున్నారో తెలుసుకుని, కొత్త తరహా సంగీతాన్నందించాలన్నదే నా తపన.

● మనం ఆనందంలో ఉన్నప్పుడు పాట వింటాము. దుఃఖంగా ఉన్నప్పుడూ పాట వింటాము. మన భావాలను పంచుకోవాలనుకున్నప్పుడు మ్యూజిక్‌తో తెలియజేస్తాం. ఇలా పలు రకాలుగా సంగీతం అనేది మన జీవితంలో ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది.

● దశాబ్ద కాలానికి పైగా సంగీతరంగంలో రాణిస్తున్నాను. ఈ రంగంలో టెక్నాలజీ అప్‌డేట్ అవుతూ వస్తోంది. టెక్నాలజీని మనం ఎంత వరకు కరెక్ట్‌గా వాడాం అన్నది జాగ్రత్తగా గమనించుకుంటుంటే అడ్వాంటేజ్‌గానే ఉంటుంది. కొన్నిసార్లు డిస్‌అడ్వాంటేజ్ కూడా ఉంటుంది. ఎందుకంటే ఒరిజినాలిటీ అనేది ఎప్పుడూ మిస్ కాకూడదు. మ్యూజిక్ అనేది హ్యూమన్ టచ్‌తో సంబంధం ఉన్న అంశం. అలాగే సంగీత దర్శకులకు ఏఐ ఉపయోగపడుతుంది. కానీ మనం దాన్ని ఎంతవరకు వినియోగిస్తున్నాం అన్నది చూసుకోవాలి.

● ఇండస్ట్రీలో ఉన్న పోటీతత్వాన్ని గమనిస్తుంటాను. ఫస్ట్ నాకు నేను పోటీగా ఉండాలనుకుంటాను. ఎంత మంది ఉన్నా కూడా మనకు మనం పోటీగా ఉన్నప్పుడే మనం ముందుకు వెళ్లగలం. ఇండస్ట్రీలో సంగీతదర్శకుల మధ్య ఉండే పోటీని చూసి ఉలిక్కిపడను. నేను ఎదగడానికి ఏం చేయాలి అని చూస్తాను తప్ప పక్కన ఇంకెవరో వచ్చారని కంగారు పడను.

● డిజిటల్ సాయంతో మ్యూజిక్ చేయడం కొంతవరకు సౌకర్యంగానే ఉంటుంది. కానీ లైవ్ రికార్డింగ్స్ అనేవి మాత్రం డెప్త్ క్రియేట్ చేస్తాయి. ఎంత చెప్పినా లైవ్ లైవే... దాంట్లో తిరుగులేదు. నేను గిటారిస్ట్‌ని. లైవ్ అంటే ఏంటో నాకు తెలుసు. ఎంత టెక్నాలజీ వాడినా కూడా లైవ్ అన్నది లైవే. డిజిటలైజ్ వల్ల పని సులభం అవ్వొచ్చు. కానీ లైవ్ రికార్డింగ్ అనేది మ్యూజిక్‌ను నిలబెడుతుంది.

● శ్రోతలకు లిరిక్స్ వినిపించేలా మనం సంగీతం ఇవ్వాలి. ఆ పాటకు లిరిక్స్ చాలా ముఖ్యమని, లిరిక్‌దే ప్రథమ స్థానమని భావిస్తాను. నా సినిమాల్లోని పాటల్లో లిరిక్స్ ఆడియన్స్‌కు వినిపించాలనే ప్రయత్నిస్తుంటాను. లిరిక్స్ ఆడియన్స్‌కు అర్థమైతే, అప్పుడు ఆ లిరిక్‌కు మ్యూజిక్ డైరెక్టర్ ఈ తరహా మ్యూజిక్ ఇచ్చాడని వారికి అర్థమౌతుంది. అదే లిరిక్ అర్థం కాకుండా మనం మ్యూజిక్ ఇస్తే ఎందుకు లిరిక్ అర్థం కావడం లేదని పిస్తుంది. లిరిక్ అర్థమైనప్పుడే సినిమాలోని సందర్భం మ్యూజిక్‌తో ఆడియన్స్‌కు మరింత చేరువ అవుతుంది.

● సినిమాలో సౌండ్ అనేది డిజైన్ చేసినప్పుడు ఫస్ట్ నుంచి లాస్ట్ వరకు ఒకే మ్యూజిక్ డైరెక్టర్ ఉంటే మంచిది. ఒక సినిమాకు ఇద్దరు... ముగ్గురు మ్యూజిక్ డైరెక్టర్స్ వర్క్ చేసే విధానానికి నేను వ్యతిరేకిని. ఇది నా సొంత అభిప్రాయం. అయితే కొన్నిసార్లు ఒక సినిమాకు ఇద్దరు... ముగ్గురు మ్యూజిక్ డైరెక్టర్స్ వర్క్ చేసినప్పుడు అది వర్కౌట్ అయ్యింది. అలాంటప్పుడు ఒక సినిమాకు ఒకే సంగీత దర్శకుడు పని చేయాలని చెప్పడానికి నేనెవర్ని. కానీ... చేస్తే మొత్తం సినిమా చేయాలని నేను కోరుకుంటాను. ఈ విషయంపై నా స్టాండ్ ఏంటంటే... నాకు వ్యక్తిగతంగా ఇష్టం లేదు. కానీ సంగీత దర్శకుల్లో నేను ఒక భాగమే. ఎవరైనా వచ్చి, ఫలానా సినిమాలో ఒకే ఒక్క సాంగ్ చేయమన్నా చేస్తాను.

● మ్యూజిక్ రంగంలో స్థిర పడాలనుకునే కొత్త తరం వారికి నేను చెప్పేది ఒక్కటే. ఒక్కసారి డిసైడ్ అయితే వెనక్కి తిరిగి చూడొద్దు. నిత్యం కష్టపడాలి. ఫోకస్‌గా ఉండాలి. ప్రతిక్షణం మ్యూజిక్ పైనే ఫోకస్ పెట్టి పని చేయాలని చెబుతాను.

● వరల్డ్ మ్యూజిక్ డేని సెలబ్రేట్ చేసుకుంటాను. ఈ సందర్భంగా నా సహచర మ్యూజిషియన్స్ అందరికీ విషెస్ చెబుతున్నాను. అందరికీ అవకాశాలు రావాలని, అందరూ సక్సెస్ కావాలని, అందరూ ఎదగాలని కోరుకుంటాను. ప్రస్తుతం అడివి శేష్‌గారి 'గూఢచారి 2, ఆది సాయికుమార్‌గారి 'శంబాల' సినిమాలు చేస్తున్నాను. మరో ఆరు సినిమాలు లైనప్‌లో ఉన్నాయి.

● నేను సినిమా ఒప్పుకోవాలంటే కథను మాత్రమే చూస్తాను. అలాగే నేను ఉపయోగించే ఇన్‌స్ట్రుమెంట్స్ సినిమా టు సినిమా మారిపోతుంటాయి. కథ, ఆ సినిమా హీరో, ఆ హీరో బాడీ లాంగ్వేజ్‌ని బట్టి ఎలాంటి స్టైల్ క్రియేట్ చేయవచ్చు, డైరెక్టర్ ఏ విధమైన మ్యూజిక్ ఆశిస్తున్నారు. ఇటువంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ట్యూన్స్ చేస్తాను. ● 'మేజర్, నాంది, గూఢచారి, కృష్ణ అండ్ హిజ్ లీలా, డీజే టిల్లు' వంటి చిత్రాలు ఓ సంగీతదర్శకుడిగా నా కెరీర్‌లో ఎక్కువ సంతృప్తినిచ్చాయి.

– ముసిమి శివాంజనేయులు

● నేడు యోగా డే

హెల్దీగా.. హ్యాపీగా...

మహిళల ఆరోగ్యానికి, అంతర్గత ఆనందానికి మేలైన సాధనంగా యోగాసనాలు ఎంతగానో ఉపయోగపడతాయి. నేడు యోగా డే సందర్భంగా కొన్ని ఆసనాలు...


2

1. కోణాసనం: సైడ్ యాంగిల్ పోజ్ గా పిలిచే ఈ ఆసనం వేస్తే.. శరీరం బాగా స్ట్రెచ్ అవుతుంది. కాళ్లు, చేతులకు బలం చేకూరుతుంది. వెన్ను నొప్పి, సయాటికా సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

2. వృక్షాసనం: నిటారుగా నిల్చొని, ఒక పాదాన్ని రెండవ కాలు మధ్యకి తీసుకొచ్చి, రెండు చేతులు తలమీదుగా పూర్తిగా పైకి నమస్కారం భంగిమలో తీసుకోవాలి. ఈ ఆసనం వల్ల మానసిక సమతుల్యత ఏర్పడి ఏకాగ్రత పెరుగుతుంది.

3. పాద హస్తాసనం: నిటారుగా నిల్చొని, శరీరాన్ని ముందుకు వంచి, చేతులను పాదాలకు, తలను మోకాళ్లకు ఆనించాలి. దీనివల్ల నరాల వ్యవస్థ చురుకుగా మారి.. రక్త ప్రసరణ మెరుగవుతుంది.

4. అర్ధ మత్స్యేంద్రాసన: మ్యాట్ పైన కూర్చొని, ఎడమ కాలుని కుడి తొడ పక్క గా తీసుకొచ్చి, నేల మీద ఉంచాలి. ఎడమ చేతిని ఎడమ మోకాలు నుంచి తీసుకొచ్చి, పాదం పట్టుకోవాలి. కుడి చేతిని నిటారుగా నేల మీద ఉంచాలి. ఈ ఆసనం వల్ల ఆక్సిజన్ లెవెల్స్ పెరిగి ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది.


8

5. సేతు బంధాసన: దీనిని బ్రిడ్జ్ పోజ్ అంటారు. ఇది కటి భాగం, గర్భాశయం, వెన్నుకి చాలా మంచిది. ఇది కటి కండరాలను బలోపేతం చేస్తుంది. పునరుత్పత్తి అవయవాలకు రక్త ప్రసరణను పెంచుతుంది.

6. మార్జాలాసనం: క్యాట్–కౌ పోజ్ గా పిలిచే ఈ ఆసనం వెన్నెముక బలానికి, ఒత్తిడిని తగ్గించడంలోనూ సహాయపడుతుంది కటి కండరాలను ఫ్లెక్సిబుల్‌గా చేస్తుంది.

7.బాలాసన: చైల్డ్ పోజ్ పెద్దలకు కూడా మేలు చేస్తుంది. ఇది ఒత్తిడిని తగ్గించడానికి, విశ్రాంతికి సహాయపడుతుంది. ఈ ఆసనం వెన్నునొప్పిని తగ్గించి, మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.

8. భుజంగాసన: కోబ్రా పోజ్ గా పిలిచే ఈ ఆసనం ఛాతీ, వెన్ను భాగాలను బలోపేతం చేస్తుంది. ఇది శ్వాసను మెరుగుపరుస్తుంది. శక్తిని పెంచుతుంది.


9

9. త్రికోణాసన: ట్రయాంగిల్ పోజ్ వల్ల పాదాలు, కాళ్ళు, చేతులు, వెన్నును బలోపేతం అవుతాయి. శరీరానికి సమతుల్యతను అందిస్తుంది.

10. మాలాసన: దీనిని గార్లాండ్ పోజ్ అంటారు. రెండు కాళ్ళను వెడల్పుగా ఉంచి, మోకాళ్ళ వరకు వంగి, చేతులను నమస్కారం స్థితికి తీసుకురావాలి. ఈ ఆసనం సాధన చేయడం వల్ల రుతుక్రమమం, మలబద్ధకం సమస్యలు తగ్గుతాయి. తొడ కండరాల శక్తి పెరుగుతుంది.

ఈ ఆసనాలను రోజూ సాధన చేయడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరి శారీరక ఆరోగ్యం అభివృద్ధి అవుతుంది ఫలితంగా జీవన శైలిలో మంచి మార్పులు కలుగుతాయి.



- అనూష రాకేష్,
యోగా ట్రైనర్, హైదరాబాద్


3

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 20న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,610
బంగారం (22 క్యారెట్లు)	91,450
వెండి	1,08,000
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,01,850
బంగారం (22 క్యారెట్లు)	92,100
వెండి	1,09,300
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,00,480
బంగారం (22 క్యారెట్లు)	92,100
వెండి	1,20,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,01,850
బంగారం (22 క్యారెట్లు)	94,860
వెండి	1,09,300
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,800
బంగారం (22 క్యారెట్లు)	89,980
వెండి	1,06,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,00,470
బంగారం (22 క్యారెట్లు)	92,100
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

వంటిల్లు



కొబ్బరి పాలతో కొత్తగా..!

కొబ్బరి పాలతో ఏ వంటకాలు చేసుకున్నా గమ్మత్తైన రుచి వస్తుంది. అందుకే వాటితో ఎన్నోరకాల ఆరోగ్యకరమైన స్నాక్స్ చేసుకోవచ్చు. అవి కేవలం రుచిగా ఉండటమే కాకుండా, కొబ్బరి పాలతో పోషకాలు కూడా లభిస్తాయి. ఇక్కడ 5 సింపుల్, వెరైటీ స్నాక్స్ ఉన్నాయి. చూద్దాం!



కొబ్బరి పాల జెల్లీ

నాలుగు కప్పుల కొబ్బరి పాలను స్టవ్ మీద పెట్టి, చిన్న మంటపై గరిటెతో తిప్పుతూ కాగించాలి. ఇప్పుడు దానిలో సరిపడా పంచదారతో పాటు కొద్దిగా అగార్‌–అగార్ కలిపి బాగా ఉడికించాలి. అగార్ అగార్ పూర్తిగా కలిసిన తర్వాత, ఒక గిన్నెలోకి లేదా పుడ్డింగ్ మౌల్డ్‌లలో పోసి చల్లబడిన తర్వాత ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. గట్టిపడిన తర్వాత సర్వ్ చేసుకోవచ్చు. అభిరుచిని బట్టి ఈ మిశ్రమం ఫ్రిజ్‌లో పెట్టే ముందు నేతిలో వేయించిన డ్రై ఫ్రూట్స్ ముక్కలు కలుపుకోవచ్చు. లేదంటే జెల్లీని సర్వ్ చేసుకునే ముందు నచ్చిన విధంగా గార్నిష్ చేసుకోవచ్చు.



కొబ్బరి పాల ఖీర్

ఒక మందపాటి గిన్నెలో మూడు కప్పుల కొబ్బరి పాలు తీసుకుని సన్న మంటపై వేడి చేసుకోవాలి. అందులో తగినంత బెల్లం లేదా పంచదార వేసి కరిగించాలి. కొద్దిగా ఉడికిన సగ్గుబియ్యం లేదా వేయించిన సేమియా వేసి చిక్కబడే వరకు ఉడికించాలి. ఏలకుల పొడితో పాటు అభిరుచిని బట్టి వేయించిన జీడిపప్పు, కిస్మిస్‌తో అలంకరించి వేడివేడిగా లేదా చల్లగా సర్వ్ చేసుకోవచ్చు.



కొబ్బరి పాల చెక్కలు

నాలుగు కప్పుల బియ్య ప్పిండిలో కొబ్బరి పాలు, సరిపడా ఉప్పు, కారంతో పాటు కొద్దిగా జీలకర్ర, కొద్దిగా కరివేపాకు తరుగుతో కలిపి గట్టి పిండిలా కలుపుకోవాలి. ఈ పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి, చేతితో అప్పాలుగా ఒత్తుకోవాలి. వీటిని వేడి నూనెలో దోరగా వేయించుంటే సరిపోతుంది.



కొబ్బరి పాల జ్యూస్

ఒక మిక్సీ బౌల్ తీసుకుని.. అందులో రెండు కప్పుల కొబ్బరి పాలు, నచ్చిన పండ్లు (అరటిపండు, మామిడిపండు, పైనాపిల్ వంటివి) వేసుకుని మిక్సీ పట్టుకోవచ్చు. అనంతరం దానిలో కొద్దిగా తేనె లేదా బెల్లం, కావాలంటే కొన్ని ఐస్ క్యూబ్స్ వేసి, మళ్లీ మిక్సీ పట్టుకుని, మెత్తగా పేస్ట్‌లా చేసుకుని నచ్చిన విధంగా గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవాలి.

● గైడెన్స్



తీవ్రమైన వ్యాయామాలు, కఠినమైన ఆహార నియమాలతో బరువు తగ్గడం అంటే శిఖరాన్ని అధిరోహించేందుకు చేసే కసరత్తులా అనిపిస్తుంది. ముఖ్యంగా బిజీ జీవనశైలిలో అధికబరువుపై ధ్యాస, జిమ్‌కి వెళ్లి వ్యాయామాలు చేయడం పెద్ద యుద్ధమే అనిపిస్తుంది. పోషకాహార నిపుణురాలు ఉదిత అగర్వాల్ జిమ్‌కి వెళ్లకుండానే 30 కిలోల బరువు తగ్గి అందరినీ ఆశ్చర్యపరిచింది. తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ముఖంలోని కొవ్వును సహజంగా తగ్గించడంలో సహాయపడే కొన్ని సాధారణ చిట్కాలనూ, తీసుకోదగిన ఆహారాలను మన ముందుంచింది.

బరువు తగ్గినా ముఖం కళ తప్పకుండా..

‘‘నా చిన్నతనం నుంచీ అధికబరువు సమస్యను ఎదుర్కొన్నాను. ఆరోగ్య సమస్యల బారిన పడ్డాను. జుట్టు రాలిపోయేది, ముఖంపై యాక్నె ఉండేది. పాతికేళ్లు వచ్చేసరికి వంద కేజీలకు పైగా బరువు పెరిగాను. జిమ్‌కి వెళ్లకుండా బరువు తగ్గాలనుకున్నాను. ఎనిమిది నెలల్లో 30 కేజీల బరువు తగ్గాను. కానీ, మేని చర్మం సాగినట్టు, ముఖంలోని కొవ్వునూ కోల్పోయి, సన్నబడి, కళ తగ్గినట్టుగా అనిపించింది. ఈ సమస్య దరిచేరకుండా జాగ్రత్త పడ్డాను.

తీసుకునే ఆహారంలో మొత్తం కొవ్వుపై దృష్టి పెట్టాలి. ఎన్ని కేలరీలు ఉన్నాయో, దానికంటే అదనపు కేలరీలను బర్న్ చేయాలని గుర్తించాలి. అప్పుడు కేలరీలు తీసుకోవడం తగ్గిస్తారు.

- ఉత్తమ ఫలితాల కోసం ఆరోగ్యకరమైన ఆహారం + క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం రెండూ జీవనశైలిలో భాగం చేసుకోవాలి.
- సమతుల ఆహారం తీసుకోవాలి. ఉప్పు, చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలను తీసుకోకూడదు.
- అధిక ప్రోటీన్ తీసుకోవడం ద్వారా కొవ్వు తగ్గుతుంది. కడుపు నిండుగా ఉంటుంది.
- ఆరోగ్యకరమైన కొవ్వులు మొలకెత్తిన గింజలు, విత్తనాలలో ఉంటాయి.
- నీళ్లు, పీచు పదార్థాలు పుష్కలంగా ఉండే పండ్లు – కూరగాయలను తీసుకోవాలి.
- రోజూ కనీసం 2–3 లీటర్ల నీళ్లు తాగాలి.

ఒత్తిడిని తగ్గించడం – హాయిగా నిద్రపోవడం

ఒత్తిడి కార్టిసాల్‌ను పెంచుతుంది, ఇది కొవ్వు పేరుకుని పోయేలా చేస్తుంది. ప్రతి రాత్రి 7 నుంచి 9 గంటల సేపు నిద్రపోయేలా చూసుకోండి. నిద్ర సరిగా లేకపోవడం వల్ల శరీరం నీరు పట్టినట్టుగా కనిపిస్తుంది.

ముఖ వ్యాయామాలు – టోనింగ్

- ఈ వ్యాయామాలు చర్మం నునుపును మెరుగుపరుస్తాయి
- బుగ్గలు ఉబ్బినట్టుగా ఉంటే, మునివేళ్లతో మృదువుగా వెనక్కి మర్దనా చేయాలి.
- పళ్ళు బిగించి, నవ్వుతూ, 10 సెకన్ల పాటు అలాగే ఉంచాలి.
- ‘ఫిష్ ఫేస్’ ప్రయత్నించాలి. అంటే, బుగ్గలను లోపలికి పీల్చుకొని, కొన్ని సెకన్లపాటు ఉంచాలి.

చక్కెర పానీయాలకు దూరం

మద్యం చర్మాన్ని డీహైడ్రేట్ చేస్తుంది. నీటిని చేరుస్తుంది. చక్కెర పానీయాలలో అధిక కేలరీలు ఉంటాయి. ఇవి ఒంట్లో ఎక్కువ కొవ్వు నిల్వలను చేరుస్తాయి.

పై జాగ్రత్తలన్నీ తీసుకొని, బాడీ ఫిట్‌నెస్‌ను కాపాడుకున్నాను. డైటీషియన్ కోర్సు కూడా పూర్తి చేశాను. నాపై నేను తీసుకున్న ఈ ప్రత్యేక శ్రద్ధ నన్ను నాజూగ్గా మార్చింది.



ఉదిత అగర్వాల్

బరువు తగ్గడానికి 12 రకాల ఆహార పదార్థాలు

కూరగాయలు (కేలరీలు చాలా తక్కువ)

1. దోసకాయ – 100 గ్రాములకు16 కిలో కేలరీలు లభిస్తాయి. హైడ్రేటింగ్, క్రంచీ, సలాడ్స్, స్నాక్స్ చేయడానికి సరైనది.
2. గుమ్మడికాయ – 100 గ్రాములకు 17 కిలో కేలరీలు తేలికైనది, చాలా రకాలు చేయవచ్చు.
3. లెట్యూస్– 100 గ్రాములకు 15 కిలో కేలరీలు ర్యాప్‌లకు, సలాడ్ బేస్‌గా అనువైనది.
4. పాలకూర – 100 గ్రాములకు 23 కిలో కేలరీలు ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది, స్మూతీలు, సాగ్ లేదా సాటీయింగ్‌కు సరైనది.
5. కాలీఫ్లవర్ – 100 గ్రాములకు 25 కిలో కేలరీలు అన్నం, పిజ్జా క్రస్ట్ లేదా సబ్జీలలో ఉపయోగించవచ్చు. పండ్లు (సహజంగా తీపి – తక్కువ కేలరీలు)
6. పుచ్చకాయ – 100 గ్రాములకు 30 కిలో కేలరీలు వేడి వాతావరణం ఉన్నప్పుడు మరీ మంచిది.
7. స్ట్రాబెర్రీలు – 100 గ్రాములకు – 32 కిలో కేలరీలు తీపి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి, జీర్ణక్రియకు మంచిది.
8. బొప్పాయి – 100 గ్రాములకు 43 కిలో కేలరీలు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. చాలా కడుపు నిండుగా ఉంటుంది.
9. ఉడికించిన గుడ్డులోని తెల్లసొన – గుడ్డులోని తెల్లసొనకు – 17 కిలో కేలరీల స్వచ్ఛమైన ప్రోటీన్, కొవ్వు ఉండదు. కండరాల నిర్వహణకు సరైనది.
10. వెన్నలేని పెరుగు (తక్కువ కొవ్వు) – 100 గ్రాములకు 59 కిలో కేలరీలు ప్రోటీన్ అధికంగా ఉంటుంది, జీర్ణాశయ ఆరోగ్యానికి మంచిది.
11. టోఫు (లైట్ లేదా తక్కువ కొవ్వు) – 100 గ్రాములకు 70 కిలో కేలరీలు మొక్కల ఆధారిత ప్రోటీన్, మృదువైనది మరియు సంతృప్తికరంగా ఉంటుంది.
12. ఎయిర్–పాప్డ్ పాప్‌కార్న్ (ఉప్పు, వెన్న లేనిది) – కప్పుకు 30 కిలో కేలరీలు.

తాను ఇవన్నీ ఫాలో అయాను కాబట్టే బరువు తగ్గినా ముఖం కళ తప్పకుండా కాపాడుకోగలిగాను అని చెబుతోంది ఉదితా అగర్వాల్.



బాలనెరుపా? బీ కేర్ ఫుల్!

పూర్వం రోజుల్లో జుట్టు కాస్త తెల్లబడితే, వయసు పైబడుతోందనడానికి సంకేతంగా భావించి దానిని హుందాగా తీసుకునేవారు. మరీ చిన్నవయసులోనే తెల్ల వెంట్రుకలు వస్తే బాలనెరుపు కాబోలు అని సరిపెట్టుకునేవాళ్లు. ప్రస్తుత కాలంలో నెరుపు చిన్న వయసులోనే మొదలవుతోంది. అలాగని ఇప్పుడిదంతా మామూలే అని సరిపెట్టుకోవలసిన అవసరం లేదు. ఈ సమస్యకు మూల కారణాన్ని కనిపెట్టి, దాన్ని సరిదిద్దుకుంటే, బాలనెరుపును దూరం చేసుకుని నిగనిగలాడే కురులను సొంతం చేసుకోవచ్చునంటున్నారు పరిశోధకులు.

25 ఏళ్ల లోపు వయసులో కొందరికి తల మొత్తంగా అక్కడక్కడా వెంట్రుకలు నెరిస్తే, ఇంకొందరికి చెంపల దగ్గర, తలలో ఏదో ఒకచోట వెంట్రుకలు నెరుస్తాయి. అయితే అది ఎలాంటి నెరుపైనా పాతికేళ్ల లోపు కనిపిస్తే కచ్చితంగా బాల నెరుపే! ఈ నెరుపు ఎవరికైనా రావొచ్చు.

కాలానుగుణ మార్పుల ప్రభావం

వాతావరణం, ఆహార కాలుష్యం, ఒత్తిడి... బాల నెరుపు తీవ్రత కాలక్రమేణా పెరగడానికి ప్రధాన కారణాలు! పూర్వంతో పోల్చుకుంటే ఆహారంలో కృత్రిమత్వం పెరిగింది. వాతావరణంలో కాలుష్యమూ పెరిగింది. మానసిక ఒత్తిడికీ కొదవ లేదు. ఇవన్నీ కాలక్రమేణా బాల నెరుపు తీవ్రమవడానికి దారితీశాయి.

ఇవీ కారణాలు

జన్యుపరంగా ఈ లక్షణం సంక్రమించి ఉంటే, తల్లిదండ్రులకు ఏ వయసులో తెల్ల వెంట్రుకలు కనిపించాయో, అదే వయసుకు పిల్లల్లో కూడా మొదలవుతాయి.

పోషకాల లోపం ప్రధాన కారణం

ప్రొటీన్ లోపం ఉన్నా, ఐరన్ తగ్గి అనీమియాకు లోనైనా, కాపర్ లోపం ఉన్నా వెంట్రుకలు తెల్లగా మారతాయి. ఈ లోపాల తీవ్రత ఏ వయసులో పెరిగితే ఆ వయసులో తెల్ల వెంట్రుకలు కనిపించడం మొదలవుతుంది. పిల్లల్లో ఈ సమస్య సర్వసాధారణం. ఇంటి భోజనానికి బదులుగా బయటి చిరుతిళ్లు తినే పిల్లల్లో పోషకాహార లోపం చివరకు తెల్ల వెంట్రుకల రూపంలో బయల్పడుతుంది.

చదువు ఒత్తిడీ కారణమే!

ఇటీవలి కాలంలో పిల్లల్లో ప్రి మెచ్యూర్ గ్రేయింగ్ పెరగడానికి ప్రధాన కారణం చదువు ఒత్తిడి. మార్కుల కోసం, అదే పనిగా చదవమని ఒత్తిడి చేసినా, మెలనిన్ పరిమాణం తగ్గి వెంట్రుకలు తెల్లబడతాయి.

కారణం తెలిస్తే చికిత్స సులువు

బాల నెరుపుకు అసలు కారణాన్ని కనిపెట్టగలిగితే సమస్య పరిష్కారం సులభమవుతుంది. ఇందుకోసం ఏ పోషకలోపం ఉందో పరీక్షల ద్వారా తెలుసుకోవాలి. థైరాయిడ్, అప్లాస్టిక్ ఎనీమియాలను గుర్తించే పరీక్షలూ చేయక తప్పదు. అలాగే ఈ నెరుపు వంశపారంపర్యంగా సంక్రమించిందేమో గమనించాలి. జన్యు సమస్యలనూ అంచనా వేయాలి. పరీక్షల్లో ఇవేవీ కారణాలు కావని తేలితే ఒత్తిడిని ప్రధాన కారణంగా భావించాలి.

పిల్లలకు బాల్యం నుంచే ఒత్తిడి లేని జీవితం గడిపేలా చూడాలి. పౌష్టికాహారం ఇవ్వాలి. అప్పుడే బాల నెరుపును జయించవచ్చు. డోంట్ వర్రీ!

● హెల్త్ టిప్స్

సబ్జాగింజలను డైలీ ఆహారం తీసుకోవడం వల్ల మలబద్ధకం, రక్తపీడనం, అధిక బరువు సమస్యలు తగ్గుతాయి. నీరసంగా ఉన్నప్పుడు గింజలు వేసిన నీళ్లు తాగడం వల్ల నీరసం తగ్గి యాక్టివ్‌గా ఉంటారు. ఈ గింజల్లో ఉన్న క్యాల్షియం, మ్యాంగనీస్, ఫాస్ఫరస్‌లు ఎముకలు, దంతాల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. క్రమం తప్పకుండా సబ్జాగింజలను నానపెట్టుకుని తాగితే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి.

● శరీరం మీద దద్దుర్లు దురదతో బాధిస్తుంటే.. కొబ్బరినూనెలో కొద్దిగా అలోవెరా జెల్ వేసి బాగా కలిపి దద్దుర్ల పైన ఆయింట్‌మెంట్‌లా రాస్తే ఉపశమనం లభిస్తుంది.



సాక్షి సినిమా

మజిలీ దర్శకుడితో మళ్లీ?



● నాగచైతన్య

నాగచైతన్య కెరీర్‌లోని 25వ చిత్రానికి సంబంధించిన పనులు ఊపందుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం ‘విరూపాక్ష’ ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో ‘వృషకర్మ’ (పరిశీలనలో ఉన్న టైటిల్) అనే మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. నాగచైతన్య కెరీర్‌లో ఇది 24వ చిత్రం. కాగా తన కెరీర్‌లోని 25వ సినిమాకి సంబంధించి మంచి కథ కోసం చూస్తున్నారట నాగచైతన్య. ఓ దశలో కిశోర్ అనే ఓ కొత్త దర్శకుడి కథకు ఈ హీరో ఓకే చెప్పారని, ఈ కథతో తెరకెక్కేదే నాగచైతన్య కెరీర్‌లో 25వ మైలురాయి చిత్రం అవుతుందనే ప్రచారం సాగింది. కానీ తనకు ‘మజిలీ’ వంటి హిట్ ఫిల్మ్ ఇచ్చిన శివ నిర్వాణతో 25వ సినిమా చేయాలనే ఆలోచనలో ఉన్నారట నాగచైతన్య. ఈ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, పూర్తి కథ సిద్ధమైన తర్వాత శివ నిర్వాణతో సినిమా చేసే విషయమై నాగచైతన్య ఓ నిర్ణయం తీసుకుంటారని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో ప్రచారం జరుగుతోంది. మరి... శివ నిర్వాణతో నాగచైతన్య కాంబినేషన్ రిపీట్ అవుతుందా? నాగచైతన్య 25వ సినిమా ఏ దర్శకుడితో ఉంటుంది? అనే వివరాలు తెలియాలంటే కొన్ని రోజులు ఎదురు చూడాల్సిందే.

మైసూర్‌లో ముత్తువేల్



● రజనీకాంత్

మైసూర్‌లో ల్యాండ్ అయ్యారు ముత్తువేల్ పాండియన్. హీరో రజనీకాంత్–దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం ‘జైలర్ 2’. వీరి కాంబినేషన్‌లోనే 2023లో వచ్చిన హిట్ ఫిల్మ్ ‘జైలర్’కు సీక్వెల్‌గా ‘జైలర్ 2’ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మాజీ జైలర్ ముత్తువేల్ పాండియన్ పాత్రలో నటిస్తున్నారు రజనీకాంత్. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ మైసూర్‌లో జరుగుతోంది. రజనీకాంత్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మరో వారం రోజుల పాటు మైసూర్‌లోనే ఈ సినిమా చిత్రీకరణ జరుగుతుందట. అలాగే ‘జైలర్’ తొలి భాగంలో నటించిన శివ రాజ్‌కుమార్, ‘జైలర్ 2’లో కూడా భాగమయ్యారని, ఈ మైసూర్ షెడ్యూల్‌లోనే రజనీకాంత్ – శివ రాజ్‌కుమార్‌ల కాంబినేషన్‌లో సన్నివేశాలను కూడా చిత్రీకరించడానికి ప్లాన్ చేశారని సమాచారం. రమ్యకృష్ణ, మిర్నా మీనన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాను సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల కానుంది. కాగా రజనీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం ‘కూలీ’ ఆగస్టు 14న విడుదల కానున్న సంగతి తెలిసిందే.



● జాన్వీ

హ్యాపీగా... జాలీగా...

సినిమా షూటింగ్‌లతో బిజీ బిజీగా ఉండే నటీనటులు కాస్త విరామం దొరికిందంటే చాలు హాలిడే ట్రిప్ కోసం విదేశాల్లో వాలిపోతుంటారు. అక్కడ హ్యాపీగా జాలీగా ఎంజాయ్ చేస్తుంటారు. ఆ ఫొటోలని తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తుంటారు. జాన్వీ కపూర్ ప్రస్తుతం లండన్‌లో విహరిస్తున్నారు. తన సోదరి ఖుషీ కపూర్‌తో కలిసి వెకేషన్‌ని ఎంజాయ్ చేస్తున్నారామె. అయితే ఈ హాలిడే ట్రిప్‌లో జాన్వీ కపూర్‌తో పాటు ఆమె బాయ్ ఫ్రెండ్ శిఖర్ పహారియా కూడా ఉండటం విశేషం. లండన్ వీధుల్లో వీరిద్దరూ చేతిలో చెయ్యేసి కబుర్లు చెప్పుకుంటూ నడిచి వెళుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఇదిలా ఉంటే... జాన్వీ కపూర్ ప్రస్తుతం తెలుగులో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న ‘పెద్ది’ సినిమాలో నటిస్తున్నారు. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. 2026 మార్చి 27న ‘పెద్ది’ విడుదల కానుంది. అలాగే హిందీలో ‘సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారీ, పరమ్ సుందరి’ వంటి సినిమాల్లో నటిస్తూ జాన్వీ బిజీగా ఉన్నారు. ఈ చిత్రాల షూటింగ్స్‌కి కాస్త విరామం రావడంతో... షార్ట్ ట్రిప్‌ని ప్లాన్ చేసుకున్నారు జాన్వీ.



● జాన్వీ, ఖుషీ

హైదరాబాద్‌లో వారణాసి!

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ అంతర్జాతీయ స్థాయి సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ ఈ వారంలో హైదరాబాద్‌లో మొదలైందని సమాచారం. ఈ షెడ్యూల్ కోసం మేకర్స్ హైదరాబాద్ శివార్లలో భారీ సెట్స్‌ను క్రియేట్ చేశారని తెలిసిందే. ఇందులో భాగంగా వారణాసి నగరాన్ని తలపించేలా భారీ సెట్స్ వేశారని భోగట్టా. ఈ సెట్స్‌కు రూ. 40 కోట్లకు పైనే అయ్యిందని టాక్. అంతేకాదు... ఈ సినిమాలోని మేజర్ సన్నివేశాల చిత్రీకరణ ఈ సెట్స్‌లోనే జరుగుతుందని, అందుకే ఈ స్థాయిలో ఖర్చు పెట్టారనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత టీమ్ ఫారిన్‌కి వెళుతుందని, అక్కడి ఫారెస్ట్ లొకేషన్స్‌లో యాక్షన్ సీక్వెన్స్‌లను ప్లాన్ చేశారనే టాక్ వినిపిస్తోంది.



● మహేశ్‌బాబు

సూర్య నలుపు!



● సూర్య

సూర్య హీరోగా ఆర్జే బాలాజీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు ‘కరుప్పు’ (నలుపు) అనే టైటిల్ ఖరారైంది. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి, సుప్రీత్ రెడ్డి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సూర్య కెరీర్‌లోని ఈ 45వ సినిమాను భారీ బడ్జెట్‌తో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ప్రకాశ్‌బాబు, ఎస్.ఆర్. ప్రభు నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించి, టైటిల్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌లో ఓ దేవత విగ్రహం ముందు సూర్య కత్తి పట్టుకుని కనిపిస్తున్నారు. ‘‘కొంత గ్యాప్ తర్వాత సూర్య, త్రిష కలిసి మళ్లీ ఈ సినిమా కోసం కలిసి వర్క్ చేస్తున్నారు. చిన్న ప్యాచ్ వర్క్ మినహా షూటింగ్ మొత్తం పూర్తయింది. మరోవైపు ప్రొడక్షన్ వర్క్స్ కూడా జరుగుతున్నాయి. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, జీకే విష్ణు ఛాయాగ్రాహకుడిగా చేస్తున్నారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

ప్రతి భారతీయుడు తెలుసుకోవాల్సిన నిజం

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం కేసరి చాప్టర్ 2 ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



మన ముందు చరిత్రను మనం అక్షరాల రూపంలోనే తెలుసుకోగలం. చరిత్రలో ఉన్న ఆ అక్షరాలు జరిగింది జరిగినట్టుగా కొంతవరకే తెలియజేయగలవు. ఇంకో విషయం ఏమిటంటే... ఆ అక్షరాలలో అప్పటి భావోద్వేగాలను పూర్తిగా అనుభూతి పొందలేం. అంతేకాదు చరిత్రకు ఎక్కని ఎన్నో విషయాలు ఉంటాయి. ఇప్పటి తరానికి, రేపటి భవిష్యత్తుకు చరిత్రలో లేని ఓ పేజీని మనకు పరిచయం చేసే ప్రయత్నమే ‘కేసరి చాప్టర్ 2 సినిమా. బ్రిటిష్ కాలం నాటి ఈ సినిమా కథ ప్రతి భారతీయుడి భావోద్వేగాన్ని తట్టిలేపుతుందనడంలో సందేహం లేదు. 1919 ఏప్రిల్ 13న పంజాబ్‌లోని జలియన్‌వాలా బాగ్ ప్రాంతంలో చరిత్ర మరచిపోలేని మారణహోమం జరిగింది. బ్రిటిష్ జనరల్ డయ్యర్ తన మందీ మార్బలంతో అమాయకులైన పంజాబీల మీద విచక్షణారహితంగా కాల్పులు జరిపి ఎన్నో ప్రాణాలు బలిగొన్నాడు. ఈ ఘటనను అప్పటి బ్రిటిష్ సామ్రాజ్యం చాలా తేలికగా తీసుకుని డయ్యర్‌ను అభినందించింది. ఇది ఇప్పటివరకూ మనకందరికీ తెలిసిన విషయం. ‘కేసరి చాప్టర్ 2’ సినిమా ‘ది అన్ టోల్డ్ స్టోరీ ఆఫ్ జలియన్‌వాలా బాగ్’ అనే ట్యాగ్ లైన్‌తో విడుదలైంది. అంటే ఈ ఘటన వెనక మనకు తెలియని ఓ కథను చెప్పారు. అప్పటి సంఘటనకు సంబంధించి బ్రిటిష్ ప్రభుత్వంచే గౌరవించబడ్డ భారతీయుడు సర్ శంకరన్ నాయర్ ఈ విషయంపై కోర్టులో జనరల్ డయ్యర్‌కు వ్యతిరేకంగా కేసు వాదిస్తాడు. బ్రిటిష్ ప్రభుత్వంలో బారిస్టర్‌గా ఉన్న వ్యక్తి బ్రిటిష్ సామ్రాజ్యానికి సవాలుగా మారి జలియన్‌వాలా బాగ్‌కి సంబంధించిన తెలియని విషయాలను ప్రపంచం ముందుకు ఎలా తీసుకొచ్చాడు? అన్నదే ఈ ‘కేసరి చాప్టర్ 2’. మనకు ఇంతవరకు తెలియని చాలా విషయాలను ఈ సినిమాలో చూపించారు దర్శకుడు. కరణ్ సింగ్ త్యాగి కథ రాసి, దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటించారు. మరో ముఖ్య పాత్రలో మాధవన్ కూడా నటించి, మెప్పించారు. జలియన్‌వాలా బాగ్ సంఘటన జరిగి ఇప్పటికి దాదాపు 105 సంవత్సరాలు పైనే. తప్పు జరిగిన తరువాత దానిని సరిదిద్దుకోవడానికి క్షమాపణ చెప్పడం సంస్కారం. అటువంటి ప్రయత్నం ఇప్పటికైనా బ్రిటన్ ప్రభుత్వం చేయాలని సినిమా ఆఖర్లో ఓ కార్డు రూపేణా చూపడం అభినందనీయం. మొన్న మార్చి నెలలో బ్రిటన్ పార్లమెంట్‌లో అక్కడి ప్రజా ప్రతినిధి కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించడం విశేషం. హాట్ స్టార్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ ‘కేసర్ చాప్టర్ 2’ ప్రతి భారతీయుడు తప్పనిసరిగా చూడాల్సిన సినిమా.

– హరికృష్ణ ఇంటూరు

సాక్షి
శనివారం
21-6-2025

బిజినెస్

స్టాక్ మార్కెట్లు
(తొలి రెండు బుధవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,046	319
82,408	25,112

విదేశీ సూచీలు

నాస్‌డాక్	19,448	▽	96
డోజోన్స్	42,251	▲	80
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,775	▽	17
డాక్స్	23,351	▽	293
షాంఘై	3,356	▽	2
నికాయ్	38,403	▽	85

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.20	87.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.60	118.50
€	యూరో	ఎస్‌బీఐ	98.55	101.30
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.93	60.45
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.55	58.38
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.01	69.70
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.19	12.70
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.68	24.47
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.18	13.01

చమురు రేట్లకు యుద్ధం సెగ



ఆరు నెలల గరిష్టానికి ధర

ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధంతో ముడిచమురు రేట్లు భగ్గుమన్నాయి. యుద్ధం మొదలైన గత శుక్రవారం నాడు (జూన్ 13న) ఒకే రోజున ఏకంగా 11 శాతం ఎగిసింది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ రేటు ఎకాయెకిన 70.50 డాలర్ల నుంచి 78.50 డాలర్లకు పెరిగి, ఆరు నెలల గరిష్టానికి చేరింది. వారం రోజులుగా ఆ గరిష్ట స్థాయిలోనే తిరుగుతోంది. యుద్ధం ఇదే విధంగా కొనసాగి, చమురు రవాణాకు కీలకమైన హర్ముజ్ జలసంధిని ఇరాన్ గానీ మూసివేస్తే ముడి చమురు రేట్లు 120–130 డాలర్ల వరకు కూడా ఎగిసే అవకాశం ఉందని అంచనాలు నెలకొన్నాయి. ఒకవేళ అదే జరిగితే, దేశీయంగా పెట్రోల్, డీజిల్ రేట్లకూ రెక్కలు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

చిన్న పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ల జోరు

- విస్తృతంగా 5జీ సేవలు, చౌకగా ఫోన్లు లభిస్తుండటమే కారణం
- మీడియాటెక్ ఇండియా ఎండీ అంకు జైన్ వెల్లడి
- కొత్త డైమెన్సిటీ 8450 చిప్‌సెట్ ఆవిష్కరణ





న్యూఢిల్లీ: ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ల వినియోగం గణనీయంగా పెరుగుతోందని అంతర్జాతీయ సెమీకండక్టర్ దిగ్గజం మీడియాటెక్ ఇండియా ఎండీ అంకు జైన్ వెల్లడించారు. 5జీ సేవల విస్తరణ, స్మార్ట్‌ఫోన్లు చౌకగా లభిస్తుండటం, కనెక్టెడ్ ఉపకరణాలకు డిమాండ్ నెలకొనడం తదితర అంశాలు ఇందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. దీంతో స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ ఉపకరణాలకు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలు, టెక్నాలజీ రంగం, యువత వృద్ధి చోదకాలుగా ఉండబోతున్నాయని జైన్ చెప్పారు. నెక్స్ట్–జనరేషన్ స్మార్ట్‌ఫోన్ల సామర్థ్యాలను పెంచే డైమెన్సిటీ 8450 చిప్‌సెట్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ వివరాలు చెప్పారు. టీవీలు, స్పీకర్లు, ఫ్రిజ్‌లు మొదలైన ఉపకరణాల్లోనూ ఏఐ చిప్‌సెట్లను ఉపయోగిస్తున్న నేపథ్యంలో స్మార్ట్ హోమ్ మార్కెట్లో కూడా తమకు ప్రాధాన్యం పెరుగుతోందని జైన్ చెప్పారు. దేశీయంగా సెమీకండక్టర్ల తయారీని ప్రోత్సహిస్తూ ప్రభుత్వం సరైన దిశలోనే ముందుకెళ్తోందని తెలిపారు. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల కొరతపై స్పందిస్తూ తమ సరఫరా వ్యవస్థకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రణాళికలు వేసుకుంటున్నామని జైన్ వివరించారు.

కొత్త విభాగాల్లోకి విస్తరణ ..

ఆటోమోటివ్, శాటిలైట్ కమ్యూనికేషన్స్‌లాంటి కొత్త విభాగాల్లోకి కూడా విస్తరిస్తున్నామని జైన్ తెలిపారు. ఎలక్ట్రిక్ టూ వీలర్లకు 4జీ స్మార్ట్ క్లస్టర్లను రూపొందించేందుకు జియోథింగ్స్‌తో జట్టు కట్టామని, స్కోడా స్లావియా, టాటా పంచ్ ఈవీలాంటి కార్లకు ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టంలపైనా దృష్టి పెడుతున్నామని చెప్పారు. భారత్‌లో శాటిలైట్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వ్యవస్థ విస్తరించే కొద్దీ తమ చిప్‌సెట్స్‌కు కూడా డిమాండ్ పెరుగుతుందని పేర్కొన్నారు. భారత మార్కెట్లో మరిన్ని పెట్టుబడులకు, ఇంజనీరింగ్ సిబ్బంది సంఖ్యను పెంచుకునేందుకు మీడియాటెక్ కట్టుబడి ఉందని చెప్పారు. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ ప్రకారం భారత స్మార్ట్‌ఫోన్ చిప్‌సెట్ మార్కెట్లో మీడియాటెక్ సంస్థకు 45 శాతం, క్వాల్‌కామ్‌కి 32 శాతం వాటా ఉంది. 2004లో మీడియాటెక్ భారత్‌లో తమ తొలి పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం బెంగళూరు, నోయిడా కార్యాలయాల్లో 1,000 మంది పైగా ఇంజనీర్లు ఉన్నారు.

హెచ్‌డీబీ @ రూ. 700-740

- ఈ నెల 25–27 మధ్య ఐపీవో
- కంపెనీ విలువ రూ. 61,400 కోట్లు

న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ.. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 700–740 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 25న ప్రారంభంకానున్న ఇష్యూ 27న ముగియనుంది. ఇష్యూలో భాగంగా రూ. 2,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మాతృ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ. 10,000 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనుంది. ఇష్యూ ద్వారా రూ. 12,500 కోట్లు సమకూర్చుకోవాలని ఆశిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 24న షేర్లను కేటాయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 20 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ప్రస్తుతం హెచ్‌డీబీ ఫైనాన్షియల్‌లో ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 94.36 శాతం వాటా కలిగి ఉంది. అనుబంధ సంస్థ విలువను రూ. 61,400 కోట్లుగా బ్యాంక్ మదింపు చేసింది. కాగా.. ఈక్విటీ జారీ నిధులను టైర్–1 మూలధన పటిష్టతకు హెచ్‌డీబీ కేటాయించనుంది. తద్వారా బిజినెస్ వృద్ధికి వీలుగా రుణాల విడుదల తదితర భవిష్యత్ పెట్టుబడి అవసరాలకు వినియోగించనుంది. జులై 2న బీఎస్‌ఈ, ఎన్ఎస్‌ఈలలో లిస్ట్‌కావచ్చు.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఎయిరిండియాకు డ్రీమ్‌లైనర్ క్రాష్ సెగ | మౌలిక రంగంలో మరింత తగ్గిన వృద్ధి

బుల్ బ్యాక్ ర్యాలీ

- దిగువస్థాయిల్లో భారీ కొనుగోళ్లు
- కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు
- 18 పైసలు కోలుకున్న రూపాయి
- ఒక శాతానికి పైగా లాభపడిన సూచీలు



ముంబై: దిగువ స్థాయిల్లో భారీ ఎత్తున కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు సెంటిమెంట్‌ను బలపరిచాయి. సెన్సెక్స్ 1,046 పాయింట్లు పెరిగి 82,408 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 319 పాయింట్లు బలపడి 25,112 వద్ద నిలిచింది. దీంతో సూచీల వరుస మూడురోజుల నష్టాలకు బ్రేక్ పడింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు క్రమంగా లాభాల్లోకి మళ్లాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,133 పాయింట్లు ఎగసి 82,494 వద్ద, నిఫ్టీ 343 పాయింట్లు బలపడి 25,136 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు 1% వరకు పెరిగాయి. అమెరికా మార్కెట్లు అరశాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- రూపాయి విలువ రెండునెలల కనిష్టం నుంచి కోలుకుంది. డాలర్ మారకంలో 18 పైసలు బలపడి 86.55 వద్ద స్థిరపడింది. ఎఫ్ఐఐల కొనుగోళ్లు, క్రూడాయిల్ ధరలు దిగిరావడం, డాలర్ ఇండెక్స్ బలహీనత కలిసొచ్చాయి.
- అన్ని రంగాల షేర్లకూ కొనుగోళ్ల మద్దతు లభించింది. రంగాల వారీగా బీఎస్‌ఈ ఇండెక్సుల్లో టెలికమ్యూనికేషన్ 3%, రియల్టీ 2%, ఐటీ 1.5% పెరిగాయి. సెన్సెక్స్ సూచీలోని 30 షేర్లూ లాభపడ్డాయి. భారతీ ఎయిర్‌టెల్ (3.27%), మహీంద్రాఅండ్‌మహీంద్రా (2.93%), పవర్‌గ్రిడ్ (2.38%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (2.16%), నెస్లే ఇండియా (2%) షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి.
- ఓస్వాల్ పంప్స్ లిస్టింగ్ విజయవంతమైంది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.614)తో పోలిస్తే 3% ప్రీమియంతో రూ.632 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 6% ఎగసి రూ.649 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 2% లాభంతో రూ.625 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.7,122 కోట్లుగా నమోదైంది.
- అన్నదమ్ములు దయానిధి, కళానిధి మారన్ మధ్య విభేదాలు రచ్చకెక్కడంతో సన్‌టీవీ నెట్‌వర్క్ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ఇంట్రాడేలో 5% పతనమై రూ.582 వద్ద కనిష్టాన్ని తాకింది. ఆఖరికి 1% నష్టంతో రూ.607 వద్ద ముగిసింది.
- బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, సహకార బ్యాంకులు మౌలిక రంగ ప్రాజెక్టులు, మౌలికేతర ప్రాజెక్టులకు మంజూరు చేసే రుణాలకు సంబంధించి ఆర్‌బీఐ వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభ తేదీ విషయంలో వెసులుబాటు కల్పించింది. దీంతో ఆర్ఎఫ్‌సీ, హడ్కో 5%, ఇరెడా 4%, ఆర్‌ఈసీ 3%, ఐఆర్ఎఫ్‌సీ 1% లాభపడ్డాయి.

విదేశీ ఆదాయం వెల్లడించని వారిపై చర్యలు

కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటన



న్యూఢిల్లీ: విదేశీ ఆదాయం, ఆస్తులను వెల్లడించని పన్ను చెల్లింపుదారులపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) చర్యలు తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. 5,483 మంది పన్ను చెల్లింపుదారుల తమకు రూ.29,208 కోట్ల విదేశీ ఆదాయం, మరో రూ.1,090 కోట్ల అదనపు ఆదాయం ఉందంటూ ఆలస్యపు రిటర్నులు దాఖలు చేసినట్లు తెలిపింది. ఆదాయపన్ను శాఖ నోటీసులకు స్పందించని పన్ను చెల్లింపుదారులపై చట్ట పరిధిలో సరైన చర్యలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. స్విస్ బ్యాంకుల్లో భారతీయుల ఆస్తుల మూడింతలు పెరిగి 2024 చివరికి 3.5 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్‌కు (రూ.37,600 కోట్లు) చేరినట్లు స్విస్ నేషనల్ బ్యాంక్ ప్రకటించిన నేపథ్యంలో కేంద్ర ఆర్థిక శాఖ ఈ ప్రకటన చారీ చేయడం గమనార్హం. 2024–25 అసెస్‌మెంట్ సంవత్సరం ఐటీఆర్‌లలో పన్ను చెల్లింపుదారులు ప్రకటించిన విదేశీ ఆస్తులు, ఆదాయం గణనీయంగా పెరిగిపోవడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్థిక శాఖ పేర్కొంది. ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పన్ను చెల్లింపుదారులు తమ విదేశీ ఆస్తులు, ఆదాయం వివరాలను స్వచ్ఛందంగా వెల్లడించేందుకు ముందుకు వస్తున్నట్లు, తమ ఐటీఆర్‌లను సమీక్షించుకుంటున్నట్లు తెలిపింది.

సాక్షి స్పోర్ట్స్



సాయి సుదర్శన్ @ 317

తమిళనాడు బ్యాటర్ సాయి సుదర్శన్ ఈ మ్యాచ్‌తో టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. 24 ఏళ్ల సాయి భారత్ తరఫున టెస్టు ఆడిన 317వ ఆటగాడిగా గుర్తింపు పొందాడు. భారత సీనియర్ క్రికెటర్ చతేశ్వర్ పుజారా అతనికి టెస్టు క్యాప్‌ను అందించాడు. దురదృష్టవశాత్తూ కెరీర్ తొలి ఇన్నింగ్స్ అతనికి కలిసి రాలేదు. నాలుగు బంతులే ఎదుర్కొన్న అతను 'సున్నా'కే వెనుదిరిగాడు. టెస్టు అరంగేట్రానికి ముందు సాయి భారత్ తరఫున 3 వన్డేలు, 1 టి20 మ్యాచ్ ఆడాడు. మరోవైపు ఎనిమిదేళ్ల తర్వాత కరుణ్ నాయర్ భారత్ తరఫున ఆడే అవకాశం దక్కించుకున్నాడు. టీమ్ మేనేజ్‌మెంట్ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌కు ప్రాధాన్యతనిచ్చి, తుది జట్టులో శార్దుల్ ఠాకూర్‌ను తీసుకుంది. ఈ స్థానం కోసం పోటీ పడిన ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డికి స్థానం లభించలేదు. శార్దుల్ 2023 డిసెంబర్‌లో చివరి టెస్టు ఆడాడు. మరోవైపు ఏకైక స్పిన్నర్‌గా జడేజాను కొనసాగించడంతో కుల్దీప్ యాదవ్‌ను కూడా ఎంపిక చేయలేదు.



5 విజయ్ హజారే, గావస్కర్, వెంగ్‌సర్కార్, కోహ్లి తర్వాత కెప్టెన్‌గా తొలి టెస్టులో సెంచరీ చేసిన ఐదో భారత సారథి గిల్

గిల్ సెంచరీ అభివాదం

పంత్

బ్యాటింగ్‌తో అదరగొట్టారు

భారత టెస్టు క్రికెట్‌లో కొత్త అధ్యాయం ఘనంగా మొదలైంది. అంచనాలకు మించిన ఆటతో ఇంగ్లండ్ గడ్డపై సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. సీనియర్లు తప్పుకున్నా... జట్టును ముందుకు తీసుకెళ్లేందుకు తాము సరైనోళ్లమని యువ ఆటగాళ్లు నిరూపించారు. అసాధారణ బ్యాటింగ్‌తో ముందుగా యశస్వి జైస్వాల్, ఆపై కెప్టెన్‌గా తొలి పరీక్షలో శుబ్‌మన్ గిల్ సెంచరీలు బాది సత్తా చాటగా, రిషభ్ పంత్ తన విలువను ప్రదర్శించాడు. హెడింగ్లీ పిచ్‌పై ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయిన ఇంగ్లండ్ బౌలర్లందరినీ ఒక ఆటాడుకున్న మన బ్యాటర్లు భారీ స్కోరుతో మొదటి రోజును గొప్పగా ముగించారు.

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 359/3

- గిల్, జైస్వాల్ శతకాలు
- పంత్ అర్ధసెంచరీ
- ఇంగ్లండ్‌తో మొదటి టెస్టు

లీడ్స్: ఇంగ్లండ్‌తో మొదలైన తొలి టెస్టులో మొదటి రోజు భారత్ భారీ స్కోరుతో చెలరేగింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ శుక్రవారం ఆట ముగిసే సమయానికి 85 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 359 పరుగులు చేసింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (175 బంతుల్లో 127 బ్యాటింగ్; 16 ఫోర్లు, 1 సిక్స్), ఓపెనర్ యశస్వి జైస్వాల్ (159 బంతుల్లో 101; 16 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో చెలరేగగా, వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ (102 బంతుల్లో 65 బ్యాటింగ్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. టెస్టుల్లో జైస్వాల్‌కు ఇది ఐదో సెంచరీ కాగా, గిల్‌కు ఆరో శతకం. జైస్వాల్, గిల్ మూడో వికెట్‌కు 129 పరుగులు జోడించారు. ఆ తర్వాత గిల్, పంత్ నాలుగో వికెట్‌కు అభేద్యంగా 138 పరుగులు జత చేశారు.

సిరీస్‌లో శుభారంభం...

ఓపెనర్లు జైస్వాల్, కేఎల్ రాహుల్ (78 బంతుల్లో 42; 8 ఫోర్లు) జట్టుకు సరైన ఆరంభాన్ని అందించారు. ఇంగ్లండ్ బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోవడంతో వీరిద్దరు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తూ చకచకా బౌండరీలు బాదారు. ఒకదశలో అసహనంతో జైస్వాల్ 23 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇంగ్లండ్ ఏమాత్రం అవకాశం లేకపోయినా... ఎల్బీడబ్ల్యూ కోసం రివ్యూ కోరి విఫలమైంది. తొలి గంటలో భారత్ 9 ఫోర్లతో 44 పరుగులు చేసింది. ఎట్టకేలకు లంచ్ విరామానికి ముందు ఇంగ్లండ్‌కు ఊరట దక్కింది. ఆరు బంతుల వ్యవధిలో రాహుల్, తొలి టెస్టు ఆడుతున్న సుదర్శన్ (0) అవుట్ కాగా... లంచ్ సమయానికి జట్టు స్కోరు 92/2కు చేరింది.

భారీ భాగస్వామ్యం...

విరామానంతరం 96 బంతుల్లో జైస్వాల్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఈ సెషన్‌లో జైస్వాల్, గిల్ ప్రత్యర్థి బౌలర్లను పూర్తిగా ఆడుకున్నారు. ఓవర్‌కు దాదాపు ఐదు పరుగుల రన్‌రేట్‌తో పరుగులు రాబట్టి ప్రత్యర్థిపై ఆధిక్యం ప్రదర్శించారు. వోక్స్ వేసిన రెండు ఓవర్లలో గిల్, జైస్వాల్ చెరో 3 ఫోర్లు బాది ధాటిని ప్రదర్శించారు. 56 బంతుల్లో గిల్ హాఫ్ సెంచరీని అందుకున్నాడు. మరోవైపు జోరు పెంచిన జైస్వాల్ కార్స్ ఓవర్లో 3 ఫోర్లు కొట్టి 99కు చేరుకున్నాడు. తర్వాతి బంతిని సింగిల్ తీసిన అతను 144 బంతుల్లో సెంచరీ మార్క్‌ను చేరుకొని సంబరాలు చేసుకున్నాడు. 50 నుంచి 100కు చేరడానికి జైస్వాల్ 48 బంతులే (8 ఫోర్లు, 1 సిక్స్‌తో) తీసుకోవడం విశేషం.

పంత్ జోరు...

టీ తర్వాత రెండో ఓవర్లోనే భారత్ వికెట్ కోల్పోయింది. జైస్వాల్‌ను స్టోక్స్ బౌల్డ్ చేయడంతో భారీ భాగస్వామ్యానికి తెర పడింది. ఆ తర్వాత గిల్, పంత్ కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. పంత్ తనదైన శైలిలో దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించగా...గిల్ చక్కటి షాట్లతో ఆకట్టుకున్నాడు. బషీర్ ఓవర్లో పంత్ వరుసగా 4, 6 బాదడంతో స్కోరు 300కు చేరుకోగా... టంగ్ ఓవర్లో కవర్స్ దిశగా ఆడి గిల్ 140 బంతుల్లో శతకాన్ని అందుకున్నాడు. ఇంగ్లండ్ కొత్త బంతిని తీసుకున్న తర్వాత తొలి ఓవర్లోనే పంత్ హాఫ్ సెంచరీ (91 బంతుల్లో) పూర్తయింది. ఎంత ప్రయత్నించినా ...పేలవ బౌలింగ్‌తో ఇంగ్లండ్ ఈ జోడీని విడదీయలేకపోయింది.

స్కోరు వివరాలు


భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) స్టోక్స్ 101; రాహుల్ (సి) రూట్ (బి) కార్స్ 42; సాయి సుదర్శన్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 0; గిల్ (బ్యాటింగ్) 127; పంత్ (బ్యాటింగ్) 65; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (85 ఓవర్లలో 3 వికెట్లకు) 359. వికెట్ల పతనం:** 1-91, 2-92, 3-221. **బౌలింగ్:** వోక్స్ 19-2-89-0, కార్స్ 16-5-70-1, టంగ్ 16-0-75-0, స్టోక్స్ 13-1-43-2, బషీర్ 21-4-66-0.

మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



యశస్వి సెంచరీ సంబరం

ఇంగ్లండ్ పశ్చాత్తాపం!



'కాస్త క్రికెట్ బుర్ర వాడేవారు ఎవరైనా ఇక్కడ టాస్ గెలిస్తే బ్యాటింగ్ తీసుకుంటారు'... ఇంగ్లండ్ నిర్ణయంపై మాజీ కెప్టెన్ మైక్ ఆథర్టన్ వ్యాఖ్య ఇది. మరో మాజీ కెప్టెన్ కుక్ కూడా ఇదే తరహా అభిప్రాయం వ్యక్తం చేశాడు. తీవ్రమైన ఎండ, పొడిగా ఉన్న పిచ్, స్వింగ్‌కు ఏమాత్రం అవకాశం లేని వాతావరణం, పెద్దగా అనుభవం లేని బౌలర్లు... ఇలాంటి స్థితిలో టాస్ గెలిచి స్టోక్స్ బౌలింగ్ ఎంచుకునే సాహసం చేశాడు. హెడింగ్లీ మైదానంలో గత ఆరు టెస్టుల్లో ముందుగా బౌలింగ్ చేసిన జట్టే గెలిచింది. కానీ శుక్రవారం పరిస్థితి వాటికి భిన్నం. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై భారత బ్యాటర్లు స్వేచ్ఛగా ఆడటం చూస్తే తాము చేసిన తప్పేమిటో ఇంగ్లండ్‌కు అర్థమై ఉంటుంది.

పెనాల్టీ పరుగులు...7 బంతుల ఓవర్!

→ 45 పరుగుల వద్ద జైస్వాల్‌కు అదృష్టం కలిసొచ్చింది. కార్స్ వేసిన యార్కర్‌ను అతను చివరి నిమిషంలో నిలువరించగలిగాడు. ఇంగ్లండ్ అప్పీల్‌కు సిద్ధమైన తరుణంలో అంపైర్ దానిని 'నోబాల్'గా ప్రకటించాడు. ఆ తర్వాత రీప్లే చూస్తే బంతి ముందుగా అతని ప్యాడ్‌కు తాకినట్లు తేలింది. 'నోబాల్' కాకపోతే అది కచ్చితంగా అవుట్‌గా తేలేది. → గిల్ 1 పరుగు వద్ద ఉన్నప్పుడు కార్స్ బౌలింగ్‌లో కష్టసాధ్యమైన సింగిల్ కోసం ప్రయత్నించాడు. అయితే గిల్ చాలా దూరంలోనే ఉన్నా... పోప్ వేసిన త్రో నేరుగా వికెట్లకు తాకకపోవడంతో రనౌట్ కాకుండా తప్పించుకున్నాడు. ఓవర్‌త్రో బౌండరీని చేరడంతో మరో నాలుగు పరుగులు జట్టు ఖాతాలో చేరాయి. → టీ విరామానికి ముందు స్టోక్స్ వేసిన చివరి ఓవర్లో స్లిప్ ఫీల్డర్ రూట్ బంతిని ఆపే క్రమంలో దానిని పక్కకు తోశాడు. అది అక్కడే పెట్టిన వికెట్ కీపర్ హెల్మెట్‌ను తాకడంతో భారత్‌కు ఐదు పెనాల్టీ పరుగులు అదనంగా లభించాయి. ఈ గందరగోళంలో అంపైర్ లెక్క తప్పడంతో ఈ ఓవర్లో స్టోక్స్ 7 బంతులు వేశాడు. → ఇటీవలి అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి నివాళి అర్పిస్తూ మ్యాచ్ ఆరంభానికి ముందు నిమిషం పాటు మౌనం పాటించిన ఇరు జట్ల ఆటగాళ్లు భుజానికి నల్ల బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఆందోళన

గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ నగదు ఇవ్వాలని డిమాండ్



ధర్నా చేస్తున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

నెల్లూరు (అర్బన్): తమకు దీర్ఘకాలికంగా రావాల్సిన గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌తోపాటు సామాజిక పింఛన్‌లు ఇవ్వాలని కోరుతూ పలువురు ఆర్టీసీ ఉద్యోగులు ఏపీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ రెడ్డి మాట్లాడుతూ తమకు రావాల్సిన గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ నగదు ఇవ్వకపోవడం దారుణమని, కనీసం సరైన పింఛను పథకం కూడా లేదన్నారు. ఈపీఎస్–95 పథకం ద్వారా తమ జీతంలో కట్ చేసిన నగదును సంస్థ వద్ద ఉంచుకుని రిటైర్ అయ్యాక కొందరికి నెలకు రూ.1,000, మరికొందరికి రూ.2,500 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఇంత చిన్న మొత్తంతో వృద్ధాప్యంలో ఎలా బతకాలని ప్రశ్నించారు. తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, సామాజిక పింఛన్లు అందించాలని కోరారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం అందచేశారు.

ఉద్యాన కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ఉద్యాన విశ్వవిద్యాలయం

తాడేపల్లిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో హార్టీకల్చర్ డిప్లొమా, హార్టీ కల్చర్ ల్యాండ్ స్కేపింగ్, నర్సరీ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆఫ్‌లైన్ దరఖాస్తులను కోరుతున్నట్టు ఉద్యాన వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26కి గాను దరఖాస్తు గడువు జూలై 7వ తేదీ వరకు పొడిగించినట్టు తెలిపారు. ఈ కోర్సుల్లో చేరడానికి పదోతరగతి లేదా తత్సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. పదోతరగతి కంపార్టుమెంటులో ఉత్తీర్ణులైనవారు, ఇంటర్మీడియట్ ఫెయిలైన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. అభ్యర్థి వయసు 2025 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలని తెలిపారు. ఇంగ్లిషు మీడియంలో బోధన ఉంటుందని, మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలని రిజిస్ట్రార్ విజ్ఞప్తి చేశారు.

మైనింగ్ కేసులో మోహన్‌రంగాకు బెయిల్

గన్నవరం: మైనింగ్ కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుడైన ఓలుపల్లి మోహన్‌రంగాకు శుక్రవారం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఇప్పటికే వంశీతోపాటు మోహన్‌రంగాను పీటీ వారెంట్‌పై పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో మోహన్‌రంగా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై వాదనల అనంతరం బెయిల్ మంజూరు చేస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

‘సాక్షి టీవీ’కి హైకోర్టులో ఊరట

పోలీసులు నమోదుచేసిన కేసులో తదుపరి చర్యలన్నీ నిలుపుదల

- ఉత్తర్వులు జారీచేసిన హైకోర్టు
- ఫిర్యాదుదారు కంభంపాటి శిరీషకు నోటీసులు.. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు ఆదేశం
- ప్యానలిస్ట్ వ్యాఖ్యలకు మమ్మల్ని బాధ్యులుగా చేయడం తగదు
- ఆ వ్యాఖ్యలతో మాకు సంబంధమేలేదు.. కేసును కొట్టేయండి
- హైకోర్టులో సాక్షి టీవీ యాజమాన్యం పిటిషన్



సాక్షి, అమరావతి : సాక్షి టీవీ యాజమాన్యానికి హైకోర్టు ఊరటనిచ్చింది. రాజధాని అమరావతిపై సీనియర్ పాత్రికేయుడు వీవీఆర్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలకు గాను సాక్షి టీవీ యాజమాన్యంపై తుళ్లూరు పోలీసులు నమోదుచేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ హైకోర్టు నిలిపేసింది. ఫిర్యాదుదారు అయిన తెలుగుదేశం పార్టీ నేత కంభంపాటి శిరీషకు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను జూలై 24కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

ప్యానలిస్ట్ వ్యాఖ్యలకు సాక్షి టీవీపై కేసు..

సాక్షి టీవీలో ప్రముఖ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు నిర్వహించే ‘లైవ్ విత్ కేఎస్సార్’ షోలో ప్యానలిస్ట్‌గా పాల్గొన్న సీనియర్ పాత్రికేయుడు వీవీఆర్ కృష్ణంరాజు అమరావతి గురించి పలు వ్యాఖ్యలు చేశారు. వీటిపై టీడీపీ నేత కంభం శిరీష గుంటూరు జిల్లా, తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా తుళ్లూరు పోలీసులు కృష్ణంరాజుతో పాటు యాంకర్‌గా వ్యవహరించిన కొమ్మినేని శ్రీనివాసరావు, సాక్షి యాజమాన్యంపై కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో.. తమపై పోలీసులు నమోదుచేసిన కేసును కొట్టేయాలని కోరుతూ సాక్షి టీవీ హోల్‌టైం డైరెక్టర్ బి. రమణారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం జస్టిస్ హరినాథ్ విచారణ జరిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టడాన్ని కోర్టే తప్పుపట్టింది..

ఇక రిమాండ్ కోసం పోలీసులు కొమ్మినేనిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడాన్ని తప్పుపడుతూ ఆ సెక్షన్‌ను తొలగించారని నిరంజన్‌రెడ్డి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసేందుకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవని మేజిస్ట్రేట్ తేల్చారన్నారు. ఆ తర్వాత కొమ్మినేని అరెస్టు, రిమాండ్‌పై తాము సుప్రీంకోర్టును ఆశ్రయించామని, విచారణ జరిపిన సుప్రీంకోర్టు కొమ్మినేనిని విడుదల చేయాలని ఆదేశించిందన్నారు. ప్యానలిస్ట్ చేసిన వ్యాఖ్యలతో యాంకర్‌కు, టీవీ యాజమాన్యానికి సంబంధంలేదని పలు తీర్పుల్లో సుప్రీంకోర్టు చెప్పిందని కోర్టుకు తెలిపారు.

దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉంది..

పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాణినిసోమయాజీ వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉందన్నారు. దర్యాప్తునకు సహకరించేలా సాక్షి టీవీ యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది చేసిన వాదనల్లో బలం ఉందన్నారు. సాక్షి టీవీ నుంచి రికార్డులు తీసుకుని వాటిని వారికి వ్యతిరేకంగా ఉపయోగించే అవకాశం ఉన్నందున ఈ మొత్తం వ్యవహారంపై లోతుగా విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల సాక్షి టీవీ యాజమాన్యంపై తుళ్లూరు పోలీసులు నమోదుచేసిన కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ ఉత్తర్వులు జారీచేస్తున్నట్లు తెలిపారు.

టీవీ యాజమాన్యాన్ని బాధ్యులుగా చేయలేరు..

పిటిషనర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఎస్. నిరంజన్‌రెడ్డి, న్యాయవాది వేలూరి మహేశ్వర్‌రెడ్డి వాదనలు వినిపించారు. చర్చా కార్యక్రమంలో ప్యానలిస్ట్ చేసిన వ్యాఖ్యలకు సాక్షి టీవీ యాజమాన్యాన్ని బాధ్యులుగా చేయడం తగదని నిరంజన్‌రెడ్డి తెలిపారు. ప్యానలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలతో సాక్షి టీవీకి ఎలాంటి సంబంధంలేదన్నారు. ఇదే విషయాన్ని తాము టీవీ ముఖంగా ప్రజలందరికీ తెలియజేశామన్నారు. అయితే, పోలీసులు మాత్రం బీఎన్ఎస్ సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కూడా కేసు నమోదుచేశారన్నారు. అంతేకాక.. సాక్షి టీవీకి సంబంధించిన రికార్డులు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ఇతర వస్తువులు కావాలని నోటీసులిచ్చారన్నారు. వాటిని సాక్షి టీవీ యాజమాన్యానికి వ్యతిరేకంగా ఉపయోగించే ప్రమాదం ఉందని, ఇందుకు చట్టం ఎంతమాత్రం అనుమతించదన్నారు. నిందితునిగా చేర్చిన వ్యక్తికి వ్యతిరేకంగా సాక్ష్యాలు ఇవ్వాలని కోరలేరన్నారు. వాస్తవానికి షో నిర్వహించిన కొమ్మినేని శ్రీనివాసరావును పోలీసులు అక్రమంగా అరెస్టుచేశారని నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఆయేషా మీరా హత్య కేసులో తుది నివేదిక సమర్పించిన సీబీఐ

- నివేదికను కింది కోర్టులో దాఖలు చేసేందుకు సీబీఐకి అనుమతిచ్చిన హైకోర్టు
- తమకొక కాపీ ఇవ్వాలని కోరిన ఆయేషా తల్లిదండ్రుల తరఫు న్యాయవాదులు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్య కేసులో దర్యాప్తు పూర్తి చేసినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) పేర్కొంది. తుది నివేదికను సీల్డ్ కవర్‌లో శుక్రవారం హైకోర్టు ముందుంచింది. దానిని విజయవాడ సీబీఐ కోర్టులో దాఖలు చేసేందుకు అనుమతినివ్వాలని హైకోర్టును కోరగా.. ఉన్నత న్యాయస్థానం అందుకు అనుమతిచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, నివేదిక కాపీని తమకు ఇవ్వాలన్న ఆయేషా తల్లిదండ్రుల తరఫు న్యాయవాదుల అభ్యర్థనను న్యాయమూర్తి తోసిపుచ్చారు. అలాంటి ఆదేశాలు ఇవ్వలేమని, అందుకు కింది కోర్టులో దరఖాస్తు చేసుకోవాలని వారికి సూచించారు.

ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల



ఏఎన్‌యూ: రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కళాశాలల్లో ప్రవేశాలకు ఇటీవల నిర్వహించిన ఎడ్‌సెట్– 2025 ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు ఎడ్‌సెట్ చైర్మన్ ఆచార్య కె.గంగాధరరావు, కన్వీనర్ ఆచార్య ఏవీఎస్ స్వామి తెలిపారు. ఫలితాలను సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఎడ్‌సెట్‌కు మొత్తం 14,612 మంది హాజరుకాగా 14,527 మంది అర్హత సాధించారని తెలిపారు.

భీమవరంలో ఆకతాయిల హల్‌చల్

- వెంటపడి విద్యార్థులపై దాడి
- సోషల్ మీడియాలో వీడియోలు వైరల్
- కేసు నమోదు చేసిన పోలీసులు



భీమవరంలో విద్యార్థులపై దాడి చేస్తున్న ఆకతాయిలు

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు స్కూల్ బస్సులో వెళుతుండగా కొందరు ఆకతాయిలు శుక్రవారం దాడి చేశారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. వివరాల్లోకి వెళితే... భీమవరం శ్రీమావుళ్లమ్మ అమ్మవారి జ్యేష్ఠమాస జాతర మహోత్సవం గురువారం నిర్వహించారు. తీన్‌మార్ డప్పులు, విచిత్ర వేషాలతో సాగిన ఉత్సవం సాయంత్రం స్థానిక పోలీస్ బొమ్మ సెంటర్‌కు చేరుకుంది. అదే సమయానికి ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు అటుగా వస్తోంది. బస్సులోని విద్యార్థి జి.రవికుమార్ చేయి బయటకు పెట్టుకుని ఉండగా ఆకతాయిల్లోని ఒకరు రవికుమార్ చేతిపై కొట్టాడు. దీంతో రవికుమార్ మిత్రుడు బస్సు దిగి ఎందుకు కొట్టారని ఆకతాయిలను నిలదీశాడు. ఇదే అదనుగా వడ్డాది సాయి, కె.చరణ్, బి.వేణుగోపాలకృష్ణ మరికొందరు కలిసి విద్యార్థులపై దాడి చేశాడు. పిడిగుద్దులు గుద్దుతూ తరిమి కొట్టారు. దీంతో భయపడిన విద్యార్థులు బస్సు ఎక్కే ప్రయత్నం చేస్తుండగా వెంటపడి మరీ తరిమికొట్టారు. అడ్డుకోబోయిన స్థానికులపై సైతం ఆకతాయిలు దాడికి దిగి, గేలి చేస్తూ నృత్యాలు చేశారు. ఈ వికృత చేష్టలు అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఘటన సమయంలో ఆకతాయిలు గంజాయి, మద్యం మత్తులో ఉన్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు జోక్యం చేసుకుని వివరాలు సేకరించారు. విద్యార్థి రవికుమార్ ఫిర్యాదు మేరకు సాయి, చరణ్, వేణుగోపాలకృష్ణలపై కేసు నమోదు చేసినట్టు భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఈ నెలాఖరుకు 9650 ఏఎన్‌ఎంల బదిలీ

సాక్షి, అమరావతి: ఈ నెలాఖరుకి 9650 గ్రేడ్–3 ఏఎన్‌ఎంల బదిలీలను వైద్య శాఖ పూర్తి చేయనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మందికిపైగా ఏఎన్‌ఎంలు సచివాలయాల్లో పనిచేస్తుండగా 9,650 మంది తప్పనిసరి బదిలీల్లో ఉన్నట్టు తేల్చారు. మరోవైపు వైద్య శాఖలో సాధారణ బదిలీల ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 5200 మంది, రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు దరఖాస్తు చేసుకున్న 1899 మందిని బదిలీ చేశారు. డీఎంఈ పరిధిలో 379 మంది ఫ్యాకల్టీకి స్థాన చలనం కలిగింది.

కాలానికి తగ్గట్టు రెవెన్యూ ఉద్యోగులు మారాలి

- ఈ నెల 29న సన్నాహక సమావేశం
- ఫోన్‌లు, సామాజిక మాధ్యమాల ద్వారా కాపు నేతలకు ఆహ్వానం

సాక్షి, అమరావతి: కాలానికి అనుగుణంగా రెవెన్యూ ఉద్యోగులు తమ నడవడికను మార్చుకోవాలని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) జయలక్ష్మి అన్నారు. ప్రజలతో సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. విజయవాడలోని రాష్ట్ర రెవెన్యూ భవన్‌లో శుక్రవారం జరిగిన రెవెన్యూ దినోత్సవం సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల పనితీరే ప్రభుత్వ పరిపాలనకు అద్దం పడుతుందని తెలిపారు.ఉద్యోగుల మనసుల్లో సేవా స్ఫూర్తి ఉంటే ప్రజల మనసులను గెలుచుకోవచ్చని అభిప్రాయ పడ్డారు. రెవెన్యూశాఖ ద్వారానే అన్ని పనులు జరగాలనే గర్వం ఉద్యోగుల్లో ఉండాలన్నారు. ప్రజలతో సామరస్యం, అర్జీలను పరిష్కరించడంలో చొరవ అవసరమన్నారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెవెన్యూ దినోత్సవం ఒక వేడుక మాత్రమే కాదని, ఉద్యోగులందరికీ తమ సేవలపై ఆత్మ పరిశీలన చేసుకునే రోజన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, నేతలు నరసింహరావు, ఎస్.శ్రీనివాస్, శ్రీనివాస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు రెవెన్యూ ఉద్యోగులు ర్యాలీ చేశారు.

రెండో విడత లాటరీలో 8,583 మందికి సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాల కోసం రెండో విడత లాటరీ ఫలితాలను సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు శుక్రవారం వెల్లడించారు. రెండో విడతలో 8,583 విద్యార్థులను ఎంపిక చేశామని, సమాచారాన్ని వారి తల్లిదండ్రుల మొబైల్ నంబర్లకు తెలియజేశామన్నారు. తొలి విడత లాటరీలో 23,118 మందికి సీట్లు కేటాయించగా 15,541 మంది పాఠశాలల్లో చేరారన్నారు.మిగిలిన సీట్లను రెండో విడతలో భర్తీ చేసామని శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు.

మీ భర్తలు జగన్ పర్యటనకు వెళ్లారు..

- ఉచిత టైలరింగ్ శిక్షణకు రావద్దు
- ఇద్దరు మహిళలకు ఆదేశాలు



సత్తెనపల్లి ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కనుమూరి వనజ. పక్కన భర్త విశ్వేశ్వరరావు

సత్తెనపల్లి: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ సత్తెనపల్లి పర్యటన విజయవంతం కావడంతో ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు సమీపంలోని డంపింగ్ యార్డ్ కేంద్రంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తోంది. సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు గ్రామానికి చెందిన కనుమూరు వనజ, నర్రా మల్లేశ్వరి ఈ శిక్షణకు వెళుతున్నారు. అయితే గురువారం వైఎస్ జగన్ సత్తెనపల్లి పర్యటనలో వారి భర్తలు కనిపించారంటూ టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో ఇకపై శిక్షణకు రావద్దు అంటూ నిర్వాహకులు నాగదుర్గ, ఈశ్వరి ఆదేశించారు. దీంతో వారు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. మల్లేశ్వరి కంటతడి పెట్టుకుని వెళ్లిపోగా, వనజ మాత్రం న్యాయ పోరాటానికి దిగింది. జరిగిన విషయాన్ని భర్త విశ్వేశ్వరరావుకు చెప్పి, శుక్రవారం సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసింది. తాము ప్రారంభం నుంచి శిక్షణకు హాజరవుతున్నామని, ఏ ఉద్దేశంతో శిక్షణకు రావద్దని చెప్పారో తెలపాలని, న్యాయం చేయాలని కోరింది. బీసీ కార్పొరేషన్ జిల్లా అధికారులతో పాటు కలెక్టర్‌ను కూడా కలిసి సమస్య విన్నవించుకుంటానని, అసలు ఈ విషయంలో రాజకీయ పార్టీల జోక్యం ఏంటని నిలదీసింది. న్యాయం జరిగే వరకూ పోరాడతానని స్పష్టం చేసింది.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

- విశాఖ వేదికగా ప్రధాని ప్రకటించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని మోదీ విశాఖ వేదిక నుంచి ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విజయవాడలో రెండు రోజుల పాటు నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను శ్రీనివాసరావు శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. యోగా కోసం విశాఖ వచ్చిన ప్రధాని మోదీతో విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో స్పష్టమైన ప్రకటన చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. పోలవరం పునరావాస చర్యలు చేపట్టి నిర్వాసితులను ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలు చేపడితే వాటిలో 10 కళాశాలలను 66 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేలా ప్రైవేటు పరం చేయాలని కూటమి ప్రభుత్వం అడుగులు వేయడం దారుణమన్నారు. గ్రామాల్లో బడులు మూసివేయొద్దని, ప్రభుత్వ విద్యను కాపాడాలన్నారు. గిరిజనులకు న్యాయం చేసేలా ఏజెన్సీలో స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. యువతకు వెంటనే నిరుద్యోగభృతి ఇవ్వడంతోపాటు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలన్నారు.

ప్రేమోన్మాది ఘాతుకం

- ప్రేమించలేదని యువతిపై హత్యాయత్నం
- రాత్రి సమయంలో ఇంటికెళ్లి మరీ దాడి
- కూటమి పాలనలో యువతులకు రక్షణ కరువు

ముదినేపల్లి రూరల్: కూటమి పాలనలో యువతులకు రక్షణ కరువవుతోంది. ఓ ప్రేమోన్మాది ఘాతుకానికి తెగబడ్డాడు. తన ప్రేమను నిరాకరించిందన్న అక్కసుతో యువతిపై హత్యాయత్నం చేసిన ఘటన ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలోని కోడూరులో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దొంగ సాయి పాలిటెక్నిక్ చదివి కాంట్రాక్టర్ వద్ద గుమాస్తాగా పని చేస్తున్నాడు. గుడివాడలోని ప్రైవేటు కళాశాలలో చదువుతున్న ఓ యువతిని ప్రేమించాడు. ఇది కుటుంబసభ్యులకు తెలియడంతో వారిని మందలించారు. అప్పటినుంచి ఆ యువతి సాయికి దూరంగా మెలుగుతూ వస్తోంది. అతనితో మాట్లాడడం లేదు. అయినా సాయి తనను ప్రేమించాలని, లేకుంటే చంపేస్తానని బెదిరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి యువతి ఇంటికి వెళ్లి కిటికీ అద్దాలు పగలగొట్టి కమ్మ కత్తితో ఆమెపై దాడి చేశాడు. చేతులు అడ్డం పెట్టి తప్పించుకునే యత్నం చేయగా ఆమె గొంతుపై కత్తి తగిలి గాయమైంది. యువతి భయంతో కేకలు పెట్టడంతో స్థానికులు ఘటనాస్థలానికి చేరుకునేసరికి సాయి అక్కడినుంచి పరారయ్యాడు. గాయపడిన యువతిని గుడివాడ ఏరియా ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం కుటుంబసభ్యులు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలించి అరెస్టు చేశారు. కైకలూరు కోర్టులో అతడిని హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు.

Published and printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

శనివారం ః 21 ః జూన్ ః 2025

స్పెషల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ కవాతు



శివమొగ్గ: మత ఘర్షణలను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన స్పెషల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం శివమొగ్గ నగరంలో కవాతు నిర్వహించారు. శాంతిభద్రతలను కాపాడటానికి, ప్రజల్లో ధైర్యం నింపేందుకు ప్రత్యేక ఊరేగింపు చేపట్టినట్లు పోలీసు శాఖ తెలిపింది.

కొండచరియలతో ముప్పు

- 2,252 గ్రామాలకు వరద ముప్పు
- భూకంపం, కొండచరియలు విరిగిపడతాయి
- రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార నివేదికలో వెల్లడి



శిరూరు వద్ద కూలిన కొండచరియలు



ఉత్తరకన్నడ జిల్లాలో విరిగిన కొండచరియలు

బనశంకరి: నైరుతి వర్షాల నేపథ్యంలో 31,261 చదరపు కిలోమీటర్లలో భూమి కుంగడం, కొండచరియలు విరిగిపడే ప్రదేశాలను గుర్తించగా ఇందులో 2,252 గ్రామాలకు ముప్పు పొంచి ఉంది. ఈమేరకు రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార తన నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కరావళి జిల్లాల్లో వరదలు, భూమి కుంగిపోవడం, కొండచరియలు విరిగిపడే ఘటనలు పెచ్చుమీరుతున్నాయి. ఈ నేపథ్యంలో రెవిన్యూ శాఖ వరదలు, భూమి కుంగిపోవడం, ఇతర విపత్తులకు గురయ్యే ప్రదేశాలను గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది. సుమారు 29 తాలూకాల్లో 1,164.52 చదరపు కిలోమీటర్లు ప్రదేశంలో అత్యధికంగా భూమి కుంగిపోయే ప్రమాదం ఉండగా, 5,386.79 చదరపు కిలోమీటర్ల పరిధిలో కొండచరియలు విరిగిపడనున్నాయి. 24,710.11 చదరపు కిలోమీటర్లలో భూమి కుంగిపోయే ప్రమాదం ఉందని ఆ నివేదికలో పొందుపరిచారు.

ఆయా జిల్లాల్లో వివరాలివే..

ప్రధానంగా దక్షిణ కన్నడ, శివమొగ్గ, చిక్కమగళూరు, ఉత్తర కన్నడ, కొడగు, ఉడుపి, హాసన జిల్లాల్లో అధికంగా భూమి కుంగడం, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉంది. భారతీయ భూ విజ్ఞాన సమీక్ష, రాష్ట్ర నైసర్గిక విపత్తు నిర్వహణ సమితి నివేదిక ప్రకారం కర్ణాటకలో కనీసం 15.30 శాతం భూభాగం కుంగిపోయే ప్రమాదం పొంచి ఉంది. రెవెన్యూ శాఖ ఇచ్చిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 2006 నుంచి ఇప్పటివరకు సుమారు 1,541 చదరపు కిలోమీటర్ల మేర భూమికుంగిపోగా, కొండచరియలు విరిగిపడటంతో 101 మంది మృత్యువాత పడ్డారు. రెవెన్యూశాఖ కర్ణాటక రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార నివేదిక ప్రకారం ఉత్తరకన్నడలో అత్యధికంగా 8,389.26 చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో భూమి కుంగిపోయే ప్రమాదం ఉంది. శివమొగ్గలో 4,797.97 చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో భూమి కుంగిపోనుంది. దక్షిణకన్నడ జిల్లాలో సుమారు 4,600 చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో భూమి కుంగిపోవడం, కొండచరియలు విరిగిపడటం జరుగనుంది. కొడగులో 4,150 చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో భూమి కుంగిపోయే అవకాశం ఉంది.



గోకర్ణ తుర్కె గ్రామం వద్ద కొండచరియలు విరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న భూవిజ్ఞాన పరిశోధన శాఖ అధికారుల బృందం

ప్రమాదం పొంచి ఉన్న జిల్లాలు

చిక్కమగళూరులో సుమారు 4,100 చదరపు కిలోమీటర్ల ప్రదేశం, ఉడుపిలో 2,650 చదరపు కిలోమీటర్లు, హాసనలో 1,100 చదరపు కిలోమీటర్లు ప్రదేశంలో భూమికుంగిపోయే ప్రమాదం ఉంది. బీబీఎంపీ పరిధిలో 201 ప్రాంతాలకు ముంపు ముప్పు ఉన్నట్లు గుర్తించారు. బెళగావిలో 230 గ్రామాలు, బాగల్‌కోటలో 203 గ్రామాలు, విజయపురలో 76 గ్రామాలు, ఉత్తర కన్నడలో 208 గ్రామాలు, చిత్రదుర్గలో 51 గ్రామాలకు వరదల ముంపు ఉంది. బీదర్‌లో 51 గ్రామాలు, శివమొగ్గలో 216 గ్రామాలు, కలబుర్గిలో 153 గ్రామాలు, గదగలో 43 గ్రామాలు, బళ్లారిలో 19, కొప్పళలో 27, హావేరిలో 80, దక్షిణకన్నడలో 90, ఉడుపిలో 86 గ్రామాల్లో వరదలు, భూమి కుంగిపోయే ప్రదేశాలుగా గుర్తించింది. మండ్యలో 112, చామరాజనగరలో 21, చిక్కమగళూరులో 85 గ్రామాలు, కొడగులో 88 గ్రామాలు, యాదగిరిలో 80 గ్రామాలు, హాసనలో 81 గ్రామాలు, ధార్వాడలో 56, తుమకూరులో 13 గ్రామాలు, రాయచూరులో 26 గ్రామాలు, విజయనగరలో 22, మైసూరులో 63, రామనగరలో 17 గ్రామాలు, దావణగెరెలో 55 గ్రామాలను వరదలు, భూమికుంగిపోయే ప్రదేశాలుగా గుర్తించారు. వరదలు, భూమికుంగిపోవడం, కొండచరియలు విరిగిపడే ప్రదేశాల్లో రెవెన్యూ, పంచాయతీ అభివృద్ధి అధికారులు, గ్రామ పాలనాధికారి, పోలీస్ ప్రతినిధి, అగ్నిమాపక శాఖ ప్రతినిధి, ఆరోగ్యశాఖ ప్రతినిధి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతినిధి, పశుసంవర్ధక శాఖ ప్రతినిధులతో కూడిన నగర, స్థానిక సంస్థలు, గ్రామీణ స్థానిక సంస్థలు విపత్తు నిర్వహణ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించింది.


సర్కారుపై ఐకమత్యంగా పోరాడండి

- పార్టీ నాయకులకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఉద్బోధ

శివాజీనగర: రాష్ట్ర బీజేపీలో నాయకుల్లో నెలకొన్న విభేదాలకు చెక్ పెట్టేందుకు ఆ పార్టీ నేత అమిత్‌షా ప్రయత్నించారు. ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం బెంగళూరు విచ్చేసిన ఆయన రాష్ట్ర నాయకులతో సమావేశమయ్యారు. మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ బసవరాజ బొమ్మై, బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర, ప్రతిపక్ష నేత ఆర్.అశోక్, శాసనసభా పక్ష ఉప నాయకుడు అరవింద బెల్లద, ఎంపీ తేజస్వి సూర్యతో పాటు పలువురితో సమావేశమయ్యారు. రాష్ట్ర బీజేపీలో చోటు చేసుకొన్న పరిణామాలు, కాంగ్రెస్ ప్రభుత్వంలోని పరిణామాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని తీవ్రం చేయాలని సూచించారని తెలిసింది. పార్టీ అధ్యక్షుల ఎంపిక విషయంపై త్వరలోనే తీర్మానం తీసుకుంటామని చెప్పినట్లు సమాచారం. విజయేంద్రను కొనసాగించే విషయంపై అభిప్రాయాలను సేకరించాం. త్వరలోనే హైకమాండ్ ఒక తీర్మానం చేస్తుందని అమిత్ షా చెప్పారని తెలిసింది. పార్టీలో అసంతృప్తి, అసమ్మతికి అవకాశం కల్పించకుండా అందరూ కలసికట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేకంగా పోరాటం చేపట్టాలని సూచించారని తెలిసింది. కాగా బీజేపీ రాష్ట్రాధ్యక్షుడిగా బీ.వై.విజయేంద్రను కొనసాగించాలని ఆయన తరఫున నాయకులు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు విన్నవించారని తెలిసింది. కాగా విజయేంద్ర వ్యతిరేక వర్గం గురువారం అర్ధరాత్రి జీ.ఎం.సిద్దేశ్వర్ ఇంటిలో సమావేశం జరిపి పార్టీ హైకమాండ్‌కు విజయేంద్రపై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైంది. అయితే కేంద్ర మంత్రి వీ.సోమణ్ణ, ప్రహ్లాద్ జోషిలు బీజేపీ భిన్నాభిప్రాయ వర్గంలో గుర్తింపు పొందిన మాజీ ఎంపీ సిద్దేశ్వర్, ఎమ్మెల్యే బీ.పీ.హరీశ్, మాజీ మంత్రులు అరవింద లింబావళి, రమేశ్ జార్కిహొళిలను కలిసి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మంత్రి సోమణ్ణ సైతం పాల్గొని అసమ్మతి నాయకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పార్టీని దృష్టిలో పెట్టుకొని హైకమాండ్ తీర్మానానికి అందరూ కట్టుబడి ఉండాలని మంత్రి సోమణ్ణ తెలిపారని తెలిసింది.

రాష్ట్రంలో అవినీతి తాండవం

- మాజీ సీఎం బీఎస్.యడియూరప్ప



బనశంకరి: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి తాండవిస్తోందని, అభివృద్ధి పనులు నిలిచిపోయాయని మాజీ సీఎం బీఎస్.యడియూరప్ప ఆరోపించారు. శుక్రవారం నగర బీజేపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజల బాధలు పట్టించుకునేవారే లేరన్నారు. అభివృద్ధి వైపు దృష్టి సారించడం లేదన్నారు. నీటిపారుదల పథకాలు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. రాష్ట్రంలో ఈ ప్రభుత్వం ఒక కి.మీ. రోడ్డు వేసి ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. ఈ ప్రభుత్వానిది తుగ్లక్ దర్బార్ అని దుయ్యబట్టారు. తాము మైనార్టీలకు వ్యతిరేకం కాదన్నారు. కానీ మైనార్టీలకు మితిమీరి సహాయం చేయడం నేరమన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అనుకూలం చేయాల్సిన ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం మైనార్టీలను బుజ్జగించే పనిలో నిమగ్నమైందన్నారు. దీనిని తామంతా ఖండిస్తున్నామన్నారు. డబ్బు ఇచ్చి ఆశ్రయ ఇళ్లు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఆర్.పాటిల్ ఆడియో వైరలైన విషయం గురించి మాట్లాడుతూ బీఆర్.పాటిల్ చెప్పింది నూటికి నూరు శాతం సత్యమన్నారు. ప్రభుత్వం తప్పు ఒప్పుకుని దీనిని సరిదిద్ది పేదలకు న్యాయం చేయాలని ఆయన అన్నారు.

'డబ్బు ఇచ్చిన వారికే ఇళ్లు' ఆడియో వైరల్

బనశంకరి: డబ్బు ఇచ్చినవారికి మాత్రమే వసతి మండలిలో ఇళ్ల ను మంజూరుచేశామని ఆళంద ఎమ్మెల్యే బీఆర్.పాటిల్ మాట్లాడిన ఆడియో వైరల్ అయింది. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీసింది. గృహ నిర్మాణశాఖ మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్ వ్యక్తిగత కార్యదర్శి సర్ఫరాజ్‌ఖాన్‌కు ఫోన్‌చేసి తమ ప్రభుత్వ కార్యవైఖరిపై బీఆర్.పాటిల్ అసమాధానం వ్యక్తం చేసినట్లు ఆడియోలో ఉంది.

న్యాయ విచారణ జరిపించాలి

దొడ్డబళ్లాపురం: రాష్ట్ర వసతి శాఖలో ఇళ్ల పంపిణీలో అవినీతి చోటుచేసుకుందని ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ వెల్లడించారని, ఈ అవినీతి వ్యవహారంపై న్యాయ విచారణ చేపట్టాలని ప్రతిపక్ష నేత ఆర్ అశోక్ డిమాండ్ చేశారు. డబ్బు ఇచ్చిన వారికే రాజీవ్ గాంధీ వసతి మండలి ద్వారా ఇళ్లు కేటాయిస్తున్నారని ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్‌కు కాల్ చేసి మాట్లాడిన ఆడియో వాస్తవానికి అద్దం పడుతోందన్నారు. ఈ ఆడియో ఆధారంగా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ ఎంక్వైరీ వేయాలని డిమాండు చేశారు. ఈమేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.



తుంగా సోయగం

నైరుతి రుతుపవనాల ప్రభావంతో శివమొగ్గ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో శుక్రవారం పరవళ్లు తొక్కుతున్న తుంగా నది దృశ్యం

సమాధి నుంచి బయటకు వచ్చిన చేయి

మైసూరు: సమాధి నుంచి చేయి బయటకు వచ్చిన ఘటన చామరాజ నగర జిల్లా కొళ్లెగాల తాలూకా హలె హంపాపుర గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన 40 సంవత్సరాల వయస్సున్న మహిళ మృతి చెందగా శ్మశానంలో ఖననం చేశారు. శశికుమార్ అనే గొర్రెల కాపరి ఆ ప్రాంతంలో జీవాలను మేపుతుండగా సమాధి నుంచి చెయ్యి బయటికి రావడాన్ని గమనించి గ్రామస్తులకు తెలపడంతో జిల్లా ఎస్పీ డాక్టర్ బి.టి.కవితకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి చామారాజనగర సిమ్స్‌కు తరలించారు. ఆమెది సహజ మరణమా? ఇతర కారణాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సమాధికి 20 మీటర్ల దూరంలో దీపం, నీటిబాటిల్, పసుపుకుంకుమ లభించడంతో క్షుద్ర పూజలు జరిగాయా? అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు.



మైసూరు దసరా ఉత్సవాల్లో భాగంగా జంబూ సవారీ(ఫైల్)

11 రోజుల పాటు మైసూరు దసరా

మైసూరు: ప్రపంచ ప్రసిద్ధి చెందిన నాడ హబ్బ మైసూరు దసరా మహోత్సవాన్ని ఈ ఏడాది మొదటి సారిగా 11 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇప్పటివరకు మైసూరు దసరా వేడుకలు 10 రోజుల పాటు నిర్వహించేవారు. కానీ చరిత్రలో మొదటి సారిగా ఈ యేడాది మైసూరు దసరా వేడుకలు 11 రోజుల పాటు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 1399వ యేడాదిలో విజయనగర సామ్రాజ్య పరిపాలనలో, 1410వ యేడాది మైసూరు సంస్థానం మహారాజుల పరిపాలన నుంచి మైసూరు దసరా మహోత్సవాన్ని 10 రోజుల పాటు నిర్వహించేవారు. దసరా అంటేనే దశ హర 10 రోజుల నిర్వహణ అని అర్థం. అయితే ఈ యేడాది మాత్రం మైసూరు దసరా మహోత్సవం చరిత్రలో నిలిచిపోనుంది. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు 11 రోజుల పాటు దసరా వేడుకలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 26, 27వ తేదీల్లో పంచమి ఉన్నందున ఈ యేడాది 11 రోజుల పాటు ఇదే మొదటిసారిగా దసరా వేడుకలు నిర్వహిస్తున్నారు. నవరాత్రి మరుసటి రోజు విజయదశమి నిర్వహించడం సాంప్రదాయం. విజయ దశమి రోజున మైసూరు ప్యాలెస్‌లో సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో జంబూ సవారీ నిర్వహిస్తారు. కాని 11 రోజుల పాటు నిర్వహించనున్న ఈ యేడాది ఉత్సవాలు ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఈ వేడుకలపై మైసూరు రాజవంశస్తులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

న్యూస్‌రీల్

విమానంలో వైద్యురాలు హల్‌చల్



సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న వైద్యురాలు

దొడ్డబళ్లాపురం: ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో క్యాబిన్ సిబ్బందితో వాగ్వాదం జరిపి నిందించిన ప్రయాణికురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో చోటు చేసుకుంది. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కెంపేగౌడ ఎయిర్‌పోర్టు నుంచి సూరత్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు బయలుదేరిన ఐఎక్స్ 2749 విమానం బయలుదేరడానికి కొన్ని క్షణాల ముందు ఈ సంఘటన జరిగింది. యలహంక సమీపంలోని శివనహళ్లి నివాసి వైద్యురాలు వ్యాస్ హిరాల్ మోహన్ భాయ్ తనకు కేటాయించిన సీట్ నంబర్- 20లో కూర్చోడానికి ముందు ముందు వరుసలో ఉన్న సీట్లో తన బ్యాగులను ఉంచింది. దీన్ని ప్రశ్నించిన సిబ్బందితో ఆమె తీవ్రంగా వాగ్వాదానికి దిగింది. అందరినీ నిందిస్తూ బాంబు పెట్టి విమానాన్ని పేల్చేస్తానని ఆగ్రహంతో ఊగిపోయింది. పైలట్, విమాన సిబ్బంది ఎంత నచ్చచెప్పినా ఆమె తగ్గలేదు. తోటి ప్రయాణికులతో కూడా గొడవ పడింది. దీంతో విమాన సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

పులి దాడిలో మహిళ మృతి

మైసూరు: పులి దాడిలో మహిళ మృతి చెందిన ఘటన చామరాజనగర జిల్లా బండీపుర పులుల సంకరక్షణ ప్రాంతమైన దేశిపుర కాలనీలో చోటు చేసుకుంది. గుండ్లుపేటె తాలూకాలోని ఓంకార విభాగం పరిధిలో ఉన్న దేశిపుర కాలనీలో నివాసం ఉంటున్న పుట్టమ్మ(40) శుక్రవారం గ్రామ సమీపంలో మేకలను మేపుతుండగా పులి దాడి చేసింది. గొంతు పట్టుకొని అడవిలోకి లాక్కెళ్లి హతమార్చింది. మేకలు ఇంటికి చేరినా పుట్టమ్మ జాడ లేకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా గ్రామ సమీపంలోని అడవిలో మృతదేహం కనిపించింది. అటవీశాఖ అధికారులు వచ్చి పరిశీలించారు. పోలీసులు మహిళ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతోందని హతమార్చాడు



గణేశ్(ఫైల్)

యశవంతపుర: నిత్యం సెల్‌ఫోన్‌లో మాట్లాడుతోందని ఓ వ్యక్తి తన భార్యను హతమార్చాడు. ఈ ఘటన ఉడుపి జిల్లా బ్రహ్మావర తాలూకా హిలియాణ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలో గణేశ్, రేఖ దంపతులు నివాసం ఉంటున్నారు. ఇటీవల రేఖకు కొత్త సెల్‌ఫోన్ కొనిచ్చాడు. దీంతో బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి గంటల కొద్దీ మాట్లాడేది. ఎక్కువ సమయం ఫోన్‌లో మాట్లాడవద్దని భర్త హెచ్చరిస్తుండటంతో గొడవ జరిగేది. గురువారం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన గణేష్ భార్యతో గొడవకు దిగి కత్తితో కడుపు భాగంలో పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఉడుపి జిల్లా బ్రహ్మావర తాలూకా శంకరనారాయణ పోలీసులు గణేశ్‌ను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ హరిరామ్ శంకర్ పరిశీలించారు.

నవ ధాన్యాలతో అలంకరణ



విశేష అలంకరణలో మారెమ్మదేవి

బొమ్మనహళ్లి : బెంగళూరు నగరం బొమ్మనహళ్లి నియోజకవర్గం హెచ్ఎస్ఆర్ లేఔట్ వార్డు పరంగిపాళ్య గ్రామంలో గ్రామదేవత మారెమ్మ దేవి అమ్మవారికి శుక్రవారం విశేష అలంకరణ చేపట్టారు. అర్చకులు వినయ్ కుమార్ దీక్షిత్ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి నవధాన్యాలతో అలంకరించి అర్చనలు, పూజలు నిర్వహించి మహామంగళహారతి ఇచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రూ.500 లంచం తీసుకున్నందుకు పదేళ్ల తర్వాత జైలు

దొడ్డబళ్లాపురం: రూ.500 లంచం తీసుకున్న పాపానికి రిటైర్డ్ అయిన 10 సంవత్సరాలకు ఒక విలేజ్ అకౌంటెంట్‌కు 10 సంవత్సరాల జైలు శిక్ష విధించారు. ఈ సంఘటన బెళగావిలో చోటుచేసుకుంది. నాగేశ్ శివంగేకర్ 30 సంవత్సరాల క్రితం విధుల్లో ఉన్న సమయంలో బెళగావి తాలూకా కడోలి గ్రామానికి చెందిన లక్ష్మణ్ ఓ పని కోసం నాగేశ్‌ను ఆశ్రయించగా రూ.500 లంచం డిమాండ్ చేశాడు. దీంతో లక్ష్మణ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. పథకం ప్రకారం లోకాయుక్త పోలీసులు దాడి చేసి నాగేశ్‌ను అరెస్టు చేశారు. 2006లో నాగేశ్‌కు కోర్టు రూ.వెయ్యి జరిమానా, ఏడాది జైలు శిక్ష విధించింది. తర్వాత ధార్వాడ హైకోర్టును ఆశ్రయించగా శిక్షను రద్దు చేసింది. అయితే అప్పటికే నాగేశ్ రిటైర్ య్యారు. అయితే లోకాయుక్త సుప్రీకోర్టుకు అప్పీలుకు వెళ్లింది. నాగేశ్‌కు పది సంవత్సరాల జైలు శిక్షను కోర్టు ఖరారు చేసింది. ఆయన్ను బెళగావి హిండలగా జైలుకు తరలించారు. కాగా ఫిర్యాదు చేసిన వ్యక్తి మృతి చెంది 5ఏళ్లు కావడం గమనార్హం.

టర్మినల్‌లోకి చొరబడేందుకు యత్నం

దొడ్డబళ్లాపురం: ఎయిర్‌పోర్టులోని టర్మినల్‌లోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించిన వ్యక్తిని సీఐఎస్ఎఫ్ అధికారులు అరెస్టు చేశారు. ఈఘటన బెంగళూరులోని కెంపేగౌడ విమానాశ్రయంలో జరిగింది. పాస్‌పోర్టు లేకుండా ఒక వ్యక్తి హఠాత్తుగా టర్మినల్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించగా అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్ సిబ్బంది అతడ్ని అదుపులోకి తీసుకుంది. అతన్ని కశ్మీర్‌లోని శ్రీనగర్‌కు చెందిన సదాద్ మహమ్మద్ బాబాగా గుర్తించారు.

బీబీఎంపీ అటవీ అధికారులపై కేసు

- అక్షయ్ మృతి కేసు నేపథ్యం

బనశంకరి: చెట్టుకొమ్మ విరిగిపడి యువకుడు అక్షయ్ మృతిచెందిన ఘటనకు సంబంధించి ముగ్గురు బీబీఎంపీ అటవీ అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదైంది. బెనరాజ్ అనే వ్యక్తి హనుమంతనగర పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుతో ఆర్ఎఫ్ఓ, ఏసీఎఫ్, డీఎఫ్ఓపై కేసు నమోదుచేశారు. అక్షయ్ ఈనెల 15వ తేదీన బనశంకరి వద్ద బైకులో వెళుతుండగా చెట్టుకొమ్మవిరిగి తలపై పడి తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లి గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. అక్షయ్ మృతి ఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం బీబీఎంపీ అటవీ విభాగం డీసీఎఫ్ బీఎల్‌జీస్వామిని బదిలీ చేసి ఆ స్థానంలో చిక్‌మగళూరు అధికారి సుదర్శన్‌ను నియమించింది. బదిలీవేటు వేసిన స్వామికి ఎలాంటి పోస్ట్ ఇవ్వలేదు. తాజాగా ముగ్గురు అధికారులపై కేసు నమోదు చేశారు.


క్లుప్తంగా

కేకేఆర్‌డీబీ కార్యదర్శిగా నళిన్‌ అతుల్‌



రాయచూరు రూరల్‌: కళ్యాణ కర్ణాటక గ్రామీణ అభివృద్ధి మండలి(కేకేఆర్‌డీబీ) కార్యదర్శిగా నళిన్‌ అతుల్‌ నియమితులయ్యారు. గురువారం సాయంత్రం కేకేఆర్‌డీబీ కార్యాలయంలో సుందరేష్‌ బాబు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. కొప్పళ జిల్లాధికారిగా విధులు నిర్వహిస్తున్న అధికారికి పదోన్నతి కల్పించి కార్యదర్శి హోదాకు బదిలీ చేశారు. గతంలో రాయచూరు జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా, పాఠశాల విద్య పరీక్ష మండలి చీఫ్‌గా, కేపీఎస్‌సీ అధికారిగా, విద్యా శాఖ అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహించిన అనుభవంతో ఆయనను మండలి కార్యదర్శిగా బదిలీ చేశారు.

రాయచూరు వర్సిటీ రిజిస్ట్రార్‌గా చెన్నప్ప



రాయచూరు రూరల్‌: రాయచూరు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా చెన్నప్ప పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న రిజిస్ట్రార్‌ శంకరప్పను బదిలీ చేయడంతో ఆయన స్థానంలో చెన్నప్ప బాధ్యతలు చేపట్టారు. గతంలో రిజిస్ట్రార్‌ శంకరప్ప రాయచూరు, యాదగిరి జిల్లాల్లో రాయచూరు విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కళాశాలల్లో పేరుకు పోయిన సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవడంతో ఆయనను బదిలీ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

పౌర కార్మికులకు కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న లలిత

రాయచూరు రూరల్‌: యాదగిరి నగరసభ పౌర కార్మికులకు నగరసభ అధ్యక్షురాలు లలిత అనాపూరే కిట్లను పంపిణీ చేశారు. శుక్రవారం యాదగిరి నగరంలోని నగరసభ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లా కేంద్రం యాదగిరిలో పరిశుభ్రత మెరుగు పరిచేందుకు కృషి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

పంట నష్టపరిహారం ఇవ్వాలి

హుబ్లీ: ధార్వాడ జిల్లాలోని కుందగోళ తాలూకాలో భారీ వర్షాలతో బెణ్ణిహళ్ల వాగు, వరదలతో పంటలు, రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయని, వీటి మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని డిమాండ్‌ చేస్తూ జేడీఎస్‌ కార్యకర్తలు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. నూర, అంచినాళ గ్రామాల మధ్యలో ప్రవహించే కట్టిహళ్ల వాగుకు వరదలతో మృతి చెందిన కుందగోళ నివాసి శివయ్య కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి. బెణ్ణిహళ్ల అభివృద్ధికి తక్షణమే రూ.200 కోట్లు విడుదల చేయాలని ఆ తాలూకా జేడీఎస్‌ అధ్యక్షుడు శంకర్‌గౌడ డిమాండ్‌ చేశారు. అప్పులు చేసి సాగు చేసిన పంటలు వరద పాలై రైతన్నలు కష్టాల్లో ఉన్నారని, వారికి తగిన పంట పరిహారం చెల్లించాలని కోరారు. జేడీఎస్‌ గంగాధర మఠ, గురురాజ్‌, నిరంజనయ్య, సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభం



పాఠశాల భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గవియప్ప

హొసపేటె: విజయనగర జిల్లా హొసపేటె తాలూకాలోని సీతారామ తండాలో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక సీనియర్‌ పాఠశాల కొత్త భవనాన్ని ఎమ్మెల్యే హెచ్‌ఆర్‌ గవియప్ప ప్రారంభించారు. గత రెండేళ్లుగా ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు అన్ని సౌకర్యాలతో కూడిన భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గత బీజేపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి ఆనంద్‌సింగ్‌ రూ.కోటి నిధుల గ్రాంట్‌ను విడుదల చేశారు. పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో బీఈఓ శేఖర్‌ హొరపేటె, సీతారామ తాండ గ్రామ పంచాయతీ అధ్యక్షుడు గోవింద నాయక్‌, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు రామమూర్తి, ఇతర తండా నాయకులు పాల్గొన్నారు.

చెక్‌ బౌన్స్‌ కేసులో నలుగురిపై ఎఫ్‌ఐఆర్‌ నమోదు

మైసూరు : ఒక వ్యక్తిని అక్రమంగా బంధించి చెక్కుపై సంతకం చేయాలని బలవంతం చేసిన బెంగళూరు వ్యాపారవేత్తలు గోవిందప్ప, పూజారి సురేష్‌, వారి అనుచరులు సుఖేష్‌శెట్టి, ప్రజ్వల్‌లపై ఎఫ్‌ఐఆర్‌, కేసులు నమోదయ్యాయి. ఎస్‌ఆర్‌ మొహల్లా నివాసి సునీల్‌, అతని భార్య కవిత సంతకం చేసిన చెక్కులను తిరిగి ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. వారు ఐదు చెక్కుల్లో రూ. 21 లక్షలు నమోదు చేసుకుని బౌన్స్‌ చేసి వారెంట్‌ తెచ్చారు. ఈ పరిణామంతో కలత చెందిన సునీల్‌, అతని భార్య కవిత న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు. మూడేళ్ల పాటు విచారణ జరిపిన తర్వాత మైసూరు కోర్టు వ్యాపారవేత్తలపై ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేయాలని ఆదేశించింది.

యోగా.. ఆరోగ్యానికి మంచిదేగా.!



యోగాసనాలు ప్రదర్శిస్తున్న నాగరాజు



- 12 ఏళ్లుగా యోగా శిక్షణ అందిస్తున్న నాగరాజు
- కేరళలో యోగా గురువు ఆనంద్‌తో శిక్షణ
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం


సాక్షి,బళ్లారి: పురాతన కాలం నుంచి యోగాకు విశిష్ట గుర్తింపు ఉంది. శాస్త్ర సాంకేతిక రంగం కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో వైద్య రంగంలో కూడా ఎన్నో మార్పులు చేర్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి డబ్బులు ఖర్చు పెట్టకపోయినా, మన పుట్టుక నుంచి వచ్చిన ఎన్నో రోగాలు, ప్రస్తుతం మారిన ఆహారపు అలవాట్ల ద్వారా వచ్చిన రోగాలను సైతం యోగా ద్వారా దూరం చేస్తున్న హఠయోగ నాగరాజు అడ్వాన్స్‌ హఠయోగా ద్వారా బీపీ, సుగర్‌, థైరాయిడ్‌, న్యూరాలాజికల్‌ డిజార్డర్స్‌, కిడ్నీ, ఊపిరితిత్తులు, గుండె సమస్యలు, లైఫ్‌ స్టైయిల్‌ డిజార్డర్స్‌తో వచ్చే అనారోగ్యాలను దూరం చేస్తున్నారు. నగరంలోని మోకా రోడ్డులోని ఎంఆర్‌వీ లేఅవుట్‌లో ఆదర్శ యోగా సెంటర్‌లో విశిష్టమైన యోగాను నేర్పుతూ ఎందరికో ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఈసందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడుతూ కేరళలో అడ్వాన్స్‌ యోగా నేర్చుకున్నానన్నారు. అక్కడ వినూత్నశైలిలో యోగా నేర్పిన గురువు ద్వారా తాను యోగా శిక్షణ ఇస్తున్నానన్నారు. యోగా నేర్పుతూ ఎన్నో ఏళ్లుగా వెంటాడుతున్న రోగాలను సైతం దూరం చేస్తున్నానన్నారు.

ప్రతి ఒక్కరికీ యోగా అవసరం

మారుతున్న కాలానుగుణంగా, ఆహారపు అలవాట్లు మారిపోవడంతో పాటు తగిన శారీరక శ్రమ లేకపోవడం తదితర కారణాలతో రోజురోజుకు ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై ఏదో రకమైన ప్రభావం చూపుతోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో మోకా రోడ్డులోని ఎంఆర్‌వీ లేఅవుట్‌లో ఆదీశ యోగా సెంటర్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమాన్ని అసిస్టెంట్‌ కమిషనర్‌ ప్రమోద్‌ కుమార్‌, యోగా శిక్షకుడు నాగరాజు తదితరులు ప్రారంభించి మాట్లాడారు. ప్రతి రోజు యోగా నిర్వహించడం దినచర్యలో భాగం కావాలన్నారు. వాకింగ్‌, క్రీడలతో పాటు యోగా కూడా ఎంతో అవసరం అన్నారు. యోగా ద్వారా ఎన్నో ఆరోగ్య సమస్యలకు చెక్‌ పెట్టవచ్చన్నారు. ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా ఏర్పడుతుందన్నారు. పురాతన కాలం నుంచి యోగాకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందన్నారు. ఇటీవల యోగా చేయడంపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోందన్నారు. ఇంకా ఇంటింటా యోగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచి యోగా చేయించాలన్నారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఆయా యోగా సెంటర్ల వద్ద పెద్ద సంఖ్యలో జనం చేరి యోగా రిహార్సల్స్‌ చేశారు. వివిధ యోగాసనాలు వేసి ఆకట్టుకున్నారు.



యోగా సాధన చేస్తున్న మహిళలు, పురుషులు



ఏకపాద శిరటిట్టిభాసనం ప్రదర్శిస్తున్న దృశ్యం



చతుష్కోణాసనం ప్రదర్శిస్తున్న తిమ్మప్ప

యోగా సాధనతో ఏదైనా సాధ్యం

రాయచూరు రూరల్‌: పేదరికంలో పుట్టి కష్టాలను అనుభవించినా యోగా ద్వారా పేరు ప్రఖ్యాతులు సాధించిన డాక్టర్‌ వడ్డేపల్లి తిమ్మప్ప పలువురికి యోగా నేర్పిస్తూ దిశా నిర్దేశం చేస్తున్నారు. కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల్లో తిమ్మప్ప యోగా సాధకుడిగా మంచి పేరు సాధించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని యోగాతో నలుగురికి సహాయ పడాలనే ఉద్దేశ్యంతో యోగా శిక్షణ ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు, జైళ్లలో ఖైదీలకు, అనాథ పిల్లలకు, సామాన్య ప్రజలకు ఉచితంగా యోగాసన శిబిరాలను నిర్వహిస్తున్నారు. డాక్టర్‌ వడ్డేపల్లి తిమ్మప్ప జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు యోగాబ్యాస పోటీల్లో పాల్గొని పలు అవార్డులు పొందారు.

23న జిల్లాకు సీఎం సిద్దరామయ్య రాక

- పలు అభివృద్ధి పనులకు ఆరోజున ముఖ్యమంత్రి శ్రీకారం
- రూ.936 కోట్లతో పనులు జాతికి అంకితం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్‌

రాయచూరు రూరల్‌: రాయచూరు జిల్లాలో ఈనెల 23న ముఖ్యమంత్రి సిద్దరామయ్య పర్యటిస్తారని గ్రామీణ శాసన సభ్యుడు బసనగౌడ దద్దల్‌ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. రూ.3 కోట్లతో 12 చర్చిలు, 35 మసీదులు, దర్గాలకు రూ.2.85 కోట్లు, రూ.222 కోట్లతో చెరువుల అభివృద్ధి, 12 గ్రామాల్లో రూ.3 కోట్లతో సామూహిక మరుగుదొడ్లు, రూ.7 కోట్లతో రెండు ఆరోగ్య కేంద్రాలు, రూ.48 కోట్లతో రాయచూరు విశ్వవిద్యాలయంలో జెనెటిక్‌ భవనం, రూ.2 కోట్లతో ట్రీ పార్కు, రూ.24 కోట్లతో పాఠశాల గదుల నిర్మాణం, రూ.6 కోట్లతో సముదాయ భవనాలు, రూ.111 కోట్లతో బీటీ రోడ్లు, రూ.289 కోట్లతో తాగునీటి పథకాలు, రూ.152 కోట్లతో బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణాలకు ముఖ్యమంత్రి శ్రీకారం చుడతారన్నారు. కల్యాణ కర్ణాటక పరిధిలో ఆర్టికల్‌-371(జే) అమలై దశాబ్దం కానున్న తరుణంలో సీఎంను అభినందించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. యరగేరలో గిరిజన ఉత్సవాలను సీఎం ప్రారంభిస్తారన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, మంత్రులు పాల్గొంటారన్నారు. విలేఖర్ల సమావేశంలో ఎంపీ కుమార నాయక్‌, ఎమ్మెల్సీ వసంత్‌ కుమార్‌, జిల్లాధ్యక్షుడు బసవరాజ్‌ పాటిల్‌, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ, జయంతిరావ్‌, కరీం, అస్లాంపాషా, తాయన్న, నాగేంద్ర, పంపాపతి, చంద్రశేఖర్‌, రాజశేఖర్‌, రామస్వామిలున్నారు.

జొన్నలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోండి



కలెక్టరేట్‌ అధికారికి వినతిపత్రాన్ని అందిస్తున్న రైతు సంఘం నేతలు

బళ్లారిఅర్బన్‌: జిల్లాలో ప్రముఖ పంట జొన్న, డిసెంబర్‌ లేదా జనవరిలో దిగుబడి చేసుకున్న జొన్నలను ఇంటి ముందే రైతులు నిల్వ చేసుకున్నారు. అంతేగాక రబీ సీజన్‌ ప్రారంభం అయితే రైతులు పండించిన ఆ పంట నష్టం అవుతుందని తక్షణమే గోడౌన్‌లలో ఉన్న నిల్వలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కన్నడ నాడు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మెణసిన ఈశ్వరప్ప డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో డీసీ కార్యాలయంలో ఆందోళన చేపట్టిన తర్వాత జిల్లాధికారికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఈశ్వరప్ప మాట్లాడుతూ ఈ నెల 30న జొన్నల కొనుగోళ్లు నిలిపి వేస్తామని ఆదేశాలు ఇచ్చారన్నారు. సదరు ఆదేశాలను మరో నెల పాటు పొడిగించాలని ఆయన కోరారు. కొనుగోలు కేంద్రంలో సుమారు 3796 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. మొత్తం 2,95,428 క్వింటాళ్ల జొన్నలు నమోదు అయ్యాయి. 81,863 క్వింటాళ్ల జొన్నలు ఆ మేరకు తూకం వేశారు. మిగిలి ఇంకా 2,13,565 క్వింటాళ్ల జొన్నలు మార్కెట్‌కు రానున్నాయి. వీటిని శుక్రవారం నుంచి కేవలం 10 రోజుల్లో ఎలా తూకం చేస్తారు. ఇది సాధ్యం కాదని, అందువల్ల మరో నెల గడువు ఇస్తే రైతులకు చాలా అనుకూలంగా ఉంటుందన్నారు. వీలైనంత త్వరగా జొన్నలను తూకం చేసి 80 లేదా 100 లారీలలో లోడ్‌ చేయించి రవాణా చేస్తే రైతులకు ఉపయోగపడుతుందని రైతు సంఘం వినతి పత్రంలో కోరింది. ఈ సందర్భంగా సంఘం ప్రముఖులు కన్నె శివమూర్తి, దొడ్డ బసవనగౌడ, రాజయ్య, యాల్పి సురేష్‌, మల్లికార్జున, మేటి దివాకర్‌, చెన్నరెడ్డి, దివాకర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, విశ్వనాథ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రికి అభినందన

రాయచూరు రూరల్‌: నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో శనివారం రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజుకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 79 ఏళ్ల వయస్సు నిండిన సందర్భంగా పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని చైతన్య సాగర అభినందన గ్రంథాన్ని విడుదల చేస్తారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వాకిటి శ్రీహరి, కర్ణాటక రాష్ట్ర విధానసభ స్పీకర్‌ ఖాదర్‌, రాష్ట్ర హోం శాఖ మంత్రి పరమేశ్వర్‌, మంత్రులు హెచ్‌.కే. పాటిల్‌, శరణ ప్రకాష్‌ పాటిల్‌, శివరాజ తంగడిగితో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు.

రక్షిత తాగునీటి వాడకం తప్పనిసరి

- జెడ్పీ సీఈఓ నోంగ్‌జోయ్‌ మహమ్మద్‌ అక్రమ్‌ అలీ షా సూచన



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ అధికారి నోంగ్‌జోయ్‌ మహమ్మద్‌ అక్రమ్‌ అలీ షా, పాల్గొన్న అధికారులు

హొసపేటె: ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా పరిశుభ్రమైన తాగునీటిని తాగడం తప్పనిసరి అని జెడ్పీ సీఈఓ నోంగ్‌జోయ్‌ మహమ్మద్‌ అక్రమ్‌ అలీ షా తెలిపారు. నగరంలోని జెడ్పీ కార్యాలయ హాలులో శుక్రవారం జరిగిన జిల్లా నీరు, పారిశుద్ధ్య మిషన్‌ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వేసవి కాలం ముగిసి వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమయంలో అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ఆరోగ్యం దృష్ట్యా, స్వచ్ఛమైన తాగునీటిపై శ్రద్ధ వహించాలన్నారు. బావులు, గొట్టపు బావులు, నిల్వ ట్యాంకులు వంటి ఇళ్లలో ఉపయోగించే నీటి వనరులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆర్‌ఓ ప్లాంట్లు, జల్‌జీవన్‌ మిషన్‌ ద్వారా సరఫరా చేసిన తాగునీటిని తాగాలన్నారు. బోరుబావుల నుంచి నేరుగా నీటిని తాగరాదన్నారు. వీలైతే నీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. కలుషిత నీటితో కలరా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. దోమల నుంచి రక్షణ పొందాలన్నారు. మీ ఇంటి చుట్టు పక్కల నీరు నిల్వ చేరకుండా చూసుకోవాలన్నారు. హంపి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు రజని షణ్ముఖ గౌడ మాట్లాడుతూ హంపీలోని ఎంపీ.ప్రకాష్‌ నగర్‌లో తాగునీటి సరఫరా కోసం వాటర్‌ ట్యాంక్‌ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అన్నారు. బైలువద్దిగేరి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు జే.లక్ష్మీదేవి, జెడ్పీ డిప్యూటీ సెక్రటరీ కే.తిమ్మప్ప, గ్రామీణ తాగునీరు, పారిశుద్ధ్య విభాగం జిల్లా ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ దీప, విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ వెంకటేష్‌, రామచంద్రప్ప, ఆరోగ్య శాఖ జిల్లా సర్వేయర్‌ డాక్టర్‌ షణ్ముఖ్‌ నాయక్‌, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రవి కుమార్‌, ఐసీడీఎస్‌ అధికారిణి సుభద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టపగలే ఎలుగుబంటి హల్‌చల్‌





రోడ్డుపై తిరుగుతున్న ఎలుగుబంటి

హొసపేటె: తాలూకాలోని ఇంగళిగి గ్రామంలోని జనావాస ప్రాంతంలో తన పిల్లలతో ఎలుగుబంటి సంచరిస్తూ కనిపించింది. ఈ ఆశ్చర్యకరమైన దృశ్యం స్థానికుల్లో భయాందోళన వాతావరణాన్ని సృష్టించింది. రైతులు తమ పొలాలకు, పిల్లలు గ్రామంలోని ప్రధాన రహదారి గుండా పాఠశాలలు, కళాశాలలకు వెళుతుండగా ఎలుగుబంటి సంచారంతో ఆశ్చర్యకరమైన పరిస్థితిని సృష్టిస్తోంది. పెద్ద ఎలుగుబంటితో పాటు రెండు పిల్లలు దాని వెనుక ఉండటంతో ప్రజల్లో ఆందోళన పెరిగింది. మహిళలు, పిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఏదైనా విపత్తు సంభవించక ముందే అటవీ శాఖ అధికారులు వెంటనే అప్రమత్తమై ఎలుగుబంటిని, దాని పిల్లలను బంధించి సుదూరంలోని అటవీ ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు డిమాండ్‌ చేశారు.

రూ.48.84 లక్షల గంజాయి జప్తు

హుబ్లీ: నైరుతి రైల్వే పరిధిలోని వివిధ రైల్వే స్టేషన్లలో అక్రమంగా తరలిస్తున్న రూ.48,84,700 విలువ చేసే 57.239 కిలోల గంజాయిని ఆర్‌పీఎఫ్‌ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 5 కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టి చట్టరీత్య చర్యలకు ఎక్సైజ్‌ శాఖకు అప్పగించారు. బెంగళూరులోని ఎస్‌ఎంవీటీ రైల్వే స్టేషన్‌ 6వ ప్లాట్‌ఫాంలో రూ.16 లక్షల విలువ చేసే 22.942 కేజీల గంజాయి, అలాగే దేవంగొంతి రైల్వే స్టేషన్‌ ఒకటో ప్లాట్‌ఫాంలో రూ.7 లక్షల విలువ చేసే 8.5 కేజీల గంజాయి, హుబ్లీ రైల్వే స్టేషన్‌ 3వ ప్లాట్‌ఫాంలో రూ.11.30 లక్షల విలువ చేసే 11.035 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. లోండా రైల్వే స్టేషన్‌ మూడవ ప్లాట్‌ఫాంలో రూ.10.28 లక్షల విలువ చేసే రూ.10.281 కేజీల గంజాయి, అదే రైల్వే స్టేషన్‌లో రూ.4.21 లక్షల విలువ చేసే 4.211 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అక్రమ గంజాయి రవాణా నివారణకు ఆపరేషన్‌ నాకోర్స్‌ మిషన్‌ ద్వారా ఈ కార్యాచరణ చేపట్టామన్నారు.


పేదలకు భూమి, ఇళ్లు కేటాయించాలి

రాయచూరు రూరల్‌: కళ్యాణ కర్ణాటక భాగంలో అధికంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు భూమి, ఇళ్లు కేటాయించాలని ఇళ్లు, భూపోరాట సమతి అధ్యక్షుధ్యాంజనేయ పేర్కొన్నారు. శుక్రవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రర ప్రభుత్వ అటవీ శాఖ ఆధీనంలో సాగు చేస్తున్న భూములు సన్నకారు రైతులకు అందించకుండా అధికారులు రైతులపై కేసు నమోదులు చేస్తుండడాన్ని తప్పుబట్టారు. మరో వైపు ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలను అధికారులు రాజకీయ నాయకుల కుమ్మక్కుతో తొలగిస్తున్నట్లు ఆరోపించారు.

కమలాపుర చెరువులో చేపల మృత్యువాత

హొసపేటె: విజయనగర జిల్లాలోని కమలాపుర వద్ద విజయనగర సామ్రాజ్య కాలంలో నిర్మించిన చారిత్రాత్మక కమలాపుర చెరువులో వేలాది చేపలు మృత్యువాత పడ్డాయి. వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న కమలాపుర చెరువులో ఏడాది పొడవునా నీరు ఉంటుంది. అందువల్ల అక్కడ చేపల పెంపకం జరుగుతుంది. ఇప్పుడు వారు పెంచిన పెద్ద, పెద్ద చేపలు చనిపోయి చెరువు ఒడ్డున పడుతుండటంతో చేపల పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. చెరువు నీరు కలుషితం కావడం వల్ల పెద్ద చేపలు అకస్మాత్తుగా చనిపోయాయని అనుమానిస్తున్నారు. అదనంగా కమలాపుర శివారులో ఉన్న రెండు వార్డుల మురుగు నీరు నేరుగా కమలాపుర చెరువులోకి ప్రవేశిస్తుంది. కలుషిత నీరు చెరువులో కలవడం వల్ల చేపలు చనిపోయాయా? అనేది దర్యాప్తు తర్వాత తెలుస్తుంది.

కృష్ణమ్మ ఉరక.. లోతట్టు మునక



ఆల్మట్టి డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు



వరద నీటిలో మునిగిన గడ్డగోళి బసవేశ్వరాలయం

రాయచూరు రూరల్‌: మహారాష్ట్రలోని ఎగువ భాగంలో జోరుగా వానలు కురుస్తుండడంతో కృష్ణా నదికి వరద పోటెత్తుతోంది. బెళగావి జిల్లా చిక్కోడి డివిజన్‌లో కల్లోళ, యడూర, మలికవాడ, దత్తవాడ, నిప్పాణి తాలూకా బారవాడ, కున్నూర, కరదగ, భోజ వంతెనలు జలావృతం అయ్యాయి. ఈ మార్గంలో కర్ణాటక, మహారాష్ట్రల మధ్య వాహన రాకపోకలు స్తంభించాయి. ఆల్మట్టి డ్యాం నుంచి 25 గేట్లను తెరిచి కృష్ణానదికి 80,250 క్యూసెక్కుల నీటిని వదిలారు. బెళగావి, గోవా రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. పుణెలో ఆలయంలోకి వరద నీరు చేరాయి. కుసుమలి వద్ద మలప్రభ నదికి అడ్డంగా నిర్మించిన వంతెన నీట మునిగింది. ఇక ఉత్తర కర్ణాటకలోని బెళగావి, బాగల్‌కోటె, విజయపుర, కల్యాణ కర్ణాటకలోని కలబుర్గి, యాదగిరి, రాయచూరు జిల్లాల్లో నదీ తీర లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయా జిల్లాధికారులు హెచ్చరించారు. బెళగావి జిల్లాలో బెణ్ణేతుప్రి వాగు ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తోంది. ఏళ్ల తరబడి నూతన వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజా ప్రతినిధులు వంతెన పనులను పూర్తి స్థాయిలో ముగించడానికి నిధుల కొరతను సాకుగా చెబుతున్నారు. రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా హూవిన హడగి వద్ద ఉన్న గడ్డగోళి బసవేశ్వర ఆలయం వరద నీటిలో మునిగింది.

అపహరణకు గురైన బాలుడు సురక్షితం

హుబ్లీ: గత రెండేళ్ల నుంచి కిడ్నాప్‌ గురైన బాలుడు బెంగళూరులో లభించడంతో అతడిని స్థానిక పోలీసు బృందం స్వస్థలానికి చేర్చడంలో విజయవంతమైంది. జిల్లాలోని కలఘటిగి తాలూకా సంగె దేవరకొప్ప గ్రామానికి చెందిన బ్రహ్మానంద అనే బాలుడు 2023 అక్టోబర్‌ 6న పాఠశాలకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అయితే ఆ బాలుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ గోపాల బ్యాకోడ సూచనలతో కలఘటిగి స్టేషన్‌ సీఐ శ్రీశైల కౌజలిగి తమ సిబ్బందితో నిరంతరం గాలించి ఎట్టకేలకు బాలుడి ఆచూకీని కనుగొని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు.

పాలికె కమిషనర్‌ బదిలీ ఆదేశాలు రద్దు

హుబ్లీ: హుబ్లీ ధార్వాడ నగర పాలికె కమిషనర్‌గా సీనియర్‌ గ్రేడ్‌ కేఏఎస్‌ అధికారి మంజునాథ్‌ డొంబరను నియమిస్తూ వెల్లడించిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. పాలికె కమిషనర్‌గా ఉన్న రుద్రేష్‌ గాళిని బదిలీ చేసిన మూడవ రోజే బెంగళూరు అభివృద్ధి ప్రాధికార ప్రత్యేక భూస్వా. దీన అధికారి మంజునాథ్‌ డొంబరను నియమిస్తూ గురువారం రాత్రి ఆదేశాలు వెల్లడించింది. అయితే శుక్రవారం ఉదయం ఇద్దరి ఆదేశాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం రుద్రేష్‌నే కమిషనర్‌గా కొనసాగేలా తాజాగా ఆదేశాలను ఇచ్చింది. హుబ్లీ ధార్వాడ నగరాభివృద్ధి ప్రాధికార కమిషనర్‌ కేఏఎస్‌ సీనియర్‌ గ్రేడ్‌ అధికారి డాక్టర్‌ సంతోష్‌ బిరాదార్‌ను కూడా బదిలీ చేసింది. ఈయన స్థానంలో కేఏఎస్‌ జూనియర్‌ గ్రేడ్‌ అధికారి దేవరాజ్‌ను నియమిస్తూ ప్రభుత్వం వెల్లడించిన ఆదేశాలు కూడా రద్దు కావడంతో డాక్టర్‌ సంతోష్‌ బిరాదారే హుడా కమిషనర్‌గా కొనసాగనున్నారు.

23న నగర పాలికె సమావేశం

హుబ్లీ: హుబ్లీ ధార్వాడ నగర పాలక సంస్థ సాధారణ సమావేశం సోమవారం జరగనుంది. ఆ రోజు ఉదయం 11 గంటలకు పాలికె సభాభవనంలో ఏర్పాటు చేసినట్లు పాలికె పరిషత్‌ కార్యదర్శి ఓ ప్రకటనలో తెలిపారు.

రేపు కసాప అధ్యక్షుడి పర్యటన



డాక్టర్‌ మహేష్‌ జోషి

హొసపేటె: కన్నడ సాహిత్య పరిషత్‌ అధ్యక్షుడు డాక్టర్‌ మహేష్‌ జోషి ఈనెల 22న విజయనగర జిల్లాలో పర్యటించనున్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు హొసపేటెలోని తహసీల్దార్‌ కార్యాలయ ప్రాంగణంలోని పత్రికా భవన్‌లో బళ్లారి జిల్లా కసాప అధ్యక్షుడు వివేకానంద గౌడ పాటిల్‌, హావేరి జిల్లా కసాప అధ్యక్షుడు లింగయ్య బీ.హిరేమఠ్‌, కలబుర్గి జిల్లా కసాప అధ్యక్షుడు విజయ్‌కుమార్‌ పాటిల్‌, రాయచూరు జిల్లా కసాప అధ్యక్షుడు రంగన్న పాటిల్‌, కొప్పళ జిల్లా కసాప అధ్యక్షుడు శరణేగౌడ పోలీస్‌ పాటిల్‌ సమక్షంలో విలేకరుల సమావేశం జరుగుతుంది. తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు బళ్లారిలో జరగనున్న 88వ అఖిల భారత కసాప సదస్సుకు సన్నాహకంగా జరిగే సంప్రదింపుల సమావేశంలో సీనియర్‌ రచయితలు, ఇతర కన్నడ అనుకూల సంస్థల పదాధికారులు పాల్గొంటారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి తెలిపారు.

ప్రతిభావంతులకు సన్మానం



విద్యార్థినులను సన్మానిస్తున్న ప్రతినిధులు

రాయచూరు రూరల్‌: విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్‌ కార్యకర్త రవి పేర్కొన్నారు. గురువారం పండిత సిద్దరామ జంబలదిన్ని రంగమందిరంలో జామియా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మైనార్టీ సమాజం ప్రతిభావంత విద్యార్థు లకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో విద్యార్థులను సన్మానించి ఆయన మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. నేడు విద్యకున్న ప్రాధాన్యత ఏ రంగానికీ లేదన్నారు. కార్యక్రమంలో నగరసభ ఉపాధ్యక్షుడు సాజిద సమీర్‌, శాలం, హసన్‌, నూర్‌ మహ్మద్‌, ఇక్బాల్‌, అక్బర్‌లున్నారు.